దేవీప్రసాద్ చటోపాధ్యాయ

# లోకాయత

- అసుర - దృక్పథం
- తంత్రవాదం
- శునకాల మంత్రాలు



ప్రజాశక్తి బుక్‌హౌస్

# లోకాయత

దేవీప్రసాద్ చటోపాధ్యాయ

# లోకాయత

★ అసుర - దృక్పథం

★ తంత్రవాదం

★ శునకాల మంత్రాలు

దేవీప్రసాద్ చటోపాధ్యాయ

ప్రజాశక్తి బుక్‌హౌస్

ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర

హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013

92761


అనువాదం : **హరి పురుషోత్తమరావు**

ప్రచురణ సంఖ్య : 1194

హెచ్.బి.టి. (మూడు భాగాలుగా) ముద్రణ : 1987

ప్రజాశక్తి ప్రథమ (సంయుక్త) ముద్రణ : మార్చి , 2011

రెండవ ముద్రణ : నవంబర్, 2013

వెల : ₹ 100/-

ప్రతులకు

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,

హన్మకొండ, నల్గొండ, గుంటూరు, ఒంగోలు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

website : www.psbh.in

# విషయసూచిక

**1. అసుర దృక్పథం ............................................................. 7**

పరిచయం ............................................................ 8

**ప్రాచీన భారత భౌతికవాద సమస్య ........................... 12**

భౌతికవాదం – ప్రజల తత్వశాస్త్రం ........................ 12
భారతీయ భౌతికవాద సమస్య ............................ 14
నశించిపోయిన లోకాయత గ్రంథాలు ..................... 15
సంప్రదాయ పద్ధతి ......................................... 17
పండిత లోకంలో అరాచకం .............................. 19
మాధవాచార్య ప్రామాణికత ............................... 27
మాధవాచార్య ఆవిష్కరించిన తీరు ........................ 29
లోకాయత జ్ఞాన సిద్ధాంతం ............................... 30
లోకాయత నీతిశాస్త్రము .................................... 37
తత్వశాస్త్రము ................................................ 42
లోకాయత – క్రతువులు .................................. 43
లోకాయత – అసుర దృక్పథం ............................ 48
అసుర దృక్పథం – ప్రాచీన దేవాలయం .................. 50
అసుర విశ్వదృష్టి ........................................... 56
లోకాయత – తంత్రవాదం ................................ 58
సింధు – పురాతత్వ శిధిలాలు ............................ 64
తంత్రవాదం – సింధులోయ నాగరికత................... 65
మొదట్లో సాంఖ్యవాదం ..................................... 66
లైంగిక చర్యలు క్రతువులు ................................. 70
వేదం – లోకాయత.......................................... 76
సింహావలోకనం ............................................ 79

**2. తంత్రవాదం ........................................................................ 81**

ముందుమాట ........................................................ 82

**గూఢమైన మతాలు - వ్యావసాయిక క్రతువు ............... 85**

మహత్తు – తొలి వ్యవసాయ విధానం .................... 85
వామాచారం అంటే ? ........................................ 88
వ్యావసాయక కర్మకాండ .................................... 96
దుర్గపూజ ఎలా మొదలైంది? ............................ 101
లతాసాధన – యంత్రములు ............................ 103
ఖపుష్ప ...................................................... 110
పంచ'మ'కారాలు .......................................... 113
తంత్రం : దాని అర్థం : ప్రాచీనత: శాఖలు ............ 122
తంత్రవాద శాఖలు ........................................ 124
తంత్రవాదము : కులాలు ................................ 130
దేహ తత్వము ............................................ 131
తంత్రవాదము – టావోయిజము ........................ 135
శారీరక శ్రమ – ఆది విజ్ఞాన శాస్త్రము .................. 141
ఆదిమ విజ్ఞానశాస్త్ర ధోరణి ................................ 146

**3. శునకాల మంత్రాలు ........................................................ 149**

ఆవిష్కరణ ................................................ 150

**తులనాత్మక విధానం - ఒక సరళి ............................ 152**

గూఢ పాఠభాగం .......................................... 152
బకదాల్భ్యు డెవరు? ...................................... 153
ఆధునికాన్వయం .......................................... 155
'శునకం' అంటే .......................................... 157
వైదిక సాహిత్యాలలో జంతునామాలు .................. 158
మానవులు : జంతు నామాలు .......................... 159
ప్రాచీన సాహిత్యంలో శునకాలు ........................ 160
వెనుకబడిన ప్రజలు ...................................... 161
చిహ్న పద్ధతి ............................................ 162
చిహ్న పద్ధతి – వేద సాహిత్యాలు ........................ 163
సమూహ జీవనం .......................................... 166
మహిమ (మహత్తు) – మతము ........................ 167
ఆహారం కొరకై గానం .................................. 170
తొలి వేదగీతాలు ........................................ 171
చాందోగ్యోపనిషత్ ........................................ 173
వాంఛ – గీతం ............................................ 177
వాక్కు, ఛందస్సు, మహిమ ............................ 181
ఋగ్వేదంలో గీతం ........................................ 183
జానపద సంస్కృతి – వేద సంస్కృతి .................. 185
సమీక్ష ...................................................... 189
సామాన్య సూత్రము ...................................... 191

# 1

# అసుర దృక్పథం

# పరిచయం

భారత తత్వశాస్త్ర చరిత్రలో ఉన్న భౌతికవాద సంపదను ఆవిష్కరించే యత్నమే దేవీప్రసాద్ చటోపాధ్యాయ "లోకాయత". మన సంప్రదాయవాదుల నుండి... మాక్సుముల్లర్‌లాంటి పాశ్చాత్య భారతీయ సంప్రదాయ ప్రేమికుల వరకూ... అందరికీ ఒకే మాట. "భారత తత్వశాస్త్రం... భావవాదానికీ, ఆధ్యాత్మిక వాదానికీ తరగని గని. "స్థూలంగా చూస్తే అది నిజమేననిపించేంత సాహిత్యం మనకు లభిస్తుంది. భౌతికవాదపు జాడలు కూడా... గుర్తుపట్టలేనంత వికృత రూపంలోకి తర్జుమా అయిపోయాయి. దీనికంతా ఒక దీర్ఘచరిత్ర, విచిత్ర సంప్రదాయం... కారణాలు.

ప్రపంచంలో ప్రతి చోటా ఇతిహాసాలున్నాయి. జగత్ సృష్టిని గురించి ప్రతి నాగరికతలోనూ ఒక కథ ఉంటుంది. అన్ని కథలకూ సామీప్యతా, పోలికా కనపడతాయి. మిగతా అన్ని ప్రాంతాల్లోనూ... ఆలోచనా చరిత్ర ఒక ప్రత్యేక క్రమంలో జరిగినప్పుడు భారత దేశంలో అందుకు భిన్నంగా ఎందుకు జరుగుతుంది? ఎలా జరుగుతుంది?... అందులో సాధ్యాసాధ్యాలు ఏమిటి?... ఇలాంటి ప్రశ్నలు మనకు రావడం సహజమే. అయితే ఆ ప్రశ్నలకు సమాధానం అంత సులువుగా లభించదు. దానికెంతో మంది మేధావులు... ఎంతో కృషి జరపాలి. అలాంటి కృషికి ఒక ముఖ్య ఫలితం 'లోకాయత'. భారతతత్వ శాస్త్రం వేదకాలం నుంచి – వేద పూర్వకాలం నుంచి – ఇప్పటి వరకూ వ్యాపిస్తూ వచ్చింది. ఇందులో కొన్నింటి మధ్య పోలికలు, అందుతో పాటు భేదాలు కనపడుతుంటాయి. ఆపైన... ఒక్కో గ్రంథానికి, ఒక్కో శ్లోకానికి వ్యాఖ్యలు, వ్యాఖ్యాతలు... ఎటూ వచ్చి చరిత్ర గమనం గురించి శాస్త్రీయమైన అవగాహన ఉంటే తప్ప, ఈ భిన్నతత్వాలను... ఆయా కాల పరిమితుల్లో 'సర్దడం', దానికున్న అసలు అర్థాలు సాధించడం... వీలుకాదు.

దేవీప్రసాద్ చటోపాధ్యాయ 'అసుర దృష్టి'లో ముఖ్యంగా... భారతతత్వశాస్త్రంలో భౌతికవాద ఛాయలను, భౌతికవాద భావాలను ఆవిష్కరించడానికి అవలంబించవలసిన పద్ధతిని గురించి విపులంగా చర్చించాడు. వేదాలు, ఉపనిషత్తులు మన తాత్విక వారసత్వానికి

ఉనికిపట్టులు. కనుక మన తత్వశాస్త్ర భావాలకు ఆధారాలన్నీ అందులోనే లభిస్తాయి. ఆపైన నాగరికతా చరిత్ర, మానుషశాస్త్రం... ఆ గ్రంథాలపై తమ వెలుగును ప్రసరిస్తాయి. ఇవన్నీ పరస్పరం 'సహకరించి' ఆయా తత్వశాస్త్ర భావాలను ఒక చారిత్రక నేపథ్యంలో అర్థం చేసుకోవడానికి దారి చూపుతాయి.

భారత తత్వశాస్త్ర చరిత్రలో ఉన్న భౌతికవాద ధోరణులను.. .గుర్తు పట్టాలంటే ముఖ్యమైన ఇబ్బంది భౌతికవాద గ్రంథాలు అసలు లేకపోవడం. ప్రత్యర్థులు ఉదహరించిన... భాగాల నుంచి మాత్రమే భౌతికవాద భావాలనుద్ధరించడం జరుగుతుంది. ఇదిలా వుండగా... సంస్కృత భాషకున్న "నానార్ధ" స్వభావరీత్యా, వ్యాఖ్యాతలు తబ్బిబ్బులు కావడానికి... ఉన్న అవకాశం కూడా ఒక ఇబ్బందే. ఈ ఇబ్బంది తొలగాలంటే చరిత్రాధ్యయనం అవసరం. మరో సంగతి... స్పష్టంగా వున్న శ్లోకాలకూ, వాక్యాలకూ మర్మత్వాన్ని, ఆధ్యాత్మికతనూ... ఆపాదించడం మనకున్న సంప్రదాయాల్లో ఒకటి. దానికి వైద్యం రెండు స్థాయిల్లో జరగాలి. ఒకటి : ఆ శ్లోక సందర్భం, రెండు : దాని చరిత్ర... నేపథ్యం .... ఇవికాక ఆ వ్యాఖ్యాత భావజాలం.

దేవీప్రసాద్ చటోపాధ్యాయ... అధ్యయన పద్ధతి – అంటే అర్థం చేసుకునే విధానంని శాస్త్రీయంగా నిర్వచించాడు. భౌతిక ప్రపంచంలో నివసించుతున్న ప్రజలు భౌతిక దృక్పథానికి పూర్తిగా భిన్నంగా, దూరంగా... తత్వశాస్త్ర సృష్టి చేయడం అసంభవం. బాగా అభివృద్ధి చెందిన సమాజంలో ఒక ప్రత్యేక అవసరాన్ని పురస్కరించుకొని భావవాదం ఆవిర్భవిస్తుంది. ఆపైన దాని పరిణామానికి కూడా చారిత్రక నేపథ్యం... ఎంతో సహకరించుతుంది.

ఈ దృష్టితో చూచినపుడు : వేదాల్లోనూ, ఉపనిషత్తులలోనూ... మనకు కనబడే భౌతికవాదపుటంశలను గమనిస్తే... "అమ్మయ్య! మనమూ మామూలు మానవులమే" అనే ఊరట కలుగుతుంది. లేనప్పుడు... మనదంతా ఆధ్యాత్మిక సంపదే అయితే... "నేను, మీరూ, అతడూ... ఈ భౌతికావసరాల కోసం వెంపరలాడటం తప్పేమో" అని బిడియపడటం జరిగేది. ఆపైన భౌతిక సమస్యలకు పరిష్కారం... మన చేతిలోనే ఉందనే భావం ఆత్మస్థైర్యం పెంచుతుంది. ఈ పుస్తకం... పరిశోధనా ప్రక్రియలో... ఒక విజయవంతమైన ముందడుగు.

ఆధ్యాత్మిక వాదానికి... భిన్నమైన తాత్వికాంశాలను స్పృశించిన గ్రంథాలు లేకపోలేదు. తెలుగులోనే డాక్టర్ కె.బి. కృష్ణ అలాంటి ప్రయత్నం చేశారు. అయితే దేవీప్రసాద్ చటోపాధ్యాయ గ్రంథానికున్న పరిధి... విలక్షణమైంది. మన తత్వశాస్త్ర చరిత్రలో భౌతికవాదాన్ని, భౌతికవాదపు ఛాయలనూ... పసిగట్టి విశ్లేషించి సంగ్రహించడం ఈ పుస్తకం పెట్టుకున్న లక్ష్యం. అందుచేత అన్ని తత్వశాస్త్ర శాఖలనూ... అధ్యయనం చేయడం తప్పనిసరి. ఆపైన... ఆయా భౌతికవాద భావాలకు... తర్వాత ఏర్పడిన "భావవాద రూపాన్ని" గుర్తించి... అంతస్సారాన్ని వెలికి తీయడం శ్రమతో కూడిన వ్యవహారం. ఇంకా... దీర్ఘచరిత్ర కల తత్వశాస్త్రానిని... వ్యాఖ్యాతలు,

టిప్పనికారులు అనేకమంది ఉండినందువల్ల... వీలైనంతమంది వ్యాఖ్యానాలకు అర్థం చెప్పుకోవడంతో పాటు... చారిత్రక నేపథ్యం ఆధారంగా వాటికి వివరణలు ఇవ్వడం మరో క్లిష్టమైన పని.

మన తత్వశాస్త్ర వ్యాఖ్యాతలలో ఎక్కువమంది ఆధ్యాత్మ సంప్రదాయానుయాయులు, ఆపైన మనకున్న ముఖ్య ప్రమాణాల్లో ఒకటి శ్రుతి : అంటే వేదమో... వేదం లాంటి గ్రంథమో అంగీకరించినదైతేనే... దానికి గుర్తింపు. ఆ పైన బౌద్ధ, జైన వ్యాఖ్యాతలకు... భౌతికవాదం పట్ల సానుభూతి లేశమైనా లేదు. ఇన్ని గండాల మధ్య భౌతికవాద భావజాలం బతికి బయటపడిందంటే కారణం దానికున్న సహజ శక్తి స్పష్టపడుతుంది.

ప్రపంచంలో ఏ నాగరికత చరిత్ర చూసినా... స్పష్టమైన భౌతికవాద దృక్పథం 'విడిగా' లభిస్తుంది. భారతదేశంలో మాత్రం ఆ దృక్పథం... అనేక ఆధారాల వల్ల పునర్నిర్మించాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. దీనికి ముఖ్యమైన కారణం ప్రత్యర్థుల రాజకీయ, ఆర్థిక... శక్తి. భావవాదానికీ, ఆధ్యాత్మిక వాదానికీ ఎదురైన ప్రతిఘటనలనూ, నిరసనలనూ నిర్దాక్షిణ్యంగా అణచివేయడమే కాక... గ్రంథస్థమైన ఆ భావాలను రూపుమాపడానికి కూడా... బలీయమైన ప్రయత్నాలు జరిగాయి. అందులో చాలావరకు కృతకృత్యులయ్యారు. అయితే మన సమాజాభ్యుదయం ఒక సరళరేఖలో... ఒక క్రమంలో జరగలేదు. అసమంగా నాగరీకం అవుతున్న విశాల ప్రాంతంలో... "అత్యున్నతమైన" భావవాదం, అతి ప్రాథమిక రూపంలో ఉన్న భౌతికవాదం ఏకకాలంలో లభించడం – భౌతికవాదానికి ఒక ముఖ్యమైన ఆధారం. నాగరిక ప్రపంచంలో ఉన్న అనేక సంప్రదాయాలకు, క్రతువులకు, అలవాట్లకు... ప్రాచీన సమాజంలో ఒక 'క్రమ రూపం' ఉండి ఉండటం అసందర్భం కాదు. అలాంటి ప్రాచీన సమాజావశేషాలు సజీవంగా ఉన్న చోట ఆ 'క్రమ రూపం' ఏమిటో కూడా ప్రత్యక్షంగా చూడవచ్చు. సామాజికంగా మన ఊహలను బేరీజు వేసుకోవడానికి ఈ సౌలభ్యం ఎంతో సహకారి.

అసలు 'లోకాయత'కూ మిగతా తత్వశాస్త్రాలకూ మరో స్పష్టమైన తేడా వుంది. మిగతా 'నాగరిక' తత్వశాస్త్రాలకు ఒక మూలపురుషుడు – తాత్వికుడు – అనేక మంది వ్యాఖ్యాతలు ఉంటారు. 'లోకాయత' అలాంటిది కాదు. సామాన్య జనం లోకాన్ని, లోక లక్షణాలను అర్థం చేసుకున్న తీరు... 'లోకాయత' నిజం చెప్పాలంటే అది 'అనుకోకుండా' తరతరాల సామాన్య జనం చేసిన 'ఆలోచనల సంపుటి' 'లోకాయత'కు కొన్ని విశ్వాసాలు, అభిప్రాయాలు, ప్రవర్తనా సంప్రదాయం ఉంటుంది. వాటిని... ప్రత్యర్థుల గ్రంథాలలోంచి అపార్థాలను వివరించి – తొలగించి – ఉద్ధరించడమే దేవీప్రసాద్ చటోపాధ్యాయ చేసింది. మానుషశాస్త్రం, సామాజిక శాస్త్రం, చరిత్ర... ఇందుకు తోడ్పడ్డాయి.

అసలు 'లోకాయత'కూ మిగతా తత్వశాస్త్రాలకూ మరో స్పష్టమైన తేడా వుంది. మిగతా 'నాగరిక' తత్వశాస్త్రాలకూ ఒక మూలపురుషుడు – తాత్వికుడు – అనేక మంది వ్యాఖ్యాతలు ఉంటారు. 'లోకాయత' అలాంటిది కాదు. సామాన్య జనం లోకాన్ని, లోక లక్షణాలను అర్థం చేసుకున్న తీరు... 'లోకాయత' నిజం చెప్పాలంటే అది 'అనుకోకుండా' తరతరాల సామాన్య జనం చేసిన 'ఆలోచనల సంపుటి' 'లోకాయత'కు కొన్ని విశ్వాసాలు, అభిప్రాయాలు, ప్రవర్తనా సంప్రదాయం ఉంటుంది. వాటిని... ప్రత్యర్థుల గ్రంథాలలోంచి అపార్థాలను వివరించి – తొలగించి – ఉద్ధరించడమే దేవీప్రసాద్ చటోపాధ్యాయ చేసింది. మానుషశాస్త్రం, సామాజికశాస్త్రం, చరిత్ర... ఇందుకు తోడ్పడ్డాయి.

అయితే.... 'అసురదృష్టి' అనే ఈ భాగం... కేవలం పరిశోధనా పద్ధతికి సంబంధించింది. 'అసురదృష్టి' అని మన ఆధ్యాత్మికవాదులు పిలవడంలోనే 'పక్షపాతం' ఉంది. ఆ పక్షపాత వ్యాధికి కారణమైన చరిత్రనూ. భావజాలాన్నీ విశ్లేషించి... 'అసుర దృష్టి' అంటే ఏమిటో స్పష్టం చేశాడు దేవీప్రసాద్. అయితే కొందరి వ్యాఖ్యానాలు వివరణ ఇచ్చేటప్పుడు... వారివైపు వాదాన్ని విస్తృతంగానే వినిపించాడు. ఆ వాదంలో ఉన్న లోపాన్ని... మోసాన్ని కూడా తరువాత వివరించి ఖండించాడు. చివరగా... 'అసుర దృష్టి' అసలు రూపాన్ని ఆవిష్కరించాడు. అడుగడుగునా... దేవీప్రసాద్ అవలంబించిన పద్ధతి ఇది. పాఠకుడు.. వాద, ప్రతివాద...తీర్మానాల మధ్య సరిహద్దులను మాత్రం కొంచెం జాగ్రత్తగా చూసుకుంటే... ఈ పుస్తకం "క్లిష్టమైన వస్తువుపై" సరళమైన గ్రంథమని అర్థమవుతుంది.

భావాలను అణచి పెట్టడానికి ఎంత ప్రయత్నం చేసినా ప్రయోజనం ఉండదు. సమాజంలో ఆ భావాలకు అనువైన 'పదును' ప్రజల్లో ఉన్నంత వరకూ... ఆ భావాలు బతుకుతాయి. అభివృద్ధి చెందుతాయి. అందుకు సాక్ష్యం... 'లోకాయత'. లోకాయత తత్వం ఈనాడు తక్షణ సమస్యల పరిష్కారానికి ఎంతవరకు ప్రయోజనకరం? అనే ప్రశ్న అసందర్భమైనది. మానవ భావనా చరిత్రలో 'లోకాయత' అద్భుతమైన పాత్ర నిర్వహించింది. ఊహల నుంచి, భ్రమల నుంచీ మానవుని వాస్తవిక కృషి వైపు మరల్చిన శక్తులలో లోకాయత ఒకటి. దేవీప్రసాద్ రాసిన 'లోకాయత' గ్రంథాన్ని... క్రమంగా – పూర్తిగా – ప్రచురిస్తున్నాం...

**- హరి**

# ప్రాచీన భారత భౌతికవాద సమస్య

ప్రాచీన భారతంలో వ్యవహారంలో ఉన్న తాత్విక పరిభాషలో ఆసక్తిదాయకమైన సందిగ్ధత ఉంది. ఆ సందిగ్ధతలో విచిత్రమైన ఆధునిక కోణం ఉంది.

మన ప్రాచీనులు ప్రజల తత్వశాస్త్రానికీ, భౌతికవాదానికీ వేరు వేరు 'పదాలు' ఉపయోగించలేదు. ఒకే పదం, ఆ రెంటికీ ఉపయోగపడేది. అదే 'లోకాయత' దాన్నే చార్వాకమనీ, బార్హస్పత్యమనీ కూడా వ్యవహరించేవారు. లోకాయత అంటేనే ప్రజల తత్వశాస్త్రమని అర్థం. లోకాయత అంటే లౌకిక తత్వశాస్త్రమని (అంటే భౌతికవాదం) కూడా అర్థము.

## భౌతికవాదం - ప్రజల తత్వశాస్త్రం

'లోకేషు అయతాః లోకాయత'. అది ప్రజలలో వ్యాప్తి చెంది ఉన్నది కనుక దాని పేరు 'లోకాయత'. మాధవాచార్య రచించిన 'సర్వదర్శన సంగ్రహం' అనువదించిన ఇ.బి. కావెల్ ఈ ఉత్పత్తి అర్థాన్ని అంగీకరించాడు. హెచ్.పి. శాస్త్రి కూడా 'లోకాయత' పదాన్ని 'ప్రజల దృక్పథం' అనే భావంలోనే ఉపయోగించాడు. ఆయన మామూలుగా అదేదో లోక వ్యవహారంలో ప్రసిద్ధమైన సామాన్యపదంగా దాన్ని స్వీకరించాడు. దానికోసం రుజువులూ, పజువులూ చూపించడానికి ప్రయత్నం కూడా చేయలేదు.

కాని అలాంటి రుజువులు దొరుకుతాయి. ఒకటో, రెండో ముచ్చటించుకుందాం. బౌద్ధ గ్రంథం 'దివ్యవాదన' లోకాయత పదాన్ని ఆ ఉత్పత్తి అర్థంలోనే ఉపయోగించిందని ఎస్.ఎస్. దాస్ గుప్తా ఉదహరించాడు ('ప్రజలలో వ్యాపించి ఉన్న' అనే అర్థంలో) అలాగే 'షడ్దర్శనసముచ్ఛయ' రచయిత హరిభద్రుడు – గ్రంథంపై వ్యాఖ్యానంలో లోకాయతులను వివేచనలేని గుంపుగా, ఆలోచనలేని సముదాయంగా వర్ణించాడు గుణరత్నుడు (14వ శతాబ్దపు జైన వ్యాఖ్యాత). చార్వాకులతో ముడిపడ్డ ప్రాచీన భౌతికవాదాన్ని లోకాయత దృష్టిగానే ఎందుకు స్వీకరించారో మాధవాచార్యతన 'సర్వ దర్శన సంగ్రహం'లో వివరించాడు.

"సంపదనూ, కోరికలనూ... మానవ లక్ష్యాలుగా భావించి, సంతోషాన్ని ధ్యేయంగా పెట్టుకున్న విధానాన్ని, సూత్రాలను అనుసరించుతూ, భవిష్యత్ ప్రపంచ వాస్తవికతను నిరాకరించే

మానవ సమూహం.. .చార్వాక సిద్ధాంతాన్ని అనుసరించే వారిగా గుర్తించవచ్చును. వారి సిద్ధాంతానికి మరో పేరు 'లోకాయత' – వస్తు రీత్యా సరైన పేరు". మాధవాచార్య చెప్పిందేమీ కొత్తకాదు. ఆయన శంకరాచార్య అడుగుజాడల్లోనే వ్యాఖ్యానించాడు. 'బ్రహ్మసూత్రాల' భాష్యంలో శంకరాచార్య అలాంటి వారిని 'ప్రకృతి జనాః' (మూర్ఖజనులు) అంటే లోకాయతికులనే చెప్పాడు.

లోకాయత అంటే ఉన్న విరోధ భావము నుంచే అలాంటి వ్యాఖ్యానాలు వస్తాయి. అయితే లోకాయత పదం యొక్క ఉత్పత్తి అర్ధం అందులో నిబిడీకృతమైనందువల్ల ఆ వ్యాఖ్యల ప్రాముఖ్యత వాటికుంది. ప్రజలన్నా, ప్రజల తత్వశాస్త్రమన్నా... చీదరించుకునేవారు ఉపయోగించిన తీరు ఎలా ఉన్నప్పటికీ, 'లోకాయత' అంటే అర్ధం 'ప్రజల తత్వశాస్త్రమే'. ఆ తత్వశాస్త్రం ఈ లోకానికి సంబంధించింది భౌతికం. ఆ పేరుకు ఉన్న ప్రత్యామ్నాయ ప్రాముఖ్యత కూడా గణనీయమే. 'పీటర్సుబర్గ్ డిక్షనరీ' (సంస్కృతం) లోకాయత అంటే 'భౌతికవాదం' అనే చెప్పింది. మోనీర్ విలియమ్స్ 'లోకాయత' పదం పుంలింగ పదంగా 'భౌతికవాది' అనీ, స్త్రీ లింగపదంగా 'నాస్తికమతం' అనీ.. అర్ధాలు చెప్పాడు. కోల్‌బ్రూక్ 'లోకాయత' పదం 'పుంలింగం' అనీ, దాని అర్ధం 'భౌతికవాది' అనీ... రుజువు సాధించాడు.

మన పండితులు కూడా ఈ పేరుకు ఇదే వివరణనిచ్చారు. వాస్తవ జగత్తును మినహా, అన్నింటినీ తిరస్కరించినందువల్ల ఈ తత్వశాస్త్రాన్ని 'లోకాయత' అంటారని పంచానన తర్క రత్న ఉవాచ. రాజకృష్ణ మహోపాధ్యాయ కూడా అదే మార్గంలో తర్కించారు. సహజ జగత్తుపై (లోక – ఇహలోక) ప్రమాణం ద్వారా... 'లోకాయత' పదాన్ని సాధించాలని ఆయన వాదం.

లోకాయత నామౌచిత్యాన్ని భౌతికవాద వస్తు దృక్పథం నుంచీ వివరించే ప్రయత్నాలు కొన్ని పురాతన గ్రంథాల్లో దొరుకుతాయి. అయిదో శతాబ్దానికి చెందిన బౌద్ధ వ్యాఖ్యాత బుద్ధఘోషుడు 'అయత' అనే పదాన్ని 'అయతన' అనే అర్ధంలో కూడా తీసుకోవచ్చని సూచించాడు. (అయతన అంటే భూమిక) , దీని ప్రకారం లోకాయత అంటే అర్ధం తత్వశాస్త్రం. దానికి ప్రాతిపదిక భౌతిక ప్రపంచం (లోక). ఇంచుమించు ఇలాంటి వివరణ హరిభద్రుడు, అతని వ్యాఖ్యాతలు సూచించారు. 'లోక' అంటే ఇంద్రియ గ్రాహ్య సంబంధమైనదంతా అని ఆయన నిర్వచనం. మణిభద్రుడు అనే వ్యాఖ్యాత మరికొంచెం స్పష్టంగా నిర్వచించడానికి ప్రయత్నించాడు. 'లోక' అంటే 'పదార్థ సార్థమనీ' లేదా 'పదార్థ సమూహమనీ' క్లుప్తీకరించాడు. అంటే భౌతిక అస్తిత్వాల మొత్తం అన్నమాట. పై చెప్పిన రెండు విధాలా, లోక అనే పదంలో లోకాయత పదం మిళితమై వుంది కనుక లోకాయత అంటే భౌతిక తత్వశాస్త్రమే అవుతుంది.

అంటే లోకాయత అనే పదానికి ప్రజల తత్వశాస్త్రం అనే కాక ఇహలోక తత్వశాస్త్రం లేదా భౌతికవాదం అని కూడా అర్ధం ఉన్నదన్నమాట. భారత తత్వశాస్త్ర చరిత్రకాలంలో అతి ప్రసిద్ధులైన రాధాకృష్ణ, దాస్‌గుప్తాలు విడివిడిగా ఆ పదానికున్న రెండు అర్ధాలూ స్పష్టపరిచారు. రాధాకృష్ణన్ 'లోకాయత ఇంద్రియాల ద్వారా గ్రహించే ప్రపంచానికి సంబంధించిన తత్వశాస్త్రం'

అని అన్నారు. అంటే భౌతికవాదానికి లోకాయత సంస్కృత పదమన్నమాట. దాస్‌గుప్తా దృష్టిలో చార్వాక సిద్ధాంతాలను – సామాన్యంగా పిలిచే పేరుగా లోకాయతను గ్రహించాడు (ప్రజలలో వ్యాపించి ఉన్న). మనకు ఈ రెండు అర్థాలనూ కలిపి చూడ్డమే మిగిలింది. అలా చూస్తే 'భారత తత్వశాస్త్ర సంప్రదాయం ఒక అవిచ్ఛిన్నమైన భావవాద (లేదా ఆత్మవాద) ప్రవాహంగా నడిచింది' అని చెప్పే ధోరణిని సందేహించాల్సి వస్తుంది. అలాంటి ధోరణి ఇప్పటికీ కొనసాగుతోంది.

"భారతీయ ఆలోచనా విధానం బాహ్య ప్రపంచం కంటే మానవుని అంతఃప్రపంచానికి అత్యధిక ప్రాముఖ్యత ఇవ్వడం భారతీయ ఆలోచనలోని విశిష్టాంశం" – (రాధాకృష్ణన్).

భారతీయ జనసమూహాల్లో సంప్రదాయసిద్ధంగా వస్తున్న ఆలోచనా విధానాలను పరిగణనలోకి తీసుకొనకపోతే పైన చెప్పింది యథార్థమే అవుతుంది. ప్రజల ప్రాపంచిక దృక్పథం సహజంగా భౌతికవాదం. ఈ వాస్తవానికి లోకాయత అనే పేరు ఒక రుజువు.

## భారతీయ భౌతికవాద సమస్య

సైద్ధాంతిక రంగంలో ప్రాచీన భారత భౌతికవాదం తనకు తానుగా ఒక తాత్విక ఆలోచనగా మనుగడ కలిగిలేదని మనకు బోధపడుతుంది. మన ప్రాచీన భౌతికవాద సమస్య మన ప్రజల చరిత్రలో విడదీయరానంత పెనవేసుకుని ఉన్నది. 'ప్రజలు' అంటే అర్థం ఏమాటి? వారికో తత్వశాస్త్రం ఉందా? ఉంటే అది ఏ అర్థంలో భౌతికవాదం అవుతుంది? లోకాయతను అధ్యయనం చేసేటప్పుడు ఈ ప్రశ్నలను విస్మరించలేము.

లోకాయతకు సంబంధించి మనకు లభించిన సమాచారాన్నంతా పరిగణనలోకి తీసుకున్నప్పుడే ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి. కానీ, మనకు దొరికే సమాచారం సంతృప్తినీ, సహకారాన్నీ ఇవ్వకపోగా అనేక రకాలైన ఇబ్బందులకు దారి తీయవచ్చు.

లోకాయతకు సంబంధించి మనకు దొరికే సమాచారం అంతా శకలాలు మాత్రమే అని మనకు తెలుసు. ఆ శకలాల నుంచీ లోకాయతను పునర్నిర్మించాలంటే ఓ భగీరథుడు అవసరం. అయితే, మరికొంచెం ముందుకు వెళితే ఇదొక్కటే మనం ఎదుర్కొనే కష్టం కాదనీ, ఇదే నిజమైన కష్టం కాదనీ మనకు అర్థమవుతుంది. అలాంటి సమాచారం ఎక్కువగా అస్పష్టంగా, ఇంకా చూడ్డానికి సందిగ్ధంగా, కంగాళీగా కనబడుతుంది.

ప్రాచీన భారతదేశపు లోకాయత ప్రాముఖ్యతను, మూలాన్ని గురించి ఆధునిక పరిశోధకులు రకరకాల గందరగోళ నిర్ణయాలకు రావడానికి ఇది పాక్షికంగానైనా ముఖ్య కారణమే. ఆ పరిశోధకులు ఒక్కొక్కరు ఒక ప్రత్యేక పరిధిలోని సమాచారాన్ని ఆధారం చేసుకుని లోకాయతపై వ్యక్తిగతమైన నిర్ణయాలకు వచ్చారు (ఇదే మనం చూడబోతున్నాం).

ప్రాచీన భారత భౌతికవాదంపై ఇంత వైవిధ్యమున్న ఆధునిక దృక్పథాలకు మరో అంశం కారణభూతం అవుతుంది. వారిలో వారికి ఎన్ని భేదాలున్నప్పటికీ అందరూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో 'సర్వదర్శన సంగ్రహము'ను (మాధవాచార్య) లోకాయతకు ఆధార గ్రంథంగా తీసుకున్నారు. కాని, లోకాయతపై మాధవాచార్య అభిప్రాయం సందేహాస్పదం. ఒకసారి మనం మాధవాచార్య ప్రభావం నుంచి బయటపడితే ఆయనకంటే పూర్వులు చెప్పిన సమాధానం మనకు ఇంత ఆశ్చర్యాన్ని కలిగించదు.

అందుకనే అందరూ వెళ్ళిన ఆ పాత దారిని వదిలిపెట్టి, పురాతన సమాచారాన్ని కాంతివంతం చేసే కొత్త పద్ధతి కోసం, తద్వారా ప్రజల ప్రాపంచిక దృక్పథంగా లోకాయతను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. అలాంటి పద్ధతి జార్జ్ థామ్సన్ రచనల్లో లభ్యపడింది. థామ్సన్ అనుసరించిన సూత్రాల ద్వారా మన ప్రాచీన తత్వశాస్త్ర సాహిత్యాల్లో లభించే అస్పష్టమైన, కొన్ని సందర్భాల్లో అర్థం పర్థంలేని భావ శకలాలను ఎలా వివరించాలో చర్చించవచ్చును.

మన ప్రాచీన సాహిత్యాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తూ పోతే లోకాయత సంప్రదాయానికి, అతి పురాతనమైన వైదిక సంప్రదాయ విభాగానికి ప్రాథమికమైన పోలిక కనబడుతుంది. ఇది చాలా అద్భుతం. మనకు తెలిసినంతలో ఈ రెండు సంప్రదాయాలు పరస్పర విరుద్ధమైనవి. వైదిక సంప్రదాయానికి వారసులమని ఘనంగా చెప్పుకునే వారికి లోకాయత సంప్రదాయమంటే ఎంత చిరాకో జగద్విదితం. అలాగే లోకాయతికులకు వైదిక సంప్రదాయం అంటే కూడా వెగటే. కానీ రెంటి మధ్యా పోలికలు గణనీయం. దీనికి వివరణ అవసరం. తొలి వైదిక ప్రజల భావాలకూ, నమ్మకాలకూ మూలం శోధించాలి. ఆ శోధన విచిత్రంగా కనబడినప్పటికీ లోకాయతను సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

ఇదంతా అసాంప్రదాయకం. ఈ సమస్యలను లేవనెత్తడానికి ప్రోత్సహించిన పరిస్థితులను మనం వివరిద్దాం.

## నశించిపోయిన లోకాయత గ్రంథాలు

'అవసరమైన సామగ్రి స్వల్పమైనందువల్ల ప్రాచీన భారత భౌతికవాదాన్ని పునర్నిర్మించడం కష్టం' అనే భావనతో లోకాయత సమస్యను ప్రారంభించడం ఆచారం. లోకాయత గ్రంథాలు నశించిపోయాయనే సమాచారంతో పాటు అసలు దానికి సంబంధించిన మౌలిక గ్రంథమేదీ లభించలేదనడం అతిశయోక్తి కాదు. అసలు అలాంటి మౌలిక గ్రంథమేదైనా ఉందా అనే సమస్య పట్ల కూడా ఏకాభిప్రాయం లేదు.

రిస్ డేవిడ్స్ అసలలాంటి అవకాశమే లేదన్నాడు. బౌద్ధులూ, శంకరాచార్యుడూ లోకాయతను తిరస్కరించడాన్ని ఉదహరిస్తూ ఇలా అన్నాడు : "కొందరు ఆలోచనాపరులకన్నా

అనేక భావాలను మాత్రమే ఈ పదాలు (శంకరుడూ, బౌద్ధులు వాడినవి) సూచిస్తాయి కానీ ఒక గ్రంథాన్ని సూచించవు." ఆ రకంగా తిరస్కరించబడిన ఏ తత్వశాస్త్ర గ్రంథమైన ఊహాత్మకమే అని ఆయన ఉద్దేశ్యం. కానీ తుచ్చి, గార్బే, దాస్‌గుప్తాలు పోగుచేసిన సాక్ష్యాలు ఈ అభిప్రాయానికి భిన్నంగా ఉన్నాయి.

"లోకాయత గ్రంథమేదీ మనకు అందనిమాట నిజమే... కొందరు పండితుల్లాగా లోకాయత గ్రంథాలేవీ అసలు లేనేలేవని భావించడం విపరీతం అవుతుంది... నాకు తెలిసినంతవరకూ ప్రాచీనకాలంలో లోకాయత గ్రంథాలు ఉండేవని సూచించే కొన్ని వాస్తవాలను మీ ముందుంచుతాను" – (తుచ్చి).

చంద్రకీర్తి 'ప్రజ్ఞాశాస్త్ర'లో ఒక లోకాయత శాస్త్రాన్ని ఉల్లేఖించాడు. ఆర్యదేవుని 'శతశాస్త్రం' లో బృహస్పతి శాస్త్రంలోని ఉల్లేఖన కనబడుతుంది. 'బార్హస్పత్య అని పిలవబడే సిద్ధాంతానికి గ్రంథకర్త బృహస్పతి అని సంప్రదాయం. దీన్ని మనం ఎందుకు అంగీకరించకూడదో నాకు అర్థం కావడం లేదు' – (తుచ్చి).

'ఈ గ్రంథంలో చెప్పబడిన పురందరుడు చార్వాక మత గ్రంథకర్త' – అని పుష్పదంతుని గ్రంథంపై వివరణ (అజ్ఞాత రచయిత) ఉంది.

గార్బే పతంజలినీ, భాస్కరాచార్యునీ 'భౌతికవాద గ్రంథాల పూర్వపు ఉనికికి సాక్ష్యంగా' ఉదహరిస్తాడు.

దాస్‌గుప్తా బౌద్ధగ్రంథం 'దివ్య వదన' లోకాయతను 'భాష్యము, ప్రవచనము రెండూ ఉన్న ఒక ప్రత్యేక అధ్యయన శాఖగా గుర్తించినట్లు' చెప్తాడు (భాష్యము అంటే వ్యాఖ్యానము. ప్రవచనము అంటే వివరణలు).

పైన గార్బే చెప్పిన పతంజలి సాక్ష్యాన్ని దీనికి జోడించి ఈ అంశాన్ని ఖాయం చేశాడు దాస్‌గుప్తా. కాత్యాయనుడు అనే (క్రీ.పూ. 300) వైయాకరిణి లోకాయతపై 'భాగురి వ్యాఖ్యానం' ఉదహరించాడు. అందుచేత 'వార్తిక సూత్ర' గ్రంథకర్త కాత్యాయనుడి కాలం నాటికే లోకాయత గ్రంథమూ, దానిపై వ్యాఖ్యానమూ ఉండి వుండవచ్చునని దాస్ గుప్తా నిర్ణయించాడు.

అలాంటి గ్రంథాలు ఒకప్పుడున్నా ఇప్పుడు లేవు కదా. లోకాయత భావాలపై అనేకచోట్ల వ్యక్తమైన శత్రుత్వం వల్ల లోకాయత గ్రంథాలను కావాలని ధ్వంసం చేసినట్లు ఊహించారు. ఏదేమైనా చాలాకాలం క్రిందట బహుశా క్రీస్తు శకానికి ముందే అలాంటి విధ్వంసనం జరిగి ఉంటుంది. పోయిన గ్రంథాలు పోగా మనకు మిగిలింది లోకాయత భావాలను గురించిన చెదురు మదురు ఉల్లేఖనలు. అవి కూడా లోకాయతను చులకన చేయడానికి, తిరస్కరించడానికి

ఉపయోగించుకున్న సందర్భాలే. వ్యతిరేకులు రాసిన పుస్తకాల్లోనుంచే లోకాయతను తెలుసుకోవడం దాని దురదృష్టం (బెల్వాల్కర్, రానడే).

లోకాయత ఏ భావాలను ప్రచారం చేయదల్చుకుందో రాగరహితంగా ఉదాహరించే ఆసక్తి దాని  వ్యతిరేకులకు ఉండదు. అందుచేత అలాంటి ఆధారల్లో నిష్పక్షపాత ధోరణిని ఆశించకూడదు.

రకరకాల శాఖలకు చెందిన తత్వశాస్త్ర రచయితలు వివిధ తాత్విక వాద ప్రతివాదాల్లో లోకాయతను ఖండించడానికి ప్రయత్నించారు. ఇలాంటి సందర్భాల్లో లోకాయతపై మనకు లభించే భోగట్టా ముక్కలు ముక్కలుగానే ఉంటుంది. దీనికి భిన్నంగా ఒక్క సర్వదర్శన సంగ్రహంలోనే పొందికైన సమాచారం లభిస్తుంది. కానీ సర్వదర్శన సంగ్రహంపై మనం ఎంతవరకు ఆధారపడవచ్చో చూద్దాం.

ఇలాంటి పరిస్థితుల్లో 'మిగతా గ్రంథాలు దొరికేలోగా, అందులోనూ శత్రుపూరితమైన అభిప్రాయాలున్న గ్రంథాలకు భిన్నమైనవి దొరికేలోగా' మనం లోకాయతను ముక్కలు ముక్కలుగా దొరికిన అవశేషాల్నుంచీ తాత్కాలిక సిద్ధాంతంగా నిర్మించవచ్చును. (రిస్ డేవిడ్స్).

రిస్ డేవిడ్స్ 1899లో ఇది రాశాడు. అప్పట్నుంచీ, ఇప్పటి వరకూ జరిగిన అనుభవం ద్వారా అలాంటి గ్రంథాలేవీ దొరకవని మనం నిర్ణయించుకోవచ్చును. ఎఫ్.డబ్ల్యు. థామస్ 1921లో 'బృహస్పతి సూత్ర' అనే దాన్ని సంపాదించి, అనువాదం చేసి ప్రచురించిన మాట నిజమే. బృహస్పతి లోకాయతకు ఆద్యుడు అని అంటారు గనుక ఈ గ్రంథం లోకాయత గ్రంథమే కావచ్చు. కాని దానిని పండితులెవరూ పట్టించుకోలేదు. అది తరువాతి కాలం నాటిది అయి వుండాలి. దానిలో భావాలు లోకాయత భావాలకు భిన్నమైనవే కాక సూటిగా వ్యతిరేకమైనవి. తుచ్చీ అన్నట్లుగా 'దానిలో బ్రాహ్మణ లక్షణాలు ఎక్కువ'. ఆపైన ఇంకా ఇలా అన్నాడు : "అయినప్పటికీ దానిలో లోకాయతపై కొన్ని ఉల్లేఖనలు కనబడతాయి. బహుశా వాటిని (ఆ ఉల్లేఖనలను) ప్రాచీన సంకలనం నుంచీ సంగ్రహించి ఉండవచ్చును. ఆ సంకలనం 'చిత్రమైన లోకాయత లక్షణం' కలదే. (అది ఇప్పుడు దొరకదు).

ఇదీ అసలు సమస్య. విచిత్రమైన లోకాయత లక్షణం అంటే అర్థం ఏమిటి? అందుగురించిన మన భోగట్టాకు ఆధారం ఏమిటి?

## సంప్రదాయ పద్ధతి

ఇందుకు సమాధానంగా మాధవాచార్య గ్రంథంలో భద్రపరచబడిన ముఖ్యమైన లోకాయత శకలాలను మన అధ్యయనానికి తొలి మెట్టుగా తీసుకోవచ్చును. అయితే ఈ సూచనను రిస్ డేవిడ్స్ నిర్ద్వంద్వంగా నిరాకరించాడు. కాని, గార్బే "ఏమయినప్పటికీ మన జ్ఞానానికి ముఖ్య ఆధారం సర్వదర్శన సంగ్రహంలోని మొదటి అధ్యాయమే" అన్నారు. ఇది

ఆధునిక పండితులకు అలవాటైన మార్గమే. మాధవాచార్య గ్రంథం నుంచీ లోకాయతకు సంబంధించి మూల భావాన్ని ముందుగా సంగ్రహించాలి. అలాగే లోకాయతపై ఉన్న ఇతర ఆధారాలను జోడించాలి. ఆ తరువాత దాని వెలుగులో లోకాయత తత్వశాస్త్రాన్ని పునర్నిర్మించే పద్ధతిని ఆధునికులు అనుసరిస్తారు. లోకాయతపై అనేక ప్రాముఖ్యమైన విషయాలను మనకు తెలియజేసిన శాస్త్రి కూడా ఈ పద్ధతివైపే మొగ్గు చూపాడు. అయితే రిన్ డేవిడ్స్‌కు మాధవాచార్య ప్రామాణికత పట్ల నమ్మకం లేదు. పూర్తిగా మాధవాచార్యపై ఆధారపడటం విషయంలోనే రిస్‌డేవిడ్స్‌కు సందేహం. ఈ విషయం మనకు ముందు ముందు స్పష్టపడుతుంది.

సంప్రదాయ పద్ధతినే అనుసరించడంలో మనకు స్పష్టంగా రెండు విధాల సౌలభ్యాలున్నాయి.

లోకాయతపై మాధవాచార్య పాఠం స్పష్టంగానూ, పొందికగానూ ఉంది. లోకాయతికుల జ్ఞాన శాస్త్రం, తత్వశాస్త్రం, నీతిశాస్త్రం మూడూ చక్కగా అల్లబడిన తార్కిక పద్ధతిలో మాధవాచార్య వివరించాడు.

లోకాయతికులు ఇంద్రియ గ్రహణకు భిన్నమైన జ్ఞానాధారాన్ని దేనినీ గణించరని మాధవాచార్య అంటారు. కనుక వారు ఇంద్రియాలకు అందుబాటులో వుండే వస్తువులను తప్ప దేనికీ వాస్తవిక స్థాయిని ఇవ్వరు. దేవుడు లేదు, ఆత్మ లేదు, మరణానంతరం మిగిలేదేమీ లేదు. దీన్నుంచి లోకాయతికులు మతైక విలువలను, నైతిక విలువలను తిరస్కరించారనీ, ఇంద్రియ సౌఖ్యాలనే గణించారనీ అర్థం అవుతుంది. సారాంశంలో మాధవాచార్య చూపించిన లోకాయత దృక్పథం ఇది. ఇలాంటి చిత్రణ అస్పష్టతకు చోటునివ్వదు (ఈ చిత్రణ ఆయన కల్పనలోంచి వచ్చిందో లేదో మనకు తెలియదు). అలాగే ఇందులో అద్భుతమైన పొందిక వుంది. దీనిని మొదటి మెట్టుగా స్వీకరిస్తే మనం సరైన దారిలోనే వెళుతున్న భావం కలుగుతుంది.

అలాగే రెండో సౌలభ్యమేమిటంటే మాధవాచార్యతో ఆరంభించడం వలన మన ఆధునిక పండితుల మనసులలో ఒక పరిచయ భావాన్ని పెంపొందించవచ్చు. ఇది కూడా అంత తక్కువ ప్రాముఖ్యమైన అంశం కాదు. లోకాయతపై ఉన్న సమకాలిక భావాలకు లేదా విరుద్ధ భావాలకు ఈ మార్గం మృదువుగా అంగీకారయోగ్యంగా ఉంటుంది. ఉన్నత మానవ అస్థిత్వ విలువలను గ్రహింపజాలని మొరటు జనాల మతంగా మాధవాచార్య భౌతికవాదాన్ని చిత్రించాడు. ఆధునిక పండితుల దృష్టి కూడా ఇదే. మాధవాచార్య వలె తీవ్రంగానే భౌతికవాద తత్వశాస్త్రంపై వారికీ సానుభూతి లేదు. ఇక్కడ రెండు ఉదాహరణలు :

"ఒక స్త్రీని భౌతికవాద భావాల వైపు మళ్ళించడానికి – చెరపడానికి – ప్రయత్నించేవాడే" లోకాయతికుడని డీలావాలి పౌసీన్ అంటాడు. ఈ రచయితకు భౌతికవాదం అంటే చెరపడమే (చెడగొట్టడమే). తనేదో వాస్తవమే చెబుతున్నట్లుగా ఉందీ భావం.

'ఈ సిద్ధాంత సారాంశం ప్రభోధ చంద్రోదయం నాటకంలోని పాత్ర క్లుప్తీకరించినట్లే' ఉన్నదని రాధాకృష్ణన్ చెప్పగలిగాడంటే పై చెప్పిన దృష్టే కారణం. సోక్రటీస్ దృక్పథ సారాంశం

లేదా సోక్రటీస్ పాత్రలోని సారాంశం అరిస్టోఫేన్స్ నాటకాలలో కనబడుతుందని చెప్పడం ఎంత వాస్తవమో ఇదీ అంతే వాస్తవమని రాధాకృష్ణ పండితుడికి తెలుసు. నిజంగా మనకు ప్రబోధ చంద్రోదయంలో కనబడేది భౌతికవాద కృతక రూపమే. పైగా అది సున్నితమైన చిత్రణ కాదు. ఈ నాటకాన్ని కృష్ణమిశ్రుడు బౌద్ధుల, చార్వాకుల, కాపాలికుల ఇంకా ఆనాటి ప్రజలను ఆకర్షించిన అనేకమంది మతస్తుల భావాలను 'బట్టబయలు' చేసి, ఎగతాళి చేయడానికి రచించాడని అందరికీ తెలుసు. బౌద్ధమత సారాన్ని గానీ, జైనమత సారాన్ని గానీ ఆ నాటకం నుంచీ ఆవిష్కరించడానికి అవకాశం ఉందని ఏ పండితుడూ అనలేదు. భౌతికవాదం దగ్గరకు వచ్చేసరికి వేరు సంగతి. దాని సారాన్ని గురించిగానీ, దాని కృతక రూపాన్ని గురించి గానీ ఆధునిక పండితులు అంత శ్రద్ధ చూపరు. అందుచేతనే లోకాయతను గురించి మాధవాచార్య చెప్పిన దానిని సంతృప్తికరమైన తొలిమెట్టుగా భావిస్తారు.

ఈ పై పై సౌలభ్యాలు ఉన్నప్పటికీ సంప్రదాయ పద్ధతిని అనుమానించాల్సి వస్తుంది. ఈ పద్ధతి ద్వారా వచ్చే నిర్ణయాలలోని వైరుధ్యమే దానిపట్ల నమ్మకానికి ఎదురు ప్రశ్నగా తీసుకోవాలి. అంటే జాగ్రత్త తీసుకోవాలి. ముందుగా ఈ వైరుధ్యాలను గుర్తించి అందుకు మాధవాచార్యపై పూర్తిగా ఆధారపడ్డం ఎంతవరకూ కారణమో నిర్ణయించుకుందాము.

## పండిత లోకంలో అరాచకం

ప్రాచీన భారత తత్వశాస్త్ర గ్రంథకర్తలలో ఆధునికులు లోకాయత ప్రారంభాన్ని గురించీ, ప్రాముఖ్యతను గురించీ విపరీతమైన వైరుధ్యమున్న నిర్ణయాలకు వచ్చారు. ఆ పండితులలో అంత తేలిగ్గా కొట్టివేయలేని గొప్పవారున్నారు.

సాంప్రదాయక అధికారం బద్దలవడంతో లోకాయత పుష్పించిందని ఒక ఊహ. అది ఆ తరువాతి సంప్రదాయక పటిష్టతకు కారణమని కొందరు అంటారు. ప్రాచీన సుమేరియా నుంచీ లోకాయత దిగుమతి అయిందని కొందరు తీర్మానించారు. మరి కొందరు దాన్ని భారతీయ పురోహిత క్రియగా ఊహించారు. లోకాయత ప్రాచీన కాలాల్లోనే గాక ఇప్పటికీ దేశంలో అస్పష్ట, అసహ్య మతాల రూపంలో ఉందని కూడా భావిస్తారు. లోకాయత అంటే ఏమిటో వివరించే ఈ భావాలన్నీ పరస్పర విరుద్ధాలు. అందుచేత లోకాయత ప్రాచీన భారత తత్వశాస్త్రంలో అసలు ఒక భాగమే కాదనే సందేహానికి కూడా చోటు దొరుకుతుంది.

మన పండిత లోకంలో వ్యాపించి ఉన్న అరాచకానికి ఇవి కొన్ని ఉదాహరణలు. మాధవాచార్య చిత్రించిన లోకాయత భావాలపై పూర్తి నమ్మకం ఉంచినందువలన ఈ పై నిర్ణయాలు ఎలా వచ్చినాయో పరిశీలించుదాం.

క్రీస్తు పూర్వం 600 నుంచి 200 వరకూ ఉన్న ఇతిహాస కాలం నాటి సంకీర్ణ పరిస్థితుల ప్రభావం వల్ల వచ్చిన తాత్విక చింతనగా లోకాయతను రాధాకృష్ణన్ భావిస్తాడు.

తరతరాల నమ్మకాలు బదాబదలైపోయిన కాలమది. ప్రజలపై ఆధిపత్యం, అదుపు కూలిపోయిన కాలమది. ఆ వాతావరణంలో "రకరకాల తాత్విక స్వప్నాలూ, నిష్ప్రయోజక భావాలూ ముందుకొచ్చాయి... ఇంద్రియ ప్రపంచాన్నే ఏకైక వాస్తవంగా చేసిన భౌతికవాదులూ, విలువైన మానసిక శాస్త్ర భోధనలూ,ఉన్నత నైతిక విలువలూ బోధించే బౌద్ధులూ మనకున్నారు."

ఈ పరిస్థితుల్లో నిష్ప్రయోజనమైనప్పటికీ భౌతికవాదం తన చారిత్రక పాత్రను నిర్వహించింది. అది పాత సంప్రదాయ మహత్తుల మతాన్ని తిరస్కరిస్తోంది. మానవుని భావ స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తోంది. ఆధిపత్య సిద్ధాంతాన్ని తోసిరాజంటోంది.

"చార్వాక తత్వశాస్త్రం ఒక మూర్ఖ ప్రయత్నం. తరతరాలుగా బాధిస్తున్న భారాన్ని తొలగించే ప్రయత్నమిది. అది పిడివాదాన్ని కూలద్రోసింది. నిర్మాణాత్మక యోచనా స్రవంతికి ఆ చర్య ఎంతో అవసరం." ఈ ముగింపు వాక్యంలో సరళత ఉంది. మాధవాచార్యపై మొండిగా ఆధారపడ్డం వలన వచ్చిన ఫలితం ఈ సరళత. రాధాకృష్ణన్ లోకాయతపై మాధవాచార్య దృక్పథానికి అనుకూలంగా ఏ సమాచార ప్రభావానికి తల ఒగ్గదలచలేదు. అందుచేతనే రాధాకృష్ణన్ సర్వదర్శన సంగ్రహానికి జతగా ప్రబోధ చంద్రోదయం, సర్వసిద్ధాంత సంగ్రహంలాంటి గ్రంథాలను మాత్రమే స్వీకరించాడు. ఆ గ్రంథాలు కూడా మాధవాచార్య గ్రంథంలాగానే వేదాంత భావవాద దృక్పథం నుంచి రాసినవే. అన్నింటిలోనూ లోకాయతపై వున్న సమాచారం ఇంచుమించు ఒకటే. ఈ సమాచార సారాంశం పూర్తిగా లోకాయతకు వ్యతిరేక స్వభావం కలది. లోకాయత అనుమాన ప్రమాణాన్నీ, వేద ప్రమాణాన్నీ, భగవంతుని ఉనికినీ, ఆత్మనూ, అమర్త్యతనూ తిరస్కరించింది. క్షణిక సౌఖ్యాలు తప్ప మిగతా నైతిక విలువలను త్యజించింది. ఇలాంటి సమాచారంపై కేంద్రీకరించి మన గ్రంథకర్తగారు (రాధాకృష్ణన్) ఒకే ప్రశ్న అడగదల్చుకున్నారు. ప్రాచీన భారతదేశంలో అలాంటి నికృష్టమైన, నిరర్థకమైన దృష్టి ఎలా సాధ్యపడింది? తరతరాల విశ్వాసాలు ధ్వంసం అయిపోయిన యుగం ఆయనకు ఆసరాగా దొరికింది. అందుకనే మొరటు స్వేచ్ఛా, దానికి సంబంధించిన ఆలోచనలూ మొలకెత్తాయి అని సమాధానం చెప్పుకున్నాడు. ఇదంతా మితిమీరినతనం, నిష్ప్రయోజనం. అయినప్పటికీ అది తన చారిత్రక పాత్రను నిర్వహించింది. మన ప్రాచీనులకు పాత పద్ధతుల మతాన్నుంచీ విముక్తులను కావడం మున్ముందు నిర్మాణాత్మక భావనా కృషిని కొనసాగించడం అవసరం. లోకాయత ఆ విముక్తిని సాధించి పెట్టింది.

జె. మ్యూర్ కూడా ఆలోచనా స్వేచ్ఛకు చిహ్నంగా లోకాయతను స్వీకరించాడు. వాస్తవానికి అతని ఊహ కొంచెం తలక్రిందులు.ఆయన దృష్టిలో లోకాయత ప్రాచీన విశ్వాస భంగ ఫలితం గాక, ఆ విశ్వాస పటిష్టతకు కారణం అవుతుంది. ఈ నిర్ణయానికి ఎలా వచ్చాడు? రాధాకృష్ణన్ లాగే ఆయన కూడా మాధవాచార్య రూపొందించిన లోకాయత (వ్యతిరేక) చిత్రాన్ని మొదటి మెట్టుగా తీసుకున్నాడు. కానీ రాధాకృష్ణన్‌కి భిన్నంగా లోకాయతపై మరికొన్ని

ఆధారాలను గట్టిగా తీసుకుని వాటిని కూడా మాధవాచార్య చట్రంలోకి ఇరికించడానికి ప్రయత్నించాడు. అందుచేతనే ఈ ఇద్దరి పండితుల మధ్యా ఇంత తేడా వచ్చింది.

రుగ్వేదంలో ఉదహరించబడిన మత విద్రోహులూ, మత విరోధులూ సాక్ష్యంగా మూర్ మన దేశంలో అతి ప్రాచీన కాలం నుంచీ ఆలోచనా స్వాతంత్ర్య స్వభావం వుండేదని ఊహించాడు. అలాంటి వాతావరణం కొన్ని శతాబ్దాల పాటు కొనసాగి ఉండవచ్చు. రామాయణ రచనా కాలంలో కూడా బ్రాహ్మణుడై యుండి లోకాయత భావాలను ప్రచారం చేయవచ్చు. బ్రాహ్మణుడైన జాబాలి రామచంద్రునికి మత విరోధ భావాలు బోధించడంలో మనకు సాక్ష్యం లభిస్తుంది. మాధవాచార్య వివరించిన లోకాయత భావాలతో ఉన్న పోలికల ఆధారంగా అలాంటి మత విద్రోహ భావాలు లోకాయతమే అని మ్యూర్ వాదిస్తాడు. రామాయణ సాక్ష్యాన్ని ఉదహరిస్తూ మ్యూర్ ఇలా అంటాడు : బ్రాహ్మణ వ్యవస్థ దృఢంగా ప్రతిష్ఠించబడిన తరువాత, దాని సూక్ష్మ వివరాలు నిర్దేశించబడిన తరువాత కూడా అదే ఖండితమైన పద్ధతి ఆలోచనా విధానానికి పొడిగించబడలేదు. కానీ, బ్రాహ్మణుడు విద్యుక్త క్రతువులను ప్రేక్షకుడుగానూ, తన పీఠధర్మానికి పరిరక్షకుడుగాను ఉన్నంత వరకూ అతనికి ఏ తాత్విక భావమైనా ఉండవచ్చు. వీలయితే బోధించవచ్చు."

అటు పిమ్మట లోకాయతికులూ, బౌద్ధులూ మొదలైన మత విరోధుల దాడులు పదునెక్కిన కొలదీ – 'పవిత్ర గ్రంథాల ప్రమాణాన్ని పక్కకు నెట్టడమో, తక్కువగా చూడటమో మాత్రమేగాక బహిరంగంగా తోసివేయడమూ, నిరాకరించడమూ జరిగినప్పుడు, అలాగే వాటిపై ఆధారపడి వున్న వ్యవస్థను త్యజించి నిరసించడమో జరిగినప్పుడు' – శిష్టులు కంగారుపడి పాతకాలపు ఆలోచనా స్వాతంత్ర్యాన్ని అరికట్టే చర్యలు తీసుకున్నారు. లోకాయత – అతివాదము ఆ రకంగా ప్రాచీన ఆధిపత్యాన్ని పటిష్టం చేయడానికి పనికి వచ్చింది.

లోకాయత పుట్టుకను గురించీ, పెరుగుదలను గురించీ దాస్ గుప్తాకున్న ఊహకూ, పై రెండు అభిప్రాయాలకూ ఏమాత్రం పోలిక లేదు. లోకాయత మౌలికంగా దిగుమతి అయిన విదేశీ విశ్వాసమనీ, భారతదేశంలో తరువాతి కాలంలో దాని పెరుగుదలలో కొంత మార్పు చెంది ఉండవచ్చునీ దాస్ గుప్తా అభిప్రాయం.

"బహుశా లోకాయత సిద్ధాంతాలు అంతకు పూర్వపు సుమేరియన్ నాగరికతలో మొలకెత్తి ఉండవచ్చు. సుమేరియన్ నాగరికలో శవాలంకరణ, మరణానంతర శరీర అవశేష సిద్ధాంత సంప్రదాయాలుగా ఉండేవి. ఇది తరువాతి కాలంలో ఎంత మార్పు చెందిందంటే 'ఆత్మా, శరీరమూ ఒకటే కనుకనూ, మరణానంతరం శరీరం దహనం అవుతుంది కనుకనూ మరణానంతరం మరో ప్రపంచం అనేది ఉండజాలదు' అని వాదించేంత వరకూ మార్పు చెందింది. "ఆర్యుల కాలానికి మునుపు ఉన్న సుమేరియన్ ప్రజలలో ప్రచారంలో ఉన్న లోకాయత భావాలు చాలా ప్రాచీనమైనవని మనకర్థమవుతుంది.' ఇలాంటి అసాధారణ నిర్ణయానికి దాస్

గుప్తా ఎలా రాగలిగాడు? ఇతరుల్లాగానే లోకాయతపై మాధవాచార్య సమాచారంపై ఆధారపడ్డాడు. కనుక అలాగే ఇతరులకు భిన్నంగా దానిపై అదనపు సమాచార ప్రాముఖ్యతను (ఆ సమాచారం చాందోగ్యోపనిషత్‌లో ఉందని అతని నమ్మకం) నొక్కి చెప్పదలచుకున్నాడు గనుక. ఆత్మనూ, శరీరాన్నీ ఒకటిగా చూసే దృక్పథం అసురులదని ఈ ఉపనిషత్తు భావిస్తుంది. మరో విషయం ఇదే ఉపనిషత్తు అసురులకు శవాలను పూడ్చిపెట్టే సంప్రదాయం ఉందనీ చెప్తుంది. దాస్ గుప్తా ఆ సంప్రదాయానికి ఇలా అర్థం చెబుతాడు. 'శవాన్ని మంచి బట్టలతోనూ, విలువైన ఆభరణాలతోనూ అలంకరించడానికీ, దానికి ఆహార పదార్థాలు సమకూర్చడానికీ కారణం బహుశా మరణించినవారు మరో ప్రపంచాన్ని జయించగలరనే విశ్వాసం కావచ్చు.'

దాస్ గుప్తా శవాలను పూడ్చిపెట్టే సంప్రదాయం సుమేరియన్‌ల ప్రత్యేక లక్షణంగా భావించి వారినీ, అసురులనూ ఒకటే అని ఊహించాడు. మరోవైపున ఆత్మ, శరీరాల – ఏకతాభావం దాస్‌గుప్తాకు లోకాయతికులను స్ఫురింపచేసింది. కానీ, మాధవాచార్య అర్థం చేసుకున్న ప్రకారం, లోకాయత శరీరానికి భిన్నంగా ఆత్మనే గాక మరణానంతర అవశేషాన్ని కూడా (ఏ రూపంలోనైనా) తిరస్కరించింది. ఉపనిషత్తు సాక్ష్యాన్ని, మాధవాచార్య లోకాయత చిత్రణనూ రాజీ చేయాలంటే దాస్‌గుప్తాకు ప్రాచీన సుమేర్‌లోని శవ భూస్థాప సంప్రదాయంలోని విశ్వాసాలు, భావాలు భారతదేశానికి దిగుమతై మార్పులు చెందాయని ఊహించాల్సి వచ్చింది. మరణించిన వారిని పూడ్చి పెట్టే భారతీయ సంప్రదాయం మరణానంతరం మిగిలేదేమీ లేదని వీరికి తెలియజేస్తుంది.

మళ్ళీ తుచ్చి ఈ అభిప్రాయాలతో ఏమాత్రం ఏకీభవించడు. అతని దృష్టిలో లోకాయత మొదట భారత పురోహిత క్రియలలో భాగమే. తొలి రోజుల్లోనే ఈ సిద్ధాంతం ఒక పురోహిత వ్యవస్థకు ప్రతీక. రాజుకు పురోహితుడు (ఇంద్రునికి బృహస్పతిలాగా) సహాయపడతాడు. 'అర్థం', 'ధర్మం'లకు వరుసగా రాజు, పురోహితుడు ప్రతినిధులు.

ఆయన దృష్టిలో అర్థ అంటే రాజకీయ ఆర్థిక విధానం. 'ధర్మ' అంటే మతైక పవిత్రత. ఈ రెండూ కలసి ఎంతో దూరం ప్రయాణించలేవు. తొలి రోజుల్లోనే ఈ రెంటి మధ్యా సంఘర్షణ సూచనలు కనబడుతున్నాయి.

"రాజకీయ వ్యూహాలూ, మతైక పవిత్రతా కలిసి మనజాలవు. యాజ్ఞవల్క్య నారదుల కాలాల్లోనే అర్థ, ధర్మాల మధ్య పోరాట ఛాయలు కనబడతాయి.

ఈ పోరాట క్రమం చివరికి 'ధర్మం' పై 'అర్థం' బహిరంగపు తిరుగుబాటుగా పరిణమించింది.

"కొంతకాలం గడిచాక రాజకీయశాస్త్ర నిపుణులలో కొందరు ధర్మం ఆధిక్యతను గుర్తించ నిరాకరించి, లౌకిక ప్రపంచంలో భగవంతుడు, పురోహితుడు కలుగజేసుకోరాదని

ప్రకటించాడు... ఇలాంటి అన్ని సందర్భాల్లో లాగానే 'ధర్మం' పై 'అర్థం' ప్రతిఘటన ఉధృతం కాసాగింది. 'అర్థం', 'ధర్మం'తో బంధాన్ని తెంచుకోవడమే గాక ఎదురు తిరిగింది."

ఈ సంఘర్షణ – అర్థవాదం చివరికి మత విరోధిగా, ఆనందమే లక్ష్యమైన భౌతిక వాదంగా మారడానికి దోహదం చేసిందనీ, అలా మారిన తత్వశాస్త్రాన్నే మాధవాచార్య చిత్రించాడనీ తుచ్చీ ఊహించాడు.

తుచ్చీ ఇలా ఎందుకు భావించాడు? అతనికి లోకాయతకు సంబంధించి మాధవాచార్యకు ముందు కాలపు ఆధారాలు లభించాయి. పైగా ఆ ఆధారాలు మాధవాచార్య చిత్రణకు భిన్నంగా ఉన్నాయి.

"బౌద్ధుల పాళీ లేదా సంస్కృత గ్రంథాలలోని పిడి సూత్రాలలో బ్రాహ్మణులు అభ్యసించే శాస్త్రాలలో లోకాయత ఒకటని మనం చూడొచ్చు : 'వినయ పిటక' ప్రకారం – బుద్ధుడు ఆపి ఉండకపోతే – కొందరు బౌద్ధ సన్యాసులు కూడా లోకాయతను పఠించడానికి సిద్ధపడ్డారట."

రిస్ డేవిడ్స్‌కి ఈ ఆధారాలు ఇదివరకే తెలుసు. ఆయన దృష్టిలో లోకాయత అంటే ప్రకృతి వాదం. తుచ్చీ ఇందుకు అంగీకరించలేదు.

"సంస్కృతంలో 'లోక' అనే పదానికి ప్రకృతి అని అర్థం లేదు. ప్రధాన, ప్రకృతి, స్వభావ అనే పదాలే ఆ అర్థాన్నిస్తాయి. అందుచేతనే బౌద్ధ గ్రంథాలు అపార్థానికి తావీయకుండా ఉండటానికి జగత్తుకు సంబంధించిన సమస్యలను చర్చించేటప్పుడు – జగత్తును భౌతిక రూపంగా భావించినప్పుడు – లోక పదానికి ముందు భాజన పదం చేర్చారు. మరోవైపున లోక అనే పదానికి మానవ ప్రపంచం లేదా జీవులు అనే అర్థం వుంది. (లోకయాత్ర, లోకోక్తి, లోకవాద, దేవలోక). అందుచేత లోకాయత అనే పదానికి మనం ఇవ్వవలసిన అర్థం ఇందుకు భిన్నం. అది ఒక శాస్త్రం. దానికి వస్తువు లోక, అంటే ఈ ప్రపంచం. చైనీయులు ఈ పదానికి చేసిన అనువాదానికి ఈ అర్థం సక్రమం (చైనా అనువాదం : షున్‌షే లేదా షున్ సు). చైనా మాటల కర్థం ప్రపంచాన్ని లేదా ప్రపంచ సంప్రదాయాలను అనుసరించేవారు. కాబట్టి లోకయాత్ర లక్ష్యంగా కల ఈ లోకాయత నీతికీ, అర్థశాస్త్రానికి మొదటి మెట్టు. నీతికీ, అర్థ శాస్త్రానికీ కూడా బృహస్పతే అది పురుషుడని బ్రాహ్మణీయ ఆధారాలున్నాయి. అతని నుంచే లోకాయతకు బార్హస్పత్యమనీ, బార్హస్పత్య మతమనీ పేర్లు వచ్చాయి. దీనిని స్థూలంగా నీతి అని కూడా అంటారు."

పేరుకు సంబంధించిన ఈ వివరణను అంగీకరించకపోయినా లేక అంగీకరించినా ఇక్కడ ఉదాహరించిన వాస్తవ విషయాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. పండితులైనవారి పుస్తకాల జాబితాలో లోకాయత పేరు విస్తృతంగా చెప్పబడటం మాధవాచార్యకు వ్యతిరేకమైన సాక్ష్యమే. అందుచేతనే మాధవాచార్య ప్రామాణికతను మన పండితులు సందేహించవలసి

ఉంది. కానీ అలా చేయలేదు. ఎందుకనంటే ఆధునిక పండితులకు మాధవాచార్య పట్ల విశ్వాసం మౌలికమైంది. ఇక తుచ్ఛికి మిగిలింది ఊహాగానమే. అర్ధ, ధర్మాలకు మధ్య సంఘర్షణలున్న ఒక చారిత్రక కాలాన్ని ఊహించి తత్ఫలితంగా శాస్త్రీయమైన లోకాయత – మాధవాచార్య వర్ణించిన లోకాయత రూపంగా పరిణమించిందని భావించాడు. లోకాయత ఏదో ప్రాచీన భారత చరిత్ర కాలానికి సంబంధించిందని చెప్పడం తప్పు అని హెచ్.పి. శాస్త్రి వాదన. ఇప్పటికీ భారతదేశంలో లోకాయత శాఖలు మిగిలి వున్నాయి. బృహస్పతి సూత్రాలలో లభించే అద్భుతమైన సాక్ష్యాల ద్వారానూ, జైన వ్యాఖ్యాత గుణరత్న రచనల ద్వారానూ కాపాలికులని పిలువబడే గూఢ మతస్తులకు, లోకాయతికులకు మధ్య నున్న సామీప్యతను ఆవిష్కరించాడు శాస్త్రి. బృహస్పతి వారిద్దరినీ ప్రత్యేక శాఖలుగా చూస్తే గుణరత్న వారిని ఒక శాఖగానే భావిస్తాడు. ఈ సూచన ఆశ్చర్యకరం, కాపాలికులు ఇప్పటికీ మాసిపోలేదు. శాస్త్రి మరికొంచెం ముందుకెళ్ళి ఇలా వాదిస్తాడు :

“.... లోకాయతికులదీ, కాపాలికులదీ ప్రభావం భారతదేశంలో ఇంకా దృఢంగానే వుంది. దేహ అంటే మానవ శరీరం ఒక్కటే జాగ్రత్తగా చూసుకోవలసింది అని నమ్మే విశాలమైన శాఖ ఇప్పటికీ ఉంది. వారి మతాచారాలు స్త్రీ, పురుష సంయోగంతో ముడిపడి వున్నాయి. ఫలితం (అంటే సిద్ధి) ఆ సంయోగకాల పరిమితిపై ఆధారపడి ఉంది అని నమ్ముతారు. వారు వైష్ణవులు, కానీ, వారికి విష్ణువు లేదా కృష్ణుడు లేదా అతని అవతారాలలో నమ్మకం లేదు. దేహమే వారి విశ్వాసం. వారికి మరో పేరు సహజియ. ఈ పేరు బౌద్ధులలోని మహాయాన తెగ నుంచి వచ్చింది. అది కూడా భారతదేశంలో బౌద్ధపు చివరి నాలుగు శతాబ్దాల కాలంలో వచ్చిన పేరు.” – హెచ్.పి. శాస్త్రి.

ఇదంతా వాస్తవమైతే లోకాయతను గురించి మాధవాచార్య చెప్పిందంతా సందేహించవలసి వుంటుంది. సహజియ మతం మహాయాన బౌద్ధానికి క్షీణరూపంగా మిగిలిపోయిందనే సంగతి ఎలా ఉన్నా మనకు దానిని మాధవాచార్యుడు వర్ణించిన లోకాయతతో ముడిపెట్టడానికి వీలుకానంత అధిక సమాచారం (సహజియాను గురించి) తెలుసు. కాపాలిక, సహజియాల లాంటిదే లోకాయత అని భావిస్తే మాధవాచార్యుని వివరణను నిర్ద్వంద్వంగా తిరస్కరించవచ్చు. అయితే తాను ఊహించింది ఎంత ఆశ్చర్యకరమైనదైనప్పటికీ శాస్త్రి మాత్రం అలా తిరస్కరించడానికి సిద్ధపడలేదు. మాధవాచార్య పట్ల అతని నమ్మకం అంత మౌలికం. సర్వదర్శన సంగ్రహం గురించి రాస్తూ “ఈ గ్రంథం మొదట్లోనే నా ఆసక్తిని ఆకర్షించింది... చార్వాకులను గురించి పద్య భాగం తొందరలోనే సొంతం చేసుకున్నారు. వేరే ఆధారాల కోసం కుతూహలపడ్డాను.” సర్వదర్శన సంగ్రహ సాక్ష్యానికి విరుద్ధమైన ఉదాహరణలు గుర్తించినప్పటికీ మాధవాచార్యను సందేహించడానికి గానీ, కాపాలిక, సహజియలాంటి గూఢ మతాలతో పోల్చి లోతైన అవగాహనతో లోకాయతను పునర్నిర్మించే ప్రయత్నం గానీ చేయలేదు.

అందుచేత పరస్పర విరుద్ధమైన భావాలలో ఇరుక్కుపోయాడు. ఒకవైపున లోకాయతకు మాధవాచార్య ఇచ్చిన రూపమూ ఆయనకు నచ్చింది. మరోవైపున సహజియా, కాపాలిక మతాలతో లోకాయతికుల సామీప్యతా ఆయన గుర్తించాడు.

హెచ్.పి. శాస్త్రి సూచనలను స్వీకరించి ఈ సమస్య వైరుధ్యాన్ని పరిష్కరించడానికి డి.ఆర్. శాస్త్రి ప్రయత్నించాడు. (డి.ఆర్. శాస్త్రి రచించిన "భారతీయ భౌతికవాదం – శారీరక వాదం – సౌఖ్య వాదం – ఒక చరిత్ర" అనే పుస్తకం చాలా ప్రసిద్ధి కెక్కింది). మాధవాచార్యుని ప్రమాణం ప్రకారం లోకాయతికులు క్షీణ సంప్రదాయకులు కనుక అలాగే క్షీణ సంప్రదాయాల వారసులైన బౌద్ధులు, కాపాలికులు, సహజియాలు మొదలైన వారితో అనుబంధం ఏర్పరచుకొనడం తేలికే అని వాదించడం సులభమైన మార్గమే కదా. (బౌద్ధులు – కాపాలికులు – సహజియాలు లైంగిక దురాచారాలకు ప్రసిద్ధులు). ఇలా హీనులంతా ఒకరినొకరు ఆకర్షించుకున్నారు. డి.ఆర్. శాస్త్రి ఈ విషయాన్ని అనేక విధాల వాదించాడు.

"లైంగిక మర్యాదల పట్ల గౌరవం లేకపోవడం ఒక లక్షణంగా గల క్షీణ బౌద్ధ శాఖలు కొన్ని క్రమంగా లోకాయతతో అనుబంధం పెంచుకున్నాయి. అలాంటి వాటిల్లో కాపాలిక శాఖ ఒకటి. అది చాలా పురాతనమైనది. కాపాలికులు మదువు సేవిస్తారు. నరబలి ఇస్తారు. స్త్రీలను రమిస్తారు. మృతదేహాలు, మదువు, స్త్రీలు... ఈ ఆధారాల ద్వారా మత లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నం చేస్తారు. కామము అంటే శారీరక సుఖ లాలసత ఈ శాఖకు గమ్యం అవడం వలన లోకాయత శాఖకు చెందిన నాస్తిక మతంలో క్రమంగా చేరిపోయింది. లోకాయత మతానికి అంతిమ లక్ష్యం కేవలం భౌతిక సుఖమే.

"బ్రాహ్మణ మత పునరుజ్జీవనం తరువాత లోకాయత శాఖ భారతదేశంలో వివిధ ప్రాంతాలలో వివిధ రూపాలు పొందింది. బెంగాల్‌లో లైంగిక సౌఖ్యానికే ఎక్కువగా ముడిబడ్డ ప్రాచీన బౌద్ధ మహాయాన శాఖ తన ప్రత్యేక అస్తిత్వాన్ని వదులుతుంది. ప్రభావవాదుల్లాగా, కాపాలికుల్లాగా వారు లోకాయతికులతో ఐక్యమయ్యారు. అలాగే లోకాయతికులు వారితో కలిసిపోయారు. ఈ శాఖలో ఇప్పటికీ భౌతిక సౌఖ్యాలకు అనుమతిగా మదనోత్సవం పేర నాస్తికులు క్రతువులు జరుపుకుంటారు. ఈ శాఖ పేరు సహజియా."

విచిత్రం ఏమిటంటే ఈ రచయితగారి లెక్క ప్రకారమే రెండు మార్గాల నుంచి వచ్చి ఏకీభావం చెందిన క్షీణత్వం మన ప్రాచీన చరిత్రలో కొద్దికాలంపాటు ఎంతో ప్రాచుర్యం పొందిందట.

"లోకాయతికులది అద్భుతమైన సౌఖ్యవాదం. వారి ప్రభావం వల్ల భారతదేశ చరిత్రలో ఆ కాలంలో దేవళము, రాజాస్థానము, కవిత, కళ అన్నీ ఇంద్రియ సౌఖ్యాలలో ఓలలాడాయి. దేశమంతటా కాముకత్వం ప్రజ్వరిల్లింది. బ్రాహ్మణుడు, చండాలుడు, ప్రభువు, భిక్షార్థి అందరూ సమానోత్సాహంతో మదనోత్సవంలో పాల్గొనేవారు. మదనోత్సవం అంటే కామదేవుని పూజ.

తాను ఏ చారిత్రక కాలాన్ని గురించి మాట్లాడుతున్నాడో ఈ రచయితగారు చెప్పలేదు. మదనోత్సవం అనే పండుగ వాస్తవ అర్థాన్ని గురించిగానీ, లైంగిక సంకేతాలతో నిండిన దేవాలయ శిల్పాల అంతరార్థాన్ని గురించి గానీ తెలుసుకోవడానికి ఆయన ఏమాత్రం ప్రయత్నించలేదు. (ఆ విషయాన్ని) కేవలం ఉదహరించి ఊరుకున్నాడు. వీటన్నిటితో లోకాయత భావాలకు సంబంధం ఉందన్న సూచన అనేక క్లిష్టమైన ప్రశ్నలకు దారితీస్తుంది. డి.ఆర్. శాస్త్రి ఈ విషయంలో అసూయ పడదగ్గ అమాయకత చూపించారు. మాధవాచార్య రాతలలో సాక్ష్యం లభించినందువల్ల అంతకు పూర్వం ఎప్పుడో లోకాయతికుల క్షీణ దృక్పథ ప్రభావం వల్ల ఇలాంటివన్నీ సంభవించి ఉండొచ్చునని ఆయన వాదం.

ప్రాచీన లోకాయతను గురించి ఇన్ని రకాల ఊహలు ఉండటం వల్ల ఆధునిక పండితులకు ఈ మొత్తం సమస్యను, వాస్తవికతా రంగాన్నుంచి తొలగించడం చాలా తేలిక. రిస్ డేవిడ్స్ దీన్ని ఎప్పుడో సాధించాడు. బౌద్ధమూలాల ఆధారంతో అసలు లోకాయత దృక్పథంగానీ, ఆ మత అనుయాయులు గానీ ఎప్పుడూ లేరని తీర్మానించి పారేశాడు.

"ఈ కథంతా చూస్తే తనను తాను లోకాయతికుడనని పిలుచుకున్నవాడు ఎవడూ లేడు. అలాగే లోకాయత జ్ఞానం కూడా లేదు. లోకాయత అనే పేరు గల తత్వ శాస్త్రం లేక ఆలోచనా విధానం ఏ ఛాయనూ, జాడనూ మిగల్చలేదు." – రిస్ డేవిడ్స్.

ఏమైనప్పటికీ లోకాయతికులు అనే వారిని గురించి మన ప్రాచీన సాహిత్యంలో అనేక చోట్ల ప్రస్తావన ఉంది. ఆ ప్రస్తావన కూడా తాత్వికంగా వారి శత్రువులు చేసినట్టిదే. ఈ ప్రస్తావనలన్నీ ప్రకృతి ఆరాధకులకు సంబంధించినవని రిస్ డేవిడ్స్ అంటాడు. తొలుత వీరి పట్ల గౌరవం ఉన్నప్పటికీ తరువాతి కాలంలో ప్రకృతి ఆరాధకులను నీచంగా చూసేవారు.

"ఈ పదం (లోకాయత) మొదట్లో ప్రకృతి సంప్రదాయంగానో, జానపద సంప్రదాయంగానో ఉపయోగించబడినప్పటికీ మనకు దొరికే భావాలలో అవాస్తవికత ధ్వనిస్తుంది... మధ్యకాలంలో ప్రకృతి ఆరాధకుల చమత్కారాలూ, పొడుపు కథలూ చులకనయ్యాయి. చివరి దశలో లోకాయత, లోకాయతికలాంటి పదాలు కొయ్య గుర్రాలుగా మారిపోయాయి. తమ శత్రువులకు ఆపాదించే భావాలను వేళ్ళాడదీసే మేకులుగా మారిపోయాయి. ఆ రకంగా ఒక అసహ్యమైన పేరు తగిలించినట్లయ్యేది."

ఆ పద్ధతిలో లోకాయత సమస్యను, దాన్ని పూర్తిగా నిరాకరించడంతో పరిష్కరించారు.

అలాంటి దృక్పథానికి, మాధవాచార్యపై పూర్తిగా ఆధారపడటం ఏ మేరకు సాయపడింది ? (అని అడగవచ్చు). దానికి సమాధానం వ్యతిరేక ధోరణిలోనే ఉంటుంది. (పైకి) రిస్ డేవిడ్స్ ఒక్కడే మాధవాచార్య ప్రమాణాన్ని సందేహించిన ఆధునిక పండితుడు.

“తిందాం, తాగుదాం, రేపు మనం ఉండం గదా... అనే తీవ్ర భావాలను 14వ శతాబ్దపు మతతత్వవేత్త శాయన మాధవ - ఒక దీర్ఘమైన అధ్యాయంలో - లోకాయతకు ముడిపెట్టాడు. మతరీత్యా నాస్తికత్వాన్ని, తత్వశాస్త్రరీత్యా మిథ్యా వాదాన్ని వారికి కట్టబెట్టాడు. సమర్ధవంతమైన అతని వర్ణన చూస్తే అంతా అతని ఊహాపోహల నుంచి వచ్చినట్టనిపిస్తుంది. విశ్వాసరాహిత్యమైన కొన్ని లొల్లాయి పదాలపై ఆధారపడినట్లనిపిస్తుంది. ఆ పద్యాలు పూర్వకాలపు బ్రాహ్మణులు చదివిన లోకాయతలో భాగాలుగా ఉండే అవకాశం లేదు. ఆ భావాలు కొంచెం ఆలోచనా శక్తి ఉండి, నైతికంగా పూర్తిగా క్షీణించి... తార్కికంగా దైవాన్ని విశ్వసించని వాని ఆదర్శంలాగా కనబడతాయి.

రిస్ డేవిడ్స్ ఈ విధంగా మాధవాచార్యను నిరాకరించినట్టు కనబడుతుంది. నిజం చెప్పాలంటే ఇక్కడ లోకాయత తత్వ వాస్తవికతను నిరాకరించే ప్రాతిపదిక మాధవాచర్యపై అకుంఠిత విశ్వాసమే. లోకాయత ప్రసక్తి వచ్చిన ప్రాచీన గ్రంథాల ఆధారం సాధించలేకపోయాడు. అలాగే మాధవాచార్య వర్ణించిన లోకాయతకు సమానమైన తత్వ దృక్పథం ఆయనకు ఎక్కడా కనబడలేదు. కనుక లోకాయత కూడా ఆయనకు అవాస్తవమైపోయింది. లోకాయత తత్వ వాస్తవత్వం మాధవాచార్య ప్రమాణం పైనే ఆధారపడి పోవడం జరిగింది. లోకాయత అవాస్తవం, ఎందుచేతనంటే మాధవాచార్య వర్ణించిన మార్గంలో అది అవాస్తవం అవుతుంది. పరోక్షంగానైనా మాధవాచార్యపై ఆధారపడటం వలన అధ్యయనం ఆ పైన సాగలేదు.

అసలు సంగతేమిటంటే లోకాయతకు సంబంధించిన అనేక ఆధారాలు ఆయనకు ముఖ్యంగా బౌద్ధ సాహిత్యంలో లభించినప్పటికీ అవన్నీ మాధవాచార్య వర్ణనకు సరిగా అతకలేదు. ఆయన మాధవాచార్య ప్రభావం నుంచి విముక్తుడైనట్లయితే, బౌద్ధ ఆధారాలకు సరైన ప్రాముఖ్యం ఇచ్చి ఉన్నట్లయితే, అలాగే జైన మొదలైన ఇతర ఆధారాలతో సమన్వయపరచి ఉన్నట్లయితే మన పండితుల వారికి ప్రాచీన లోకాయతను పునర్నిర్మించే మార్గం దొరికేది. ఏమైనా మాధవాచార్యకు వాగ్రూపేణా ఎంత కాదన్నప్పటికీ ఆయన మరో మార్గాన అన్వేషించలేదు. అందుచేతనే మాధవాచార్య మన ఆధునిక పండితులకు ఏకైక ప్రమాణంగా మిగిలిపోయాడు.

## మాధవాచార్య ప్రామాణికత

మన ఆధునిక పండితులు మాధవాచార్యను విపరీతంగా విశ్వసించినందువలనా, ఆ విశ్వాసం పండితుల మధ్య ఎంతో గందరగోళం కలగజేసినందువలనా, మాధవాచార్య వర్ణించిన లోకాయత ప్రామాణికతను ముందుగా పరిశీలించడం న్యాయం.

మొట్టమొదట మూల లోకాయతకూ, మాధవాచార్యకూ మధ్య నున్న కాల వ్యవధిని చూస్తే మాధవాచార్యపై ప్రాథమికమైన సందేహం వచ్చే అవకాశం వుంది. ‘కూటదంతసుత్త’లాంటి

తొలి బౌద్ధ ఆధారాల్లో మనకు లోకాయత అనే పేరు తగుల్తుంది. అలాగే మరో ప్రాచీన బౌద్ధ గ్రంథం 'బ్రహ్మ జాలసుత్త'లో శరీరాన్నే ఆత్మగా భావించే కచ్చితమైన భౌతికవాద దృక్పథం కూడా మనకు తగుల్తుంది. ఈ ఆధారాల వలన లోకాయతికులను గురించి, వారి భౌతిక దృష్టిని గురించీ తొలినాటి రచయితలు కనబరచిన ఆసక్తి కారణంగా మనకు ఒకటి స్పష్టపడుతుంది. బౌద్ధమతానికి పూర్వకాలం నుండి (మూల) లోకాయత వర్ధిల్లుతోంది. మరి మాధవాచర్యా చూస్తే క్రీ.శ. 14వ శతాబ్దానికి చెందినవాడు. అతనికి (మూల) లోకాయతకూ మధ్య రెండువేల సంవత్సరాల అంతరం ఉంది.

ఈ ప్రాథమిక సందేహం మాధవాచార్య నిమగ్నమైన రాజకీయాల వల్ల ఇంకా బలపడుతుంది. తన సోదరుడు శాయనలాగే మాధవాచార్య కూడా. విజయనగర సామ్రాజ్యానికి స్థాపకుడు, మంత్రి. ఆపైన ఈ సామ్రాజ్య స్థాపనకవసరమైన ధనాన్ని మధ్యయుగాలకు చెందిన ఒక మఠం ద్వారా సంపాదించాడని కూడా చెబుతాడు. ఇందువలన తేలేదేమిటి? రాజకీయ వ్యవహారాల్లో ఆయన గాఢంగా నిమగ్నుడయ్యాడని తేల్తుంది. అలాగే ఆ రాజకీయాలు తత్వశాస్త్రం పట్ల ఆయనకున్న ఉత్సాహాన్ని ప్రభావితం చేయడానికి అవకాశం వుందని కూడా బోధపడుతుంది. బహుశా తత్వశాస్త్రం ఆయన అనుభవ రాజకీయాలకు ప్రతిబింబం కావచ్చు. లోకాయత దాని పేరు సూచించినట్టుగానే ప్రజల ప్రాపంచిక దృష్టి అయివుండగా, మాధవాచార్య లాంటి రాచరికవాది లోకాయతను గురించి నిష్పక్షపాత చిత్రాన్ని ఎలా చూపగలడు?

ఈ పైన చెప్పిన రెండు అంశాలూ ప్రత్యేకమైన ప్రాధాన్యత కలవి కావని మాధవాచార్యను సమర్థించేవారనవచ్చు. మాధవాచార్యకూ, తొలి లోకాయతికులకూ మధ్య కాలవ్యవధి గణించతగినంత ఉంది. అయితే భారత తత్వశాస్త్రాభివృద్ధిలో ఉన్న ప్రత్యేక వైఖరిని గమనించినవారెవరైనా... కొన్ని శతాబ్దాల పరిమితిలో కూడా ఈ క్రమంలో అద్భుత పరిణామాలను ఆశించరు. మాధవాచార్య కాలం నాటికి తొలినాటి లోకాయత భావ బీజాలు విస్తృతమై ఒక క్రమ సిద్ధాంతంగా రూపొంది ఉండవచ్చును. అయితే తొలినాటి లోకాయత, తర్వాతి కాలపు దాని రూపంతో గుణాత్మకంగా విభేదిస్తుందనే శంకకు ఆధారం లేదు.

అలాగే మాధవాచర్యకు తన రాజకీయాలేవో ఉన్నాయి. దాన్నే ఆధారం చేసుకుంటే లోకాయత అవ్యక్తంగానూ, అజ్ఞాతంగానూ ఉండిపోతుంది. ఎందుచేతనంటే లోకాయతకొక దురదృష్టకర స్థితి ఉంది. వ్యతిరేకుల ఉల్లేఖనల నుంచే లోకాయత గురించి మనం తెలుసుకోగలం. లోకాయతను గురించిన సమాచారం ఇచ్చిన అనేకులూ, మాధవాచార్య రాజకీయ పక్షపాత వైఖరి కలవారు కాకపోవచ్చు. కాని మతపరంగా వారికి గాఢమైన మొగ్గు ఉండేది.

ఎన్ని సమర్థనలున్నప్పటికీ మాధవాచార్య వర్ణించిన లోకాయతను అక్షరసత్యంగా తీసుకోలేం. బాహ్యంగానూ, అంతర్గతంగానూ లభించే ఆధారాలు అందుకు వ్యతిరేకంగా కనబడుతున్నాయి. బాహ్యంగా దొరికే ఆధారాలు నిర్ణయాత్మకం అయినప్పటికీ ఆంతరంగికమైనవి కూడా అప్రధానమైనవి కాదు.

## మాధవాచార్య ఆవిష్కరించిన తీరు

'సర్వదర్శన సంగ్రహం' ఆంగ్ల అనువాదకుడు కొవెల్ తన పరిచయ వాక్యాల్లో మాధవాచార్యను గురించి – అతని వ్యతిరేకుల దృక్పథ సందర్భంగా ఇలా అంటాడు. మాధవాచార్యా "అనుకూలవాది (ఆ తత్వశాస్త్రానికి) స్థానంలో ఉన్నప్పుడు – అప్పుడప్పుడు చోద్యంగా ప్రవర్తిస్తాడు. తన భావాలకు శుద్ధ వ్యతిరేకమైన భావనిక్షేపం తనదే అన్నట్లు ప్రవర్తిస్తాడు" – (అంటే తన వ్యతిరేకుల వాదం మనకు చెప్పేటప్పుడు వారి తరఫున మాట్లాడతాడన్న మాట).

ఇది చాలా ముఖ్యమైంది. ఇక్కడ ఉదహరించిన విషయం మాధవాచార్య భావనా ప్రతిభకు నిదర్శనం. కాని ఆ ప్రతిభ ప్రామాణికతను నిర్లక్ష్యం చేసింది. తన కల్పనాచాతురికి తానే ముగ్ధుడై పోయి, లోకాయతికుల స్థానంలో తాత్కాలికంగా తనను నిలుపుకో వాంఛించాడు. అందుచేతనే లోకాయతికులు స్వయంగా ఏం చెప్పారో, ఏ విధంగా వాదనను సాగించారో... సమాచారమిచ్చే జాగ్రత్త తీసుకోలేదు. తద్విరుద్ధంగా "తాను లోకాయతికుడైతే తాను ఏమి చెప్పదలచుకున్నాడో, వారి తాత్విక దృక్పథానికి అనుకూలంగా ఏ పద్ధతిలో వాదించగలడో" చెప్పడానికి ఆతురత చూపించాడు.

ఇది మరికొన్ని అసందర్భాలకు దారితీసింది. లోకాయతుల వాదనా విధానం మాధవాచార్య పద్ధతికి తీవ్ర వ్యతిరేకం అయి ఉండాలి. మాధవాచార్య వేదాంత తత్వవేత్త. లోకాయతికులకొక భాష్య పద్ధతి ఉంది. అయినా సరే! తన వేదాంత భాష్య పద్ధతిని లోకాయతికులకు అంటకట్టాడు మాధవాచార్య.

వేదాంత తత్వవేత్తకు శ్రుతి పరమ ప్రమాణము. ఏ సిద్ధాంతాన్నీ భాష్యాలు మాత్రమే నిలబెట్టజాలవు. శ్రుతికి సహాయకారిగా ఉన్నప్పుడే వాటికి తార్కిక స్థాయి (విలువ) కనక ఉపనిషదుల్లేఖనమే ఒక వాక్యానికి పరిగణన తీసుకువస్తుందనేది వేదాంత దృష్టి. కాని ఇది లోకాయతికులకు విరుద్ధమైన తీరు. అసలు మాధవాచార్య స్వయంగా అంగీకరించిన విషయం. శ్రుతిని, సోమరిపోతుల (మోసకారుల) సృష్టిగా భావిస్తారు లోకాయతికులు.

ఈ పరిస్థితుల్లో లోకాయతికులు ఉపనిషద్వాక్యాలనుల్లేఖించడం ఏదో సామెతలాగా – దెయ్యాలు వేదాలు వల్లించినట్లు – కనబడటం ఆశ్చర్యకరం కాదు. కాని మాధవాచార్య తన వ్యక్తిత్వం పట్ల ప్రగాఢ విశ్వాసంతో మైమరచిపోయి లోకాయతికుల చేత 'బృహదారణ్యకోపనిషత్' నుంచి ఉల్లేఖింపచేశాడు – (తమ వాదాన్ని నిలుపు కోవడానికి).

"ఈ సిద్ధాంతంలో భూమి మొదలైన నాలుగు మూల పదార్థాలు ప్రాథమికమైనవి. వీటి నుంచి మాత్రమే శరీరంగా పరివర్తన చెందినపుడు బుద్ధి ఉత్పన్నమవుతుంది. కొన్ని

సంచారముల మిశ్రణము వలన 'మత్తెక్కించే స్వభావం' లభ్యమైన రీతిగా – ఈ ప్రాథమిక వస్తువులు నాశనం చేయబడితే బుద్ధి కూడా నశిస్తుంది. వారు శ్రుతిని ఉల్లేఖిస్తారు (బృహదారణ్యకోపనిషత్ 2, 4, 12) 'ఈ నాలుగు మూల పదార్థాలనుంచే దృఢ జ్ఞానం చిప్పిల్లుతుంది. అవి నశించినప్పుడు అది కూడా (జ్ఞానం) నశింపు చెందును. మరణానంతరం బుద్ధి మిగిలియుండదు.'

## లోకాయత జ్ఞాన సిద్ధాంతం

అనుమాన ప్రమాణాన్ని లోకాయత తిరస్కరించిందని సామాన్యంగా అనుకుంటారు (అనుమానం అంటే సంశయం లేదా సందేహం అని తెలుగులో రూఢి. కాని సంస్కృత భాషలో 'అనుమాన' అంటే 'ఊహించతగినది', 'భావించతగినది' అని అర్థాలు చెప్పుకోవచ్చు. ఉదా : 'కొండ మీద పొగ కనబడుతోంది. కనుక అక్కడ నిప్పు ఉన్నది.' ఇందులో నిప్పు ఉండటమనే ఊహ 'అనుమాన' అవుతుంది. ఈ భాగంలో 'అనుమాన' అంటే ఇదే అర్థం). ఈ భావం మాధవాచార్య లోకాయత – జ్ఞాన సిద్ధాంతాన్ని వివరించిన పద్ధతి వల్ల వ్యాప్తిలోకి వచ్చింది. యూరోపియన్ తర్క పరిభాషలో అనుమాన ప్రమాణాన్ని తిరస్కరించే వాదనా క్రమం ఈ క్రింది విధంగా క్లుప్తీకరించవచ్చును.

సార్వత్రిక సంబంధం (వ్యాప్తి) అనుమాన ప్రమాణానికి ప్రాతిపదిక. రెండు వస్తువులకు మధ్యనున్న వ్యాప్తి అనుమాన ప్రమాణానికి ఆధారం (పై ఉదాహరణలో 'పొగ'కూ, 'నిప్పు'కూ ఉన్న అవినాభావ సంబంధం – ఇక్కడ 'పొగ'ను లింగమనీ, 'నిప్పు'ను 'సాధ్యము' అనీ పరిభాష. ఆ రెంటికీ ఉన్న సంబంధం వ్యాప్తి). కాని ఈ వ్యాప్తి అనేది ఆయుక్తమైన భావన (అనుకోవడం రుజువు లేకుండా). సక్రమ జ్ఞానానికి మూలమైనదేదీ ఈ ఊహను బలపరచదు. యూరోపియన్ తర్కంలో లభించే డేవిడ్ హ్యూమ్ తిరస్కరించిన సార్వత్రికత బంధనావశ్యకత – ఇందుకు ఉదాహరణ. అది ఈ వాదానికి దగ్గర.

నిప్పు (సాధ్య)ను పొగ (లింగ) ఆధారంగా ఊహించడం ఎప్పుడు వాస్తవమవుతుంది? ప్రపంచంలో పొగ ఉన్నచోటునల్లా – మినహాయింపులు లేకుండా – నిప్పు ఉన్నప్పుడే సక్రమమవుతుంది. ఈ సార్వత్రిక సంబంధాన్ని సమర్థించే జ్ఞాన మూలమేదీ లేదు. ఇంద్రియ గ్రాహ్యత దాన్ని సాధించలేదు. ఇంద్రియ గ్రాహ్యత విడివిడి సంఘటనలకు మాత్రమే పరిమితం. కనుక. అనుమాన ప్రమాణమే వ్యాప్తిపై ఆధారపడి ఉంది కనుక... వ్యాప్తిని అది సృష్టించజాలదు. సాక్ష్యము – లేదా దృష్టాంతము లాంటి మిగతా జ్ఞానాధారాలు కూడా 'అనుమానం'పై ఆధారపడ్డవే కనుక వ్యాప్తికి అవి ప్రాతిపదిక కాజాలవు. కనుక 'అనుమాన' సాధ్యపడదు. ఈ ప్రకారంగా మాధవాచార్య వివరించిన పద్ధతిలో లోకాయత జ్ఞాన సిద్ధాంతం ప్రత్యక్ష ఇంద్రియ గ్రాహ్యత మాత్రమే అవుతుంది.

లోకాయతికుల జ్ఞాన సిద్ధాంతం ఇదే అయితే దాన్ని తిరస్కరించడం తేలికే. వాదాలు (భాష్యాలు) అన్నీ వ్యాప్తిపైఆధారపడి వున్నాయి. అందుచేత 'వ్యాప్తి'ని తిరస్కరించడం వాదమనే దానిపైనే అపనమ్మకం వెలిబుచ్చటమవుతుంది. కానీ లోకాయతికులే తమ వాదాన్ని ప్రతిష్టించుకోవాలి. అందుచేత స్వవచోవ్యాఘాతాల పాలవుతారు. మాధవాచార్య బౌద్ధ దృక్పథం నుంచి లోకాయతికుల వాదాన్ని ఖండించడానికి ఈ క్రింది విధంగా అన్నాడు.

"అనుమాన"ను ఒక ప్రమాణంగా తీసుకోనివానితో ఇలా అనవచ్చు : 'అనుమాన' ఒక ప్రమాణం కాదు అని వక్కాణిస్తున్నావు. దానికి రుజువు లేదంటావా? ఉందంటావా? మొదటి ప్రత్యామ్నాయం అంగీకరించబడదు, వక్కాణించడం మాత్రమే వక్కాణింపుకు రుజువు కాదు. అలాగే రెండో ప్రత్యామ్నాయం కూడా ఇంతకంటే మెరుగు కాదు; 'అనుమాన' ఏ రకంగానూ ప్రమాణం కాదని చెపుతూనే మొండి వాదనను ముందుకు తీసుకు వస్తున్నావు (రుజువు చేయడం అనగా 'అనుమాన'... అదే లేదన్నావుగా), నువ్వు అసంబద్ధ స్థితిలో పడిపోతావు. మీ అమ్మ గొడ్రాలు అని నువ్వన్నంత అసంబద్ధత, ఇంద్రియ గ్రాహ్యత లేదనే ప్రాతిపదికతో ఏ వస్తువు అస్తిత్వాన్నైనా తిరస్కరిస్తే, నువ్వే 'లింగ'ను ఇంద్రియ అగ్రాహ్యత కారణంగా (తిరస్కరించి) 'అనుమాన'ను అంగీకరించినట్లే" – (సర్వదర్శన సంగ్రహం).

ఆపైన లోకాయత – వాదం మన దినసరి జీవితాన్ని కూడా అసాధ్యం చేస్తుందని 'న్యాయ' మార్గానికి చెందిన మధ్యయుగపు తాత్వికుడు ఉదయనుడన్నాడు.

"ఈ సిద్ధాంతాన్ని ఎల్లవేళలా అన్వయిస్తే, ఏ క్షణాన్నైనా తమ ఇంద్రియ గోచరంగాని దానిపై అపనమ్మకం కలిగించుకుంటే అనుభవ జీవితం గందరగోళమై పోతుంది."

లోకాయత – జ్ఞాన సిద్ధాంతాన్ని ఇలా చిత్రీకరించడాన్ని మనం ఎంత మేరకు గౌరవించాలి?... ఇదీ ప్రశ్న. వాస్తవంగా లోకాయతికులు అనుమాన ప్రమాణాన్ని ఇంత అఖండంగా తిరస్కరించారా – తర్కశాస్త్రాన్నే కాక, రోజువారీ జీవితాన్ని కూడా అసందర్భ పరిచేతంగా ఇతరేతర ఆధారాలు చూస్తే – దీనికి సమాధానం పూర్తిగా తలక్రిందులుగా వుంది. ఆ రకంగా మాధవాచార్య చిత్రించిన లోకాయత – జ్ఞాన సిద్ధాంతం పూర్తిగా ఊహాత్మక కల్పన.

అలాంటి ప్రయోజన శూన్యమైన వాదనలకు భిన్నంగా బహుశా లోకాయతికులు తొలి తార్కికులని మనం నిరూపించ ప్రయత్నిద్దాం. అలాగే వారు (లోకాయతికులు) తమ వాదనలను (భాష్యాలను) వితర్కంగా మాత్రమే ప్రయోగించారని భావించడం తప్పని కూడా ప్రతిపాదించవచ్చును.

బుద్ధఘోషుడు లోకాయతను 'వితండవాద శాత్త' అని పిలిచాడు. 'శాత్త' అనే పాళీ భాషా పదానికి 'శాస్త్ర' అని సంస్కృతంలో అర్థం. అంటే ఇంచుమించు విజ్ఞానశాస్త్రం (ఒక

శాఖాధ్యయనం). ఆ విధంగా బుద్ధఘోషుని దృష్టిలో లోకాయత 'వితండానికీ', 'వాదానికీ' సంబంధించిన శాస్త్రం. ఈ రెండు పదాలూ న్యాయమతం ప్రకారం వాద ప్రతివాదాలకు చెందినవి. అయితే అవి పరస్పర వ్యతిరేకార్థ సూచకాలు.

"వితండ అంటే జిత్తులమారి వివాదము... ప్రత్యామ్నాయ సిద్ధాంతాన్ని దేన్నీ స్థాపించకుండా, ప్రతికక్షి సిద్ధాంతాన్ని విమర్శించడానికి మాత్రమే ప్రయోగించే చమత్కార తర్క చర్చ (జల్ప)గా 'వితండ' నిర్వచించబడింది. అది ఒకానొక సిద్ధాంతాన్ని సక్రమంగా నిలపడానికి ఉద్దేశించబడిన తార్కిక చర్చ – అంటే 'వాద'కు పూర్తిగా భిన్నమైనది". (దాస్ గుప్తా – భారతీయ తత్వశాస్త్ర చరిత్ర).

ఈ తేడాను దృష్టిలో పెట్టుకుని, లోకాయత ఒకే సమయంలో 'వితండ'కూ 'వాద'కూ కూడా 'శాత్త' (శాస్త్రం) ఎలా కాగలదని ప్రశ్నించాడు. మరో న్యాయ సిద్ధాంతానుయాయి జయంతుడు సూచించిన సమాధానం ఆ ప్రశ్నకు అన్వయించాడు. బౌద్ధుల దృష్టిలో 'వితండ', 'వాద' రెండూ కూడా 'కుతర్కాలే' కావడం వలన అవి వేరు వేరు కాదని జయంతుడి సూచన. 'లోకాయత'లో 'వితండ' లక్షణమున్నా దాన్ని 'వాద' అని కూడా పిలవవచ్చునని బౌద్ధుల అభిప్రాయమని దాస్‌గుప్తా భావించాడు. అంటే లోకాయత వినాశకరమూ, నిష్ప్రయోజకమూ అయిన వాదం మాత్రమేనని అర్థం – పనికిమాలిన కుతర్కం.

"పైన పేర్కొనబడ్డ వివరణతో పాటు ఇంకా ఇతర పాళీ గ్రంథాల ఆధారాల నుంచీ లోకాయత అంటే అబౌద్ధులు అవలంబించే చమత్కార వివాదము లేదా కుతర్కం లేదా తర్జన భర్జన అని స్పష్టపడుతుంది. అది సత్ఫలితాలను ఇవ్వదు. వివేచనా జ్ఞానాన్ని పెంపొందించదు. పైగా స్వర్గ మార్గానికీ, విమోచనకు దూరం చేస్తుంది. మామూలు జనానికి అలాంటి చమత్కార వివాదాలంటే మోజు. ఈ విషయానికి సంబంధించిన ఒక క్రమం శాస్త్రం (శాస్త్ర – శాత్త) ఉంది. బౌద్ధులు అసహ్యించుకునే ఆ శాస్త్రం పేరు 'వితండ శాత్త'."

మన ముందున్న సమస్యకొక పరిష్కారం ఇక్కడ ఉండవచ్చు. కాని మరో పరిష్కారం కూడా అసాధ్యం కాదు. లోకాయతికులకు రెండు విధాలైన వాదాలు (పద్ధతులు) తెలిసి ఉండొచ్చు. విమర్శనాత్మకము, నిర్మాణాత్మకము. ఆ రెండూ మామూలు అర్థంలో 'వితండ' – 'వాద', ఇది అసందర్భమని ఎవరైనా అనొచ్చు. లోకాయత అంటేనే ప్రయోజనంలేని వట్టి చమత్కార వాదంగా భావించే బౌద్ధులు కొందరున్నారు. అయితే అలాంటి వర్ణన అవాస్తవికంగా తడుతుంది. ఎందుచేతనంటే చూడగానే అసంబద్ధంగానూ, తెలివితక్కువగానూ కనబడే తార్కిక వాదాలను కొన్నింటిని బౌద్ధ గ్రంథాలు లోకాయతికులకు అంటగట్టాయి. మచ్చుకొకటి : "కాకుల బొమికలు తెల్లగా ఉంటాయి కనుక కాకులూ తెల్లగా ఉంటాయి, కొంగల రక్తం ఎర్రగా ఉంటుంది కనుక కొంగలూ ఎర్రగా ఉంటాయి , లోకాయతికుల వాదం ఇంత పిచ్చిగానూ, కల్తీగానూ ఉండజాలవు. ఈ వివరం గమనించండి.

కళలూ, శాస్త్రాలు జాబితాలో 'శుక్ర నీతిసారం' తార్కిక వివాదాల్లో పరిపుష్టమైనవారిగా 'నాస్తికుల'ను జమకట్టింది. ఈ నాస్తికులనే లోకాయతికులుగా లెక్కిస్తారు. ఈ గ్రంథం ప్రకారం నాస్తికులు భగవంతునీ, వేద ప్రమాణాన్నీ తిరస్కరిస్తారు. అయితే ఇది విమర్శా లక్ష్యం (విధ్వంసక లక్ష్యం) కోసమే వాదాన్ని స్థాపించడమవుతుంది. కాని ఆ 'శుక్రనీతిసారం' ప్రకారమే నాస్తికులకు నిర్మాణాత్మకమైన సిద్ధాంతం కూడా ఉంది. 'సర్వం స్వాభావికం' – మతం అంటే అన్నీ (వస్తువులు, ప్రాణులు వగైరా) ప్రకృతి సూత్రాల కనుగుణంగా ప్రవర్తించుతాయనే మతం. లోకాయతికులకు వాద ప్రతివాదాల పట్ల నిర్మాణాత్మక దృక్పథం ఉన్నదనే సూచనతో పాటు, అలాంటి వాదాలను ఒక నిర్మాణాత్మక సిద్ధాంతాన్ని సమర్థించడానికి ప్రయోగిస్తారని కూడా అర్థం అవుతుంది.

కౌటిల్యుడు తన 'అర్ధ శాస్త్రం'లో సాంఖ్య, యోగశాస్త్రాలతో పాటు లోకాయతను కూడా ఉదహరించి, దానిని 'తర్కశాస్త్రం' అన్నాడు (అన్వీక్షికి). మను ధర్మ శాస్త్రానికి భాష్యం చెబుతూ, మేధా తిథి చార్వాకుల తర్క విద్య ప్రసక్తి తెస్తాడు. అసలు 'మను' కూడా హేతుశాస్త్రం గురించి, హైతికుల గురించీ ప్రసంగవశాత్తు చెబుతాడు. ఇవన్నీ లోకాయతకూ, లోకాయతికులకూ సంబంధించినవేనని దాస్‌గుప్తా సక్రమంగానే ఊహించాడు. న్యాయ మీమాంస తాత్వికులను కూడా హైతికులనీ, తార్కికులనీ పిలిచినప్పటికీ వారంతా సంప్రదాయక పరిధిలోని తార్కికులే. కాని 'మను' చెప్పిన తార్కికులు మాత్రం నాస్తికులు. వైదిక సంప్రదాయ దృష్ట్యా విద్రోహులు. 'భాగవత పురాణం' కూడా బౌద్ధ, జైనులతో పాటు హైతికుల ప్రసక్తి తీసుకువస్తుంది. అందుకు ఈ గ్రంథం వాడిన పదం 'పాషండులు'.

ఈ తార్కికులపై కఠిన చర్యలను 'మను' సూచించిన మాట నిజమే. పాషండులు వర్ణ వ్యవస్థా వ్యతిరేకులు, వైరుల ప్రతికులు, హైతికులు... మొదలైన వారితో మాటలాడటం నిషిద్ధం. అందుక్కారణం హైతికులు వాదనా యాదార్థ్యాన్ని శంకించడం మాత్రం కాదు. అలాగే వారు కుత్కరవాదులనీ కాదు. పరలోకం, యజ్ఞయాగాదులు, వేద ప్రమాణం మొదలైన అంశాలను తమ తార్కిక ప్రతిభతో ఖండించగలగడమే వారి వ్యతిరేకతకు కారణం. 'మను' భాష్యకారుల్లో అతి ప్రసిద్ధుడు ఇందుకు సాక్ష్యం. మేధా తిథి చెప్పిన ప్రకారం హైతికులంటే పరలోకాన్ని, నైవేద్య ఫలాన్ని, యజ్ఞాలనూ తిరస్కరించినవారు. కల్లూకభట్టు హైతికులను వేద వ్యతిరేకులుగానూ, ఆ వ్యతిరేకతను సమర్థించుకోవడానికి మాత్రమే వాద ప్రతివాదాలు చేసేవారినిగానూ వర్ణిస్తాడు (వేద విద్రోహి తర్క వ్యాహారిణః). 'మను' చెప్పిన పద్ధతి ప్రకారం చూస్తే లోకాయతికులు తమ తర్క సామర్థ్యాన్ని కేవలం విధ్వంసనం కోసమే – 'అంటే వాద వివాదాల పట్ల విమర్శా దృష్టితోనే' ప్రయోగించలేదని అర్థమవుతుంది. అసలు ప్రాచీన గ్రంథాల పట్ల అంధ విశ్వాసంలోనే తర్క ప్రామాణికత ఇమిడి ఉందనుకుంటే... అది వేరు.

అంటే తర్క ప్రామాణికత పట్ల సంపూర్ణ వ్యతిరేక దృష్టి గాని, సంపూర్ణ విశ్వాసం గాని భారత తత్వశాస్త్ర చరిత్రలో ఎక్కడా కనిపించదని అర్థం కాదు. కనిపిస్తుంది. అయితే విచిత్రంగా మాధవాచార్య అనుసరించే తత్వశాస్త్ర శాఖ దృష్టి అలాంటిదే. వేదాంత దర్శనం మాత్రమే తర్కాన్ని (వివేచనను) సహజంగానే దుర్బలమైన ప్రమాణంగా భావిస్తుంది. వివేచన భాష్యం చెప్పే వ్యక్తి యొక్క సామర్థ్యం మీద ఆధారపడి వుంటుంది. అందుచేత ఒకరు సిద్ధాంతం చేస్తే మరొకరు పూర్వ పక్షం చేయవచ్చు. అది కేవలం వ్యక్తుల సామర్థ్యంపైనే ఆధారపడి వుంటుంది.

లోకాయతికులే వేదాంతుల వివేచనా తిరస్కారానికి ప్రేరణ – అంటే వ్యతిరేకార్థంలో – అని ఊహించారు. లోకాయతికుల తర్కబలం మామూలు జనాన్ని స్వర్గ, ముక్తి మార్గాన్నుంచి 'తప్పించడం' వలన, సంప్రదాయవాదులు తర్కాని తోసిపుచ్చి తిరిగి విశ్వాసానికి, నమ్మకానికి అంటే 'భక్తి'కి పట్టం కట్టారు.

"…. సనాతన హైందవ తత్వశాస్త్ర సూత్రము – 'శుద్ధ సత్యము పవిత్ర గ్రంథాల సాయం వలనే సాధ్యమనే' సూత్రము. తార్కికుల (కుతర్కవాదుల) 'విరోధ' ప్రభావ ఫలితంగా వచ్చిందనుకోవడం సాధ్యమే. ఎందుచేతననగా ఒక తార్కికుడు సిద్ధాంతం చేసిన దానిని మరో తార్కికుడు పూర్వపక్షం చేయవచ్చును… తిరిగి మరొకడు దానికి వ్యతిరిక్తమైన సిద్ధాంతం చేయవచ్చును.. అలాగే కొందరు తార్కికులు స్థితపరచిన సిద్ధాంతాలను మరికొందరు తోసిపుచ్చగలిగారు… ఇంకా నేర్పరులైన తార్కికులు దానిని తోసివేయగలిగారు.."

ఈ మొదటి తార్కికులు (హైతికులు) లోకాయతుల లాంటి వారేనని దాస్‌గుప్తా అభిప్రాయం. ఆ విధంగా సనాతనుల వివేచనా సామర్థ్యం పట్ల తిరస్కృతి లోకాయతికుల వ్యతిరేక – రుణ – ప్రభావం నుంచి వచ్చిందని భావించాడు. కాని నిజానికి తాను వేదాంత తాత్వికుడు కనక మాధవాచార్య విధ్వంసమైన, శత్రుపూర్వకమైన దృక్పథం కనబరిచాడు. ఈ వ్యతిరేకతా లక్షణాన్నే లోకాయతికులకు ఆపాదించాడు. ఆ ఆరోపణ విచిత్రంగానూ, చూడటానికి నప్పినట్లుగానూ ఉంటుంది. లోకాయతికులు అనుమాన క్రమం అనేదాన్ని నిజంగా అభ్యంతర పెట్టలేదనీ, ప్రత్యేకార్థంలో అంటే పరలోకం, భగవంతుడు, ఆత్మలాంటి వాటిని రుజువు చేయడానికి అనుమాన క్రమాన్ని వాడుకోవడాన్ని మాత్రమే తిరస్కరించారనీ అనుకోవడానికి ఆస్కారం ఉంది. అందుకే మాధవాచర్యా అలా ఆరోపించాడు.

వివేచనా ప్రామాణికతను సనాతనులు తిరస్కరించడానికి హైతికుల పరోక్ష ప్రభావమే కారణమన్న దాస్‌గుప్తా సూచన త్వరపడి అంగీకరించలేము. లోకాయతికులు కుతార్కికులనీ, మాటల గారడీ చేసేవారనీ, తర్కపద్ధతిని విధ్వంసనానికి (ఖండనకు) మాత్రమే ప్రయోగించేవారనీ, ఆ అభిప్రాయంలో ఉన్న సారాంశం. బ్రాహ్మణవాదంలోని అనేకానేక అంశాలను లోకాయతికులు

తిరస్కరించారనడానికి సందేహం లేదు. అయితే ప్రశ్న ఏమిటంటే స్వర్గం, ముక్తి, వైదిక సంస్కారాలు వాటి పట్ల వ్యతిరేకత... ను ప్రయోజనరహితమైన, విధ్వంసపూరితమైన కుతర్కంగా గణించాలా? సనాతన పరిధుల్లో పైన చెప్పినవన్నీ ప్రశ్నించడానికి వీలులేని వాస్తవ భాగాలుగా చెలామణీ అయిన కాలం ఉండేది. ఈనాడు భారతీయ తత్వశాస్త్ర చారిత్రకుడు ఆ ధోరణి ఎంచుకునే ఆవశ్యకత లేదు.

లోకాయతికులు తమ వాదనను (భాష్యాన్ని) నిర్మాణాత్మక లక్ష్యాలతో ప్రయోగించిన సాక్ష్యాలేవీ లేవని ఎవరైనా అనవచ్చు. తమ హేతువాదాన్ని లోకాయతికులు కేవలం ఏదో ఒక దాన్ని తిరస్కరించడానికి మాత్రమే ప్రయోగించిన ఆధారాలు మాత్రమే మనకు లభ్యమవు తున్నాయి. "వారికి సమర్ధించుకోవలసిన సిద్ధాంతాలు తక్కువ. కాని తూర్పారబట్టాల్సినవి కొల్లలు. అలా దుమ్ము దులపడంలో వారికి స్పష్టత, సాహసం, తీవ్ర వ్యంగ్యం తోడుపడ్డాయి" – (హెచ్.పి. శాస్త్రి). ఇదే మనకు లోకాయతికులంటే ఉన్న సామాన్యాభిప్రాయం. సందేహం లేదు. అయితే లోకాయతకు సంబంధించిన ఆధారాలు మాత్రం విచిత్రమైనవి. లోకాయతికులపై మనకున్న భావాలన్నీ వారి వ్యతిరేకుల – తాత్వికంగా – నుంచి సాధించబడినవే. లోకాయత భావాలను ఉదహరించడానికి వేరే అవకాశం లేదని స్పష్టమవుతుంది. మరో మాటలో చెప్పాలంటే భిన్న తాత్వికుల నిశ్చితాభిప్రాయాలపై – వ్యతిరేక సిద్ధాంతాలపై – లోకాయత విమర్శకు సమాధానాలు మాత్రమే మనకు దొరుకుతున్నాయి. అందుచేత ఇతరులను విమర్శించడం మినహా లోకాయతికులు తమంత తాము చెప్పేదేమీ లేదనే భావం ఏర్పడుతుంది. అయితే ఇది లోకాయతపై మనకున్న పరిజ్ఞానానికున్న పరిమితిని సూచిస్తుందే గాని, లోకాయత దృక్పథపు మౌలిక లక్షణాన్ని మాత్రం కాదు.

విశేష శ్రమతో దాస్‌గుప్తా చేసిన పరిశోధనల పుణ్యమా అని ఆ పరిమితి కూడా పాక్షికంగా తొలగిపోయింది. అనుమాన క్రమం పట్ల లోకాయతికులకున్న నిర్మాణాత్మక దృక్పథానికి సంబంధించిన సమాచారం ఆయన వెలుగులోకి తెచ్చారు. మనకు లభించిన ఆధారం ఒక లోకాయతికుడు స్వయంగా వెలిబుచ్చిన భావాలు. అదే ఇక్కడి ప్రత్యేకత. అతని పేరు పురంధరుడు. ఇతడొక చార్వాక మత గ్రంథకర్త అని 'తుచ్చీ' అన్న విషయం మనకిదివరకే తెలుసు. దాస్‌గుప్తా కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవించి, పురందరుడు 7వ శతాబ్దం వాడని ఊహించాడు. అయితే ఈ తేదీ మరీ ఆలస్యము. ఏమైనప్పటికీ పురందరుడు లోకాయతికుడు కనుక లోకాయత సంప్రదాయాన్నే అతడు కొనసాగిస్తున్న వాడని భావించవచ్చు. దాస్‌గుప్తా పురందరుడి అభిప్రాయాలను ఇలా సంక్షిప్తం చేశాడు :

"పురందరుడు ... ఇంద్రియానుభవానికి సాధ్యపడే ప్రాపంచిక వస్తువుల స్వభావ నిర్ణయం వరకు, 'అనుమాన' ప్రయోజనాన్ని అంగీకరిస్తాడు. పరలోకం, మరణానంతర జీవితం, కర్మసూత్రాలు – ఇవేవి సామాన్య ఇంద్రియానుభవానికి సాధ్యపడేవి కావు. వీటిని స్థాపించడానికి

అనుమాన ప్రమాణ ప్రయోగం చేయకూడదు." (పురందరాః తుఅః లోక ప్రసిద్ధం అనుమానం చార్వాకైఃఅపిఇస్యతే ఇవ, యత్ తుక్త్యైః చిత్ లౌకికమ్, మార్గమ్, అతిక్రమ్య అనుమానమ్, తిస్యతే తమ్ నిషిధ్వతే).

అంటే అర్థం : కాని చార్వాకుల ప్రకారం కూడా. 'అనుమాన' అనుభవజ్ఞాత ప్రపంచ పరిధి వరకే సాధ్యపడుతుంది. అయితే, ఎవరైనా ఇహలోక విషయాలకు బాహ్యంగా 'అనుమాన'ను అన్వయించడం నిషిద్ధము.

ఇది పురందరుని వైపు నుంచి జరిగిన పిడివాదం కాదు. పురందరుని 'సూత్రాన్ని' ఉల్లేఖించిన జైన రచయిత వాదిదేవసూరి సూచనల ఆధారంగా, పురందరుని హేతువులను (కారణాలను) వివరించాడు దాస్‌గుప్తా.

"సామాన్యానుభవ జీవిత ప్రయోగానికీ, అనుభవాతీత సత్యావిష్కరణకూ మధ్యనున్న అంతరానికి 'అనుమాన' ప్రమాణాన్ని అన్వయించడంలో వ్యత్యాసాన్ని స్పష్టంగా చూపించడానికొక ముఖ్య కారణముంది. అంగీకారమున్న ప్రత్యక్షాంశాలననేకం గమనించి, అంగీకారమున్న పరోక్షాంశాలను సూత్రీకరించడం ప్రేరేపక పద్ధతి కాగా, లోకాతీత విషయాలలో అంగీకారాంశాలు ఇంద్రియ గ్రాహ్యాలు కావు. (అంటే అలాంటివి ఒకవేళ ఉన్నప్పటికీ). ఆ విధంగా ఊహించబడిన ఇంద్రియాతీత ప్రపంచంలో 'హేతు', 'సాధ్య' అంశలు అంగీకరించిన సందర్భాలు గమనించ వీలుపడదు. అందుచేత ప్రేరేపక సూత్రం (లేదా పరస్పరానుసరణ సూత్రం) ఆ పరిధిలో సాధ్యం కాదు."

ఆ రకంగా వడిదేవసూరి లోకాయత జ్ఞాన సిద్ధాంతంపై ఇచ్చిన భావముద్ర రీత్యా 'అనుమానక్రమం' ద్వితీయ శ్రేణి (గౌణము) ప్రాముఖ్యం కలది మాత్రమే. ప్రథమస్థానం ఇంద్రియ గ్రాహ్యతదే. ఇంద్రియగ్రాహ్యతకు లోకాయత ఇచ్చిన ప్రాధాన్యతకు 'షడ్దర్శన సముచ్చయ' వ్యాఖ్యానంలో మణిభద్రుడు అద్భుతమైన కారణాలు చెబుతాడు. అవి సామాజిక – రాజకీయ కారణాలు. విచిత్రంగా అధునాతనంగా కనబడతాయి. మతపు ముసుగులో మోసకారులున్నారు. స్వర్గ సాధన గురించీ, మంచి చెడుల భేదం గురించీ, సామాన్యులలో భ్రమలు కల్పించ యత్నిస్తారు. సక్రమ జ్ఞానానికీ ఆధారంగా పనికిమాలిన 'అనుమాన' 'గ్రంథసూత్రాలు' మొదలైన ప్రమాణాలను చూపి తమ వాదాలను స్థిరపరచుకుంటారు. అలాంటి వంచనను, దోపిడీని ఎదుర్కోవడానికి లోకాయతికులు ఇంద్రియ గ్రాహ్యతకు ప్రాథమిక స్థానాన్నిస్తారు. ప్రజల తత్వశాస్త్రం కాబట్టి లోకాయత మతపరమైన దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను మేల్కొల్పడానికి పూనుకొంది. మణిభద్రుడు లోకాయత దృక్పథాన్ని వివరించుతూ పోయినట్లుగా – కనబడినవాటికి అస్థిత్వం ప్రసాదిస్తే పేదలు ఒక బంగారు గుట్ట ఉన్నట్లుగా భ్రమపడి తమ పేదరికపు స్థితిని అవాస్తవంగా చూసే ప్రమాదముంది. అలాగే బానిస కూడా తానొక యజమానినని భ్రమపడే

అవకాశం వుంది. మతం పేరిట వంచకులు సృష్టించే భ్రమలలాంటివి ప్రజలకు ప్రమాదకారకమవుతాయి. ఎందుచేతనంటే ఆ వంచకులు కనబడనివాటి అస్థిత్వాన్ని స్థిరపరచడానికి 'అనుమాన ప్రమాణాన్నీ' సాక్ష్యాన్నీ అధికంగా శ్లాఘిస్తారు. కనుక లోకాయతికులు ఇంద్రియ గ్రాహ్యతకు ప్రాథమిక ప్రాముఖ్యాన్నివ్వాల్సి వచ్చింది. ఆ విధంగా సనాతన మతాన్ని సమర్థించే వారు హేతుత్వాన్ని తిరస్కరించి, విశ్వాసానికి ఆధిక్యతనివ్వడానికి ప్రయత్నిస్తే, లోకాయతికులు ప్రజారక్షణ కోసం మతైక వంచకుల కపట యోగ్యతను ఎదిరించడం అవసరమని భావించారు.

ఇది ఇక్కడ మనకు కనబడే సంపూర్ణ చిత్రం. ఏదో చెదురు మదురుగా కుతర్కవాదులు జరిపిన నిష్ప్రయోజనమైన వాద వివాదాల చిత్రణ మాత్రం కాదు. అది రెండు సంస్కృతుల సంఘర్షణా చిత్రం. ఒక సంస్కృతికి చెందిన వారు దైవము, అమర్త్యము, ఇంకా వాటిని సాధించడానికై జరిగే వైదిక సంస్కారాల సామర్థ్యం... గురించి బోధిస్తున్నారు. రెండో వర్గం వారు ప్రజాదృష్టిని ప్రతిబింబిస్తూ తమ భౌతిక ప్రయోజనాలను రక్షించుకో ప్రయత్నిస్తున్నారు. లోకాయతికులు ఈ దేశపు తొలి తార్కికులు అని అంగీకరిస్తే అందుకవసరమైన పటిష్టమైన ఆధారాలున్నట్లు మనకు కనబడుతోంది. భారతీయ తర్క జననం మతపరమైన వంచనలకు వ్యతిరేకంగా ప్రజా ప్రయోజన రక్షణతో సంబంధం కలగి వున్నదని మనమూహించవచ్చును. అయితే ముందుగా మతపరమైన వంచనలకు మూలమైన విషయాలను గురించి పరిశీలించాలి.

లోకాయత – జ్ఞాన సిద్ధాంతాన్ని ప్రజల వర్గ ప్రయోజనానికి ముడిపెట్టిన మణిభద్రునిపై మనం ఎంతవరకు ఆధారపడవచ్చుననేది వేరే సమస్య... అదలా ఉండగా ఒక సంగతి మాత్రం స్పష్టం. మాధవాచార్య చిత్రించిన లోకాయత – జ్ఞాన సిద్ధాంతం మాత్రం – సంపూర్ణంగా విధ్వంసనాత్మకం (విమర్శనాత్మకం అని) – పూర్తిగా కల్పన. ఈ కాల్పనిక జ్ఞాన సిద్ధాంతం నుంచే మాధవాచార్య లోకాయతికుల తత్వ విచారాన్ని, నైతిక శాస్త్రాన్ని సష్టించాడు కనుక అతని లోకాయత చిత్రణ విశ్వసనీయంగా ఉండజాలదు.

## లోకాయత నీతిశాస్త్రము

'ఆనందమే లక్ష్యంగా ఉన్న తత్వశాస్త్రం విలాసాధిక్యతకల వర్గం ఉచ్ఛరించే తెలివైన మాటలు మినహా మరేమీ కాదు' అన్నాడు మార్క్స్. ఇదే వాస్తవమైతే, ఆపైన లోకాయత, దాని పేరు (అంటే ఉత్పత్తి అర్థం : ప్రకృతి జనాః అంటే పామర జనుల తత్వశాస్త్రము) సూచించే అర్థం – శంకరాచార్యుడు అలానే తిరస్కారంగా (నిర్లక్ష్యంగా) – కూడా వాస్తవమైతే దాన్ని ఆనందతత్వం అనడానికి అవకాశాలు స్వల్పం. అయినా మాధవాచార్య వర్ణించిన ప్రకారం లోకాయత అలాంటి తత్వశాస్త్రంలో కూడా "అతి" మాధవాచార్య లోకాయత నీతిశాస్త్రాన్ని ఇలా వివరించాడు.

"మానవుని ఏకైక లక్ష్యం ఇంద్రియ సుఖం ద్వారా వచ్చే సంతోషమే. అలాంటిది మానవుని లక్ష్యం కాగూడదనీ, సంతోషం ఎప్పుడూ ఏదో బాధతో మిళితమై ఉంటుందని నీవు చెప్పకూడదు. ఎందుచేతనంటే వివేకవంతులమైనందువల్ల మనకు సాధ్యమైనంతవరకు శుద్ధ సంతోషాన్ని (ఆనందాన్ని) అనుభవించాలి. తప్పనిసరిగా దాంతో మిళితమై సంభవించే బాధను వర్జించగలగాలి. చేపలు కావాలనుకున్నవాడు చేపలను ముళ్ళతోను, బొమికలతోను పొందగలడు. కావలసినవి తీసుకుని మిగిలినవి వదిలేస్తాడు. బియ్యం (అన్నం) కావాలనుకున్న వాడు గడ్డీగాదంతో సంపాదించి అవసరమైన వాటినే తీసుకుని మిగతా వాటిని వర్జిస్తాడు. మన స్వభావం సహజంగా అనుకూలమని గుర్తించిన ఆనందాన్ని, ఏదో బాధ ఉందనే భయంతో విసర్జించడం మన మతం కాదు. అడవి జంతువులు తినిపోతాయనే భయంతో ధాన్యం విత్తనాన్ని మానివేయరు. అలాగే భిక్షకులు వచ్చి ఇబ్బంది పెడతారనే భయం వలన వంట పాత్రలను పొయ్యి మీద పెట్టడానికి సందేహించరు."

అదేవిధంగా అందరికి తెలిసిన ఈ కవితను లోకాయతికులకు అంటగడతారు. "బతికున్నంతవరకూ మనిషి సుఖపడాలి. అప్పుల్లో మునిగిపోయినా, నేతినే భుజించాలి." లోకాయతికుల నీతిశాస్త్రాన్ని అలా చిత్రించడం అపకీర్తిపాలు చేయడానికేనని మన వాదం. లోకాయత, ఎలాంటి పరిస్థితుల్లోనూ అలాంటి ఇంద్రియ సౌఖ్యాల కోసం వెంపరలాడి ఉండదు.

మన ఆధునిక పండితులు ఇప్పటికే మన ముందుంచిన కొన్ని అంశాలతో ప్రారంభిద్దాం. గార్బే ఇలా అంటాడు.

ప్రత్యర్థులిచ్చిన సమాచారం ఆధారంగా లోకాయతను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే, లభించే తీర్మానాలకు భిన్నంగా, లోకాయత సిద్ధాంతం ఇంకా లోతైన సూత్రాల మీదా, అంతకంటే ఉన్నత తార్కిక క్రమం పైనా... నిర్మించబడిందనుకోవడం సహజమే.

ఇది వాస్తవమే. కాని ప్రశ్న ఏమిటంటే ఈ ఊహ ఎలా సహజం? బెల్వాల్కర్, రానడేలు దానికి సమాధానం ఇచ్చారు. సాధారణంగా జరిగే ఊహాత్మక వివరణలాగా, సంపూర్ణంగా వ్యతిరిక్త లక్షణంతోనూ, విధ్వంసనా లక్షణంతోనూ (లోకాయత) సూత్రాల స్వభావాన్ని ముడిపెట్టినట్లైతే లోకాయత మనోహర స్వభావాన్నీ, విస్తార ప్రాచుర్యాన్నీ (పూర్తిగా) వివరించజాలము."

ఇలాంటి సాధారణమైన "ఊహలు" మాధవాచార్య లోకాయత చిత్రణ ప్రభావం వల్ల వచ్చాయని కూడా ఈ పండితులెందుకు అనలేదో స్పష్టమే.

లోకాయత భావాల ప్రభావం గాఢమైనదనీ, విస్తృతమైనదనీ చూపడానికి అనేక ఆధారాలున్నవి. దాని పేరే ఒక ఆధారం. "ప్రజలలో వ్యాపించి ఉన్నదని" అర్థం. లోకాయతను

ఖండించడానికి, తృణీకరించడానికి, వక్రీకరించడానికి దాని వ్యతిరేకులు చూపిన తహతహ మరో ఆధారం కావచ్చు. ప్రాచీన భారతంలో ఈ పద్ధతులన్నీ అవలంబించని తత్వశాస్త్ర శాఖ ఇంచుమించు లేదు. నిజంగా లోకాయత అప్పు చేసి పప్పు కూడు తినమనే తేలికపాటి తత్వశాస్త్రమై ఉంటే, దానికంత గాఢమైన, విస్తృతమైన ప్రాచుర్యం ఎలా వచ్చిందో లేదా భారత తత్వశాస్త్ర శాఖలన్నీ దానినంత తీవ్రంగా ఎందుకు పరిగణించాయో... మనం వివరించలేము. కాని మాధవాచార్య చిత్రణకు భిన్నమైన, స్పష్టమైన ఆధారాలు మనకున్నాయి.

అరణ్య పర్వం (భారతం)లో తన చిన్నతనంలో తమతో ఉండటానికి ఒక బ్రాహ్మణున్ని తన తండ్రి ఆహ్వానించాడని ద్రౌపది చెబుతుంది. ఆ బ్రాహ్మణుడు తన తండ్రికి, తన సోదరులకు, బార్హస్పత్య భావాలను బోధించాడు. ద్రౌపది ఇంకా ఇలా అంది. "మహారాజా (ధర్మజా)! ఆయన చెప్పేవి వినాలనే కాంక్షతో నేను ఏదో పని వంక మీద నా తండ్రి వద్దకు వెళ్ళి ఆయన అంకతలంపై కూర్చునేదానిని. ఆ బ్రాహ్మణ బోధకుడు ప్రేమగా, మృదువుగా ఆ విషయాలన్నీ నాకు చెప్పేవాడు."

బార్హస్పత్యం 'లోకాయత'కు మరో పేరు. దీన్ని కాదంటే, మన ప్రాచీన సంప్రదాయాన్నే తీవ్రంగా శంకించాల్సి వుంటుంది. అలాగే 'తుచ్చీ' భావించినట్లు, బార్హస్పత్యమంటే ప్రాచీన రాజ్యతంత్ర శాస్త్రమనీ అనకూడదు. రాజ్య తంత్రశాస్త్రమని పిలువబడేదాంట్లో స్వతస్సిద్ధంగా మత వ్యతిరేకత ఏమీ లేదు. కాని ద్రౌపది చెప్పిన విషయాలన్నీ విన్న యుధిష్టరుడు - మహాభారతంలో ఆమెను మత వ్యతిరేక భావాల ప్రభావంలో పడిపోయిందని నిందించాడు. అందుకే, బార్హస్పత్య భావాలని చెప్పబడినవి లోకాయత భావాలే అయి ఉండాలి. కాని ఈ చిత్రణకు మాధవాచార్య చిత్రణతో సామ్యం ఉందా? లేదని స్పష్టమే. మాధవాచార్య మనలను నమ్మించడానికి ప్రయత్నించిన సరళిలోనే లోకాయత ఉన్నట్లయితే, ద్రౌపది తండ్రిలాంటి గౌరవనీయుడు ఆ భావాలను బోధపరచడానికి ప్రత్యేకంగా ఒక బ్రాహ్మణ పండితుని ఆహ్వానించడానికి ఆస్కారం ఉండేదా?

లోకాయత భావాలను బోధించిన పండితుడు బ్రాహ్మణుడని చెప్పబడింది. ఇది వింతగా కనబడవచ్చును. ఇది లోకాయతపై సామాన్యాభిప్రాయానికి భిన్నమైనదేకాక, బ్రాహ్మణులపై ఉన్న అభిప్రాయానికి కూడా విరుద్ధమే. కాని బౌద్ధ ఆధారాలు మరికొంచెం ముందుకు వెళ్ళాయి. 'బౌద్ధసుత్త' (బౌద్ధసూత్ర)లలో తమను గురించి తాము చెప్పుకునే సందర్భాలలో బ్రాహ్మణులు, తాము అధ్యయనం చేసే శాఖలలో లోకాయతను ఒకదానిగా పేర్కొన్నారు. ఈ వ్యాసభాగమంతా ప్రశంసాత్మకమే. ఏదో ఒకటి రెండు పదాల నిర్వచనాలు సందేహాస్పదమైనప్పటికీ, ఆ పదాలన్నీ బ్రాహ్మణులు తాము సగర్వంగా పాండిత్యం సాధించామని చెప్పడానికి అనువైన వర్ణనలే" అని - రిస్‌డేవిడ్స్ అంటాడు.

ఆపైన మహాభారతంలో ఒకచోట – అలాగే 'హరివంశం'లో కూడా – "బ్రాహ్మణ పండితులు అధ్యయనం చేసిన శాస్త్రాలలో లోకాయత పాండిత్యమొకటి" అని కూడా రిస్‌డేవిడ్స్ చెపుతాడు.

ఇలాంటి ఆధారాల వలన, బ్రాహ్మణులను గురించి, ముఖ్యంగా బౌద్ధ బ్రాహ్మణులను గురించి మన అభిప్రాయాలు పునరాలోచించవలసి వుంటుంది. అలాగే మాధవాచార్య చూపెడుతున్న లోకాయతను గురించి కూడా మన అభిప్రాయాలను మార్చుకోవలసిన అవసరముంది. ఈ సాక్ష్యాలు ఏదో 'లోకాయత'ను బోధించే కొందరి బ్రాహ్మణుల గురించి కాక, అధ్యయనం చేసి ప్రశస్తి పొందిన వారిని గురించి సూచిస్తున్నాయి. అంటే 'లోకాయత' పరిపూర్ణ మేధా జీవితానికి ముఖ్యమైన అంశమనీ, సంస్కృతికీ, జ్ఞానానికీ ఒక చిహ్నమనీ అర్థమవుతుంది. అంటే మాధవాచార్య నమ్మించ ప్రయత్నించినట్లు, లోకాయత భావాలు ఆనందమే లక్ష్యమైన సమూహపు స్వతస్సిద్ధ గ్రామ్య భావాలు కాజాలవు.

ఇతర ఆధారాలు కూడా మాధవాచార్య దృష్టి తప్పు అనే సూచిస్తున్నాయి. కథానాయకుడైన నాగసేనునికి లోకాయత పరిజ్ఞానమున్నట్లుగా "మిళింద"లో వర్ణితమైంది. ఈ విషయం శ్లాఘపూర్వమే. అయితే మరోచోట 'లోకాయత' పదాన్ని దూషణ పూర్వకంగా ప్రయోగించడం జరిగింది. ఈ అంశాన్ని 'గ్రంథంలోకి చొచ్చుకు వచ్చిన తళుకు'గా భావించాడు రిస్ డేవిడ్స్. ఇంకా బాణుని 'హర్ష చరిత్ర'లో రుషుల జాబితాలో 'లోకాయత' పేరు కూడా ఉంది.

"అనేక ప్రాంతాలకు చెందిన అనేక మంది బౌద్ధులను రాజు వీక్షించుచుండగా పవిత్రుల పేర్లు చాటబడ్డాయి.... శ్వేతాంబర జైనులు, శ్వేత సన్యాసులు, కృష్ణభక్తులు, ధార్మిక విద్యార్థులు, కేశరహితులైన సాధువులు, కపిల శిష్యులు, జైనులు, లోకాయతికులు, కణాదానుచరులు, ఔపనిషదికులు, సృష్టికార భగవంతుని విశ్వసించేవారు..."

'సర్వదర్శన సంగ్రహం'లో చిత్రితమైన లోకాయతికులకు పూర్తిగా భిన్నమైన దృశ్యం ఇక్కడ ప్రత్యక్షమవుతోంది.

అందుచేత మాధవాచార్య చెపుతున్న లోకాయత నైతిక దృక్పథాన్ని అసత్యమనవలసి వస్తుంది. మరి లోకాయతికులు సూటిగా నైతిక విలువలను ఏమాత్రంగానైనా ఆదరించినట్లు చెప్పే స్వల్పమైన ఆధారం లభిస్తుందా? అనేది ప్రశ్న. కొన్ని ఉన్నాయి, కాని ఆ సూచనలన్నీ పరోక్షంగా ఉన్నాయి.

'మహాభారతం'లో శాంతిపర్వంలో ఉన్న ప్రసిద్ధమైన చార్వాకవధతో ప్రారంభించుదాం.

కురుక్షేత్ర మహా సంగ్రామానంతరం, పాండవులు దిగ్విజయంగా తిరిగి వస్తున్న సందర్భంలో వేలకొలదీ బ్రాహ్మణులు నగర ద్వారం వద్ద యుధిష్టరుని ఆశీర్వదించడానికి పోగయ్యారు. వారిలో ఉన్నాడు చార్వాకుడు. మిగతా బ్రాహ్మణుల అనుమతి తీసుకోకుండానే ముందుకు వెళ్ళి రాజును (ధర్మరాజుని) ఉద్దేవించి ఇలా అన్నాడు :

"ఈ బ్రాహ్మణ సమూహం, నీ రక్త బంధువులను వధించిన నిన్ను శపిస్తోంది. నీ మనుషులనే, నీ పెద్దలనే సంహరించి నీవు సాధించిందేమిటి? నీవు చనిపోయి తీరాలి (నశించాలి)."

హఠాత్తుగా జరిగినచార్వాకుని మాటలకు సమావేశమైన బ్రాహ్మణులు నిర్ఘాంతపోయారు. యుధిష్టరుడు నైతికంగా గాయపడి, మరణించాలని నిశ్చయించాడు. అప్పటికి మిగతా బ్రాహ్మణులు తెలివి తెచ్చుకుని, చార్వాకుడు తమ ప్రతినిధి కాదనీ, బ్రాహ్మణ వేషంలో ఉన్న రాక్షసుడనీ, రాజ విరోధి దుర్యోధనుని మిత్రుడనీ... చెప్పారు. అలాగే తమకు రాజు చేసిన ఘనకార్యాల పట్ల మెచ్చుకోలు మాత్రమే కలదని హామీ ఇచ్చారు. తర్వాత నిరసన తెలిపిన చార్వాకుని నిలువునా దహించి వేశారు.

చార్వాకుడు మారువేషంలో ఉన్న రాక్షసుడనీ, దుర్యోధనుని రహస్య గూఢచారి అనీ... చెప్పిన కథలన్నీ దుర్బుద్ధితో కల్పించినవే. నమ్మే అవకాశమే లేనంతటి మొద్దుకథలవి. అయితే ఇక్కడ గమనించవలసిందేమంటే 'లోకాయత' 'చార్వాక' పదాలు పరస్పరార్ధకాలు కనుక, చార్వాకుని మాటలలో వాస్తవమైన లోకాయత నైతిక శాస్త్ర ప్రతిధ్వని ఉన్నట్లు భావించడం అసందర్భం కాదు.

ఈ మహాభారత భాగంలో చార్వాకుని ఉద్ఘాటనలో "తిని తాగుదాం, రేపెలాగూ మనముండం" అని బోధించే జీవిత తత్వం తాలూకు నీడలు కూడా కనబడవు. కాకపోగా ఇక్కడున్న మాటల్లో దాగున్న నైతిక విలువలను వెలికితెచ్చే ప్రయత్నమేదైనా చేసే అవకాశముంటే రక్తబంధంతో ముడివడ్డ గిరిజనుల జీవననీతి కనబడుతుంది. చార్వాకుడు యుధిష్టిరునికి అపాదించిన ఘోర నేరం... బంధువులను, పెద్దలను వధించడం. అది సామాన్యంగా మానవులను వధించడం కాదు. అలా అయితే దాన్ని అహింసా ధర్మమనవచ్చును. అది ఒక స్పష్టమైన ప్రత్యేకమైన నేరం. రక్త సంబంధీకులను వధించడం. దానిని మనం ఆటవిక సమాజపు విశిష్ట నైతిక ప్రమాణంగా అర్ధం చేసుకోవచ్చును.

"ఆటవిక సమాజపు చరిత్రలో తెగ – బంధం అన్నింటిలోకి అతి పవిత్రమైన బంధం. ప్రాచీన నార్సు జాతివారిని గురించి రాస్తూ గ్రోన్‌బెచ్ తెగలో జరిగిన హింసాకాండ (మానవ హత్యలు) రేపెట్టిన భీతిని వివరంగా వర్ణించాడు : ఆ తెగలోకి ప్రవేశించిన మరుక్షణం నుంచీ

ప్రాణ పవిత్రత అనుల్లంఘనీయ స్థాయిని అందుకుంటుంది. రక్తపాతాన్నీ, దైవద్రోహంగా, గుడ్డితనంగా, ఆత్మహత్యగా ధర్మ నిర్ణయం చేస్తారు. నరానికి సూది అంటినప్పటిలాగా, ప్రతి భావం హఠాత్తుగా పెల్లుబుకుతుంది."

కురుక్షేత్ర యుద్ధంలో భిన్నంగా జరిగింది. అది సోదరుల మధ్య సమరం. రక్తసంబంధీకులనే వధించాలి. పాత ఆటవిక సమాజ విలువలు నేలమట్టమై ధ్వంసమై పోతున్నాయి. వీటన్నింటికీ వ్యతిరేకంగా చార్వాకుడెత్తిన నిరసన గళం కల్మషరహితం, సాహసవంతం. అతన్ని దగ్ధం చేశారు. నైతిక విలువలను తిరగదోడి నూతన పరిస్థితి కనుగుణంగా సరిదిద్దాలి. "భగవద్గీత"లో అదే జరిగింది. కురుక్షేత్ర యుద్ధారంభంలో అర్జునుడు విచారగ్రస్తుడై కుంగిపోయాడు. తన రక్త సంబంధీకులను చంపవలసిన, తన పెద్దలను ధ్వంసం చేయవలసిన దుస్థితి అతనికెదురైంది. అందుచేత యుద్ధం చేయనన్నాడు. అందుచేత కృష్ణుడు అతనిని ఉన్నతోన్నతమైన తాత్విక శిఖరాలపైకి ఉద్ధరించి, అలాంటి హత్యలను సమర్ధించగలిగాడు. అలాంటి శిఖరాలను చేరడానికి ముందు కృష్ణుడు, అల్పమైన మామూలు సంగతులు, పూర్తిగా ఐహిక సంబంధమైన విషయాలూ ముచ్చటించాడు. ఆయన భాష్యం : ఈ "సమరంలో నీవు మరణిస్తే స్వర్గాన్ని సాధిస్తావు. విజయమే సంభవిస్తే ఈ ధరణీ తలాన్ని అనుభవిస్తావు" (గీత).

ఇది నిష్కర్షగా చెప్పిందే, ప్రత్యామ్నాయమేదైనా ఆనందానికి మాత్రం పూచీ ఇచ్చాడు. నీ బంధువులను చంపితే భువిపై ఆనందం, చంపబడితే స్వర్గంలో ఆనందం. బహుశా భారతీయ తత్వశాస్త్ర చరిత్రలో సుఖలాలస తత్వాన్ని బోధించిన తొలిరూపం ఇదే కావచ్చును. 'మహాభారతం' ఆధారంగా నిర్ణయిస్తే చార్వాకుల నైతికశాస్త్రం... ఈ తత్వానికి (సుఖతత్వం) బహిరంగ నిరసన అనిపిస్తుంది. ఎవరైతే సిగ్గుమాలిన ఆనందతత్వం లోకాయతికులకు అంటకడుతున్నారో.. వారే కపటంగా... విలోమ మార్గంలో... ఆ తత్వాన్ని అనుసరించడం లేదు గదా?

## తత్వశాస్త్రము

లోకాయతికుల ప్రాపంచిక దృక్పథం ప్రాథమికంగా ఇకహలోక సంబంధమైన భౌతికతత్వమే. అయితే మాధవాచార్య వారికి ఆపాదించే భౌతిక తత్వశాస్త్రం మాత్రం కాదు (లోకాయత భౌతికవాదపు మౌలిక వైఖరిని 'దేహవాదం' అంటారు). అంటే 'స్వ' అనగా దేహమే అని భావించే తత్వం. లోకాయతికుల దేహవాదం, తొలి తంత్రవాదపు దేహవాదమే అయి వుండవచ్చు. లోకాయతికుల 'జగత్ సృష్టి' శాస్త్రానికి, తాంత్రికుల దృష్టితో సామ్యముంది.

ఈ వాదం సంక్లిష్టమైనది. పైగా ఈ వాదాన్ని బలపరుచుకోవడానికి కొంచెం విషయాంతరాన్ని చర్చించాలి. అందుచేత వాదం కొనసాగించే క్రమాన్ని... ముందుగా పేర్చుదాం.

మన వాదం ఈ క్రింది అంచెలలో సాగిపోతుంది.

1. లోకాయత మొదటి రోజుల్లో మనం ఉపయోగించే అర్థంలో ఆజ్ఞేయవాదం కానీ, భౌతిక తత్వశాస్త్రం కానీ అయి వుండదు.

2. బ్రాహ్మణ క్రతువులకు (తంత్రులకు) వ్యతిరేకమైనప్పటికీ, అప్పటికి ప్రాచుర్యం పొందిన ఇహలోక స్వభావం కల మత క్రతువులను వివరించే విశాలార్థంలో లోకాయత పదం వాడుకలోకి వచ్చి ఉండవచ్చును.

3. బ్రాహ్మణ సంస్కృతికి అనుచరులైనవారు లోకాయతను అసుర దృక్పథం అని పిలిచారు. అందుచేత బ్రాహ్మణ సాక్ష్యాలలో అసుర భావాలుగా వర్ణించబడిన వాటి ఆధారాలను విశ్లేషించి అసలైన లోకాయత భావాన్ని సాధించవచ్చు.

4. ఈ అసుర దృక్పథంలో రెండు ముఖ్యాంశాలున్నాయి : దేహవాదం, విచిత్రమైన జగత్ సృష్టివాదం. మౌలిక లోకాయతకూ, మౌలిక తంత్రవాదానికీ సాధ్యపడే సంబంధాన్ని సూచిస్తున్నాయి. లోకాయతను తొలినాటి తంత్రవాదంగా గుర్తించడం ఒక అద్భుతంగా తోచవచ్చు. ఈ రెంటిని గురించీ మనకున్న ఊహలు పొరబాటు కావడం మూలాన అలా అనిపిస్తుంది.

## లోకాయత - క్రతువులు

లోకాయతికులు శ్రుతి, స్మృతుల ప్రమాణాన్ని తిరస్కరించారు. బ్రాహ్మణ క్రతువులను గేలిచేశారు. మరో లోకం – లేదా స్వర్గం – అనే భావాన్ని పరిహసించారు. ఈ అంశాలన్నింటా లోకాయతను గురించిన సాక్ష్యాలన్నీ ఏకీభవిస్తాయి. బ్రాహ్మణీకపు సనాతనత్వాన్ని విమర్శించినందువలన, మన పండితులంతా వెంటనే లోకాయతికులను ప్రాచీన తార్కికులుగా, ఆజ్ఞేయ తాత్వికులుగా, నాస్తికులుగా – అంటే ఇప్పుడు మనం అనుకుంటున్న అర్థంలో – ఊహించారు. కాని అది సందేహాస్పదం. తార్కికులు, ఆజ్ఞేయవాదులు అనగానే ఎవరో కొందరు తత్వ శాస్త్రజ్ఞులుండేవారనిపిస్తుంది. అందుకు భిన్నంగా లోకాయత ఎవరో కొందరు వ్యక్తిగతంగా బోధించిన తత్వశాస్త్రం కాకపోవచ్చును. బహుశా ప్రజల జీవితాలలో పాదుకున్న విశ్వాసాల, సంప్రదాయాల... సంపుటీకరణం కావచ్చును. అయితే అది బ్రాహ్మణ సిద్ధాంతాలకు పూర్తిగా వ్యతిరేకమైన భావజాలము.

లోకాయతికులు బ్రాహ్మణ మత క్రతువులను వ్యతిరేకించారంటే వారికసలు క్రతువులంటేనే పడదని అర్థం కాదు. వారు తమ సంప్రదాయ క్రతువులనే అంటిపెట్టుకోదలిచారు. వారి క్రతువులు సనాతన బ్రాహ్మణ తత్వానికి ప్రత్యక్షంగా విరుద్ధమైన విశ్వాసాల నుంచి జన్మించినవి. అదే సందర్భంలో లోకాయత, భౌతిక మానవ దేహాన్ని మన చుట్టూ ఉన్న భౌతిక విశ్వాన్నీ మినహా దేన్నీ వాస్తవంగా పరిగణించదు. కనుక లోకాయత ముఖ్యంగా భౌతికవాదమే. కనుక లోకాయతికులు ఏవైనా క్రతువులు నెరపి వుంటే వాటికి పార లౌకిక సంబంధం ఉండజాలదు. ఈ అంశం మనకు వింతగా తోస్తుంది. ఎందుకనంటే ఏ క్రతువైనా మతపరంగా ఉంటుందనేది సాధారణమైన నమ్మకం. అంటే 'పరలోక సంబంధమనిపిస్తుంది.' క్రతువులు ప్రముఖంగా ఇహ లోకానికి సంబంధించినవి ఎలా కాగలవనే సమస్యను తర్వాత ఆలోచిద్దాం. ప్రస్తుతానికి లోకాయత పూర్తిగా ఇహలోక దృక్పథపు వ్యక్తీకరణ – అనేక ప్రాచీన ఆధారాలతో – అని చూపించ ప్రయత్నించడమే కాక, కొన్ని రకాల క్రతువులతో ఖచ్చితంగా ముడిపడి వుందని కూడా చెప్పగలము.

రెండు రకాల ఆధారాలను క్లుప్తంగా పరిచయం చేసుకుందాం. మొదటిది : 'పరలోక భావ' తిరస్కారం. దాన్ని నిరూపించడానికి ఎక్కువగా ఆధారాలు (సాక్ష్యాలు) చూపించే అవసరం లేదు. ఈ ఆధారాలు అందరికీ తెలిసినవే. కాదని ఎవరూ ఆక్షేపించలేదు. ఒకే ఒక్క సాక్ష్యాన్ని మాత్రం తీసుకుందాం. దాన్ని సామాన్యంగా ఎవరూ చర్చించరు. సంప్రదాయ మనుధర్మ వ్యాఖ్యాతలు లోకాయతికులను రెండు ప్రత్యేక పదాలతో ఉదహరించారు. నాస్తికులు, హైతికులు. మేధా తిథి (ఉదాహరణకు) రెండు పదాలకూ లోకాయతికులనే అర్థాన్నిచ్చాడు. వారి దృక్పథాన్ని వివరించడానికి కూర్చిన మేధాతిథి సూత్రం : 'నాస్తి దత్తం, నాస్తి హుతం. నాస్తి పరలోకమ్ ఇతి.' 'దానానికి పరమార్థం లేదు. యజ్ఞ నైవేద్యాలకు విలువ లేదు. పరలోకమనేది లేదు' అని ఆ సూత్రార్థము. మను ధర్మ సూత్రాలకు (3 అధ్యాయం, 150 శ్లోకం – 8వ అధ్యాయం శ్లోకం 22) వ్యాఖ్యానంలో నాస్తికులంటే 'లోకాయతికులు' ఇతరులు అన్నాడు మేధా తిథి. ఆ సందర్భంలో పై సూత్రాన్ని ప్రయోగించాడు. మనుధర్మశాస్త్రంలో మరో భాగాన్ని (4వ అధ్యాయం 30వ శ్లోకం) వివరిస్తూ 'హైతికుల' విషయంలో కూడా పై సూత్రాలన్నీ వర్తింపచేశాడు. ఇవన్నీ... హైతికులు, నాస్తికులు అని పేరుపడ్డ లోకాయతికులకు భౌతిక దృక్పథం – ఇహలోక దృష్టి –ఉండేదని స్పష్టం చేస్తాయి. అయితే మేధాతిథి ప్రాచీన కాలపు వాడు కాదు. అతడు క్రీ.శ. 900 ప్రాంతానికి చెందినవాడని, మనువు క్రీ.పూ. 200 – క్రీ.శ. 200 ప్రాంతం వాడనీ కాణే పండితుని అభిప్రాయం. అయినా, మేధాతిథి ప్రామాణికతను సంశయించవలసిన అవసరం లేదు. ఎందుచేతనంటే, రెండు పదాలకూ ప్రత్యామ్నాయ వ్యాఖ్యానం లేదు. అలాగే లోకాయతికులకు దానధర్మాల్లోనూ యజ్ఞయాగాదుల్లోనూ, పరలోకంలోనూ విశ్వాసమున్న దాఖలా లేదు.

రెండు : పరలోక సంబంధమైన క్రతువులను తిరస్కరించినప్పటికీ లోకాయతికులకు ప్రత్యేకమైన క్రతువులున్నట్టనిపిస్తుంది. ఆసక్తికరమైన ఆ ఆధారాలను చూద్దాం.

'సద్ధర్మ పుండరీక' అనే బౌద్ధ గ్రంథంలో "లోకాయత మంత్రధారక" "లోకాయతిక" అనే పదాలు ఒకచోట తగుల్తాయి (అయితే చులకనగా, అనకోండి).

దాన్ని అనువదిస్తే ఇలా ఉంటుంది.

".... ఉద్యోగం చేయనప్పుడు, ప్రేమించనప్పుడు, ఇహలోక మంత్ర ప్రవీణులనూ లోకాయతికులనూ సేవించనప్పుడు...."

'లోకాయత మంత్రధారక' – ఇహలోక మంత్ర ప్రవీణులు – అనే ఈ విచిత్ర సమాస ప్రయోగానికి అర్థం ఏమిటి? సరైన సమాధానం సాధ్యపడదు. అయినప్పటికీ లోకాయతికులనే ఇందులో ఉదహరించారనడంలో సందేహం లేదు. అందుచేత వారు ఏదో ఒక రకమైన మంత్ర సాధన చేసే వారన్నమాట.

మరో బౌద్ధ గ్రంథం 'దివ్య వదన'లో 'లోకాయత యజ్ఞ మంత్రేషు నిష్ణాతాః" అనే వింత ప్రయోగం కనబడుతుంది. దాని అర్థం క్రింది వాటిలో ఏదైనా కావచ్చు.

1. లోకాయత యజ్ఞ (క్రతువు)లోనూ, మంత్రం (మహత్తు కల శ్లోకం) లోనూ నిపుణుడు.

2. లోకాయతుల (పద్ధతి – లేదా గుర్తు) యజ్ఞ. మంత్రాలలో నిపుణుడు.

3. లోకాయత యజ్ఞాలకు చెందిన మంత్రాలలో ప్రసిద్ధుడు.

మొదటి అర్థాన్ని అంగీకరించినా, లోకాయతకూ, యజ్ఞానికీ, మంత్రానికీ ఉన్న సన్నిహిత సంబంధాన్ని కొట్టివేయలేము. బహుశా లోకాయతకు ఏదో విధమైన క్రతువుతో మంత్రంతో సంబంధం ఉండి వుండాలి.

దీనికి "వినయ పిటక" సాక్ష్యాన్ని చేర్చవచ్చు. ప్రాచీన బౌద్ధులు అర్థం చేసుకున్న లోకాయతలో మహిమా మంత్రాలకు స్థానముందని స్పష్టంగా సూచిస్తుంది 'వినయ పిటక'. ఈ క్రింది భాగం 'వినయ పిటక'లోని 'కులవగ్గ'లో ఉంది. అప్పుడు చబాగ్గియ భిక్కులు లోకాయత సిద్ధాంతాన్ని అధ్యయనం చేస్తుండేవారు. ప్రజలు అందుగురించి గుసగుసలు చెప్పుకునేవారు. "ప్రాపంచిక సుఖాలననుభవించేవారి వలె..." అని... ప్రజల గుసగుసలు చెవినబడ్డ భిక్కులు బుద్ధుని వద్దకు పోయారు. ఆయనకా సంగతి నివేదించారు.

"లోకాయతనే ధర్మంగా భావించే వారెవరైనా, ఈ నీతినీ, క్రమశిక్షణనూ... సంపూర్ణ ప్రయోజనకరంగా సాధించగలరా? పరిపూర్ణ విశాల స్థాయి నందుకోగలరా?

"అది కాజాలదు... ప్రభూ"

"మీరు కూడా లోకాయత మతాన్ని... అధ్యయనం చేయరాదు. ఎవరు చేసినా సరే! 'దుక్కట'నేరం చేసిన వారవుతారు (సర్వసంగ పరిత్యాగులు చేయగూడని నేరము).

...భిక్కులు లోకాయత శాస్త్రాన్ని... బోధిస్తున్నారు. మళ్ళీ ప్రజలు గుసగుసలాడారు...

బుద్ధుని వద్దకు పోయి భిక్కులు చెప్పారు.

"మీరు లోకాయత శాస్త్రాన్ని బోధించరాదు. అలా ఎవరు చేసినా.. 'దుక్కుట'నేరం చేసినవారవుతారు."

(ఇలాంటివే... చివరి దాకా సాగుతాయి).

"భిక్కులారా! మీరు లోకాయతనూ క్షుద్ర విద్యలనూ నేర్చరాదు, బోధించరాదు. (క్షుద్ర విద్యలంటే : దూరదృష్టి, మంత్రాలు, శకునాలు, జ్యోతిశ్శాస్త్రం, దేవతలకు బలి, మంత్ర విద్య నాటు వైద్యం). అందుకై ఉపయోగించిన పాళీ పదాలు 'తిరచ్ఛన్నవిగ్గా' : అంటే "మోటు లేదా మృగప్రాయమైన జ్ఞానము, బుద్ధి" అని అక్షరార్ధం. బౌద్ధులకు ఇలాంటి వాటి పట్ల సహజంగానే జుగుప్స ఉండేది. అయితే మనం గమనించాల్సిన అంశం అదికాదు. అసలు వారికి తెలిసిన లోకాయత, క్రతు మంత్రాలతో ముడిపడి వుండేది. పైన పేర్కొన్న 'కులవగ్గ'లో ఉన్న ఏడు క్షుద్ర విద్యల జాబితా 'మహాశీల'లో కూడా వుందని రిస్‌డేవిడ్స్, ఓల్టెన్ బర్గ్.... చెపుతున్నారు. ఆ క్షుద్ర విద్యలలో ఒకదానిగా లోకాయతను ఉదహరించారందులో. లోకాయతకూ, క్రతువులకూ ఉన్న సంబంధం ఆ విధంగా స్పష్టపడుతుంది.

ఈ దృక్కోణం నుంచే బహుశా మనం మీమాంసతత్వశాస్త్రాన్ని సంస్కరించాలనే కుమారిలుని ప్రయత్నంలో అంతరార్థాన్ని గ్రహించాలి.

"వాస్తవంలో మీమాంస ఎక్కువగా లోకాయతగా మారిపోయింది. దానిని (మీమాంసను) 'ఆస్తికపథం'లోకి తీసుకురావడానికే నేనా శ్రమపడ్డాను" అని ఆయన అన్నాడు.

దీన్ని ఈ క్రింది విధంగా అన్వయించడం ఆనవాయితీ. మీమాంస శాస్త్రానికి ప్రతిద్వంద భాష్యకారుడు (ప్రభాకరుడు) మీమాంసలో దైవానికి స్థానం లేకుండా చేశాడు. కుమారిలుడు తిరిగి అందులో దైవాన్ని ప్రతిష్టించి మతశాస్త్రంగా నిర్మించాడు. "మీమాంసిక భాష్యకారుడైన ప్రభాకరుడూ అతని అనుయాయులూ పూర్వ మీమాంసను నాస్తిక మతంగా ప్రవర్తింపచేస్తే, కుమారిలుడు దానిని మత శాస్త్రంగా ప్రవర్తింపజేశాడు. ఈ విషయం నేను ఆచార్య బెనర్జీ ద్వారా తెలుసుకున్నాను" అని మ్యూర్ అంటాడు.

అలాంటి అన్వయం పూర్తిగా కాల్పనికము, కుమారిలుడు, ప్రభాకరుని కంటే తక్కువ నాస్తికుడు కాడు. నిజానికి కుమారిలుని "శ్లోకవార్తిక"లోని "సంబంధా క్షేప పరిహార" భాగం భారత తత్వశాస్త్ర సాహిత్యంలో మత వ్యతిరేక వాదానికి అత్యున్నతమైన ఉదాహరణగా తేలుతుంది. అయితే మీమాంస మిక్కుటంగా లోకాయతగా పరివర్తన చెందిందని కుమారిలుడనడంలో అర్థమేమిటి? ఈ ప్రశ్నకు అతని వ్యాఖ్యతల నుంచి సరైన సమాధానం రాదు. అయినప్పటికీ ఒక విషయాన్ని మనం విస్మరించలేము. అసలు ముఖ్యంగా మీమాంస క్రతువులకు సమర్ధన. కనుక మీమాంస క్షీణ లక్షణాన్ని గురించి కుమారిలుడే మనుకున్నప్పటికీ అది కూడా క్రతువుల సమర్ధనకు సంబంధించిన పతనమే. బహుశా క్రతువుల తప్పుడు రూపాలకు చెందిన సమర్ధింపు కావచ్చు. అందుచేత కుమారిలుడు ఆ పరిస్థితిని సంస్కరించడానికి పూనుకున్నాడు. క్రమమైన క్రతువులకు క్రమమైన సమర్ధనను స్థిరపరచాలని కుమారిలుని ప్రయత్నం. మనం ఇలా ఊహిస్తే – మీమాంస క్రతువులను అపక్రమంగా సమర్ధించి ఉండాలి లేదా అపక్రమ క్రతువులను – సనాతన వ్యతిరేక క్రతువులను – సమర్ధించైనా ఉండాలి కనుక మీమాంస ఇంచుమించు లోకాయతకు సమానమైనదైంది. ఈ రెండు ప్రత్యామ్నాయాల్లో ఏది వాస్తవమైనప్పటికీ కుమారిలునికి లోకాయత పట్ల ఉన్న భావాలు ఖచ్చితంగా క్రతువులకు సంబంధించినవి కాకుండా పోవు. కుమారిలుడు 'ఆస్తికపథం' అనే సమాసం ఉపయోగించాడు. అంటే అర్థం వైదిక పథమే – లోకాయతకు ఆసక్తి ఉన్న క్రతువులన్నీ ప్రముఖంగా అవైదిక లక్షణాలున్నవని కుమారిలుడు అభిప్రాయపడినట్లనిపిస్తుంది. ఇంతవరకు పరిశీలించినదాన్ని బట్టి లోకాయత లక్షణాలను ఈ విధంగా సంగ్రహం చేయవచ్చును.

శ్రుతి, స్మృతి ప్రమాణాలను లోకాయత తిరస్కరిస్తుంది. నిజమే. దైవము, పరలోకము, బ్రాహ్మణ క్రతువుల ప్రయోజనం... వీటన్నింటినీ కాదంటుంది... నిజమే. కాని లోకాయత ఎవరో కొందరు తాత్వికులు నిర్మించారనే భావంలో – అంటే మనం మామూలుగా ఊహించే అర్థంలో – ఆజ్ఞేయవాదమనీ, భౌతికవాదమనీ పేరు పెట్టే అవకాశం స్వల్పం. అంతకంటే అది బ్రాహ్మణ వాద, లోకాయతలకు మధ్యనున్నసంఘర్షణగా మనకు – రెండు సంస్కృతుల ఘర్షణగా కనబడుతుంది. అందులో ఒకటి ప్రజలలో పాదుకున్న సంస్కృతి. లోకాయత దేశంలో 'విస్తృత ప్రచారాన్నీ, మోహనకరమైన సౌందర్యాన్ని' సాధించిందని బెల్వాల్కర్, రానడేలు చెప్పిన విషయాన్ని ఈ దృక్పథంలో మాత్రమే స్పష్టంగా అర్థం చేసుకోగలము. 'లోకేషు అయతాః '... (లోకంలో వ్యాప్తి చెందిన) అనే సూత్రంలోని కీలకార్థాన్ని కూడా ఈ దృక్పథం నుంచే గ్రహించవచ్చును. అసలు ఆ పేరులోనే ఆ అర్థం వుంది కదా! ఈ దృక్పథాన్ని కాదనుకుంటే కొందరు ఆజ్ఞేయవాదులు, తార్కికులు, నాస్తికులు, భౌతికవాదులు – అంటే ఆధునికార్థంలో – ప్రచారం చేసిన భావాల వలన మనమెరుగని కారణాల మూలాన – భారత ప్రజా సమూహం ప్రభావితమయిందనే అసంగతమైన అభిప్రాయానికి రావలసి వస్తుంది.

## లోకాయత - అసుర దృక్పథం

కానీ, సమస్యేమిటంటే లోకాయత అనే పదాన్ని మనం విశాల దృష్టిలో ఉపయోగించుతూ అర్థం చేసుకునే క్రమంలో లోకాయతికుల ప్రాపంచిక దృష్టి గురించి వచ్చే భావానికి ఎలా చేరుతాము? మనకు వారితో భేదించిన వారి దృష్టిలో ఉన్న అభిప్రాయాలే తెలుసు. అందుచేత లోకాయతికులపై బ్రాహ్మణవాదుల కట్టుకథలను విశ్లేషించి లోకాయత దృక్పథాన్ని ఆవిష్కరించే ప్రయత్నంచేయాలి.

మహాభారతం ప్రకారం పవిత్రులైన బ్రాహ్మణుల చేతిలో హతుడైన చార్వాకుడు అంతకు పూర్వం ఒక రాక్షసుడు. కఠోరమైన తపస్సులు చేసి విపరీతమైన శక్తులు సాధించాడు. ఆ తరువాత దేవతలను బాధించి అణచివేయడం ప్రారంభించాడు. ఈ కథ సర్వసాధారణమైనదే. ఎందుచేతనంటే బ్రాహ్మణ సాక్ష్యాలన్నీ రాక్షసులు, దైత్యులు, అసురులు అని పిలవబడే వారికే లోకాయత భావాలను నిరంతరంగా ఆపాదిస్తూ వచ్చాయి.

విష్ణు పురాణం ద్వైతులను, బౌద్ధ, జైన భావాలను అంటే మత వ్యతిరేక భావాలను స్వీకరించేటట్లు మాయామోహిని ఎలా చేయగలిగిందో వివరించిన తరువాత లోకాయత భావాల ఉత్పత్తిని గురించి ఈ క్రింది విధంగా వివరించింది.

"మాయామోహిని తన ఇంద్రజాలంతో మిగిలిన దైత్యులను రకరకాల మత వ్యతిరేక భావాలతో ఆకర్షించింది. అతి స్వల్పకాలంలోనే ఈ అసురులు మోహినీ ప్రభావం వల్ల భ్రమించి మూడు వేదాల విధులను వదిలిపెట్టారు. కొందరు వేదాలను, మరికొందరు దైవాలను, ఇంకొందరు యజ్ఞ యాగాదులను, ఆపై కొందరు బ్రాహ్మణులను దూషించారు. వారు ఈ సిద్ధాంతాలు చర్చించనవసరం లేదన్నారు. జంతుబలికి మత ప్రాముఖ్యంతో సంబంధం లేదన్నారు. అగ్నికి అర్పితం చేసిన నైవేద్యానికి (వెన్న, నెయ్యి) భవిష్యత్ ప్రయోజనం లేదని బాలుడు కూడా చెప్పగలడు. అనేక యజ్ఞాలు చేసి భగవంతుడైపోయిన ఇంద్రుడు శమి మొదలైన వృక్షాలను తినేవారయితే, ఆకులలములు మేసే జంతువు అతనికంటే ఉన్నతమైనది. యజ్ఞంలో బలియైన జంతువు స్వర్గానికి చేరేటట్లయితే ఆరాధకుడు తన తండ్రినే ఎందుకు బలిచేయడు? ఎవరో తిన్న ఆహార పదార్థం వల్ల ఒక మనిషి (ఆత్మ) తృప్తి చెందగలిగితే ఇతర ప్రాంతాల్లో ప్రయాణం చేసే ప్రజలకు శార్ధములు అర్పించవలసి వుంటుంది. వారు దీనిని నమ్మితే తినుబండారాలు తమతో పాటు తీసుకుపోయే శ్రమ తప్పుతుంది. చుతిలేని (పతనం చెందని) వాక్యాలు ఆవేశం నుంచి ఊడిపడ్డవని అసురులంటారు; నేను, తెలివిగల మీలాంటివారు అంగీకరించే హేతుబద్ధమైన ఉద్ఘాటనలు మాత్రమే నిజమైనవి. ఆ విధంగా మహా మాయ వలన రకరకాలుగా దైత్యులు గజిబిజి అయ్యారు. అందుచేత వారెవ్వరూ మూడు వేదాలను ప్రమాణంగా స్వీకరించలేదు. దైత్యులు ఈ వక్రమార్గాన ప్రవేశించినపుడు దేవతలు తమ శక్తులన్నీ

కూడదీసుకుని యుద్ధానికి తయారయ్యారు. అప్పుడు దేవతలకు, అసురులకు యుద్ధం ఆరంభమైంది. సక్రమ మార్గాన్ని వదిలి పెట్టినందువల్ల అసురులు దేవతల చేతిలో ఓడిపోయారు. ఇంతకు పూర్వ యుద్ధాల్లో వారి ధర్మకవచం వారిని కాపాడేది. ఆ ధర్మ కవచ వినాశనంతో పాటు వారూ నశించారు. ఇక్కడ వివరించబడిన దృక్పథం లోకాయత దృక్పథమేనని మ్యూర్ ఇదివరకే చెప్పాడు. ఇంకా మైత్రేయణి ఉపనిషత్ కూడా ఈ కథను లోకాయతికుల రాక్షస అసత్య అవైదిక భావాలను ఇలా చెప్పింది.

"యధార్థానికి బృహస్పతి (దేవత గురువు) శుక్రుడయ్యాడు (అసురుల గురువు) ఇంద్రునికి రక్షణగా అసురుల నాశనం కోసం అవిద్యను సృష్టించాడు. ఈ అవిద్య వలన అశుభాన్ని శుభమనీ, శుభాన్ని అశుభమనీ మానవులు అనటం ప్రారంభించారు. వేదాలను ఇతర శాస్త్రాలను ధ్వంసం చేసి ధర్మాన్ని పరిరక్షించాలన్నారు. అందుచేత ఇలాంటి విద్యనే నేర్చుకోరాదు. అది అసత్యము. అది గొడ్రాలి వంటిది. కేవలం సంతోషం మాత్రమే ఇందుకు ప్రతిఫలం. అలాగే సక్రమ మార్గాన్నుంచీ వక్రంగా పోవటం కూడా. ఆ దారి తొక్కరాదు."

భగవద్గీతలో కృష్ణుడిలా అన్నాడు :

"ఈ ప్రపంచంలో రెండు జాతులు సృష్టించబడ్డాయి; దేవతలు, అసురులు. అర్జునా దేవతల భావాలు చెప్పాను. అసురుల భావాలు చెబుతాను విను."

దేవతల భావాలంటేనే 'గీత' తాత్విక సారాంశం. మరి అసురుల భావాలంటే? భగవద్గీత వ్యాఖ్యాతలలో అతి సమర్థుడైన శ్రీధరస్వామి 'గీత' చెప్పిన అసురుల భావాలు లోకాయత భావాలు మినహా మరేం కాదన్నాడు. ఇక్కడ కూడా లోకాయత భావాలంటే రాక్షసుల భావాలే (అంటే అసురుల భావాలే). అన్న కథ మళ్ళీ మన కెదురవుతుంది.

ఇలాంటి కథలన్నీ మామూలు ప్రజలను లోకాయత భావాలకు దూరం చేయటానికి నిలబెట్టిన దిష్టిబొమ్మలు. ఈ కథలు మనకు చెప్పిన పద్ధతిలో వాస్తవం కావడానికి ఏమాత్రం ఆస్కారం లేదు. అయితే దీనిలో ఒక ముఖ్యమైన వాస్తవాంశ ఉండి వుండవచ్చు. దైత్యులనీ, అసురులనీ బ్రాహ్మణ గ్రంథాలలో పేర్కొనబడిన వారి భావాలను లోకాయత భావాలుగా మనం ఊహించవచ్చు. కాని ఎవరీ ప్రజలు? దీనికి సమాధానం సంక్లిష్టం. దీనికి సమాధానంగా సరళంగా లభించదు. కానీ, చాలాచోట్ల వైదిక సంప్రదాయ వారసులు తమకు శత్రువులుగా భావించే వారిని ఈ పదాలతో (అసురులు, దైత్యులు, లోకాయతికులు) వర్ణించే వారనటంలో సందేహం లేదు. అలాగే ఆ శత్రువులు బ్రాహ్మణ సంస్కృతికి పూర్తిగా భిన్నమైన సంస్కృతికి చెందిన వారు అనడంలో కూడా సందేహం లేదు.

అయితే స్పష్టంగా అసురుల దృష్టి ఏమిటి? అది ఎంతవరకు ఇహలోకానికి సంబంధించింది? అయినా క్రతువులతో, మంత్రాలతో దానికున్న సంబంధం ఏమిటి?

## అసుర దృక్పథం - ప్రాచీన దేవాలయం

అసురులకు ఆపాదించబడిన దృక్పథాన్ని ఆధారంగా తీసుకుని లోకాయతను పునర్నిర్మించే అవకాశాన్ని దాస్‌గుప్తా చూపించాడు. ఆయన దృష్టిలో అసురులంటే ప్రాచీన సుమేరియన్‌లు. అందుచేత లోకాయత భావాలు ప్రాచీన సుమేరియా నుంచి మనకు చేరినవని ఆయన అభిప్రాయం. ఈ ఊహ, సందేహాత్మకమే. అసురులు ప్రాచీన సుమేరియన్‌లే అని చెప్పే భావం అనేక సిద్ధాంతాల్లో ఒకటి కావచ్చు. అయినా ఆయన చేసిన మౌలిక సూచన మాత్రం ముఖ్యమైనది. ఎందుచేతనంటే బ్రాహ్మణ గ్రంథాలన్నీ లోకాయత భావాలను అసురులకే ఆపాదించాయి. అసురులెవరు? అనే సమస్యను అలా వుంచి వారికి ఆపాదించబడిన భావాలకు, మూలాలను లేదా ఆధారాలను పరిశీలించుదాం. మనం అసుర భావాలలోని ముఖ్యంగా రెండు అంశాలకే పరిమితమవుదాం. ఒకటి : ఆత్మ సిద్ధాంతం, రెండు : విశ్వసృష్టి లేదా విశ్వమూలం, మొదటిది : మైత్రేయనీ ఉపనిషత్ ఈ క్రింది కథను చెప్పింది.

“దేవతలు, అసురులు “ఆత్మ”ను గురించి తెలుసుకొనడానికి బ్రహ్మ సమక్షానికి వచ్చారు. ఆయనకు ప్రణమిల్లి ‘ఆత్మను గురించి తెలుసుకోగోరుతున్నాము. మాకు చెబుతారా?’ అని అడిగారు. ఆయన చాలాకాలం ధ్యానించి తనలో తాను ఇలా అనుకొన్నాడు. ‘ఈ అసురులు ఆత్మ కావాలనుకుంటున్నారు. ఆత్మకు భిన్నమైన దాన్ని ఇస్తాను.’ అందుచేత వారికి భిన్నమైన తత్వాన్ని బోధించాడు. దానిపై ఆధారపడి ఇక్కడ ఆ మూర్ఖులు ప్రయోజనకరమైన, శాశ్వతమైన, రక్షణను పోగొట్టుకొని గాఢమైన బంధాలతో జీవితాన్ని కొనసాగిస్తున్నారు. గారడీలో వలె, వారు అసత్యమైన దానిని సత్యమైన దానిగా భావిస్తున్నారు. కనుక వేదాల్లో చెప్పిందే సత్యం. వేదాలలో చెప్పిందాన్నే విజ్ఞులు ఆచరిస్తారు, జీవిస్తారు. అందుచేత బ్రాహ్మణుడు అవైదికమైన దానిని పఠించరాదు. ఇదే సూత్రం.”

అసురులు అనుసరించే ఆత్మభావం వారిని సత్యానికి దూరంగా, భ్రమ పెట్టడానికి ఉద్దేశపూర్వకంగా బోధించబడినదనే అంశం సందేహాస్పదం. ఏది ఏమైనా ఉపనిషత్‌కారులు ఆత్మ సిద్ధాంతాన్ని అతి ముఖ్యమైన లక్షణంగా భావించారనేది స్పష్టం.

కానీ, ఆత్మకు సంబంధించిన ఈ అసుర సిద్ధాంతం ఏమై ఉంటుంది? మైత్రేయనీ ఉపనిషత్ దీనికి సమాధానం ఇవ్వలేదు. కానీ ఇదే కథ : మరికొన్ని వివరాలలో చెప్పిన చాందోగ్యోపనిషత్‌లో మనకు సమాధానం దొరుకుతుంది. అందులో చెప్పిన ఇంద్ర విరోచనుల కథ ఈ క్రింద ఇస్తున్నాం.

“ఆత్మ పాపదూరమైనది, వయోరహితం, మరణరహితం, దుఃఖరహితం, క్షుత్పిపాసారహితం, దాని వాంఛ సత్యం, దాని భావన సత్యం... దానిని అన్వేషించాలి. దానినర్థం

చేసుకోవడాన్ని అభిలషించాలి. ఆత్మను కనుగొని అర్థం చేసుకున్న వానికి అన్ని వాంఛలూ, అన్ని లోకాలు లభిస్తాయి" అన్నాడు ప్రజాపతి. దేవతలూ, అసురులూ దాన్ని ఆలకించారు. "అన్ని లోకాలనూ, వాంఛలనూ సమకూర్చే ఆత్మాన్వేషణ కావిద్దాం రండి, ఆత్మాన్వేషణ కావిద్దాం" అన్నారు. దేవతల నుంచి ఇంద్రుడూ, అసురుల నుంచి విరోచనుడూ ఆయన (ప్రజాపతి) వద్దకు ముందుకు వెళ్ళారు. ఒకరితో ఒకరు భాషించకుండా సమిధలను చేతబట్టి ప్రజాపతి సమక్షానికి వచ్చారు.

ఆ తర్వాత ముప్పది రెండు సంవత్సరాలు బ్రహ్మచర్యంతో పరిశుద్ధ జీవితం గడిపారు.

"ఏమి కోరి ఇలా జీవిస్తున్నారు మీరు" అన్నాడు ప్రజాపతి. "ఆత్మ, పాపరహితం, వయోరహితం, మరణరహితం, దుఃఖరహితం, క్షుత్పిపాసారహితం, అయిన ఆత్మ దేని వాంఛ సత్యమో, దేని భావం సత్యమో... దేనిని అన్వేషించాలో, దేనిని సాక్షాత్కరింప చేసుకోవడానికి అభిలషించాలో, ఆ ఆత్మ. ఆత్మను కనుగొని అర్థం చేసుకున్న వారికి అన్ని వాంఛలూ, అన్ని లోకాలూ అనుభవమవుతాయి. ఇవన్నీ మీ పలుకులని ప్రజలంటారు స్వామీ! దానికోసమే మేము జీవిస్తున్నాం" అన్నారిరువురూ.

ఆ యిద్దరికీ ప్రజాపతి ఇలా చెప్పాడు. "కంటితో చూడబడేదే ఆత్మ. ఆ ఆత్మను గురించే నేను చెప్పాను. అది అమర్త్యము. భయరహితము అదే బ్రహ్మత్."

'కాని స్వామీ, నీటిలోనూ అద్దంలో కనబడేది... అదేమిటి?"

"అన్నీ అదే సుమా! అన్నింటిలోనూ కనబడేది అదే"

నీటి పాత్రలో మిమ్మల్ని మీరు చూసుకోండి. ఆత్మను గురించి మీకు బోధపడనిదేమైనా ఉంటే, నన్నడగండి."

ఇద్దరూ నీటి పాత్రలోకి చూశారు.

"ఏమి చూస్తున్నారు" – ప్రజాపతి అడిగాడు.

ఇద్దరూ సమాధానం చెప్పారు "స్వామీ! ఇక్కడ మేమంతా చూస్తున్నాం. నఖశిఖ పర్యంతం సరిగ్గా ఆత్మనే చూస్తున్నాం" అన్నారు.

"మీరు సర్వాభరణ భూషితులై, వస్త్రాలలంకరించుకుని... నీటి పాత్రలో చూడండి" అన్నాడు ప్రజాపతి.

ఇద్దరు వస్త్రములతోను, భూషణములతోను, అలంకారములతోను సరిదిద్దుకుని... నీటి పాత్రలోకి చూశారు.

"ఏమి చూస్తున్నారు?" – అడిగాడు ప్రజాపతి.

"మేము ఇక్కడ ఉన్నట్లే, అలంకారాలు, భూషణాలు, వస్త్రాలతో సహా ఇక్కడ ఎలా ఉన్నామో, అక్కడ కూడా అలంకారాలు, భూషణాలు, వస్త్రాలతో సహా కనబడుతున్నాయి" అన్నారు.

"అదే ఆత్మ, అమర్త్యము, భయరహితము. అదే బ్రహ్మన్" అన్నాడు ప్రజాపతి.

శాంత హృదయంతో ఇద్దరూ వెళ్ళిపోయారు.

వారి వైపు చూస్తూ ప్రజాపతి "వారు... ఏమీ గ్రహించకనే, ఆత్మను తెలుసుకోకనే వెళ్ళిపోయారు. ఇలాంటి తత్వమును 'నమ్మినవారు' దేవతలైనా, అసురులైనా... నశించి తీరతారు" అన్నాడు.

శాంత హృదయంతో విరోచనుడు అసురుల వద్దకు వచ్చాడు. వారికి తన తత్వాన్ని (ఉపనిషత్‌ను) ప్రకటించాడు. "ఈ భూలోకంపై ఆత్మను (తనను తాను) ఆనందపరచాలి. తనను తాను విశ్వసించాలి. ఈ భూమిపై ఆత్మను ఆనందపెట్టే వాడు, తనన తాను విశ్వసించే వాడు – అతనికి రెండు లోకాలు – ఇహ, పరలోకాలు లభ్యమవుతాయి."

"ఏమీ అర్పించనివాడు, విశ్వాసం లేనివాడు (భగవంతుడంటే) యజ్ఞాలు చేయనివాడు... ఇలాంటి వారికి చెందిందే అసురతత్వం (అసురోపనిషత్). మరణించిన వారి శరీరాన్ని వస్త్రాలతోను, భూషణాలతోనూ – అవీ అడుక్కుని సంపాదించినవి తాము ఆశించినట్లు అలంకరిస్తారు. ఆ విధంగా వారు పరలోకాన్ని కూడా సాధించగలమని తలుస్తారు."

ఉపనిషత్ దాని తర్వాత దేవతల ప్రతినిధియైన ఇంద్రుడు, ఆత్మ విషయంలో అలాంటి దృక్పథానికి అంటిపెట్టుకుంటే జరిగే ప్రమాదాన్ని గ్రహించి ప్రజాపతి వద్దకు ఎలా తిరిగి వెళ్ళాడో, ఎలా ఆత్మకు సంబంధించిన భావవాద వాస్తవ జ్ఞానాన్ని క్రమక్రమంగా తెలుసుకున్నాడో... వివరంగా చెప్పింది. ఈ భాగంలో అసుర భావాలు కానివేవో చెప్పిన అంశాలు మాత్రమే మనకు ఆసక్తికరము. విరోచనుడు మాత్రం తోటి అసురులతో పాటు ఆత్మ – శరీరాల అభేద్యతను అర్థం చేసుకోవడంతోనే సంతృప్తి చెందాడు. అసుర విశ్వాసంలో పరలోక ప్రస్తావన భాగం కావడం చిత్తంగానే ఉంటుంది. ఆ భావం స్థూలంగానైనా... శరీరాతీతమై ఆత్మ అనే భావానికి పూర్తి విరుద్ధంగా వుంది. లోకాయతకు సంబంధించిన సాక్ష్యాలన్నీ అందుకు ప్రతికూలంగా ఉన్నాయి కాబట్టి ఆ నమ్మకం లోకాయత భావాలలో చోటుచేసుకోజాలదు. ఏమైనా ఈ ఒక్క మినహాయింపును గమనంలో ఉంచుకుని అసురులకు ఉపనిషత్తులో ఆపాదించిన 'ఆత్మ – శరీర' ఏకతా భావం లోకాయత భావమేనని దాస్‌గుప్తా చేసిన సూచనను అంగీకరించవచ్చును. పైగా లోకాయతపై దాడి చేసిన భిన్న తాత్వికులందరూ

'శరీరాతీత ఆత్మ' భావాన్నే ఆధారంగా పెట్టుకుని విమర్శించారు కదా! శంకరాచార్య కృతులు అందుకు చక్కని ఉదాహరణ. శరీరానికతీతమైన ఆత్మ లేదనే సిద్ధాంతాన్నే పునః పునః ఉదహరిస్తూ, శంకరాచార్య తన 'బ్రహ్మ సూత్ర' భాష్యంలో లోకాయత భావాలను గురించి మూడుసార్లు ముచ్చటించాడు.

"అవిద్యాపరులు, లోకాయతికులు వివేకపూరితమైన శరీరమే ఆత్మ అనే భావంతో ఉన్నారు."

"ఇదే కారణం వలన... అంటే... శరీరము తోడనే వివేకము దృశ్యమానమగుట వలననూ, శరీర రహితంగా అది కనబడకపోవుట వలననూ, లోకాయతికులు వివేకమును శరీర గుణముగా మాత్రమే గణింతురు."

"ఆత్మను శరీరంలో మాత్రమే చూసే కొందరు లోకాయతికులు శరీరమునకు భిన్నముగా (విడిగా) ఉండదు అని భావిస్తారు. భూమి మొదలైన బాహ్య మూలకాల్లో – ఒకటిగా కాని, మిశ్రమంగా కాని – కనబడని చైతన్యం, అవి శరీర రూపంలోకి పరివర్తన చెందినపుడు (చైతన్యం దాని నుంచి ఉద్భవించే విధంగా) కనబడుతుందని ఊహిస్తారు. అలాగే జ్ఞానాన్ని మత్తు కలిగించే గుణానికి – కొన్ని పదార్థాలను ఒక క్రమ నిష్పత్తిలో మిశ్రమ మొనర్చినప్పుడు కలిగేది పోల్చి చెబుతారు. మానవుడు "చైతన్యమున్న శరీరం మాత్రమే అని భావిస్తారు. అదే విధంగా ఆత్మ, శరీరానికి వేరుగా ఉండదు, ఇంకా స్వర్గలోకానికి వెళ్ళగల ఆత్మ లేదా విముక్తి సాధించుకునే ఆత్మ ప్రశ్న ఎక్కడిది? శరీరంలో ఉండేది చైతన్యం మాత్రమే, శరీరమే చైతన్యం, అదే ఆత్మ" అంటారు. ఈ వక్కాణింపుకు సూత్రంలో చెప్పిన సమర్ధన "శరీరమున్న చోటనే చైతన్యమున్నది కనుక. ఒక అంశం మరో అంశమున్న చోటునల్లా ఉండే అలాగే రెండో అంశము లేనిచోట మొదటి అంశం లేనట్లయితే... మొదటి అంశాన్ని రెండో అంశం యొక్క లక్షణం (స్వభావం)గా పరిగణిస్తాం. వెలుగు, వేడి... నిప్పు లక్షణాలు (స్వభావాలు) అని అంటాం. ప్రత్యేకాత్మ భావాన్ని ఆదరించే వారు జీవం, చలనం, చైతన్యం, స్మృతి మొదలైన వాటిని ఆత్మకు లక్షణాలుగా గణిస్తారు. కాని ఈ గుణాలన్నీ శరీరంలోనే లభిస్తాయి గాని, శరీరానికి బాహ్యంగా కావు. ఇంకా శరీరానికి బాహ్యంగా కావు. ఇంకా శరీరానికి భిన్నంగా ఈ లక్షణాలకు నిదర్శనం కనబడదు కనుక అవన్నీ శరీర లక్షణాలు మాత్రమే. అందుచేత ఆత్మ శరీరానికి భిన్నమైనది కాదు."

ఇక్కడ మనకు ఆత్మను శరీరానికి పర్యాయంగా గుర్తించే భావం దొరుకుతుంది. అలాగే దానిని లోకాయత భావంగా ఉదహరించడం జరిగింది. లోకాయతికుల ఇతర భావాన్ని దేన్నీ శంకరాచార్య ఉదహరించలేదు. తిరస్కరించడానికి ప్రయత్నించలేదు. దీన్ని గుర్తుంచుకోవాలి. అంటే లోకాయత అభిప్రాయాల్లో దీన్ని అతి ముఖ్యమైన దానిగా శంకరాచార్య భావించాడన్న మాట.

పైగా ఆత్మను గురించిన అలాంటి భావం చాలా పురాతనమైనది, నిజానికిది 'బ్రహ్మ సూత్రాల' కంటే పురాతనం. ఇలాంటి భావం – అంటే సుమారుగా ఇలాంటి భావం. 'బృహదారణ్యకోపనిషత్'లో తొలి బౌద్ధ సాహిత్యాల్లో ఉదహరించబడింది. 'బృహదారణ్యకోపనిసత్'లో యాజ్ఞవల్క్యుడు మైత్రేయితో ఇలా అంటాడు.

"ఈ మూలకాల (భూతాల) నుంచి ఉద్భవించినది. వానిలోనికే అదృశ్యమై పోతుంది. మరణానంతరం చైతన్యముండదు (నప్రేత్యా సంజ్ఞ ఆస్తి).

'బృహదారణ్యకోపనిషత్తు'లో మరోచోట కూడా ఇదే విషయం ప్రస్తావించబడింది. బహుశా 'కఠోపనిషత్'లో యముడు ఇలాంటి భావాన్నే ప్రస్తావించాడు. యాజ్ఞవల్క్యుని నోట అలాంటి భావం రావడం మైత్రేయికి దిగ్భ్రమ కలుగజేసింది – (బృహదారణ్యకోపనిషత్) కాని అది అతని అభిప్రాయం కాదని స్పష్టమే. అది తాను ఖండించబోయే 'ప్రత్యర్థి అభిప్రాయం'. అందుచేత అది ప్రాచీన లోకాయతికుల అభిప్రాయం కావచ్చును. ఉపనిషద్భాగాన్ని జయంతుడు – వ్యాఖ్యాత – చూడదలుచుకున్న పద్ధతి ఇదేనని దాస్‌గుప్తా వ్యక్తపరిచాడు.

ప్రత్యర్థుల పూర్వపక్ష పాఠాల నుంచే లోకాయత భావాలు సంకలనమయ్యాయని జయంతుడు తన 'న్యాయమంజరి'లో వ్యక్తం చేశాడు.

ఆత్మను గురించిన ఈ అభిప్రాయంపై రిస్ డేవిడ్స్ ఇలా అన్నాడు.

"ఇదే భావం కాకపోయినా, దానిని పోలిన భావమే 'బ్రహ్మజాలసుత్త'లో విపర్యాయంగా చూపబడింది... దానిని నిరంతరంగా 'తం జీవం తం శరీరం' అనే పడికట్టు సూత్రంగా 'పిటకా'లన్నింటా ఉదహరించారు" రిస్ డేవిడ్స్ అనువదించిన ప్రకారం ఆ పాఠం ఇది.

"సోదరులారా! మొదటగా ఎవడో సన్యాసి లేదా బ్రాహ్మణుడు ఈ క్రింది అభిప్రాయాన్ని, ఈ క్రింది ఉద్దేశ్యాన్ని – మన ముందుంచుతాడు. 'స్వామీ (ఆర్యా) ఈ ఆత్మకు రూపం ఉంది కనుక నాలుగు మూలకలతో (భూతాలు) నిర్మించబడింది. తల్లిదండ్రుల నుంచి ఉద్భవించింది. శరీర నాశనంతో ఆత్మ వేరవుతుంది. నాశనమైపోతుంది. మరణానంతరం మనజాలదు. ఆర్యా! ఆ తర్వాత ఆత్మ సంపూర్ణంగా నిర్మూలం అయిపోతుంది."

రిస్‌డేవిడ్స్ చెప్పినట్లుగా అలాంటి దృక్పథం 'పిటకాలలో నిరంతరం ఉదహరించబడినందువలన' కనీసం అలాంటి దృక్పథం బౌద్ధ భారతంలో బహుళ వ్యాప్తిలో ఉండేదని మనం తీర్మానించవచ్చు. పైగా రిస్ డేవిడ్స్ స్వయంగా చెప్పినట్లు లోకాయత, లోకాయతిక అనే పదాలు తరచు తొలి బౌద్ధ గ్రంథాలలో కనబడుతుండేవి. ఈ పరిస్థితుల్లో మనం చర్చించే ఈ సిద్ధాంతం లేదా అందుకు సమానమైనది తొలి లోకాయతలో ఒక అంశమై

ఉండేదని భావించడం కూడా సహజమే. కానీ సరిగ్గా ఈ విషయాన్నే రిస్ డేవిడ్స్ సందేహిస్తున్నాడు. 'అతను చెప్పిందాని ప్రకారమే ప్రాచీన బౌద్ధ గ్రంథాలలో ఇలాంటి దృక్పథం సూచింపబడిన మాట నిజమే. అలాగే అవే గ్రంథాలలో లోకాయత అనే మాట ఉన్న సంగతీ నిజమే. కానీ, ఎక్కడా ఈ రెంటి మధ్య ఉన్న సంబంధాన్ని నిర్దేశించే సూచన కనబడదు. అందువలన అలాంటి సంబంధం ఉన్నట్లు మనం తీర్మానించలేము. అయితే శంకరాచార్య ఇలాంటి సిద్ధాంతాన్ని ఖండించాడు. దాన్నే లోకాయత అని కూడా పిలిచాడు. "ఇది కూడా తప్పేనేమో" అని రిస్ డేవిడ్స్ అనుమానం.

"శంకరాచార్య ఆత్మ సిద్ధాంతాన్ని వివరిస్తూ లోకాయతికులకు ఆపాదించిన ఒక వింత భావాన్ని వివాదగ్రస్తం చేశాడు. అది తప్పేమో. ఎందుచేతనంటే అనేక యుగాల ముందు అదే భావాన్ని పిటకాలలో తిరస్కరించారు. కానీ అక్కడ దానిని లోకాయత అని పిలవలేదు. అయితే కొన్ని చోట్ల లోకాయత అనే పదం కూడా ఉపయోగించబడింది."

ఈ అంశంపై రిస్‌డేవిడ్స్‌తో ఏకీభవించడం సాధ్యం కాదు. స్పష్టంగా ఉన్న సాక్ష్యాన్ని అస్పష్టంగా ఉన్న సాక్ష్యాధారంతో తోసిపుచ్చలేము. ఒక విధమైన దేహవాదం తరచుగా ప్రాచీన బౌద్ధ గ్రంథాలలో ఉదహరించబడేదనేది స్పష్టమైన ఆధారం. రెండు : లోకాయత అని పిలవబడే సిద్ధాంతం గురించి కూడా అవే గ్రంథాలు సూచించాయి. మూడు : శంకరాచార్య తొలి బౌద్ధుల అనంతరం చిరకాలానికి వచ్చినప్పటికీ ఈ రెంటినీ గుర్తించి దేహవాదాన్ని లోకాయతికుల సిద్ధాంతంగా పరిగణించి ప్రత్యేకంగా ఖండించ పూనుకున్నాడు. అటువైపు అస్పష్టంగా వున్న విషయం : తొలి బౌద్ధ గ్రంథాలు దేహవాదాన్ని లోకాయత నామంతో కలిపి ఎందుకు చెప్పలేదో, రెంటినీ ఒకటిగా ఎందుకు గుర్తించలేదో అనే విషయం. కానీ లోకాయత, దేహవాదాల సమానతను ప్రత్యేకించి చెప్పకపోవడం దాన్ని తిరస్కరించినట్లు అర్థంకాదు. అందులోనూ శంకరాచార్యలాంటి వారి రచనలలో లభించిన సాక్ష్యం ఉన్నప్పుడు అది తిరస్కరణ కానేకాదు. రిస్ డేవిడ్స్ అభిప్రాయం సక్రమమైనది అనడానికి క్రింద చెప్పే రెండు రకాల ఆధారాలలో ఒకటైనా ఉండి తీరాలి.

ఒకటి : బౌద్ధ గ్రంథాలలో దేహవాదాన్ని మరో పేరుతో (లోకాయత కాక) ఉదహరించాలి. రెండు : లోకాయతను వివరించడానికి మరో సిద్ధాంతం (దేహవాదం కాక) వర్ణించబడి ఉండాలి. ఈ రెంటిలో ఏదీ మనకు లభించలేదు. రిస్‌డేవిడ్స్‌తో ఏకీభవించాలంటే మనం రెండు రకాలుగా ఊహించాల్సి వుంటుంది. ఒకటి : బౌద్ధ భారంతో దేహవాదానికి విస్తృత ప్రచారం ఉన్నప్పటికీ దానికొక స్పష్టమైన పేరు లేదు. లేదా బౌద్ధగ్రంథ కర్తలకు దాని పేరు చెప్పే అవసరం కలగలేదు. రెండు : లోకాయత అనే సిద్ధాంతం బహుళ ప్రచారంలో ఉంది. కాని బౌద్ధ రచయితలకు దాన్ని వివరించే అవసరం కలగలేదు. ఈ రెండు ఊహాలూ

విపరీతమైనవే. ఆ పైన శంకరాచార్య లోకాయతికులకు దేహవాదాన్ని ఆపాదించి ప్రయత్న పూర్వకంగా వక్రీకరించినట్లు వూహించాల్సి వుంటుంది. తొలి బౌద్ధులకూ, శంకరాచార్యునికీ మధ్య దీర్ఘకాల వ్యవధి ఉన్నమాట నిజమే. అయితే సుదూర గతం నుంచీ సాంప్రదాయకంగా – బహుశా బృహదారణ్యక, ఛాందోగ్య ఉపనిషత్‌ల కాలం నుంచీ – లభించిన అంశాన్నే శంకరాచార్య చర్చించాడనడానికి, అభ్యంతర పెట్టే సాక్ష్యమేమీ లేదు.

## అసుర విశ్వదృష్టి

ఉపనిషత్‌లు, పిటకాలు సూచించిన ఈ దేహవాదం నిస్సందేహంగా లోకాయతికులదే. అయితే అది మాధవాచార్య వర్ణించిన దేహవాదం మాత్రం కాదు. ఎందుకనంటే, లోకాయతకు ప్రత్యేకమైన మంత్రాలు, క్రతువులూ ఉన్నాయి. కనుకనే లోకాయత దృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి మరో ప్రశ్న వెయ్యాల్సి వస్తుంది. ప్రాచీన భారత సాంస్కృతిక చరిత్రలో ఎక్కడైనా – ఏదైనా దేహవాదం ప్రత్యేకమైన "మంత్ర క్రతువుల"తో సంబంధం కలిగి ఉండటం ఎరుగుదుమా? అవును, అలాంటివి ఉన్నాయి. తంత్రవాదం పేరున్న గూఢ విశ్వాస సంప్రదాయాలకు చెందిన దేహవాదం అలాంటిదే. తంత్రవాదం చాలా ప్రాచీనమైనది. ప్రతిభావంతులైన కొందరు పండితులు దాన్ని వేదాలకంటే పురాతనమైనదంటారు. తంత్రవాదం – ఎన్ని మంత్రాలు, క్రతువులు వున్నప్పటికీ స్పష్టంగా అవైదికము. దాని తొలి రోజుల్లో వైదిక సంప్రదాయానికి వ్యతిరేకమైనది. మను ధర్మశాస్త్ర వ్యాఖ్యాత కుల్లూభట్టు చెప్పినట్లు శ్రుతులు రెండు విధములు : వైదికము, తాంత్రికము, తంత్రవాదం ఒక అర్థంలో లోకేషు ఆయతాః అంటే లోకులలో వ్యాప్తి చెందినది. ఒక ఆధునిక పండితుడన్నట్లు ప్రజల జ్ఞానంగా, విశ్వాసంగా అవి (తంత్రములు) భారతదేశంలో ఎక్కువ చోట్ల వేదాలను మించి పోయాయి. ఈ తంత్రవాదం విశిష్టార్థంలో దేహవాదానికి ఒక తీవ్ర రూపం. దేహం అంటే 'భౌతిక మానవ శరీరం' తంత్రవాద దృష్టిలో – విశ్వానికి సూక్ష్మరూపం.

లోకాయతికుల దేహవాదము, తంత్రవాదుల దేహవాదమూ ఒకటే అన్న యథార్థము ప్రాచీన లోకాయతను పునర్నిర్మించడానికి ఎంతవరకు సహాయపడుతుందో చూద్దాం. గీతలో పేర్కొనబడిన అసుర దృక్పథం లోకాయత దృక్పథానికి సమానమేనని శ్రీధరుడు వ్యాఖ్యానించడం మనం ఇదివరకే గమనించాం. ఛాందోగ్య ఉపనిషత్, మైత్రేయిని ఉపనిషత్, విష్ణు పురాణం లాంటి ప్రాచీన గ్రంథాలు లోకాయత భావాలను అసురులకు ఆపాదించాయి. కనుక శ్రీధరుని ప్రామాణికతను ప్రశ్నించే అవసరమేమీ కనబడదు. అసుర దృక్పథానికి సంబంధించిన రూఢియైన సమాచారం మరేదైనా లభిస్తుందేమో అనే దృష్టితో భగవద్గీతను సూక్ష్మంగా పరిశీలించాలి.

అసురులను గురించీ, వారి భావాలను గురించీ భగవద్గీత ఎక్కువ భాగం తృణీకారంగా చెప్పిందే : అసురులు వాంఛకూ, సహనానికి మధ్య భేదాన్ని పాటించరు, శుచి, నీతి, సత్యం వీటిని గురించి వారికి ఏ భావమూ లేదు... వగైరా ఈ నిందల నుంచీ, దూషణల నుంచీ అసుర దృక్పథం గురించిన రెండు ఆసక్తికరమైన అంశాలను మనం సాధించవచ్చును. మొదటిది: వారికొక విశ్వదృష్టి ఉండేది. రెండోది : వారికి ప్రత్యేకమైన క్రతు సంప్రదాయ పద్ధతులుండేవి.

అసురుల విశ్వదృష్టిని భగవద్గీత ఇలా సంగ్రహపరిచింది : అపరస్పర సంభూతం కిం అన్యత కామ హైతుకం. విశ్వం స్త్రీ, పురుష సంభోగం నుంచీ ఉద్భవించింది. అందుకు కామం మినహా మరే హేతువూ లేదు. రెండోది : గీత ప్రకారమే అదే అసురులు దైవాన్నీ, పరలోకాన్నీ తిరస్కరించినప్పటికీ వారికి కొన్ని సొంత క్రతు సంప్రదాయాలున్నవి : వారొనరించే యజ్ఞం పేరునకు మాత్రమే యజ్ఞం. అంటే వారు కూడా ఏదో యజ్ఞం చేస్తున్నారన్నమాట. అయితే సహజంగా వీరిని వ్యతిరేకించే వారు ఆ యజ్ఞాలను హీనంగానే చూస్తారు.

అంటే భగవద్గీత ఉదహరించిన అసురులకు ఒక ప్రత్యేకమైన విశ్వదృష్టి ఉందనీ, ప్రముఖంగా ఇహలోకత, దైవభావనా తిరస్కారం వారి సిద్ధాంతాలైనప్పటికీ – వారికి కొన్ని క్రతు సంప్రదాయాలున్నవనీ అర్థం. ఈ అసురులే లోకాయతికులని శ్రీధరుడు చేసిన సూచనను అంగీకరించి, ఈ రెండు ఆధారాల వలనా ప్రాచీన లోకాయతికులను గుర్తించడానికి ప్రయత్నించవచ్చును. అయితే ఇక్కడో ప్రశ్న : ఏదో విధమైన అవైదిక క్రతు – ఆచారం కల ఇదే విశ్వదృష్టి – లేదా ఇలాంటి విశ్వదృష్టి – ప్రాచీన భారత సంప్రదాయంలో మనకెక్కడైనా లభిస్తుందా? దానికి సమాధానం 'అవును' అని చెప్పవచ్చును. దాన్ని తెలుసుకోవాలంటే తంత్రవాదం వైపు చూడాల్సిందేననిపిస్తుంది. మనకున్న అతి సమర్థుడైన ఇటీవలి రచయిత ఒకాయన తంత్రవాదంపై చెప్పిన పాఠానికి స్వేచ్ఛానువాదం ఈ క్రింద ఇస్తున్నాం. "నూతన మానవ జీవిత సృష్టికి స్త్రీ పురుషుల సంగమమే మూల క్రమం. విశ్వదృష్టి కూడా అదేవిధంగా పురుష, ప్రకృతుల కలయిక ద్వారా సంభవించింది. విశాల శూన్యాకాశంలో (విశ్వంలో) మౌలిక చలనం మానవులలో కామంగా – మదన చర్యగా – అభివ్యక్తి పొందుతుంది. మానవుల విషయంలో కామము, (మదన భావము) నూతన రూపాలను, నూతన నామాలను తీసుకొని వచ్చిన విధంగానే, ఆదిమ పురుష, ప్రకృతులలో కామము, మదన భావముల వలన నూతన రూపాలు, నూతన నామాలు విశ్వమంతటా సంభవిస్తవి... కొన్ని తంత్రశాస్త్రాలలో శివ (పురుష) శక్తుల (ప్రకృతి) సంయోగమునకూ మానవ స్త్రీ పురుషుల సంయోగానికీ మధ్యనున్న పోలిక – నిజానికి సమానత – సూక్ష్మ వివరాలతో వర్ణించబడ్డాయి. మొదటిది విశ్వసృష్టికీ, రెండో శిశూత్పత్తికీ హేతువులని.

ఆ విధంగా అసుర విశ్వదృష్టి – అంటే శ్రీధరుడూహించినట్లు లోకాయత విశ్వదృష్టి – తంత్రశాస్త్రం విశ్వదృష్టే. ప్రాచీన బౌద్ధ గ్రంథాలలో లభించే లోకాయత క్రతువు ఉదాహరణలు. భగవద్గీత చెప్పిన అసుర క్రతువులూ ఈ వెలుగులో అర్థం చేసుకోవచ్చును.

## లోకాయత - తంత్రవాదం

దాస్‌గుప్తా ఇలా అంటాడు "ఏమైనా 'షడ్దర్శన సముచ్చయ'పై వ్యాఖ్యానంలో గుణరత్నుడు చార్వాకులను కేవలం తినేవారుగానూ, మంచీ చెడుల అస్తిత్వాన్ని గమనించని వారుగానూ ఇంద్రియ గ్రాహ్యమైన వాటిని మినహా మరిదేన్నీ విశ్వసించని వారుగానూ వర్ణిస్తాడు. మధుపానం చేసి, మాంసం భుజించి, మితిలేని లైంగిక కార్యంలో పాల్గొనే వారిగా చూపించాడు. ప్రతి సంవత్సరం ఒకానొక నియమిత దినాన వారంతా కూడి స్త్రీలతో హద్దులేని శృంగార కలాపాలు సాగిస్తారు. వారు సామాన్య మానవుల వలె ప్రవర్తిస్తారు కనుక వారిని లోకాయతికులంటారు."

గుణరత్నుడు ఉదహరించిన లైంగికమైన విచ్చలవిడితనము ఒక ఆసక్తికరమైన అంశాన్ని సూచిస్తుంది. అది కేవలం నీతిహైన్యతకు గుర్తు కాదు. దుర్నీతిపరులు అలాంటి 'ఉన్మాద చర్యల'కొక ప్రత్యేక దినాన్ని నిర్ణయించుకోరు. అందుచేత ఆ విచ్చలవిడితనానికొక క్రతు స్వభావమున్నదన్నమాట. ఇంకా ఆ విచ్చలవిడితనానికి క్రతు స్వభావమున్నట్లయితే, మధుపానానికీ, మాంస భక్షణకూ కూడా క్రతు సంబంధమున్నట్లే. ఆ విధంగా తాంత్రికుల త్రి 'మ'కారాలు గుణరత్నుని రచనల్లో కనబడుతున్నాయి. తాంత్రికులకు పంచి విధ 'మ' కారాలతో క్రతు సంబంధమున్నట్లు అందరికీ తెలిసిందే. మద్య, మాంస, మైథున, మత్స్య ముద్ర, ఉడికిన ధాన్యాలు ఈ అయిదూ 'మ' కారంతో ప్రారంభమవుతాయి కదా! ఈ జాబితాలోని మొదటి మూడూ ముఖ్యమైనవి కాబట్టి, తంత్ర శాస్త్రాన్ని, లోకాయతనూ ఒకటే అనడానికి గుణరత్నుడు ఉద్దేశించినట్లు మనకర్థమవుతుంది.

గుణరత్నుని వివరణ అసాధారణమైనది. అయితే అంతకంటే విశేషమేమిటంటే దాని ప్రాముఖ్యత పట్ల దాస్ గుప్తా ఉదాసీనత. గుణరత్నుని మాటలపై దాస్ గుప్తా వ్యాఖ్య కూడా 'చార్వాక' పదం విషయంలో ఉన్న అనిశ్చితను గురించి మాత్రమే. "అందుచేత 'చార్వాక' పదం ఒక వాస్తవిక వ్యక్తి నామమో, లేదా లోకాయత దృక్పథాన్ని అనుసరించే వారి నుద్దేశించిన పదమో... చెప్పడం కష్టము."

గుణరత్నుని వ్యాఖ్యలు 'ఇంతకంటే' ఎక్కువ సమస్యలనే సూచిస్తాయి. అసలు గుణరత్నుడు చెప్పిన మాటలతోనే ప్రారంభిద్దాం.

"తర్వాత లోకాయత దృష్టి, ముందు నాస్తికుల స్వభావం. భస్మాన్ని (బూడిదను) ఒంటికి పులుముకొనే కాపాలికులలో కొందరు యోగులు, కొందరు హీనస్థితికి చేరిన బ్రాహ్మణులు. ప్రాణుల పుణ్య పాపాలను వారు గమనించరు. ఈ ప్రపంచం – జగత్తు నాలుగు మూలకాలతో (భూతములతో) నిర్మితమైందని వారంటారు. వారిలో చార్వాకులు మొదలైనవారు ఆకాశాన్ని (శూన్యాన్ని) మరో మూలకంగా భావిస్తారు. వారు ప్రపంచాన్ని ఐదు మూల పదార్థాలతో తయారైనదానిగా భావిస్తారు. వారి అభిప్రాయంలో మత్తు కలగజేసే స్వభావ మేర్పడిన విధంలోనే చైతన్యం కూడా ఈ మూలకాల నుంచి ఉద్భవిస్తుంది. జీవులు బుద్బుదప్రాయులు. మానవుడు చైతన్య సహితమైన శరీరము మినహా మరేమీ కాదు. వారు మద్యపానం చేస్తారు. మాంసభక్షణ చేస్తారు. అదుపులేని లైంగిక క్రియలో పాల్గొంటారు. వావివరుసలు పట్టించుకోరు. ఏడాదికొక నిర్ణీత దినాన వారంతా ఒకచోట చేరి కోరుకున్న స్త్రీని సంగమిస్తారు. వారు కామానికతీతమైన దేనినీ వారు గుర్తించరు. వారిని చార్వాకులనీ, లోకాయతులనీ (వగైరా) అంటారు. పానం చేయుట, నములుట (భుజించుట) వారి నీతి, నములుతారు కనుక వారిని చార్వాకులంటారు (చర్వ్ : నములుట) అంటే వివేచన లేకుండా భుజిస్తారన్నమాట. 'పాప పుణ్యాలు వస్తువుల కాపాదింపబడిన గుణాలు మాత్రమే.' వారిని లోకాయతులనీ, లోకాయతికులనీ కూడా పిలుస్తారు.... వారు విచక్షణ నెరుగని సామాన్య మానవులలాగా ప్రవర్తిస్తారు. వారి సిద్ధాంతం బృహస్పతి ప్రతిపాదించాడు కనుక వారిని బార్హస్పత్యులని కూడా అంటారు."

లోకాయతికులకు సంప్రదాయకంగా ఆపాదించబడిన పేర్లన్నీ గుణరత్నుడు చెప్పాడు. వీరు బార్హస్పత్యులు, చార్వాకులు. తాను ముచ్చటించుతున్న వారిని గురించి మనకే సందేహమూ మిగల్చలేదు. అదే సమయంలో ఈ లోకాయతికులు, కాపాలికులని చెప్పాడు. వారు యోగులు శరీరమంతా భస్మం పూసుకుంటారు. కాపాలికులంటే తాంత్రికులని మనమెరుగుదుం. తంత్రవాదము ఒక యోగాచారము. అందులో భస్మం అందుకోవడానికి ప్రాముఖ్యత ఉంది. ఈ వెలుగులో గుణరత్నుడు ఉదహరించిన తాంత్రికాచారంలోని ముఖ్యమైన త్రి 'మ' కారాలను (మద్య, మైధున, మాంస) అర్థం చేసుకోవాలి. తంత్రవాదంపై వాడుకగా వున్న మన అభిప్రాయాలకూ గుణరత్నుడు చెప్పిన భౌతికవాదానికీ పొసగనప్పటికీ లోకాయతికులకూ, తాంత్రికులకూ ఉన్న సమత్వం, ఇంతకుమించి సమగ్రంగా ఉండజాలదు... తంత్రవాదం పట్ల మనకున్న మామూలు భావాలను పునరాలోచించాలి... అసలు తంత్రవాదం మొదట్లో గాని, సారాంశరీత్యా గాని మనమిప్పుడూహిస్తున్న తత్వశాస్త్రం కానే కాదు. దానికేదైనా తత్వ ప్రాతిపదిక ఉండి ఉంటే, తంత్రవాదం భౌతికవాదమే... ఇంకా క్లుప్తంగా చెప్పాలంటే ఆదిమ భౌతికవాదం. ప్రాచీన కల్పనలతో అల్లుకున్న ఆదిమ భౌతికవాదం. ఇంతకుముందు చెప్పిన దేహదవాదం తంత్రవాద విశ్వదృష్టి అందుకు మంచి ఉదాహరణలు. ఆదిమ భౌతికవాదం ఇప్పుడు మనమనుకుంటున్న భౌతికవాద తత్వశాస్త్రానికి సహజంగా భిన్నమైనదే. తొలి తంత్రవాదం మానవ నాగరికతలో ఒక దశకు ప్రాతినిధ్యం వహిస్తుంది. దానికి అప్పటికింకా ఆధ్యాత్మిక

విలువలు పరిచయం కాలేదు. కనుక దాని ప్రాముఖ్యత ఎంతో ఉంది. తంత్రవాదంపై రాయబడిన గ్రంథాలలో ఆధ్యాత్మిక భావాలనేకం తగుల్తాయి. నిజమే, అయితే మనకు దొరికే గ్రంథాల నుంచి అసలు తంత్రవాద భవాలను ఆవిష్కరించడం కొంచెం శ్రమతో కూడుకున్న పనేనని చక్కగా అన్నారు. ఈ గ్రంథాలలో తంత్రవాదాన్ని మత మార్గం పట్టించడానికి తీవ్ర ప్రయత్నాలు జరగడమే దీనికి కారణం. ఆధ్యాత్మిక భావాలను దానిపై రుద్దడానికి నిరంతర కృషి జరిగింది. ఇందుమూలాన తంత్రవాద శాఖలు అనేకం మొదలయ్యాయి. బౌద్ధ తంత్రవాదం, హైందవ తంత్రవాదం, మళ్ళీ దీనిలో వైష్ణవ తంత్రవాదం, శాక్తేయ తంత్రవాదం... ఇలా అయితే తంత్రవాదం వీటిన్నింటికంటే చాలా పురాతనం – నిజానికి మామూలు ఆధ్యాత్మిక భావాల పుట్టుక కంటే పురాతనం. సరే! గుణరత్నుని సాక్ష్యాన్ని పరిశీలిద్దాం.

హెచ్.పి. శాస్త్రి బాహ్యదృష్టి కలవాడు కనుక గుణరత్నుని సూచనను వదిలి వేయడం కాని, ఉపేక్షించడం కాని చేయలేదు. "గుణరత్నుడు కాపాలికులను లోకాయతులుగా గుర్తించాడు" అన్న హెచ్.పి. శాస్త్రి ఇతర అంశాల వైపు కూడా మన దృష్టిని మరల్చాడు. వీటిల్లో ఒక అంశం "బృహస్పతి సూత్ర" (సంపాదకుడు థామస్)లో లభిస్తుంది. ఈ గ్రంథంలో మనకు రెండు సుభాషితాలు వరుసగా కనబడతాయి. మొదటిది 'లోకాయతికులకు', రెండోది 'కాపాలికులకు' సంబంధించినవి. శాస్త్రి దృష్టిలో ఈ గ్రంథం ఎక్కువ భాగం కృత్రిమంగా నిర్మితమైనప్పటికీ ఈ సుభాషితాలు మాత్రం వాస్తవమైనవే.

అవి : "భౌతిక సంపద కూర్చుకొనేటప్పుడు సర్వత్రా 'లోకాయత'ను అనుసరించాలి" (అర్ధ సాధనకాలే).

"కామక్రీడల విషయంలో 'కాపాలిక'ను మాత్రమే" (కామసాధనే) వీటి విషయంలో శాస్త్రి ఇలా అన్నారు.

"లోకాయతికులకు, కాపాలికులకు ఉన్న గాఢ సంబంధాన్ని గురించి 'బృహస్పతి సూత్ర' ముఖ్య సమాచారాన్ని ఇస్తుంది. ఆయన (అంటే ఈ గ్రంథంలోని మౌలిక భావాల కర్తగా ఊహించబడిన బృహస్పతి) సంపదను ఉత్పత్తి చేయడానికి 'లోకాయత'యే శాస్త్రము అన్నాడు. అదే సమయంలో భౌతికానందం కోసం అంటే కామం కోసం ఇంకా మక్కికి మక్కి చెప్పాలంటే శృంగార క్రీడల జ్ఞానం కోసం – 'కాపాలిక'యే శాస్త్రమని కూడా అన్నాడు. బృహస్పతి అలా అంటే, సనాతనులంతా అతన్ని నాస్తికుడని నిందించక మానరు. కాని ప్రస్తుతం మనక్కావలసింది అది కాదు. మనక్కావలసింది కాపాలికులు... 'బృహస్పతి సూత్ర' 'కాపాలికులు' చాలా ప్రాచీన శాఖ వారనీ, కనీసం 'లోకాయతులంత' ప్రాచీనులనీ చెపుతుంది. 'లోకాయతులు' తమ భౌతిక తత్వశాస్త్రం ఆధారంగా అర్ధ శాస్త్రాన్ని ప్రారంభించారనీ, అదే విధంగా కాపాలికులు వారి తత్వశాస్త్రమేమిటో మనకు తెలీదు. కామశాస్త్రాన్ని నిర్మించారని కూడా అంటాడు." పై

అభిప్రాయంలోని చివరి అంశం స్పష్టంగా లేదు. లోకాయతికులూ, కాపాలికులూ గాఢ సంబంధం కలవారని బృహస్పతి అన్నాడు. గుణరత్నుడు మరొక అడుగువేసి, ఇద్దరూ ఒకటే అన్నాడు. ఈ రెండి ప్రామాణికతనూ శాస్త్రి రూఢిగా నమ్మాడు. అయితే మనం వాస్తవంగా అలా విశ్వసించినపుడు కాపాలికుల కామసాధననకు ప్రాతిపదికగా భౌతికవాదాన్ని మించి వేరే తత్వశాస్త్రం గురించి ఊహించే అవసరమే లేదు. పైగా శాస్త్రి చెప్పిన ఆధార వాక్యాల నుంచే కాపాలికుల కామశాస్త్రమని పిలవబడుతున్న శాస్త్రానికి, అర్ధ సాధనా దర్శంతో సజీవ సంబంధముంది. ఇదే వాస్తవమని మన వాదం... కాపాలికుల లాంటి తాంత్రిక మతాలకు మూలం... మానవోత్పత్తికి అణుకరణగా ఆచరించి సహజోత్పత్తిని వృద్ధి చేయవచ్చుననే ప్రాచీన విశ్వాసంలో.... లభిస్తుంది. అంటే కామసాధన, అర్ధ సాధన.... భిన్నమైనవి కావు...

అసుర భావాలకు సంబంధించిన సమాచారం, లోకాయతికులంటే బహుశా తాంత్రికులేననే ఊహకు మరింత బలం చేకూరుస్తోంది. అయితే ఈ అంశాన్ని చర్చించే ముందు దాస్‌గుప్తా వ్యాఖ్యలను పరిశీలించడం అవసరం. ఎందుచేతనంటే అసురులకు ఆపాదించబడిన భావాల విశ్లేషణ ఆధారంగానే శిధిలమైన – పోయిన – లోకాయతను పునర్నిర్మించాలని మొదట సూచించినవాడు దాస్‌గుప్తా.

మనమిదివరకే చూపిన 'చాందోగ్యోపనిషత్'లోని పాఠ్యభాగంలో అసురులకు దేహవాదాన్ని ఆపాదించడం దాస్‌గుప్తాకు ముఖ్యమైన ఆధారం. ఆ ఉపనిషత్తు అసురుల శవ ఖనన పద్ధతిని కూడా సూచించింది. "మృత శరీరాలంకరణ సంప్రదాయం అసురుల దేహవాద" ఫలితమని దాస్‌గుప్తా వాదం. దీని ఆధారంగా ప్రాచీన సుమేరియా లోకాయత భావాల జన్మస్థానం అని దాస్‌గుప్తా భావించాడు.

ఇందులో రెండు ముఖ్యమైన ఊహలున్నాయి. మొదటిది : అసురులంటే ప్రాచీన సుమేరియనులు. రెండవది : ఖనన సంప్రదాయం వారి ప్రత్యేక లక్షణం. ఎందుకని? ఖనన సంప్రదాయ ఫలితమే దేహవాదమైతే, వేరే ఎవరికైనా ఇదే విధమైన – ఇలాంటి ఖనన సంప్రదాయముంటే వారు కూడా ఇదే – ఇలాంటి – రకమైన దేహవాదాన్ని విశదం చేస్తే... దాస్ గుప్తా ఊహ (అంచనా) వ్యత్యయమవుతుంది.

అయితే సూక్ష్మంగా పరిశీలిస్తే ఈ రెండు ఊహలూ సందిగ్ధమైనవే. రెండో ఊహతో మొదలుపెడదాం.

మొదటగా దేహవాదం అసురుల ఖనన పద్ధతి ఫలితమని ఉపనిషత్తు చెప్పలేదు. అంతకంటే, అసురులు దేహవాదాన్ని విశ్వసించారనీ, అలాగే ఒక విధమైన ఖనన పద్ధతినవలంబించారనీ నిరలంకారంగా ఈ గ్రంథం చెబుతుంది. రెండు : ఈ ఖనన పద్ధతి సుమేరియనులకు మాత్రమే పరిమితమైన లక్షణం కాదు... అలాగే తెలిసిన ఖనన పద్ధతి ఇదొక్కటే కాదు. ప్రాచీన ఈజిప్షియనులు మృత శరీరాలను విస్తారంగా అలంకరించే వారని

అందరికీ తెలుసు. ఇంకా ప్రాచీన ప్రపంచానికి చెందిన అనేకులు ఇదే ఇంచుమించు ఇలాంటి సంప్రదాయాన్ని అనుసరించే వారని కూడా తెలుసు. భారతదేశంలో ఇప్పటికి మిగిలి వున్న గిరిజనులలో కొందరు ఇలాంటి సంప్రదాయాన్నే పాటిస్తారు. అందుచేత ఉపనిషత్తులో చెప్పిన అసురుల ఖనన పద్ధతి ప్రాచీన సుమేరియనుల ప్రత్యేకాచారం కాదు. ప్రాచీన సుమేరియనులకు, మృత శరీరాన్ని వదిలించుకొనే పద్ధతి ఇదొక్కటే కాదు. "ప్రాచీన సుమేర్, ఇంకా కొన్ని చోట్ల ఖననమే సంప్రదాయంలాగా కనబడుతోంది. అలాగే లాగాష్‌కు దక్షిణ ప్రాంతంలో కూడా, మిగతా ప్రాంతాలలో శవపేటికలలోనో, నేలమాళిగలలోనో... పాతి పెట్టడం అధికం."

అందుచేత సుమేరియనుల శవాలంకరణ పద్ధతిలో నిబిడీకృతమైన విశ్వాస ఫలితమే దేహవాదమన్న దాస్‌గుప్తా వాదాన్ని తేలిగ్గా అంగీకరించలేము.

అసలు 'అసుర' అంటే అర్థం? ప్రాచీన భారత సాహిత్యంలోని 'అసురులు' ప్రాచీన సుమేరియనులు మాత్రమేనా? అలాంటి ఊహ దాస్‌గుప్తా పరిష్కారాన్ని సమర్థిస్తుంది. పండితులందరూ దీన్నంగీకరించరు. ఖచ్చితంగా కొన్ని ఆధారాలు ఈ ఊహకు ఊతమియ్యవు.

ప్రాచీన 'అసురుల' గురించి అనేక ఊహలున్నాయి. అందులో దాస్‌గుప్తా సిద్ధాంతానికి ప్రాతిపదిక అయిన ఊహ ఒకటి. "బెనర్జీ – శాస్త్రి... అసురులను అస్సీరియా నుంచి వలస వచ్చిన అసుర మతానుయాయులనీ, వారు ఆర్యులకంటే ముందు భారతదేశంలో ఉన్నారనీ, సింధు నాగరికతా నిర్మాతలనీ... భావిస్తున్నారు. అసురులను, అసూర్‌లు లేదా అస్సీరియనులు అని భండార్కర్ భావన. మగధ లేదా దక్షిణ బీహార్‌ల అసుర నివాసాలను గురించి 'శతపథ బ్రాహ్మణ' పేర్కొన్నట్లు కూడా చెప్పాడు."

కొందరు వారిని 'అహురమజ్ద' అనుయాయులైన ప్రాచీపర్షియన్లుగా ఊహిస్తున్నారు.

ఆసుమతాన్ని ఆదిమ ఇండో ఇరానియన్ సమాజపు సంస్కారవంతమైన, ప్రశాంతమైన జనులనుసరించారని క్రిస్టెన్సన్ భావన; వారి ముఖ్య వృత్తి వ్యవసాయము, పశుపాలన... అంతకంటే పూర్వపుదైన 'దైవ'మతం మాత్రం అంతకంటే శక్తివంతులూ, అనాగరికులూ అయిన జనంలో అనుకూల్యాన్ని కొనసాగించింది. వారికి కొల్లగొట్టే ఆదిమ విధానం అనుగుణంగా ఉండేది. మొదటి రకం వారు ఇరాన్‌లో ఉండిపోవడంతో తృప్తి చెందారు. ఇక రెండో వర్గం వారు, సాహసోత్సాహంతో తూర్పుగా ముందుకుపోయి... చివరకు భారతదేశంలో ప్రవేశించారు" (మజుందార్ : 'వైదికయుగం').

అంతిమంగా ఇండో ఆర్యన్ సమాజంలో 'దైవిక' మతం ప్రబలమైనప్పటికీ, 'అసుర' మతప్రాబల్యం కల ఇండో ఇరానియన్ సమాజంలో ఉన్న భేదాన్ని పరికిస్తే... 'అసుర' శబ్దాన్ని ఇంతకంటే 'ఉన్నత సమాజం నుంచి ఎరువు తెచ్చుకున్నట్టనిపిస్తుంది' – బి.కె. ఘోష్.

"...... ఈ పదం అస్సీరియా వారి ఇలవేల్పుకు చెందిన పేరు. అంటే, 'కాసైట్'ల ప్రాబల్య కాలంలో ఇండో ఆర్యనులకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అస్సీరియనులతో సంబంధం ఏర్పడి ఉండాలి. వారా పదాన్ని ('అసుర') సాముదాయకార్థంలో ఉపయోగించి ఉంటారు" ('వైదికయుగం' : మజుందార్) మధ్య భారత దేశంలో ఇప్పటికీ మిగిలి వున్న 'అసుర' – తెగవారు ప్రాచీన భారత సాహిత్యంలోని 'అసురు'లేనని కొందరి అభిప్రాయం. "... ప్రస్తుతం భారతదేశమని పిలువడుతున్న ప్రాంతంపై దాడిచేసినప్పుడు... ఆర్యులకు భీకరమైన అనాగరిక జాతివారు – వారినే 'అసురు'లన్నారు – నిరోధించారు. తర్వాత వారినే (అసురులనే) వెళ్ళగొట్టారు. కొందరిని నాశనమొనర్చారు. చోటా నాగపూర్ ప్రాంతంలో నివసిస్తున్న అసురులు... ఈ ఆర్య శత్రువుల వారసులా లేక మీర్జాపూర్ జిల్లాలో కనబడే ప్రాచీన కుడ్యాలు (గట్లు) నిర్మించిన 'అసుర' నిర్మాణ కర్తలకు సంబంధించిన వారా అనేది విశాలమైన ప్రశ్న : అయినా, అలాంటి ఊహలు కాదనగల పరిస్థితి కూడా లేదు.

ఇప్పటికీ వున్న అసుర – తెగవారి ప్రాచీనులతో 'అసురుల' సమానతను అంగీకరించని వారు, ప్రాచీన "అసురులను"... ఆర్య దండ్రయాలను నిరోధించిన 'భారతదేశ ప్రజలను' గుర్తించే సామాన్య పదంగా భావిస్తారు.

"అసురులు, దైత్యులు, దానవులు, నాగులు... మొదలైన పదాలన్నీ వివిధ దశలలో ఉన్న నాగరికతా సంస్కృతులకు చెందిన ప్రజలను సూచిస్తాయి. మొరటైన ఆదిమ, ఆనాగరిక తెగల నుంచి అర్ధ నాగరిక జాతుల వరకూ ఉన్న దశలవి. వారంతా ఆర్య సంస్కృతీ వ్యాప్తికి తీవ్రమైన ఆంటకము, పురాణ సాహిత్యంలో అసుర, దానవ, దైత్య, రాక్షస జాతుల వారిని – విరోధ జాతులను – వర్ణన మూడు స్థాయిలలో జరిగినట్లు కనబడుతుంది. మొదట్లో ఈ పదాలన్నీ మానవులను సూచించేవే. కాని వారంతా సామాన్యంగా ఆర్యులకు విరోధులైనందువల్ల... ఈ పదాలన్నీ నిషిద్ధమైన, ద్వేషించవలసిన, విరోధ లేక ఆటవిక... మానవులకు సూచకాలయ్యాయి. ఆ తర్వాత ఈ పేర్లన్నీ దూషణకూ, తిట్లకూ పర్యాయంగా మారి ఆయా జాతి ప్రజలకు దుష్ట లక్షణాలు ఆపాదించే స్థితి వచ్చింది.... చివరికి ఈ పదాలకు భూతాలతోను, దయ్యాలతోను సామీప్యత వచ్చేసింది." (మజుందార్) అసురుల గురించిన ఈ అభిప్రాయాల వైవిధ్యం, ఈ సమస్య అంత సరళమైనది కాదని స్పష్టం చేస్తుంది. అందుకే 'అసురు'లంటే ప్రాచీన సుమేరియనులని తేలిగ్గా అంగీకరించలేము. మన ప్రాచీన సాహిత్యంలో అసురులను గురించి మనకు లభించే అనేక ఆధారాలకు... ఒకే స్వభావం లేదనేది గమనార్హం.

'అసురు'లను గురించి మనల్ని విభ్రాంతపరిచే అనేక ఆధారాలతో, ప్రధానంగా కనబడే ఒకే ఒక రకమైన సూచనపై కేంద్రీకరించడం ఉపయోగకరంగా ఉంటుంది... సింధు నాగరికతా నిర్మాతలను సూచించడానికి 'అసుర' పదం ఎక్కువసార్లు మనకు కనబడుతుంది. (ఆ సూచననే పరిశీలించుదాం).

## సింధు - పురాతత్వ శిథిలాలు

"మేరు పర్వతాగ్రంపై అమరావతి పట్టణముంటుంది; అక్కడ దేవతలుంటారు, మేరు పర్వతం క్రింద అసురుల నగరం ఇరావతి ఉంటుంది" అంటాడు శాయనుడు. ఇక్కడ శాయనుడే సంప్రదాయాన్ననుసరిస్తున్నాడో జాడ తీయడం క్లిష్టమైన వ్యవహారమే. కాని ఆయన సూచించిన ఇరావతీ – అసుర సంబంధాన్ని సులువుగా కొట్టివేయలేము. నిజంగానే ఐరావతీ తటాన పురాతత్వ శాస్త్రవేత్తలు ఒక ప్రాచీన నగర శిథిలాలను వెలికి తెచ్చారు. ఋగ్వేద సాక్ష్యం ప్రకారం అది అసురుల నగరమని గట్టిగా నమ్మే అవకాశం ఉంది. ఆ నగరాన్నే హరప్పా అంటారు.

అక్కడ లభించిన ఆధారాలు అతి సాధారణమైనవి. 'ఋగ్వేదం'లో అరవ 'మండలం'లో అసురులపై ఇంద్రుని దండయాత్రను గురించి వర్ణన కనబడుతుంది. అక్కడ ఇంద్రుని 'అసురఘ్నుడ'ని ఉదహరించారు. అంటే అసురులను వధించినవాడు అని అర్థం. వైదిక సాహిత్యంలో ఇంద్రుణ్ణి ఈ విధంగా వర్ణించడం అసాధారణం కాదు. 'అధర్వవేదం', 'శతపథ బ్రాహ్మణం', 'గృహ్య సూత్రాలు' ఆఖరికి 'ఉపనిషత్తులు'.... ఇంద్రుణ్ణి అసుర నాశకుడుగానే స్మరిస్తాయి.

'అసురఘ్న' పదం 'ఋగ్వేదం' ఆరో మండలంలో 22, 4 శ్లోకంలో లభిస్తుంది. దాని రచయిత భరద్వాజ ఋషి అని సంప్రదాయం. ఆ మండలంలో అనేక శ్లోకాలకు కూడా కర్త ఆయనేనని చెబుతారు. (సూక్తంతో సహా – ఆరో మండలం 27వ భాగం). 27వ భాగంలో నిర్వహించిన పాత్రనే ఇంద్రుడు 22వ భాగంలో కూడా నిర్వహిస్తాడు. అయితే 'అసుర' పదం బాహ్యంగా 27వ భాగంలో కనబడదు.

ఋగ్వేదం ఆరో మండలం – 27లో కొన్ని ఆసక్తికరమైన పేర్లు కనబడతాయి. వాటిలో 'వరశిఖ' ఒకటి. అతనినీ అతని అనుయాయులనూ ఇంద్రుడు నాశనం చేశాడని వర్ణించబడింది. 'అసురఘ్న' పాత్రలో కూడా ఇంద్రుడు చేసిందిదే. అసుర ధ్వంసం. ఈ కోణం నుంచి చూస్తే 'వరశిఖ' అనేది ఒక అసురుని పేరని శాయనుడు వ్యాఖ్యానించడం సబబే.

ఈ అంశం ముఖ్యమైనది. వరశిఖ మొదలైనవారు అసురులైతే, వారి పట్టణం అసుర నగరమే. ఋగ్వేదం ప్రకారం ఈ నగరం పేరు 'హరియూపియ'. ఇప్పటి పండితులు 'ఋగ్వేదం'లోని హరియూపియను సింధులోయకు చెందిన హరప్పాగా గుర్తించడానికి గాఢానుకూలురే. "ఇక్కడ లిఖిత సంప్రదాయమూ, పురావస్తు సమాచారమూ చక్కగా సరిపోలుతున్నాయి" (కొసంబీ).

అందుచేత 'అసుర' శబ్దం కొన్ని సందర్భాలలోనైనా సింధు నాగరికతా కర్తలను సూచిస్తున్నదనడానికి అనువైన ఆధారాలున్నాయి. మనమిదివరకే గమనించినట్లు బెనర్జీ – శాస్త్రి అలాగే అభిప్రాయపడుతున్నారు. అయితే సింధు నాగరికతా నిర్మాతలు మొదట్లో అస్సీరియా నుంచి వచ్చి ఉంటారని ఆయన ఊహ. సమకాలిక పురావస్తు శాస్త్రం ఈ అంశాన్ని రుజువు చేయవలసి వుంది.

## తంత్రవాదం - సింధులోయ నాగరికత

సమకాలీన పురాతత్వ శాస్త్రజ్ఞులూ, చరిత్రకారులూ 'వైదిక ఆర్యులు సింధు నగరాలను ధ్వంసం చేసి, అక్కడి ప్రజలను హతమొనర్చి, వారి సంపదను కొల్లగొట్టారని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత దశలో ఈ సిద్ధాంతాన్ని కాదనగల ప్రత్యామ్నాయం మనకు లభించదు. అయితే.. సింధు నాగరికతా వైశాల్యం పెద్దది. అక్కడున్న ప్రజలందరినీ పూర్తిగా నిర్మూలించడం సాధ్యపడి ఉండదు. అలాగే వారి భావజాలపు జాడలు, విశ్వాసాలు, క్రతువులు... పూర్తిగా మాయమైపోజాలవు.

అవన్నీ ఏమైపోయాయి? ఈ ప్రశ్నకు మన చరిత్రకారులింకా పూర్తిగా సమాధానం ఇవ్వాలి. ఏమైనా... 'రుగ్వేదం' తొలి భాగాలలో సింధు ప్రజలను అసురులని పిలిచి ఉంటే, వారి వారసులను, తర్వాతి కాలపు బ్రాహ్మణ సాహిత్యంలో ముందు వలెనే చిత్రించడం సహజంగా ఉంటుంది.... అంటే అసురులని పిలవడం సహజమే. అందుచేత ఉపనిషత్తులు, భగవద్గీతలాంటి తర్వాతి కాలపు సాహిత్యంలో అసురులకు ఆపాదించబడిన భావాలు, క్రతువులు... సింధు నాగరికత నాటి భావాలకూ, క్రతువులకూ... అవశేషాలు అయి ఉండకూడదా అనే ప్రశ్న నిర్హేతుకమైనది కానే కాదు.

ఇక్కడ కూడా సాహితీ సంప్రదాయానికీ, పురావస్తు సమాచారానికీ అనుకూలం ఉంది. ప్రత్యేకంగా 'గీత'లో వర్ణించబడిన అసుర భావాలు బహుశా తంత్రవాద భావాలకు సమానమే. మరో ప్రక్కన సింధు నాగరికతకు చెందిన భౌతికావశేషాలలో గాఢమైన తంత్రవాదపు జాడలు కనబడుతున్నాయంటారు.

లోకాయతను, అసుర భావాలతో సమానం చేయడానికున్న ఆధారాలను గురించి మనమిదివరకే ఆలోచించాము. కాని లోకాయత – అది ఏదైనప్పటికీ – ప్రముఖంగా ఆదిమ భౌతిక స్వభావం కలది (ఇహలోక సంబంధి). ఆ విధంగా మరో ప్రశ్న తలెత్తుతుంది. అసురులకాపాదించబడిన భావాలలో ఏదైనా, ఇహలోకతను సూచించే భావం ఉందా? మనమిదివరకే దేహవాదాన్ని గురించీ, అసురుల విశ్వ దృష్టిని గురించీ అనుకున్నాం. వైదిక సాహిత్యంలో లభించే ఒక విచిత్రమైన ఆధారాన్ని గురించి చెప్పుకుందాం. అసురుల క్రతువులు కూడా ప్రాథమికంగా ఇహలోక సంబంధమైనవేనని ఆ ఆధారం సూచిస్తుంది.

రుగ్వేదంలో "ఓ ఇంద్రా! మాయ (మహత్తు) వలన నీవు యజ్ఞ నైవేద్యాన్ని తామే భుజించే మాయావులను లొంగదీశావు. మానవ సంరక్షకుడవైన నీవు 'పిప్రూ' నగరాలను ధ్వంసం చేసి, రుజువర్తనులను చోరుల ధ్వంసకాండ నుండి రక్షించావు."

మాయావులంటే – మంత్ర శక్తులను కలిగినవారు. ఆచరణలో ప్రయోగించే వారు అని అర్థం (మాయ : మహత్తుకు సంబంధించిన శక్తి లేదా కళ). శాయనుడు ఈ పదం అసురులను సూచిస్తుందని వ్యాఖ్యానించాడు. శాయనుని వ్యాఖ్య ఒప్పైనదే. 'రుగ్వేదం'లో మాయ... అసురుల స్వభావమైన శక్తి. వైదిక సంప్రదాయంలో అసురులు యజ్ఞ నైవేద్యాన్ని భుజిస్తారనే కథనం తిరిగి తిరిగి కనబడుతుంది.

"ఒకానొకప్పుడు... దేవతలు, అసురులు ప్రజాపతి నుండి ఉద్భవించి కలిసి మెలిసి ఉండేవారు. అసురులు గర్వమెక్కి "నిజంగా, ఎవరికి నైవేద్యమివ్వాలి? అనే ఆలోచనతో తామే భుజింపసాగారు." శతపథ బ్రాహ్మణంలో ఇది రెండుసార్లు జరుగుతుంది. ఇదే అంశాన్ని స్థిరపరచడానికి శాయనుడు తన రుగ్వేద వ్యాఖ్యలో వాజసనేయి, కౌశితకిసుల ప్రమాణాలను ఉల్లేఖించాడు. 'దేవతలు' అసురులు ఒకరినొకరు అహంకారంతో చూసేవారు అని వాజసనేయి అంటాడు. అసురులు తిరస్కారంగా "మేము ఎవరికి నైవేద్యమివ్వబోము" అని భావించారు. అందుచేత నైవేద్యాలను తామే భుజింపసాగారు. తద్వారా దేవతలను అవమానించారు. అసురులు అగ్నిని జయించి తమకు తామే నైవేద్యాలిచ్చుకొనేవారని కౌశితకిసుడి వ్యాఖ్య.

యజ్ఞ నైవేద్యాలను తామే భుజించడమనే క్రతు సంప్రదాయం చాలా విచిత్రంగా ధ్వనిస్తుంది. ఏమైనా తాంత్రికుల క్రతువులు అలాంటి పద్ధతుల్లోనే ఉంటాయి. వారు మద్యాన్ని సేవిస్తారు. మాంసాన్ని భుజిస్తారు. ఆ ఆచారాలకు వారిచ్చే ప్రాముఖ్యత ఏమైనప్పటికీ 'చార్వాక' పదానికి గుణరత్నుడిచ్చిన వుత్పత్తి అర్థాన్ని (చార్య : తినుట) మనం అంగీకరిస్తే, నైవేద్యాన్ని 'భుజించే' అసురులను చార్వాకులని కూడా పిలవవచ్చును. ఏ రకంగానైనా అసురుల క్రతువులు 'పరలోకత' అనే భావనపై ఆధారపడిలేవని మాత్రం వైదికాధారాలు సూచిస్తాయి... అంటే ఆ క్రతువులు భౌతిక వాద స్వభావం కలవే.

## మొదట్లో సాంఖ్యవాదం

సాంఖ్య తత్వశాస్త్రపు మూలము, వికాసములను గురించిన సంక్లిష్ట సమస్యను గురించి తెలుసుకోకుండా, అసుర దృక్పథాన్ని గురించి గాని, తంత్రవాదాన్ని గురించి గాని విశాలార్థంలో ఉన్న ప్రశ్నలను సంపూర్ణంగా పరిష్కరించలేము. చాలా ఆసక్తికరమైన సూచనలు లభిస్తాయి. వాటి ప్రాముఖ్యతను తేలికగా తీసుకోలేము. సాంఖ్య తత్వానికి కపిలుడు స్థాపకుడని చెబుతారు. అతడు ముందుగా ఈ శాస్త్రాన్ని 'అసురి'కి చెప్పాడట. 'భగవద్గీత' ప్రకారం పంచమావతారం పేరు కపిలుడు. రుషులకు ముఖ్యుడు. 'అసురి'కి అతడు మూలసూత్రాలకు సాంఖ్య వివరణను బోధించాడు. కాల ప్రవాహంలో అది క్షీణించిపోయింది.

అయితే కపిలుడు భగవంతుని అవతారమనే భావన వ్యంగ్యభూయిష్టం. మౌలిక సాంఖ్యవాదంలో భగవంతునికి స్థానం లేదనేది జగద్విదితం. కాని సాంఖ్య జ్ఞానాన్ని తొలుతగా 'అసురి'కి బోధించడమనేది మాత్రం కట్టుకథ కాకపోవచ్చు. అదే విషయాన్ని 'సాంఖ్యకారిక' కూడా చెబుతుంది. "ఈ విశుద్ధా సిద్ధాంతాన్ని రుషి సహృదయంతో అసురికి బోధించాడు. 'అసురి' పంచ శిఖునికి నేర్పాడు. అతని వల్ల విస్తృతంగా ప్రచారమైంది.

'అసురి' – సామాన్యంగా అందరూ భావించినట్లు – ఒకానొక వ్యక్తి పేరై ఉండవచ్చును. అదే సందర్భంలో 'అసురి' అనే పేరు 'అసుర' పదం నుంచి సాధించబడిందంటే మనం కాదనలేము (అసురస్ని అంటే అసుర సంతానము. కనుక 'అసురి' అంటే అసుర పుత్రుడు). ఈ స్ఫురణ గమనించదగ్గది. మరో ప్రాచీన గ్రంథంలో కపిలుడే అసురుడనీ, అందరూ అసురుల వలెనే దేవతలలో పోరాడిన వాడనీ... వర్ణితమైంది. అందుచేత బాధాయనుడు ఇలా అన్నాడు.

ఈ తీర్మాన సందర్భంగా ఈ క్రింది పాఠాన్ని ఉల్లేఖిస్తారు... "వాస్తవంగా ప్రహ్లాదపుత్రుడు కపిల నామధేయుడైన అసురుడు కలడు. దేవతలతో పోరాడుతూ అతడు ఈ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాడు. విజ్ఞుడు వీరిని గణించరాదు."

అయితే ఈ కపిలుడే సాంఖ్య తత్వ స్థాపకుడని ఖచ్చితంగా చెప్పజాలము. అలాగే అది అసంభావ్యమని కూడా చెప్పలేం. పైగా అసురులకాపాదించబడిన భావాలతో, సాంఖ్య అంగీకరించిన మౌలిక ప్రాధాన్యత కల అంశాలు అనేకం ఉన్నవి.

భగవద్గీత అసురుల కాపాదించిన విశ్వదృష్టిని గురించి ఇదివరకే గమనించాము. ప్రపంచం కామ ఫలితం. స్త్రీ పురుష సంయోగం వల్ల జనించింది. 'సాంఖ్యకారిక' పై వ్యాఖ్యానంలో గౌడపాదుడు అదే 'విశ్వదృష్టి'ని ప్రస్తావించాడు.

"స్త్రీ పురుష సంగమం వల్ల శిశూత్పత్తి జరిగినట్లే, ప్రకృతి పురుషుల సంయోగం వలన సృష్టి ఉత్పన్నమవుతుంది." సాంఖ్య ప్రకృతి అంటే ఆదిమ పదార్థమనీ (స్త్రీ కాదనీ). అలాగే పురుషుడంటే ఆత్మ (పుంలింగ భావం కాదని) అనీ అభ్యంతరపెడతారు. సాంఖ్య విశ్వదృష్టికీ, అసుర విశ్వదృష్టికీ గల సామ్యం – దీనివలన – ఎడమై పోతుంది. కాని వాస్తవం అది కాదు. 'పురుష' పదానికి తుదకు ఆత్మ అనే అర్థం వచ్చినప్పటికీ... మొదటి అర్థం అది కాదు. మొదట్లో 'పురుష' అంటే పుంలింగ మానవ శరీరమే ఉపనిషత్కారులు కూడా ఆ పదాన్ని ఈ అర్థంలోనే తీసుకున్నారు. రానడే, బెల్వాల్కర్‌లు ఈ విషయాన్ని సమర్థించారు. ఈ పదాన్ని బ్రాహ్మణాలలోను, ఉపనిషత్తులలోనూ ఉపయోగించిన సందర్భాన్ని పురస్కరించుకొని

వారిలా అన్నారు.” ‘పురుష’ పదం విశిష్ట శరీర నిర్మాణంతో కూడిన మనిషినే సూచిస్తుంది. కాని అందులో నెలకొనియున్న అంతర్గత లేదా ఆధ్మాత్మిక ‘వస్తువు’ను మాత్రం కాదు. (మన తొలి, మలి... ఉపనిషద్గ్రంథాలన్నింటా ఈ ప్రత్యేకార్థంలోనే ‘పురుష’ పదము నుపయోగించబడింది. సాంఖ్య సిద్ధాంతం మొదట్లో నాస్తికము, భౌతికము తర్వాత విపరీతంగా ఆధ్యాత్మీకరించబడింది. భావవాద సారం అంచెలంచెలుగా దీనిలోకి జొనిపారు. చివరికి రూపెత్తిన సాంఖ్యవాదం తొలినాటి సాంఖ్యవాదానికి పూర్తిగా వ్యతిరేకం... (ఈ విషయాన్ని వేరే చోట చర్చిద్దాం). పురుష శరీర భావన నుంచి, వేదాంత దృష్టిలోని ఆత్మభావనకు సమానమైన నిర్లిప్త చైతన్యంగా పరివర్తింపబడటం... ఈ క్రమంలో ఒక అంశం. సాంఖ్య ‘ప్రకృతి’ అంటే భౌతికసత్వం అనే మాట నిజమే. అయితే గమనించనిదేమిటంటే, స్పష్టంగా స్త్రీ లక్షణాలనే ప్రకృతి కాపాదించుచున్న సందర్భం. భట్టాచార్య చెప్పినట్లు ప్రకృతిని నాట్యమాడే బాలికతోనూ, ముగ్ధ వధువుతోనూ పోలుస్తారు. (‘క్షేత్ర’ మొదలైన పారిభాషిక పదాలు సాంఖ్య గ్రంథాలలో ‘ప్రకృతి’ని గురించి చెప్పేటప్పుడు ఉపయోగిస్తారు. వాటికి స్పష్టంగా స్త్రీ పరమైన ప్రాముఖ్యత ఉండి వుండాలి). ఇందుచేత ప్రకృతి అంటే కేవలం భౌతికసత్వమే కాదు. స్త్రీ సత్వం కూడా అని అర్థమవుతుంది. ఈ స్త్రీ సత్వాన్నే, ఆదిమ భౌతిక పదార్థంగా భావించడం ఎలా జరిగిందో (ఆదిమ భౌతిక పదార్థం నుంచే విశ్వ పరిణామం జరిగిందని మొదటి సాంఖ్యవాదం భావిస్తుంది). మనం ఇంతకంటే విస్తృతంగా – సంపూర్ణంగా చర్చించాలి.

మళ్ళీ సాంఖ్య భావాల సమస్యకు వస్తే : ప్రకృతి పురుషుడు అనే పదాలకు మొదట్లో స్త్రీ, పురుషుడు అనే అర్థాలుంటే – ఉన్నట్లు స్పష్టం. మొదటి సాంఖ్యవాదపు విశ్వదృష్టికీ, అసురులకు భగవద్గీత ఆపాదించిన విశ్వదృష్టికీ పెద్ద భేదం లేదనడానికి అనేక హేతువులున్నాయి. అయితే, ఈ విశ్వదృష్టి తంత్రవాద విశ్వదృష్టికి సమానమైనదని మనం అనుకున్నాం. ఇక్కడ మనకు తొలినాటి సాంఖ్యవాదానికి, తొలినాటి తంత్రవాదానికి మధ్య నున్న సంబంధం గురించిన సమస్యలు ఎదురవుతాయి.

సాంఖ్యవాద, తంత్రవాదల్లోని మౌలిక వస్తు వర్గీకరణ ఒకటే నన్నది సందేహించ నవసరం లేదు. అవి ప్రకృతి, పురుషుడు. సాంఖ్యవాద, తంత్రవాదాల రెంటిలోనూ కనీసం విశ్వ క్రమరీత్యా... ప్రకృతి ప్రాథమికమైనది. అందుచేత తంత్ర, సాంఖ్య వాదాలకు... బాంధవ్య ముండి తీరాలి. అయితే సాంఖ్య విషయంలో మారిపోయిన (పరివర్తన చెందిన) భావాల ప్రభావం వల్ల అంటే తొలుత భౌతిక వాదమైన సాంఖ్యను ఆధ్యాత్మిక భావవాదంగా అపార్థం పాలైనందువల్ల ఆధునిక పండితులు ఆ రెంటి మధ్యనున్న సంబంధాన్ని గుర్తించ నిరాకరిస్తున్నారు. పైగా తంత్రవాదం ప్రధానంగా తొలి దశలోని మొరటైన ఆదిమత్వాన్ని – ముఖ్యంగా దాని క్రతు స్వభావంలో నిలబెట్టుకోగలిగింది. తర్వాతి కాలంలో దానికిచేర్చిన... ఆధ్యాత్మిక లేపనం...

ఉపయోగపడలేదు. తంత్రానికీ, సాంఖ్యకూ సంబంధాన్ని ఒకవేళ అంగీకరిస్తే... తంత్రవాదం తన తాత్విక ప్రాతిపదికను సాంఖ్యవాదం నుండి ఎరువు తెచ్చుకుందంటారు. (ఈ ఊహ ఎంత నిరాధారమో తరువాత చెప్పుకుందాం). ఎందుచేతనంటే ఎన్ని ఆధ్మాత్మిక సవరణలు చేరినప్పటికీ సాంఖ్యవాదం, తంత్రవాదంలాగే... నిరాడంబర స్థితి నుండి ప్రారంభమైనదే. నిజానికి పుట్టుకలో తంత్రవాదానికీ, సాంఖ్యవాదానికీ పెద్ద భేదం లేదు. లేదా చారిత్రక క్రమ ప్రకారం ప్రాధాన్యతను నిర్దేశించాలనుకున్నా... తంత్రవాదమే ప్రాచీనమవుతుంది. 'మొదట్లో తంత్రవాదమంటే ఆదిమ ప్రాపంచిక దృక్పథం, దాంతో పాటు ఆదిమ క్రతు సంప్రదాయాలూ కలిసిన సంకీర్ణ సముదాయం. అది చివరకు సహజీవనంచేసే ద్వంద్వంగా మారింది. దీన్నుంచి ఒకవైపు సాంఖ్య చింతన, మరోవైపు యోగ శిక్ష ఉద్భవించాయి. కాలక్రమేణా సాంఖ్యయోగాలు రెండూ భావవాద మార్గం వైపు మళ్ళించబడ్డాయి. తర్వాతి కాలాల్లో సాంఖ్య యోగాల మధ్య ఒక విధమైన సంశ్లేషణం జరిగిన సమయంలో... తంత్రవాదానికీ, సాంఖ్యవాదానికీ మధ్యనున్న సంబంధం – పూర్తిగా స్మృతిలో నుంచి పోలేదు. ఆ స్మృతి హేతుబద్ధం చేయబడింది. అయితే చారిత్రకంగా ఈ వ్యవహారం భిన్నమైన రీతిలో సాగిందని మన వాదం. తంత్రవాదమే తొలి సంకీర్ణ భావ సముదాయం. దాన్నుంచే తర్వాతి కాలంలో సాంఖ్యయోగాలు పుట్టుకొచ్చాయి. అసమానమైన అభివృద్ధి కారణాన, ఆదిమ, ఆటవిక పరిస్థితుల్లో ఉన్న ప్రజలు నాగరిక, నూతన సమాజాలతో ప్రక్క ప్రక్కనే ఉండినట్లే. భావజాల రంగంలో కూడా సాంఖ్య యోగాల లాంటి ఆధునిక తత్వాలతో పాటు ఆదిమ సంకీర్ణతను ప్రతిబింబించే తాంత్రిక విన్యాసాలూ, సంప్రదాయాలూ – వీటి నుంచే సాంఖ్య యోగాలు అభివృద్ధి చెందాయి. మనుగడ సాగించాయి. ఈ విషయాన్ని గురించి మరోసారి.

సింహావలోకనము : అదృశ్యమైపోయిన లోకాయత సమస్య నుంచి అసుర భావాలకూ, తంత్రవాదానికీ చెందిన ప్రశ్నలు పుట్టాయి. తిరిగి ఈ ప్రశ్నల నుంచి సాంఖ్యవాదపు మూలాన్ని సాధించే సమస్య ఎదురైంది. అయితే లోకాయతకూ, సాంఖ్యవాదానికీ ఏమైనా సంబంధముందా? జైన సంప్రదాయాన్ననుసరించి, దానికి సమాధానం 'అవుననే'. ఈ విషయమే దాస్‌గుప్తా చూపెట్టాడు.

"లోకాయత నాస్తికుల దృక్పథం వివరించిన తర్వాత, 'సూత్తకృతాంగ సూత్ర' సాంఖ్యులను గురించి వివరించింది. ఈ సందర్భంలో లోకాయతకూ, సాంఖ్యవాదానికీ మధ్య స్వల్పభేదమే ఉంది. ఎందుచేతనంటే సాంఖ్యులు ఆత్మ ఉనికిని అంగీకరించినప్పటికీ, ప్రకృతి మాత్రమే సర్వ కార్య నిర్వాణా సమర్ధమైనది : ప్రకృతి అంటే శక్యమైన (శక్తి గల) ముడి – మూలకాలకు సమానము. భూతాలు. అందుచేత శరీరమూ, మనస్సు అలా పిలవబడేది... కూడా... ఈ మూలకాల కలయిక మినహా వేరేమీ కాదు. ప్రత్యేక పురుష భావాంగీకారము

నామమాత్రమే. అలాంటి ఆత్మ ఏమీ చేయజాలదు. దానివలన ప్రయోజనము లేదు. కనుక లోకాయతులు దాని ఉనికిని తిరస్కరిస్తారు" జైన గ్రంథాలు చూపెట్టే ఈ సంబంధం – సాంఖ్య, లోకాయతలు మధ్య – కొంచెం చిత్రంగానే కనబడుతుంది. దీనికి ఒక కారణం, బహుశా మనం లోకాయతపై మాధవాచార్య వర్ణనపై ఆధారపడటం (ఇది తప్పే). రెండో కారణం మౌలిక సాంఖ్యవాద భావాలను ఇంకా సమకూర్చుకోలేకపోవడం. ఏమైనా, మనం తలపెట్టిన వాదం ప్రకారం లోకాయతకూ, సాంఖ్యవాదానికీ మధ్య నున్న సన్నిహిత సంబంధం ఏమీ వింత కాకపోగా, ఊహించతగిందే. లోకాయత అంటే మొదట్లో తంత్రవాదమని స్థూలంగా పిలవబడే గుప్త విశ్వాసాలో, సంప్రదాయాలో అయి వుండవచ్చును. తంత్రవాదము, తొలి సాంఖ్య వాదంతో మౌలిక సామ్యాలు కలిగి ఉన్నట్లు ఆధారాలున్నాయి. ఏది ఏమైనా తొలి సాంఖ్యవాదానికి సంబంధించిన సమస్యలోకి చొరబడకుండా, లోకాయత సమస్యను సరిగా అర్థం చేసుకోలేము. ఆ పైన తంత్రవాదపు మూలాన్ని గురించిన చర్చ లోకాయతపైనా, సాంఖ్యవాదం పైనా నూతన కాంతిని ప్రసారం చేయవచ్చును. అందుచేత మనము ఒక ప్రాథమిక ప్రశ్న వద్దకు చేరుకుందాం. అసలు మౌలిక తంత్రవాదం అంటే అర్థమేమిటి? (ఈ ప్రశ్నలు 'తంత్రవాదం' అధ్యాయంలో చర్చించాము). తంత్రవాదమంటే మనకున్న సామాన్యాభిప్రాయానికి విరుద్ధంగా, తంత్రవాదం భారతీయ తత్వ సంప్రదాయంలో సహజ (ప్రాకృతిక) ధోరణిని అది ప్రతిబింబించింది. దానికి ప్రత్యేకమైన ప్రజాస్వామ్య లక్షణముంది. సాంప్రదాయకంగా చులకన చేయబడిన వృత్తులకూ, కళలకూ (చేతి పనులకు)... అనుబంధింపబడి ఉన్నందున దాన్ని నిరంతరం అపార్థం చేసుకోబడటం జరిగింది. ప్రాచీన చైనాలోని టావో వాదంతో దానికి గాఢమైన పోలికలున్నాయి. నిజానికి టావో వాదానికి, తంత్రవాదానికీ ఉన్న పోలికలు మౌలికమైనవని జోసెఫ్ నీధాం పరిశోధనలు రుజువు చేస్తాయి. అందుకనే ఈ అంశాన్ని ఇప్పుడు సక్రమంగా అర్థం చేసుకోగలుగుతున్నాం. ప్రాచీన టావో వాదపు ప్రాముఖ్యతను నీధాం విశ్లేషించిన పద్ధతిలోనే మన ప్రాచీన తంత్రవాదంలోని గుప్తత మనకు స్పష్టంగా అర్థమవుతుంది. ఇక్కడ మాత్రం మనం తంత్రవాదం, లైంగిక సంయోగానికిచ్చిన ప్రాముఖ్యతను గురించి మాట్లాడుకుందాం.

## లైంగిక చర్యలు క్రతువులు

లోకాయతికులు నిర్ణీత సమయాలలో లైంగిక విశృంఖలతను పాటించేవారని గుణరత్నుడంటాడు. ఇది తంత్రవాదపు వామాచారి తత్వ సంప్రదాయంగా పిలవబడే దానికి ప్రస్తావన. 'వామ' అంటే స్త్రీ. బహుశా 'కామం' కూడా కావచ్చు. తంత్రవాద సందర్భంలో రెండర్థాలూ ఉన్నాయి. తంత్రవాదమంటే స్త్రీ కేంద్రంగా, అలాగే కామక్రీడ కేంద్రంగా... జరిగే ఆచారం (సంప్రదాయం). 'వామాచారానికి' ఆపాదించబడే అర్థం – వామహస్త సంప్రదాయం – అపార్థానికి దారి తీస్తుంది.

ఆధునిక విద్వాంసులలో తంత్రవాదానికి సంబంధించిన ఈ అంశం విపరీతమైన జుగుప్స రేపిందనేది నిర్వివాదం. తంత్రవాదాన్ని గురించి రాస్తూ రాజేంద్ర మిత్రా దీన్ని ప్రస్తావించాడు.

"…. సిద్ధాంతాలు వల్లించబడ్డాయి… దానికి అనుబంధంగా నిర్వర్తించబడే సంప్రదాయాలు (ఆచరణలు) మాన హైన్యతకు పరాకాష్ట. జుగుప్సాకరం, ఘోరం. వాటితో పోలిస్తే గత శతాబ్దానికి చెంది "హోలివెల్ వీధి సాహిత్యం"లోని పదాలూ, నమూనాలు… చాలా శుభ్రమైనవిగా కనబడతాయి."

"ఈ విషయాలను బహిరంగంగా చర్చించాలంటే మానవ నాగరికతా పరిమితులను దాటాలి. బహుశా భారత శిక్షాస్మృతిని ధిక్కరించే నేరం చెయ్యాల్సి వుంటుంది అన్నాడు హెచ్.పి. శాస్త్రి. ఈ వామాచార కారణంగానే తంత్రవాదాన్ని "హైందవ తత్వపు నీచ భాగమని" క్రూక్ వర్ణించాడు.

ఆధునిక నైతిక విలువల దృష్ట్యా అంచనా వేస్తే, తంత్రవాదంలోని అధిక భాగం దుర్మార్గంగానూ, అసంబద్ధంగానూ కనబడుతుంది. అయినా ఒక తీర్పు ప్రకటించి చేతులు దులిపేసుకోగూడదు. తంత్రవాద స్వభావాన్ని ఇంత నీచమొనరించిన వక్రతకు చిహ్నం కాజాలదనేది వాస్తవం. ఇందుకు కనీసం రెండు ముఖ్య కారణాలున్నాయి.

మొదటిది : పలుమార్లు సక్రమంగా చెప్పబడినట్లు, భారత సంస్కృతీ పరిణామంలో తంత్రవాదం, చాలా శక్తివంతమైన అంశాలలో ఒకటి. అందుచేత మనలను మనం ఒక వికృతమైన జాతిగా లెక్కించకుండా తంత్రవాదాన్ని మాత్రమే వక్రమైనదిగా చూడలేము. మన సున్నితమైన భావాలనలా ఉంచితే, అలా తీర్మానించడం శాస్త్రీయంగా అసంబద్ధం. కేవలం నైతికమైన అసహ్యాన్ని మాత్రం ఆధారం చేసుకుంటే ఈ విచిత్రమైన విశ్వాసాలకు, సంప్రదాయాలకూ ఆపాదించుకున్న తొలి ప్రాముఖ్యతను గుర్తించలేము. అలాంటి ప్రాముఖ్యత సాధ్యమనిపిస్తుంది. పురోగతి చెందిన మన జ్ఞాన, నైతిక విలువల నేపథ్యంలో కామం వికృతంగా వ్యక్తీకరణ చెందుతున్నట్లు కనబడినా, మన పూర్వీకులు అతి ముఖ్యమైన దానిగా పరిగణించిన తంత్రవాదపు వామాచారం వికృతమైనది కాకపోవచ్చు. మన ప్రాచీనులకు అలాంటి అసంబద్ధ విశ్వాసాలెందుకుండేవో తెలుసుకోవలసిన అగత్యముంది. అప్పుడే ఇప్పుడు మనమున్న స్థితికెలా ఎదిగామో అర్థమవుతుంది.

రెండో వాదం : ఇంతకంటే స్వల్పమైనదేమీ కాదు. దాన్ని మరింత విస్తృతంగా చర్చిద్దాం. క్రతు సంబంధిత లైంగిక సంయోగం, కేవలం వికృత స్వభావము కలది కాదని చెప్పడానికి భారతీయ సంస్కృతలోని ముఖ్య ధోరణిలో మనకాధారం లభిస్తుంది. వైదిక

సంప్రదాయంలో ఇవే. లేదా ఇలాంటి విశ్వాసాల - సంప్రదాయాల గాఢమైన జాడలు కనబడతాయి. నిజానికి వైదిక సాహిత్యం నిండా ఇవే. ఆధునిక భారతీయ సంస్కృతీ ప్రతినిధులు అలాంటి అవమానకరమైన విశ్వాసాల నుంచీ, సంప్రదాయాల నుంచీ ఆర్య పితామహులను రక్షించాలనే ఉత్సాహంతో, ఈ సాక్ష్యాలను కప్పిపెడతారు. మన ప్రాచీన వారసత్వపు అద్భుత గాథలతో మనలను మనం భ్రమింప చేసుకోవడం కంటే వాస్తవాలను పరిశీలించడం ఎంతో అవసరం. అందుచేత వైదిక సాహిత్యంలోని కొన్ని భాగాలను చదివి అర్థం చేసుకో ప్రయత్నించెదము గాక! ఈ క్రిందిది, ఛాందోగ్యోపనిషత్‌లోని 'వామదేవ్య సామం'.

"ఒకరు ఆజ్ఞాపిస్తారు - అది హింకారము

అతడు వేడుకుంటాడు - అది ప్రస్తావము

స్త్రీతో సహా అతడు పండుకొనును - అది ఉద్గీథ

అతడామెపై పరుంటాడు - అది ప్రతీహారము

అతడు అంత్యానికి చేరుకుంటాడు - అది నిదానము

అతడు అంత్యాన్నందుకుంటాడు - అది నిదానము.

ఇది సంభోగముపై అల్లిన 'వామదేవ్యసామం'

ఆ విధంగా సంభోగముపైన అల్లిన 'వామదేవ్యసామం' తెలిసినవాడు సంభోగాన్ని సాధించుతాడు. ప్రతి సంభోగంలోనూ తనను పునస్సృష్టించుకుంటాడు. దీర్ఘాయువౌతాడు, సంతాన విషయంలోను, పశు సంపద విషయంలోనూ గొప్పవాడవుతాడు. కీర్తి గడిస్తాడు. ఏ స్త్రీనీ నిరాకరించరాదు. ఇది సూత్రము."

సామం అంటే వేదపఠనం. వైదిక రుషులు ఈ ఆచారానికి విశేష ప్రాముఖ్యతనిచ్చారు. హింకారము, ప్రస్తావము, ఉద్గీథ మొదలైనవన్నీ పంచపాది సామంలో ఐదు భాగాలు, సంభోగంలోని వివిధ దశలను వేదపఠనంలోని ఐదు దశలతో సమానం చేయడం వలన ఉపనిషత్కారుడు సంభోగ దశలకు అధిక ప్రాముఖ్యతనిచ్చినట్లు స్పష్టమవుతుంది. ఆనాటి వెనుకబడిన పరిస్థితుల ప్రమాణాల నుంచి చూస్తే లైంగిక కార్యఫలితంగా వచ్చే ఊహించిన ప్రయోజనాలు బ్రహ్మాండమైనవి. ప్రతి సంభోగంలోనూ తనను పునస్సృష్టి చేసుకుంటాడు. దీర్ఘయువౌతాడు. సంతానం, పశువులు.... అధికమవుతాయి. కీర్తివంతుడవుతాడు." పశువుల ప్రస్తావన గమనించదగ్గది. ఉపనిషత్తుల కాలం వరకూ, భౌతిక సంపదకు ప్రమాణం పశువులే. పునరుత్పత్తిని, ఉత్పత్తికి భిన్నంగా చూడజాలని విశ్వాసం గురించి ఉపనిషద్భావుకుడు విస్తరించి చెపుతున్నాడన్నమాట. కామం –అంటే లైంగిక సంయోగం – అర్థానికి (పశువుల) సహాయకారిగా (అంటే భౌతిక సంపదకు సహాయకారిగా కూడా) ఊహించబడింది. ఆధునికులు ఏమని

వ్యాఖ్యానించినా 'ఏ స్త్రీని తిరస్కరించకూడదు. ఇది సూత్రం' అని చెప్పడం, ఈ ప్రాచీన విశ్వాసపు కోణం నుంచి చూస్తే తెలివైన మాటే అవుతుంది.

ఉపనిషత్తులను 'వేదాంత'మంటారు. అంటే వేదాలకు చివరివి అని అక్షరార్థం. కాలగమన క్రమంలో .. రెంటికీ మధ్య శతాబ్దాల వ్యవధి ఉన్నా ఎలాగో, ఉపనిషత్తులు వేదాలకు అనుబంధంగా చేయబడ్డాయి. వేదాలకూ, ఉపనిషత్తులకూ మధ్య ఈ సంబంధం కృతకంగా ఏర్పడిందే. అయినా ఉపనిషత్కారులు. తమ పూర్వీకులైన వైదిక ప్రజల అనుభవాలకు, భావాలకు, విశ్వాసాలకు తాత్విక స్థాయి కలుగజేస్తున్నారు. విలక్షణమైన నిరంతర మౌఖిక సంప్రదాయాధారాల వలన వేదాలు వారికి (ఉపనిషత్కారులకు) అందాయి. ఛాందోగ్యోపనిషత్ లోని 'వామదేవ్యసామం' అలా వచ్చిందే. ఇలాంటి విశ్వాసం మన 'సంహితల'లో కూడా లభిస్తుంది. ఉదాహరనకు 'అథర్వ వేదం'లో లైంగిక సంయోగం అరణిలో అగ్ని పుట్టించడంతో సమానంగా ఊహించబడింది. (రెండు కొయ్యముక్కల (అశ్వత్థము; శమీ) రాపిడి నుంచి అగ్నిని జనింపచేయడం) "అశ్వత్థము, శమీని అధిరోహించింది; పురుష శిశువు ఉత్పన్నమైనది. వాస్తవంగా, కుమారుని సాధించే మార్గమదే; అదే మనం మన భార్యలకు చేయు క్రియ."

అయితే, పురుష శిశువును పొందుటకై చేసే క్రతు సందర్భంగా ఈ శ్లోకాన్ని పఠిస్తారు. కాని సంభోగ కార్యాన్ని, అగ్నిని మథించే ప్రయత్నంగా ఊహించడం... విశిష్టమైన ప్రాధాన్యత కల అంశం. ఎందుచేతనంటే అగ్ని కోసం మథించే చర్య, తొలి వైదిక ప్రజల యజ్ఞ నిర్వహణలో అతి ప్రధానమైన భాగం. 'వాజసనేయి సంహిత' ప్రకారం లైంగిక కార్యము (దాంతో పాటు) వర్ణనా సంభాషణలు అశ్వమేధ యజ్ఞంలో ముఖ్యాంశం – ఇది ప్రసిద్ధమే.

ఇక్కడ మనకు వైదిక క్రతువులు – యజ్ఞాల – సమస్య ఎదురవుతుంది. తొలి నాటి వైదిక ప్రజలు యజ్ఞాలను ఉత్పత్తి కార్యానికి – చర్యలకు – సహాయకారిగా – లేదా సాధనాలుగా – యజ్ఞాలను గురించి తలపోశారని తర్వాత తెలుసుకుంటాం. వైదిక విశ్వాసాలతో యజ్ఞ క్రమమూ, లైంగిక సంయోగ క్రమమూ, పరస్పరం విడదీయరానంతగా కలిసి ఉన్నాయనేది మనం ముఖ్యంగా గమనించాల్సిన విషయం. యజ్ఞాన్ని అర్థం చేసుకున్న క్రమమూ, దాన్ని నిర్వహించిన క్రమమూ... లైంగిక సంయోగ క్రియా రూపాలతోనే సాగిపోయేవి. 'సంహితలకూ', 'ఉపనిషత్తులకూ' మధ్య కాలంలో వచ్చిన క్రతు సంబంధ గ్రంథాలైన 'బ్రాహ్మణాల'లో ఇందుకనేక ఆధారాలు దొరుకుతాయి.

"ఏ ఆధారమూ లేదని తలపోసిన వాడు నేతిముద్దను నైవేద్యంగా సమర్పించాలి; ఈ భూలోకంలో తనకాధారం లేదని గుర్తించినవాడు ఆధారం లేదని గుర్తించినవాడే. ఘృతము స్త్రీ క్షీరము (రక్తము), వరిగింజలు అతనివి; జతకూర్చుట అంటే అదే; నిజంగా అలా

జతకూర్చడంలోనే అతడు తన సంతానముతోను, పశువులతోనూ తరాల వరకు వృద్ధి చెందుచున్నాడు; ఇది తెలిసినవాడే అలా సంతానముతోనూ, పశువులతోనూ... వ్యాప్తి చెందుచున్నాడు."

"ఆధారములేని" అంటే "సంతానమూ, పశువులూ లేని" అని... వ్యాఖ్యాతల భాషణము. ఇందుకు సూచించిన పరిష్కారము క్రతు విధానముగా నేతినీ, వరి విత్తనాలనూ మిశ్రణము చేయుట, ఈ క్రమము లైంగిక సంయోగానికి చిహ్నం. నేయి స్త్రీ రక్తానికీ, విత్తనాలు పురుష శుక్లానికీ ప్రతీకలు. స్త్రీ రక్తం, పురుష శుక్లంతో కలసినప్పుడు శిశూత్పత్తి జరుగుతుందని ప్రాచీన విశ్వాసము. జత కూర్చడమంటే అర్థం ఇది. ఇక్కడ గుర్తించాల్సిన ముఖ్యాంశము. ఈ క్రమము వల్ల సంతానమే కాక, పశువుల వృద్ధి కూడా జరుగుతుందనే ఊహ; ఆ విధంగా 'ఆధారం లేని స్థితి'ని తొలగించడం సాధ్యమవుతుందని అర్థం.

ఈ పాఠభాగం సోమయజ్ఞ సందర్భంగా, 'ఐతరేయ బ్రాహ్మణం'లో ఉంది. మిగతా యజ్ఞాల సందర్భంగా లభించే పాఠభాగాల్లో కూడా లైంగిక కార్యానికి వారిచ్చిన అఖండ ప్రాముఖ్యత స్పష్టంగా కనబడుతుంది.

"మీ అగ్నిదేవుని వైపు కదలండి" – అని అనుష్టుప్పు – వేద పద్య విశేషము – అతడు రెండు (పద్య) పాదాలను విడదీస్తాడు; అందుచేత స్త్రీ తన తొడలను విడదీస్తుంది. చివరి రెండు పాదాలనూ సృష్టిస్తాడు. అందుచేత పురుషుడు తన రెండు తొడలనూ దగ్గర చేరుస్తాడు. అది జతకూర్చడం. నిజంగా... దైవస్తోత్రానికి ముందుగా ఈ జత కూర్చడం చేస్తాడు. (సంతాన వృద్ధికై) సంతానంతోనూ, పశువులతోనూ... వ్యాప్తి చెందుతాడు."

'కౌసితకి బ్రాహ్మణం'లో ఇంచుమించు ఇదే... పునశ్చరణమైంది.

"అతడప్పుడు' 'సప్తపాద ఆజ్య' పఠించాడు. అది అనుష్టుప్పు ఛందస్సులో వుంది; అనుష్టుప్పు వాచకము; అతడుచ్చరించిన దెల్లా – అనుష్టుప్పులో – పొందగలడు. రెండు పాదాలను – పద్య పాదాలను – విడదీస్తాడు. అది సృష్టికి చిహ్నం. అతని భార్య (శరీర భాగాల) వలె, వాటిని విడదీస్తాడు. ఆపైన, అలా విడదీయడమే ఆధారానికి చిహ్నం."

'శతరుథ బ్రాహ్మణం' లైంగిక సంయోగ ప్రాముఖ్యతను ప్రతీకలతో (కొన్ని సందర్భాలలో ప్రత్యక్ష వర్ణనలతో) ఉగ్గడించిన సందర్భాలు అనేకం.

'బ్రాహ్మణాల' తర్వాత 'ఉపనిషత్తులు' వచ్చాయి. ఉపనిషత్తులు కూడా ఈ సంప్రదాయాన్ని దైవదత్తమైన జ్ఞానంగానే పరిగణించడం గమనించవచ్చును – యజ్ఞాన్ని, లైంగిక కార్యంతో సమానమైనదిగా స్వీకరించడం, 'చాందోగ్య, బృహదారణ్యక' ఉపనిషత్తులు రెంటిలోనూ... ఈ క్రింది వృత్తాంతముంది.

"పాంచాల సభకు శ్వేత కేతు అరుణేయుడు వెళ్ళాడు. ప్రవాహణ జాబాలి అతనిని అడిగాడు. "నీ తండ్రి నీకు విద్య గరిపాడా?" శ్వేత కేతు అవునన్నాడు. అతని జ్ఞానాన్ని పరిశీలించడానికి జాబాలి ఐదు ప్రశ్నలు వేయగా, ఒకదానికీ సమాధానమీయలేకపోయెను. శ్వేతకేతు అసంతృప్తంగా తండ్రి గౌతముని వద్దకు వెళ్ళాడు. గౌతమునికి కూడా ఆ ప్రశ్నలకు సమాధానం తెలియదు. ఆ ప్రశ్నల సమాధానం తెలుసుకుని జ్ఞాన వికాసం పొందాలని అతడే జాబాలి వద్దకు వెళ్ళాడు. ప్రాథమిక శిక్షణలలో జ్ఞాన సముపార్జన తర్వాత, ఆ ప్రశ్నలకు సమాధానాలు పొందాడు. ఆ ప్రశ్నలలో ఒకటి : "పంచమ నైవేద్యంలో, నీటికి మానవ స్వరమెలా వస్తుందో నీకు తెలుసా?" చివరికి దానికిచ్చిన సమాధానమిది.

"గౌతమా! మానవుడు వాస్తవంగా యజ్ఞాగ్ని, ఈ సందర్భంలో వాక్కు ఇంధనం, ఊపిరి ధూమం; నాలుక జ్వాల; కన్నులు బొగ్గులు; కర్ణములు నిప్పు రవ్వలు.

ఈ అగ్నిలో దేవతలు ఆహారాన్ని నైవేద్యమిస్తారు. ఈ నైవేద్యం నుంచి శుక్లం ఉద్భవిస్తుంది.

ఓ గౌతమా ! స్త్రీ... నిజంగా... హవనాగ్ని. ఈ సందర్భంలో జననాంగం ఇంధనం; ఉచ్చాటన చేస్తే ధూమం; యోని జ్వాల; జౌనుపుట బొగ్గులు; లైంగిక సుఖము, నిప్పురవ్వలు.

ఈ అగ్నిలో దేవతలు శుక్లాన్ని అర్పిస్తారు. ఈ నైవేద్యం నుంచి పిండోత్పత్తి. ఆ విధంగా పంచమ నైవేద్యానికి మానవ స్వరం లభిస్తుంది.

లోపల పదిమాసాలు – లేదా ఏదో కొంతకాలం – పొరలో విశ్రమించిన తర్వాత జన్మిస్తాడు."

ఔపనిషధిక తత్వవేత్తలు మానవోత్పత్తి క్రమాన్ని ఇలా గమనించారని విశదమవుతుంది. బృహదారణ్యకోపనిషత్ ఈ అంశాన్నింకా పొడిగించింది. వివరాల జోలికి మనం వెళ్ళనవసరం లేదు.

మనం తిరిగి లోకాయత సంప్రదాయంలోని వామాచార సమస్య వద్దకు వెళదాం – లోకాయతను స్థూలంగా తంత్రవాదం అనే భావనతో. ప్రాథమికంగా వైదిక సంప్రదాయ వారసులమని తర్వాతి కాలంలో చెప్పుకున్నవారు తంత్రవాదాన్ని అసహ్యించుకుని తిరస్కరించడానికి కారణం ఈ వామాచారమే. అలాంటి దృక్పథం ఎలా సమర్థనీయం కాదో... మనం విశదీకరించాం. పైగా ఈ లైంగిక సంయోగానికి కేవలం వికృత లక్షణం కాక, వేరే కారణం వలన విశిష్టతనాపాదించారని (మొదట్లో) వైదిక సాక్ష్యం... విశదం చేస్తుంది... లేనట్లయితే ప్రాచీన రుషులు లైంగిక సంయోగాన్ని సామానికి (వేద పఠనకు) యజ్ఞానికి

సమానం చేసేవారు కాదు. మన సమస్య ప్రాచీనులను అర్థం చేసుకోవడం; అలాగే ఈ విచిత్రంగా కనబడే విశ్వాసాలకూ, భావాలకూ ఇంత ప్రాముఖ్యత నివ్వడానికి వారిని ప్రేరేపించిందేమిటో తెలుసుకోవడం. ఇది తెలుసుకోవాలంటే సంప్రదాయ పద్ధతికి భిన్నమైన మార్గాన్ని ఎన్నుకోవాలి. సంప్రదాయ పద్ధతి దీనిని వివరించజాలదు.

## వేదం - లోకాయత

తర్వాతి కాలపు వైదిక సంప్రదాయ రక్షకులు వామాచార కారణంగా తంత్ర వాదాన్ని తిరస్కరించడం ద్వారా, వారు తమ గతాన్ని కూడా కాదనుకుంటున్నారని మన వాదం. నిజానికి, అవే – ఇంచుమించు అలాంటి – విశ్వాసాలు తొలి వైదిక సంస్కృతిని గాఢంగా ప్రభావితం చేశాయి.

వైదిక సాహిత్యాలలో అలాంటి విశ్వాసాలూ, భావాలూ లభించినప్పటికీ, అవి ఆదిమ భావాలే; బహుశా అవన్నీ (మరీ) ఆదిమ తెగల వారి భావాలై వుండవచ్చు. వైదికార్యులు వారితో సంపర్క మేర్పరచుకున్నప్పుడు వైదిక దృక్పథం ఆ ఆదిమ విశ్వాసాలతో సంకరమైంది. ఈ విధంగా తర్కించే వాదమొకటుంది. ఈ వాదానికి ఆధునిక విద్వాంసులు చాలామంది వెంటనే అంగీకరిస్తారు. వైదిక ప్రజలు స్వేచ్ఛగా ఆ ప్రాంతపు ఆదిమ జాతివారి విశ్వాసాలను, భావాలనూ స్వేచ్ఛగా ఎరువు తీసుకున్నారనీ, ఆ కారణం వలన వైదిక దృక్పథంలోకి ఆదిమాంశాలు ప్రవేశించాయనీ... చెప్పే సిద్ధాంతానికి ఆ విద్వాంసుల సానుభూతి అపారం. భారతీయ సంస్కృతిలో ఆర్య, అనార్యాంశాలు... అద్భుతంగా జతకట్టాయని అనేకసార్లు చెప్పబడింది. ఈ సిద్ధాంతాన్ని భావ స్వీకార, లీన సిద్ధాంతమని పిలుద్దాం.

ఈ సిద్ధాంతానికి అనేక ప్రతిబంధకాలున్నాయి. అందులో మూడు అభ్యంతరాలను చెప్పుకుందాం. మొదటి రెండూ... ఈ సిద్ధాంత అసంభావ్యతకు సంబంధించినవి. మూడోది : అలాంటి భావలీనత – అంటే వామాచార సంప్రదాయానికి చెందిన అంశాలు వైదిక సాహిత్యంలో లీనం కావడం – కున్న అసంభావ్యతను సూచించేది.

**మొదటిది :** అలాంటి విశ్వాసాలూ, భావాలూ... ఆదిమ ఆలోచనా సరళికి చెందినవనుకుంటే అవి వైదిక ప్రజల ఆదిమ గతావశేషాలు – జాడలు – అయి వుండవచ్చును గదా! ఆదిమ గతం వైదిక ప్రజలకు ఉండి వుండాలి. వైదిక సాహిత్యంలో 'ఆదిమత్వం' ఉన్న అంశాలన్నీ సమకాలీన ఆదిమ జాతివారి నుండే సంక్రమించి ఉండజాలదు.

**రెండోది :** పరిభాషలు జాతి (వంశం – తెగ) గతం. సాంస్కృతిక పరమైన మార్పిడి... క్రమం అస్పష్టంగా, కొన్ని సందర్భాలలో విచిత్రంగా జరుగుతుంది. సిద్ధాంతాలు చూస్తే సంస్కృతికి

సంబంధించిన... అరకొర జ్ఞానం నుంచి వచ్చాయి. భావాలనూ, విశ్వాసాలనూ... ఎవరికైనా సరిపడే దుస్తుల్లాగా చూడటం జరుగుతోంది.

సాంస్కృతిక వ్యాప్తిని గురించిన సిద్ధాంతం గురించి ఎక్కువగా వినవస్తోంది. ఈ సిద్ధాంతాన్ని ఇంకా సమగ్రపరచాల్సి వుంది. ఈ లోపున, థాంప్సన్ చెప్పినట్లు... దాని ప్రాముఖ్యతను గురించి విస్తారం చేసే ప్రమాదముంది. "సామాజిక వ్యవస్థల – దేశీయం – తద్భిన్నం – విధి ప్రత్యేకావసరాలకు సమాధానం సాధించడం కనుక ఫలానా ఆచారం పరదేశాన్నుండి ఎరువు తెచ్చుకొన్నారనడంతో ఆ ఆచారాన్ని గురించి వివరించనిట్లు కాదు. ఫెర్గుసన్ అన్నట్లు 'తనకు తానే సృష్టించుకోవలసిన పరిస్థితి ఉన్నప్పుడే ఒకజాతి వేరే చోట నుండి (ఏ ఆచారాన్నైనా) అరువు తెచ్చుకుంటుంది.

ఆ విధంగా భారత సంస్కృతిలో ఆర్య, అనార్య... అంశాల మిశ్రణం జరిగిందనే సిద్ధాంతం ఎప్పటికైనా స్థిరపడితే... ఒకరి దగ్గర మరొకరు (భావాలు) అరువు తెచ్చుకోవలసిన భౌతికావసరాల సమగ్ర పరిజ్ఞానం ద్వారా మాత్రమే స్థిరపడుతుంది. వాస్తవంగా అలాంటి అవసరం ఎంతవరకు కలదనే సమస్యను విస్తృతమై చారిత్రక పరిశోధనలు మాత్రమే నిర్ణయించగలవు. అయితే అలాంటి పరిశోధనలకుపక్రమించే ముందే, భౌతికావసరం అనేదాన్ని గురించి స్థూల సిద్ధాంత అవగాహన స్పష్టంగా ఉండాలి.

సంస్కృతికి స్వయం ప్రతిపత్తి లేదు. అదేదో గాలిలో తేలియాడే వస్తు విశేషం కాదు, అలాగే దాన్ని ఇష్టం వచ్చిన జీవిత సరళికి అనుబంధించలేము. దీనికి సాదృశ్యం, చారిత్రక భౌతికవాదం చెప్పే ఉపరితల నిర్మాణం.

"భావాలు, ఊహలు, చైతన్యం... వీటి ఉత్పత్తి ప్రాథమికంగా మానవ భౌతిక చర్యలతోనూ, సంపర్కంతోనూ, వాస్తవ జీవన భాషతోనూ. పెనవేసుకుని ఉంటుంది. నీతి, మతం, తత్వశాస్త్రం, మిగతా భావజాలం, తత్సంబంధమైన చైతన్యరూపాలు.. ఆ విధంగా స్వతంత్ర అస్థిత్వానికి నోచుకోవు. వాటికి చరిత్ర లేదు, అభివృద్ధి క్రమం లేదు. కాని మానవులు... భౌతికోత్పత్తినీ, భౌతిక సంపర్కాన్నీ అభివృద్ధి చేసుకునే క్రమంలో... తమ వాస్తవికమైన మనుగడకు అనుగుణంగా తమ ఆలోచనా విధానాన్ని, ఆలోచనా ఫలాన్ని... మార్చుకుంటారు" – (మార్క్స్ – ఎంగెల్స్ : జర్మన్ భావజాలం).

ఈ సామాన్య కారణాలు అలా వుండగా, వైదిక సాహిత్యంలో లైంగిక క్రియ కిచ్చిన అమితమైన క్రతు ప్రాముఖ్యతను ఆ సాహిత్యంలో లీనమైన అనార్య విశ్వాసంగా పరిగణించరాదనడానికి ఒక కచ్చితమైన ముఖ్య హేతువు కలదు. ఈ అంశాలు కనిపించే వైదిక ఆలోచనా నిర్మాణ వ్యవస్థ తాంత్రిక ఆలోచనా నిర్మాణ వ్యవస్థకు పూర్తిగా భిన్నమైనది. వైదిక ప్రజలు లైంగిక కార్యం తమ భౌతిక సంపదను వృద్ధి చేస్తుందని విశ్వసించారు. ఈ భౌతిక సంపదను ప్రాథమికంగా పశువుల రూపంగా పరిగణించారు. అంటే వైదిక భావాలు,

ప్రబలంగా పశుపోషక జనం భావాలన్న మాట. ఇందుకు విరుద్ధంగా తంత్రవాదపు వామాచారం భౌతిక సంపదను వ్యవసాయోత్పత్తుల రూపంలో ఊహిస్తారని మనం చూడబోతున్నాం. అయితే లైంగిక కార్యం సంపదను వృద్ధి చేస్తుందనే నమ్మకమే వారికి కూడా ఉంది. అంతే తంత్రవాదుల భావాలు వ్యవసాయ సమాజానికి చెందినవి.

ఈ సందర్భంలో లోకాయతికులు కూడా వ్యవసాయానికున్న విశేష ప్రాముఖ్యత పక్షంగానే ఆలోచించారని చెప్పడానికి ఆధారాలున్నాయని గమనించాలి. 'లోకాయత' అనే పదమే దీన్ని సూచిస్తున్నట్లు వ్యాఖ్యానించుకోవచ్చును. అదిలోక, అయత. అయత అనే పదాన్ని 'అ' 'యత్' 'అ'... ల నుంచి సాధించవచ్చును. దానికి సరియైన అర్థం 1. కృషి సలుపుట (యత్). మోనార్ విలియమ్స్ ఇలా చూపాడు. "ప్రాచీన గ్రంథాలలో 'లోక' పదం 'ఉ' స్వరారంభంతో ఉండేది. అంటే 'ఉ' అనే అచ్చు 'లోక' పదానికి ముందుండేది. 'ఉలోక' పదం 'లోక' పదానికి తత్సంబంధమైన ప్రాంతీయ రూపం. మరికొందరు 'ఉ–లోక' పదం 'ఉరు' లేదా 'అవ–లోక' సమాసానికి సంగ్రహరూపం. అంటే అర్థం 'విడి లేదా బహిరంగ ప్రదేశము' ఇంకా 'లోక' అనే ఈ పదాన్ని లాటిన్ 'లూకస్' పదంతో పోలి వుంది. మొదట్లో దాని అర్థం 'అరణ్యాన్ని కాళీ చేయుట' అని అర్థం. అలాగే లిథూనియత్ 'లౌకాన్' అంటే పొలము."

లోకాయతికులు సక్రమ మార్గంలో (అయతా) అడవిని నరికి వ్యవసాయం కోసం భూమిని తయారుచేయడానికి కృషి చేసేవారేనా (లోక)? ఏమైనా 'బృహస్పతి సూత్ర' 'ప్రబోధ చంద్రోదయం'ల ప్రకారం లోకాయతికులు 'వర్త'ను అధిక ప్రాముఖ్యం గల దానిగా పరిగణిస్తారు. 'వర్త అంటే ప్రాథమికార్థం 'వ్యవసాయం'. తంత్రవాదపు 'వామాచారం' వ్యావసాయిక జనుల విశ్వాసాల్లో భాగమైతే, ఈ దృష్టి నుంచి కూడా తంత్రవాదమూ, లోకాయతా... ఒకటే అన్న మన సిద్ధాంతానికి బలం చేకూరుతుంది.

వైదిక సాహిత్యపు క్రతు లైంగికతకు మరో లక్షణం... విపరీతంగా విస్తరించిన పురుషాధిక్యతా భావాలు. ఉదాహరణకు 'బృహదారణ్యకోపనిషత్తు' ఈ వ్యవహారాన్నంతా పురుష దృక్పథం నుంచే చూసింది. స్త్రీని లొంగదీయడానికీ, అవమానించడానికీ తీవ్రమార్గాలను సూచించడానికిది సందేహించలేదు.

"ఆమె అప్పటికీ అతని వాంఛను నెరవేర్చకపోతే అతడామెను కర్రతో కాని, చేతితో కాని మోది లొంగదీయాలి. 'బలం వలన, ప్రతాపం వలన... నీ పౌరుషాన్ని హరిస్తున్నాను' ఆ విధంగా ఆమె దిక్కుమాలినదవుతుంది" – స్త్రీ సత్వానికి రూపమిచ్చి, ఇంచుమించు పురుష సత్వాన్ని కాదన్నంత వరకూ పోయిన తంత్రవాద ప్రాథమిక సూత్రాలకిది పూర్తిగా వ్యతిరేకం. ఆర్థర్ ఎవలోన్ ఈ అంశాన్ని చక్కగా విపులీకరించాడు.

"ఈ శాఖ స్త్రీలను అత్యున్నతంగా పరిగణించి 'శక్తులు' అని పిలుస్తారు. 'శక్తి'ని అంటే స్త్రీని చులకన చేయడాన్ని నేరంగా భావిస్తారు. స్త్రీలు మూలకారణానికి ప్రతీకలు.

అవతారాలు – కనుక గౌరవానికీ, ఆరాధనకూ అర్హులని హెచ్. హెచ్. విల్సన్ కూడా సూచిస్తాడు. వారిని అవమానించిన వారు... అన్నింటికీ తల్లియైన ప్రకృతి క్రోధానికి బలి అవుతారు. స్త్రీలను సంతృప్తిపరచి, ఆరాధించినవారు 'ప్రకృతి'ని పూజించినట్లే."

అందుకనే సతీసహగమనం వేద సమ్మతమని చెపుతూ, ఆచరించబడే కాలాన, అనేకమంది అతివలు క్రూరంగా అణచివేయబడుతున్నప్పుడు పైన చెప్పిన కారణంగానే 'మహా నిర్వాణతంత్రం' దాన్ని నిషేధించింది. ఈ భావాల కనుగుణంగానే శాస్త్రాలన్నింటిలో ఉత్కృష్టమై తంత్రవాదం ప్రకారం స్త్రీ గురువు కా తగుననీ, ఆమె వద్ద పొందిన దీక్ష ఫలదాయకమనీ మనం భావించవచ్చును."

అలాంటి దృక్పథం 'మాతృ – ధర్మ' వ్యవస్థ అని పిలవబడే సామాజిక వ్యవస్థ లక్షణ ఫలితము. భారతదేశంలోని మాతృ – ధర్మ వ్యవస్థను గురించి తెలుసుకోకుండా, లోకాయత సమస్యను సంపూర్ణంగా అర్థం చేసుకోలేము.

**క్లుప్తీకరిస్తే :** వైదిక సాహిత్యంలో కనబడే లైంగిక క్రియా క్రతు ప్రాముఖ్యత పశుపోషక, పితృస్వామిక భావాలలో భాగం. ఇందుకు విరుద్ధంగా, లోకాయత సంప్రదాయం వ్యావసాయిక, మాతృస్వామిక భావాలను నిలుపుకుంది. ఇక్కడ మనకు ముఖ్యాంశము : ఇది ఒకరి నుండి మరొకరు పుచ్చుకున్న వ్యవహారం కాదు. తంత్రవాదంలోని లైంగిక వ్యవహారాల ప్రాముఖ్యతకు వక్రతకు – అంటే హైన్యతకు – భిన్నమైన ప్రాముఖ్యత ఏదో ఉంది. అందుచేత ఈ కారణాన తంత్రవాదాన్ని ఖండించడం సహేతుకం కాదు. ముఖ్యంగా వైదిక సంప్రదాయ రక్షకులమని చెప్పే వారికి తంత్రవాద లైంగిక సిద్ధాంతాలను, ఆచరణలనూ... కోప్పడటం పూర్తిగా అకారణం. ఎందుకనంటే తొలి వైదిక ప్రజలు అలాంటి విషయాలనే నమ్మి, ఆచరించారు.

## సింహావలోకనం

లోకాయత అంటే ప్రజల తత్వశాస్త్రము. ఇహలోక తత్వశాస్త్రమనీ, లేదా సహజ భౌతికవాదమనీ కూడా అర్థం. లోకాయతికుల మూలగ్రంథాలు నశించిపోయాయి. వాటిని తిరగి సంపాదించే అవకాశం కూడా లేదు. అందుచేత లోకాయతను, దాని వ్యతిరేక గ్రంథాలలో లభించే ఉల్లేఖనల ద్వారా పునర్నిర్మించాలి. అలాంటి వ్యతిరేకులలో మాధవాచార్య ఒకరు. 'సర్వదర్శన సంగ్రహం'లో ఆయన 'లోకాయత' రూపాన్నిచ్చాడు (తన). గతించి పోయిన లోకాయతకు ఇప్పటి వరకు దీన్నే ఆధారంగా తీసుకున్నారు ఆధునిక పండితులు. కాని అంతస్సాక్ష్యాలూ, బాహ్యాధారాలూ కూడా మాధవాచార్య ప్రామాణికతకు వ్యతిరేకంగా ఉన్నాయి. ఆధునిక పండితులనేకులు, అనేక మార్గాలలో మాధవాచార్య లోకాయత వర్ణననూ, ఇతరేతరంగా లభించిన ఆధారాలనూ సమన్వయపరచడానికి ప్రయత్నించిన కారణంగా... ప్రాచీన భారతీయ

భౌతికవాదం గురించి అనేక సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి. వానిలో అవి పరస్పర వైరుధ్యాల పుట్టగా ఉన్నప్పటికీ, అన్నింటిలోనూ... సత్యాంశ కలదు. ఈ వైరుధ్యాలన్నీ మాధవాచార్య ప్రభావాన్నుంచి విముక్తమైతే పరిష్కారమవుతాయి. అలా చేస్తే ఈ సిద్ధాంతాలాధారపడిన దత్తాంశమంతా ఏకదిశను సూచిస్తుంది. ఆ సూచన లోకాయత అంటే ప్రజలలో ప్రబలంగా వున్న గూఢవిశ్వాసాల ఆధారాలు. దీన్నే తంత్రవాదమంటారు. ఆధ్యాత్మిక, పరలోక భావాలు తర్వాతి కాలంలో తంత్రవాదంపై రుద్దబడ్డాయి. కాని అసలు తంత్రవాదం – దాని తాత్విక కృతి అయిన సాంఖ్యవాదంలాగా – నాస్తికమూ, భౌతికమూ.

తంత్రవాదంలో లైంగిక క్రియకున్న స్థానం వలన ఆధునిక భావన దానిని అసహ్యించుకుంటుంది. ఈ కారణం వల్లనే తర్వాతి కాలంలో వైదిక సంప్రదాయ రక్షకుల మనుకునేవారంతా తంత్రవాదాన్ని తిరస్కారంగా చూస్తారు. అయితే ఈ లైంగికాంశాలన్నీ వైదిక దృష్టిలో కూడా గాఢంగా అలుముకున్నాయి. ఆధునిక దృష్టిలో ఆపాదించబడేదానికి భిన్నమైన ప్రాముఖ్యత ఏదో దీనికుండవచ్చునని భావించవచ్చు. ఈ ప్రత్యేక ప్రాముఖ్యతను గ్రహించడమే ప్రాచీన లోకాయత సమస్యగా మారిపోతుంది.

ప్రశ్న : అదెలా చేయాలి? ఏ శాస్త్రీయ పద్ధతి ననుసరించాలి?

# ౨

# తంత్రవాదం

# ముందుమాట

**ఈ** చిన్ని పుస్తకం దేవీప్రసాద్ చటోపాధ్యాయ రాసిన "లోకాయత" లో ఒక భాగం. తరచుగా వినబడేమాట : భారత తత్త్వశాస్త్ర స్రవంతి ముఖ్యంగా భావవాద స్రవంతి. 'సర్వ దర్శన సముచ్ఛయం', 'సర్వ దర్శన సంగ్రహం' లాంటి ప్రాచీన గ్రంథాలను చూసినా 'భారతీయ తత్త్వశాస్త్ర చరిత్ర' (రాధాకృష్ణన్) లాంటి ఆధునిక గ్రంథాలు చూసినా వచ్చే అభిప్రాయం కూడా అదే. అసలు 'భారతీయ సంస్కృతి' అనే పదం... వేదాలకు, ఉపనిషత్తులకు స్మృతులకు, శ్రుతులకు... ప్రతిధ్వనిగా అర్థం చేసుకుంటారు కొంతమంది. నాగరికతా చరిత్రలో ఒకో దశలో సృష్టించుకున్న గ్రంథాలవి. వాటిని సక్రమంగా అర్థం చేసుకోవాలంటే, అవి సృష్టి అయిన చారిత్రక పరిస్థితులను కూడా తెలుసుకోవాలి, తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. చారిత్రక నేపథ్యం అర్థమైతే ... ఎంత దేవభాష అయినప్పటికీ... వేదాలు, ఉపనిషత్తులు... వగైరా ఇంత 'గొట్టుగా' ఉండకపోవచ్చును. మరో విశేషముంది. కళ, సంస్కృతి... మొదలైన సామాజిక ఉపరితల వ్యవహారాలన్నింటిలోనూ... రెండు భిన్నమైన మార్గాలు చరిత్ర పొడవునా (అంటే 'నాగరిక చరిత్ర' పొడవునా) మనకు కనబడతాయి. నాగరిక శైలి, జానపద శైలి అని స్పష్టమైన విభజన ఉంది. శిల్పం, చిత్రకళ, కవిత, సంగీతం... అన్నిటా ఈ ధోరణులు స్పష్టం. మరి తత్త్వశాస్త్రం.. అందుకు భిన్నంగా ఉంటుందా? ఉండటానికి వీలుందా? 'తీర్థానికి తీర్థం, ప్రసాదానికి ప్రసాదం'లాగా ... దేని దారిన అది పోతుందా? అంటే అలాంటి సావకాశం లేదని మార్క్సిస్టులేకాక, మానుష శాస్త్రజ్ఞులు, సామాజిక శాస్త్రవేత్తలు చరిత్రకారులు కూడా చెపుతారు.

తత్త్వశాస్త్ర పరిణామంలో కూడా జానపద 'శైలి'కి ఒక ప్రత్యేక స్థానముంది. దాన్నే స్థూలంగా 'లోకాయత' అని పిలుస్తారు. మొదటి నుంచీ ఈ జానపద 'శైలి' తత్త్వశాస్త్రాన్ని, సంప్రదాయాలనూ పండిత వర్గం చులకనగా చూసింది. 'సర్వదర్శన సంగ్రహం'లో లోకాయత వాదానికిచ్చిన స్థానం ఇంచుమించు పాద పీఠిక లాంటిది మాత్రమే. అలాగే 'ప్రబోధ చంద్రోదయం' అనే 'తాత్త్విక' రూపకంలో 'లోకాయత' ఆధునిక ప్రహసనంలోని పాత్రలాగా...

మొరటుగా చిత్రించబడ్డాడు. రాధాకృష్ణన్ పండితుని 'భారత తత్త్వశాస్త్ర చరిత్ర' చదివితే శంకరాద్వైత సిద్ధాంతానికి భిన్నమైనవన్నీ... తాత్త్వికంగానూ, నైతికంగానూ ఎందుకు పనికిరానివని చెప్పడానికే రాసాడనిపిస్తుంది. ఒక్క క్షణం కూడా... పాఠకుణ్ణి ఆలోచించనీయదు ఆ పుస్తకం. మన తరపున 'ఆలోచించి' పెడుతుంది. మనం పైన అనుకున్నట్టు ఇదంతా నాగరిక వ్యవహారం, పండిత వ్యవహారం, ఉన్నతవ్యవహారం.

వీరి తత్త్వశాస్త్రానికి భిన్నంగా మరోరకం ఆలోచనా ధోరణి కూడా అవిచ్ఛిన్నంగా సాగుతూ వచ్చింది. దానికేపేరు పెట్టుకున్నా ఆ ధోరణిలో మౌలికంగా క్రింది వర్గాల వారి 'తత్త్వం' దొరుకుతుంది. దానికి 'లోకాయత' అని ఒక స్థూలమైన పేరు వ్యాప్తిలోకి వచ్చింది.'లోకాయత' అంటేనే అర్థం 'లోకంలో వ్యాప్తిలో ఉన్నది' అని. అంటే ఈ పేరు కూడా పండితులు ఈసడింపుగా పెట్టారేమోననిపిస్తుంది. (లోకేషు ఆయత, లోకాయత), 'సర్వదర్శన సంగ్రహం' – కర్త మాధవాచార్య.... ఇంకా ముందుకు వెళ్ళి 'లోకాయత' భావాలన్నింటిని కలగలిపి 'చార్వాక' మతంగా భావించాడు.

దేవీప్రసాద్ చటోపాధ్యాయ 'లోకాయత' గ్రంథంలో... భారత తత్వశాస్త్ర చరిత్ర పొడవునా ఉన్న భౌతికవాద భావజాలాన్ని గుర్తించడానికి ప్రయత్నించాడు. 'లోకాయత' గా చలామణి అవుతున్న రకరకాల భౌతిక తత్త్వ 'వాదాలను' గురించి విపులీకరించారు. అంటే అవన్నీ 'సంపూర్ణమైన' భౌతికవాద దృక్పథాలని పేరాశ పడగూడదు. చరిత్రలో ఒకే ఒక దృక్పథం. ఏకచ్ఛత్రాధిపత్యం వహిస్తుందనేమాట ఆసంబద్ధం. మానవుడు... జంతు పద్ధతిలో బతకడం నుంచి 'నాగరిక' పద్ధతిని కనుగొన్న క్షణం నుంచి భావ సంఘర్షణ, తద్వారా భావ సంపన్నత... సమకూడతాయి. ఈ భావ సంఘర్షణ ఒకప్పుడు మూగగా సాగుతుంది. మరొకప్పుడు ఎలుగెత్తి సాగుతుంది. మరో సందర్భంలో – జీవితంలాగే – భావాలు కూడా ఘనీభవించి పోవచ్చు. కాని – మొత్తంమ్మీద ... చరిత్రా, భావజాలం సృష్టించబడుతూనే ఉంటాయి.

దేవీప్రసాద్ చటోపాధ్యాయ – 'లోకాయత' గ్రంథంలో – వేదకాలం, వేద పూర్వకాలం నుంచి ఇప్పటివరకూ ప్రచారంలో ఉన్న కేవల భారత తత్త్వశాస్త్ర భావజాలలను అధ్యయనం చేసి, శోధించి, జల్లెడ పట్టి భౌతికవాద ధోరణులను, ఛాయలను, ఆయా చారిత్రిక భౌతిక నేపథ్యంలో వాడుకున్న ప్రత్యేకతలను – పునర్నిర్మించడానికి ప్రయత్నించారు. అందులో "తంత్రవాదం" ఒకటి.

భారతీయ జీవన స్రవంతికి బాహ్యంగా నివసించే అనేకానేక సమూహాలలో తంత్రవాదుల సమూహం ముఖ్యమైనది. వీరిలో ఎక్కువ భాగం ఒకప్పుడు మామూలుగా

అందరితోపాటు బ్రతికినవారే. అయితే వారి జీవిత విధానాలు, వారనుసరించే ప్రమాణాలు, వారు ఆచరించే పద్ధతులు... గూఢంగా, గుప్తంగా ఉంటాయి. తాంత్రికుల మధ్యకు నాగరికులను అంటే మామూలు జీవన వ్యాపారులను సాగించేవారిని రానీయరు. అలాగే తాంత్రికులంటే మామూలు మనుషులకు ఒక రకమైన భీతి, దాంతోపాటు వచ్చే గౌరవం... ఉంటాయి. తాంత్రికులు అంత భయంకరమైనవారా? అంత ప్రమాదకారులా? అంటే కాదు అనే చెప్పుకోవలసి వస్తుంది. వారు సమాజానికి బాహ్యంగా జీవించడం వలన, సమాజ విలువలను వారంతగా లక్ష్యపెట్టనందువలన సామాన్య ప్రజల్లో ఈ భావం సర్వత్రా వ్యాపించి ఉంది.

అసలు తాంత్రికుల తత్త్వశాస్త్రం ఏమిటి? తాంత్రిక తత్త్వ శాస్త్రానికి ప్రాతిపదిక ఏమిటి? వారికి సమాజానికీ ఇప్పుడు కాకపోతే... ఎప్పుడైనా గాఢ సంబంధం ఉందా? ... ఇలాంటి ప్రశ్నలకు శాస్త్రీయ సమాధానం, వివరణ ఇవ్వడానికి మానుష శాస్త్రజ్ఞులు ఒక శతాబ్దంపైగా ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రశ్నలకు సమాధానం ఇంచుమించు దొరికినట్టే.

తంత్రవాదం – సంప్రదాయం అతి 'ఆదిమ' ఆలోచనా ధోరణి. "భూమికి అనిర్వచనీయమైన శక్తులున్నాయి. అలాగే స్త్రీకి కూడా. ఈ ఆలోచనకు భౌతిక ప్రాతిపదిక – అటు భూమి ఇచ్చిన (ఇస్తున్న) పంటల నుంచీ, ఇటు స్త్రీ కన్న (కంటున్న) శిశువుల నుంచీ సంక్రమించింది." భూమి నుంచి స్త్రీ కి, స్త్రీ నుంచి భూమికి... ఈ సంతానశక్తి సంక్రమిస్తుంద'నే నమ్మకం (అదేదో మహత్తు లేదా దోహదం లేదా అద్భుతశక్తి) తాంత్రికులకు ప్రాథమికమైనది. ఈ నమ్మకం శాస్త్రీయమైనది కాకపోవచ్చును. కాని ఆ నమ్మకం రెండు భౌతిక వాస్తవాల నుండి ఏర్పడింది. కనుక దానిని ఆదిమ భౌతికవాద ఛాయగా తీసుకోవచ్చును. "తంత్రవాదం ఆచరణ మంత్రమాయలతో నిండి ఉన్నట్లు కనబడినా దాని తొలి ప్రాతిపదిక, అభివృద్ధి మాత్రం భౌతిక ఆధారాలను విసర్జించలేదు" అనేదే దేవీప్రసాద్ చటోపాధ్యాయ చెప్పింది.

దేవీప్రసాద్ చటోపాధ్యాయ... తాంత్రికుల సంప్రదాయాలు, తత్త్వదృక్పథం వివరించడంతో పాటు తాంత్రిక వాదానికున్న ప్రాథమిక విశ్వాసం, దానికున్న చారిత్రక నేపథ్యం, శాస్త్రీయంగా వివరించారు. ఈనాటి తాంత్రికులనూ, తంత్రవాదంపై... ఉన్న 'నాగరిక' లేదా 'భావవాద' అభిప్రాయాలనూ... చటోపాధ్యాయ తన విషయంగా తీసుకోలేదు. ఇందులో ఒక కచ్చితమైన 'పరిమితి'ని ఆయన విధించుకున్నారు. ఆ పరిమితిలోనే ఈ 'తంత్రవాదాన్ని' చూడాలి. ఇందుకు బాహ్యమైన అంశాల వివరణకు వేరే చోట వెదకాలి.

# గూఢమైన మతాలు - వ్యావసాయిక క్రతువు

**(తంత్రశాస్త్రం చర్చ సందర్భంగా మహత్తు అనే పదానికి విస్తృతమైన అర్థం లేదు. మహత్తు ఒక అపూర్వ ప్రభావము. ఈ ఆలోచనకు భౌతిక ప్రాతిపదిక లేదు. అలాగే నాగరిక సమాజాల్లో ప్రాచుర్యం పొందిన మానవాతీత శక్తి అనే అర్థం కూడా లేదు. మహత్తు అనేది కేవలం ఒక వస్తువు నుంచి మరియొక వస్తువునకు ప్రసరించే స్వభావం అని మాత్రమే తీసుకోవాలి. – అను.)**

**భా**రత సంస్కృతిలో రెండు ప్రాథమిక ధోరణులున్నాయి. వైదిక ధోరణి, అవైదిక ధోరణి. ప్రకృతి లేదా స్త్రీసత్వం ప్రత్యేక ప్రాముఖ్యత సంతరించుకున్న తంత్రవాదం రెండో ధోరణికి చెందుతుంది. స్త్రీ సత్వ భావన వ్యవసాయ మూలకమనే ఆలోచనా ధోరణి ఎంతవరకూ సబబో మిగతా తాంత్రికవాద విశ్వాసాలు, ఆచరణలూ ఏమిటో మనం చర్చించుదాం.

## మహత్తు - తొలి వ్యవసాయ విధానం

తొలిదశలో వ్యవసాయ కార్యక్రమాలు మహత్తుపై ఆధారపడి ఉన్నాయనేది ప్రపంచమంతటా గమనించిన విషయము. మహత్తుల మీద విశ్వాసం తొలి వ్యవసాయ కార్యక్రమాల్లో ఒక వింతైన ప్రాముఖ్యాన్ని సాధించుకుంది.

"మిగతా అన్ని వ్యవహారాలకంటే వ్యావసాయిక కళలో మహత్తుకు నేర్పు, శారీరక శ్రమ మొదలైన అంశాలకంటే ఉన్నత స్థానం ఉంది" – (బ్రిఫాల్ట్) ఈ అంశాన్ని బ్రిఫాల్ట్ ఉదాహరణలతో వివరించాడు. ప్యూబ్లో ఇండియన్లు ఏ క్రతువూ – తంతు లేకుండా యూరోపియన్ వలసదారులు వ్యవసాయ కార్యక్రమాలను ప్రారంభించటం చూసి ఆశ్చర్యపడ్డారట. ఆ సంవత్సరం వారి పంటలు అధికంగా పండటం చూసి ఇంచుమించు దిగ్భ్రాంతి చెందారు. 'ఫాదరీలు చేసిన అనేక మత ప్రచారాలకంటే ఈ వాస్తవం (పంటలు బాగా పండటం అందులో ఏ క్రతువూ లేకుండా) వారి పూర్వ విశ్వాసాలను ధ్వంసం చేసింది.'

ఉత్తర బోర్నియోలో దయాక్ జాతివారు వ్యవసాయం చేసే విధానం పూర్వ పద్ధతిలోనే జరిగింది. కానీ, వారికి మహత్తుకు సంబంధించిన ఉత్సవ నిర్వహణ వ్యవసాయ కార్యక్రమాలన్నిటా అల్లుకుని పోయింది. 'అలాగే దక్షిణాఫ్రికాలో సుంబార జాతి స్త్రీలు ముందు పొల్లాల్లో నృత్యం చేయకుండా దున్నుడు కార్యక్రమం ప్రారంభించరు. ఆయా దేవతలను గౌరవించకపోతే పంటలు పండవని వారి నమ్మకం'. ప్రాచీన మెక్సికోలో ఎటువంటి చిన్న వ్యావసాయిక ప్రక్రియ అయినా ఉత్సవాలతోనూ, ఉచ్చాటనలతోనూ పంట దేవతను సంతృప్తి పరచకుండా ప్రారంభించరు. భారతీయ –తెగల్లో కూడా ఇలాంటి ఆచారాలు గమనించవచ్చు. హో జాతివారు ఏడు రకాల పండుగలు చేస్తారు. ఆ పండుగలన్నీ వ్యవసాయ రుతువులకూ, కార్యక్రమాలకూ సంబంధించినవే. ఇవి వారి ఉద్దేశ్యంలో సరదాకు చేసే పండుగలు కావు. ఈ పండుగల ద్వారా వ్యవసాయ ఫలాన్ని (మహత్తు వలన) సాధించగలమని వారి నమ్మకం. సంతాలులు శ్రావణమాసంలో అంటే ఊడ్పుల సమయంలో 'హరియర్ సిం' పండుగ చేసుకుంటారు. 'పంటలు పచ్చగా ఉండాలనేది' వారి లక్ష్యం.

"మధ్య రాష్ట్రాల్లో పంటలు పెరుగుతున్న ఆగస్టు మాసంలో ధాన్యమాత చిహ్నంగా అడవి వరి కంకులను ఇళ్ళల్లో కడతారు. అదే రాష్ట్రంలో కూర్మీలు శ్రావణ మాసం మధ్యలో హిరేలీ అనే పండుగ జరుపుతారు. ఇది కూడా పంట పచ్చదనానికి సంబంధించినదే. ఆ సందర్భంలో వరి మొలకెత్తుతుంది. ఉప్పుతో కలిపిన పిండితో ముద్దలు చేసి పశువులకు పెడతారు. అలాగే నాగలి మొదలైన వ్యవసాయ పరికరాలను చెరువులో కడిగి సూర్యుని కెదురుగా దోడ్లో నిలబెడతారు. నాగలికి వెన్న – పంచదార నైవేద్యం పెడతారు. భుయ్యాలు, కోలులు, బీందులు మొదలైన ఉత్తరప్రదేశ్ తెగలవారు వర్షాకాలంలో 'హరియారీ దేవి'ని పూజిస్తారు. హరియారీ అంటే పచ్చదనమే. అందుకు ప్రత్యేకంగా ఒక 'బాగా' పూజారిని కోళ్ళను బలివేయడానికి, మద్యాన్ని పొలాల్లో చల్లడానికి వినియోగిస్తారు కూడా. ఇదంతా పంటకాలం ముగిసిం తర్వాత గానీ, విత్తనాలు చల్లడానికి ముందు గానీ చేస్తారు" – (క్రూక్).

ఇవి కొద్ది ఉదాహరణలు మాత్రమే. భారతదేశంలోని వెనుకబడిన ప్రజలకు క్రతువులూ, పండుగలూ లేని వ్యవసాయ కార్యక్రమం ఉండజాలదు. అయితే ఈ సంప్రదాయం ఏ పరిస్థితుల్లో – అంటే మన ప్రాచీనులు ఏ సందర్భంలో – ప్రారంభించారో తెలుసుకోవడానికి ప్రయత్నించక పోవటం ఆశ్చర్యకరం. కౌటిల్యుడు 'అర్థశాస్త్రం'లో ఒక ప్రత్యేకమైన మంత్రోచ్చాటన జరపకుండా విత్తనాలు జల్లరాదని నిర్దేశించాడు. "విత్తనాలు చల్లేటప్పుడు నీళ్ళల్లో కడిగిన గుప్పెడు విత్తనాలను ఒక బంగారు తునకతో సహా జల్లుతూ ఈ క్రింది మంత్రాన్ని పఠించాలి. 'ప్రజాపతి కశ్యపునకు వందనం. వ్యవసాయం ఫలప్రదం అగుగాక. దేవి విత్తనాలలోనూ, సంపదలోనూ నివశించుగాక. చండావతహో' –(అర్థశాస్త్రం). కౌటిల్యుని ముందు కాలానికి అంటే వేదకాలం వరకూ ప్రయాణించితే ఇదే అంశాన్ని గమనించవచ్చు. అయితే వైదిక ఆర్థిక

వ్యవస్థలో వ్యవసాయానికి ద్వితీయ ప్రాముఖ్యత మాత్రమే ఉంది. వేద సాహిత్యంలో మనకు దొరికిన కొద్దిపాటి వ్యవసాయ సంబంధ ఆధారాలలో వ్యవసాయ కార్యక్రమం మంత్రాలపైన తత్సబంధ క్రతువులపైన ఆధారపడి ఉన్నట్లు గమనించవచ్చు. 'అదర్వవేదం' విత్తనాలు చల్లేటప్పుడు ఈ క్రింది మంత్రాన్ని ఆదేశించింది: 'ఓ ధాన్యమా నీకు నీవై పైకి లేచి విస్తరించు. ప్రతి నాళాన్ని బ్రద్దలు చెయ్. ఆకాశం నుంచి వచ్చే మెరుపులూ (ఉరుములు) నిన్నేమీ చేయజాలవు. దాన్యదైవమా మేము నిన్ను ప్రార్థించుతున్నప్పుడు మా పలుకులు వింటావ్. ఆకాశంలోకి సముద్రంలాగా అనంతంగా వ్యాపిస్తావ్. నిన్ను కొలిచిన వారికి అంతం లేదు. నీ ఫలం అనంతం. నిన్ను నైవేద్యంగా సమర్పించిన వారికి నాశనం లేదు. నిన్ను భక్షించిన వారికి అంతం లేదు.'

తై త్తిరీయ సంహిత ఇలాంటి మంత్రాన్నే చెబుతుంది: 'నెయ్యి, తేనే పూసిన నాగలి దేవతలందిరికీ – శక్తియుత్తులైన మరుమత్తులకు –ప్రియమైనది క్షీరముతో బలోపేతమైన నాగలీ! క్షీర సమృద్ధితో మమ్ము కటాక్షించు.' వ్యవసాయ సాఫల్యతను ఆశిస్తూ ఉచ్చరించిన మంత్రాల భోగట్టా రుగ్వేదంలో కూడా ఉంది. ఏది ఏమైనా వేద సాహిత్యం ఆఖరిదశల్లో ముఖ్యంగా గృహ్యా సూత్రాల్లో వ్యవసాయానికీ, మహత్తుకూ ఉన్న సాన్నిహిత్యం ఎక్కువ స్పష్టం అవుతుంది. ఆశ్వలాయన, సాంఖ్యాయన, భరద్వాజ గృహ్యాసూత్రాలు దున్నడానికి ముందు భూదేవతకు నైవేద్యం ఇవ్వాలని నిర్దేశించాయి. నాగేటి దేవత సీతకు పరాస్కర గృహ్యాసూత్రం ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చింది. గోభేల గృహ్యా సూత్రం సీతతో పాటు ఆస, ఆరాడ అనఘ లాంటి దేవతలను కూడా వివిధ వ్యవసాయ కార్యక్రమాల సందర్భంలో (దున్నుట, నూర్చుట మొదలైనవి) పూజించాలని చెప్పింది. ఇక్కడ చెప్పిన వైదిక సాక్ష్యాలు చాలా ప్రధానమైనవి. వేదకాలపు ప్రజలకు వ్యవసాయం అంత ప్రధానమైన వృత్తి కాకపోవచ్చు. కానీ, మహత్తుకు సంబంధించిన క్రతువులు మాత్రం వ్యవసాయానికి ముఖ్యమని వారి ఊహ. అలా ఎందుకు భావించారు అనేది ముఖ్యమైన ప్రశ్న. థామ్సన్ వ్యవసాయాన్ని పశువుల పోషణతో పోల్చి కారణాలు విశ్లేషించాడు. "పచ్చిక బీడు ఉన్నంతవరకూ పశువులు వాటి మానాన అవి పెంపొందుతాయి. కానీ, పశువుల పోషణతో పోల్చి చూస్తే దున్నటం, విత్తనాలు చల్లటం, నూర్చటం కష్టతరం. ఫలితం నమ్మరానిది. దానికి ఓపిక, దూరదృష్టి, విశ్వాసం ఉండాలి. అందుచేతనే వ్యవసాయ సమాజం మహత్తు – కార్యక్రమాల మీద విస్తారంగా ఆధారపడుతుంది.

తొలి వ్యవసాయదారులకు మొక్కలు నిజంగా ఎలా పెరుగుతాయో, ఎందుకు పెరుగుతాయో తెలియదు. విత్తనాలు చల్లటం దగ్గర నుంచి నూర్పిడి వరకూ జరిగే మార్పులన్నీ వారికి అద్భుతంగా తోచాయి. పైగా అప్పటి నైపుణ్యం స్వల్పమైంది. అందుచేతనే వ్యావసాయక ఫలితం అత్యంత అనుమానాస్పదం. మరైతే మహత్తు అనేది ఈ మానసిక అవసరాలను ఎలా తీరుస్తుంది? మహత్తు అనేది ఒక భ్రమా ప్రక్రియ. వాస్తవికతను ఆ భ్రమతో అదుపులో

పెట్టగలమని వారి సూత్రం. మరి ఈ భ్రమను సృష్టించడమెలా? ఒక కాల్పనిక చర్యను నటించడం ద్వారా ఈ భ్రమను సృష్టించవచ్చు. ఆ నటన వాస్తవంగా ప్రకృతి క్రమంపై ఏ ప్రభావమూ చూపజాలదు. కానీ, ఆ కార్యక్రమాన్ని చేసినవారిపై మాత్రం తగు ప్రమాణంలో ప్రభావాన్ని చూపించగలదు. కోరుకున్న వాస్తవాన్ని సాధించగలమనే నమ్మకంతో వారు ఒక నటనా కార్యక్రమాన్ని సృష్టించుకుంటారు. ఆ నమ్మకం ఆధారంగా సఫలమవ్వాలనే దీక్షతో తీవ్రంగా కృషి చేస్తారు.

'మహత్తు' అనేది అజ్ఞానాన్నుంచి పుడుతుంది. అయితే దాన్ని కేవలం అజ్ఞానంగానే చూడకూడదు. అదే వారు నెరపబోయే కార్యక్రమానికి సూచికగా ఉపయోగపడుతుంది. అది కేవలం మానసిక సంబంధమైన సూచికే కావచ్చు. తొలి వ్యావసాయక దశలో ఈ మానసిక సూచిక ఎంతైనా స్థైర్యాన్ని ఇస్తుంది. అందుచేతనే తరువాతి కాలంలో ఈ మహత్తు – కార్యక్రమాలు తీవ్రమయ్యాయి.

## వామాచారం అంటే ?

వ్యవసాయం స్త్రీలచేత కనుగొనబడినది అనుకుంటే వ్యావసాయిక మహత్తంతా స్త్రీ ఆధిక్యతలోనే ఉంటుందని తార్కికంగా నిర్ణయించవచ్చును. ఇక్కడ మనకు తంత్రానికి సంబంధించిన ముఖ్యమైన ఆధారం దొరుకుతుంది. ప్రచారంలో ఉన్న అభిప్రాయాలకు భిన్నంగా, తంత్రం కూడా మొదట్లో స్త్రీలు పాల్గొనే కార్యక్రమాలకే ముడిపడి ఉండేది. స్త్రీలు మాత్రమే వ్యావసాయక మహత్తు క్రియలలో పాల్గొనేవారు అనే దృక్పథం నుంచీ ఆలోచిద్దాం. బ్రిఫాల్ట్ ఈ విషయాన్ని ఈ విధంగా చెప్పాడు: "పంటల సమృద్ధి కోసం ఉద్దేశించబడిన మహత్తులు గానీ, మతైక క్రతువులు గానీ వ్యవసాయం చేసే స్త్రీల ప్రత్యక్షాధీనంలోనే ఉండేవి." ఈ నిర్ణయానికి రావడానికి ఆయనకు అనేక ఆధారాలున్నాయి. అందులో కొన్ని చూద్దాం. సియారాలాన్‌లోని రరూబా స్త్రీల వ్యవస్థ ముఖ్య కార్యక్రమం 'ఔషదాన్ని' లేదా మహత్తు గల దినుసును తయారు చేయటం. ఆ దినుసును భూమి మీద చల్లి పంటల సామర్థ్యాన్ని పెంచటం. చియనీ జాతి వారి ధాన్య నృత్యంలో యువతులు, మధ్యవయసు స్త్రీలు పాల్గొంటారు. ఆ నృత్యానికి నాయకత్వం వహించిన స్త్రీ ఓ ధాన్యపు కంకిని కర్రకు కట్టి, ఆ కర్రను తన చెవికి తగిలించుకుంటుంది. సియోక్స్ జాతి స్త్రీలు ప్రతి వసంతంలోనూ క్రతు కార్యక్రమాలు, ఉత్సవాలు జరపటం కూడా భూముల సామర్థ్యాన్ని పెంచడానికే. హిదతాస్ జాతి స్త్రీలు ధాన్యోత్సవంలో తాము పెంచే రకరకాల కూరగాయలను కర్రలకు కట్టి నడుస్తారు. అలా నడుస్తూ ఇంటికి చేరుకుంటారు, నగ్నమైపోతారు. ఆ జాతికి చెందిన పెద్దలు ఆ స్త్రీలమీదా, కూరగాయల మీదా పవిత్ర జలాన్ని చల్లుతారు. ఇక్కడ పురుషులు ముఖ్య కార్యక్రమం నిర్వర్తించినప్పటికి అసలు ఈ పద్ధతిని వ్యవస్థీకరించినవారు స్త్రీలే. ఇదే అంశాన్ని మరో వైపు నుంచి చూడవచ్చు. 'ఫలవంతమైన

వ్యవసాయానికి ప్రాథమిక అవసరం వర్షం. వర్షాన్ని అదుపులో పెట్టడానికి ఉద్దేశించిన కార్యక్రమాల కంటే క్రతువులేని వ్యవసాయపు పనుల్లో విజయం సాధించడానికి సరిరావు.' అలాగే పెరూలోని కొన్ని తెగలు, చిలీలోని రాకేనియన్ వారు వర్షాన్ని కురిపించే మహత్తులన్నీ పూజారిణులపైనే ఆధారపడి ఉన్నాయని నమ్ముతారు. గ్రాంచాకో ప్రాంతానికి చెందిన అభిపోన్స్ తెగవారు తమ ప్రాంతంలోని అత్యంత వృద్ధురాలు మాత్రమే తమకు అవసరమైనంత నీరు సమకూర్చగలదని భావించేవారు. కానరీ ద్వీపంలోని గ్రాంచెస్ తెగవారిలో వర్షాన్ని రప్పించటం పూజారిణుల కర్తవ్యం : వారంతా సముద్రపు ఒడ్డుకు వెళ్ళి సముద్రాన్ని కర్రలతో కొడతారు. భారతదేశం అంతా వర్షాన్ని సాధించడానికి చేసే క్రతువులన్నీ స్త్రీలు మాత్రమే నిర్వహిస్తారు. పురాతన కాలపు యూరప్‌లో వర్షాన్ని సృష్టించే కార్యక్రమాలు పూజారిణులవే అని చెప్పడానికి అనేక సూక్ష్మ ఆధారాలున్నాయి. వారి వారసులే మధ్యయుగంలోనూ, ఆధునిక కాలంలోనూ మంత్ర కత్తెలుగా చలామణి అయ్యారు.

ఆఫ్రికాలో కూడా వర్షాన్ని సాధించే కార్యక్రమం పవిత్రమైన రాజుగారిదే అయినా స్త్రీల ప్రత్యేక శక్తులు, చర్యలు కూడా దాంతో గాఢ సంబంధం కలిగి ఉన్నాయి. అంటే వ్యవసాయ కార్యక్రమాలలో అతి ముఖ్యాంశం స్త్రీల ద్వారా జరిగేదన్నమాట. ప్రాచీన కాలం నాటి కొన్ని మత వ్యవస్థల మూలాలు వ్యావసాయక మంత్రతంత్రాలలో దొరుకుతాయి. డయనీసియస్ మత వ్యవస్థ వ్యవసాయ ఆవిష్కారాన్ని ప్రతిబింబిస్తుంది. బొయేటియాలో డయనీసియస్ కర్మకాండలన్నీ ఆనాది కాలం నుంచీ విజయవంతంగా వ్యవసాయంతో ముడిపడ్డ కార్యక్రమాలే. ఈ క్రతువులన్నీ స్త్రీలే నిర్వహించేవారు. 'థేబేలో డయనీసియస్ ప్రసూతి గృహాన్ని సూచించే ఆలయంలోకి (పౌసానియాల కాలం వరకూ) పురుషులకు ప్రవేశం లేదు.' పెంథియన్ కథ మనకు చెప్పేది : స్త్రీల మహత్తు గురించి తెలుసుకోవడానికి ఆసక్తి చూపించిన పురుషులను ముక్కలుగా నరికేస్తారు. అసలు డయనీసియస్ మత వ్యవస్థ మొదట్లో స్త్రీల మతమనీ, అందులో పురుషులు నిషిద్ధులనీ మనకు అర్థమవుతుంది. ఇటలీలో ఈ వ్యవస్థ ప్రారంభకాలాన ఎట్టి పరిస్థితుల్లోనూ ఉత్సవాల్లో పురుషులకు ప్రవేశం లేదు.

ఏ ఉత్సవాలైనా సంపూర్ణంగా గానీ, ప్రధానంగా గానీ, స్త్రీలకే పరిమితమని భావించటం మనకు కొంచెం కష్టమే. ఎందుకనంటే మనమంతా పితృస్వామికమయిన ఆలోచనలో పెరిగినవారము. క్రిస్టియన్ వ్యవస్థగానీ, భారతదేశంలోని బ్రాహ్మణ వ్యవస్థ గానీ, అలాగే చైనా సంఘం గానీ పూజారి విధులు స్త్రీలు నిర్వహిస్తారనే భావాన్ని జీర్ణం చేసుకోలేవు. ప్రాచీన కాలంలో అలాకాదు. అందులోనూ ముఖ్యంగా నాగరికంగా ముందడుగు వేస్తూ వ్యవసాయాన్ని వృద్ధి చేసుకుంటూ పోయే వ్యవస్థలో అసలే కాదు. ప్రాచీన ప్రపంచమంతా పూజారిణులతో నిండి ఉండేది. రోమన్ వ్యవస్థలో ఇందుకు అవసరమైన ప్రాచీన పవిత్ర అవశేషాలను చూడొచ్చు. ఇటాలియన్ వ్యవస్థలో పూజారిణులు చాలా ప్రముఖమైన పాత్రను నిర్వహించేవారు అనడానికి

చాలా సూచనలున్నాయి. ప్రాచీన ఇటలీలో అధికార పూజారిణితోపాటు ఇంకా అనేకమంది స్త్రీలు పూజారి పనులు, భవిష్యద్వాణి కార్యక్రమాలు నెరవేర్చేవారు. ఆయా దేవాలయాల్లో వీరికి ముఖ్య పూజారిణి కంటే ఎక్కువ పలుకుబడి ఉండేది. ప్రాచీన గ్రీసు దేశంలో కూడా పూజారిణులు ఉండేవారు. డెల్ఫి డొడొనా లాంటి చోట్ల ఆలయ కార్యక్రమాన్ని స్త్రీలే నిర్వహించేవారు. ఒలింపిక్ ఉత్సవాల సందర్భంలో డెమెటర్ పూజారిణికి ఉన్నత అధికారులతో సమానమైన ఆసనాన్ని ఏర్పాటు చేసేవారు. హెలికార్నసస్‌లో పూజారిణికి ప్రజల పూజారిణి అనే బిరుదుండేది. పురాతన గ్రీసులో స్త్రీలకు పూజారి వ్యవహారాల్లో అంతకంటే ప్రముఖ స్థానం ఉండేది. డయనీసియస్ మతానికి అనుబంధితమైన పురాతన మతాల్లో పూజారి కార్యక్రమాలన్నీ పూర్తిగా స్త్రీలకే చెంది ఉండేవి. బాబిలోనియా, అస్సిరియా, ఈజిప్టులలో కూడా ఇలాగే జరిగింది. అస్సీరియన్ శాసనాలలో పూజారిణులకు “మాతలు” అనే పేరుండేది. కార్తెజ్‌లో మహాదేవికీ, ప్రజలకూ సంధానకర్తలు స్త్రీలే. ఈజిప్టులో 'రా' దేవత ముఖ్య పూజారిణి, ఆ దేశానికి రాణీ కూడా. ప్రాచీన చైనాలో ముఖ్యంగా టావో మతస్తులలో మంత్ర తంత్రాలన్నీ స్త్రీలకు చెందినవే అని నీధామ్ రుజువు చేశాడు. బ్రిఫాల్ట్ లెక్క ప్రకారం ప్రాచీన సమాజపు మత క్రతువులలో స్త్రీల పాత్ర మనం చెప్పుకున్న దానికంటే కూడా ఎక్కువే. “పశ్చిమ యూరప్, ఉత్తర యూరప్ ప్రాంతాలవారి ప్రాచీనుల్లోనూ, ప్రపంచంలోని ఇతర భాగాల్లోని అనాగరిక జాతుల్లోనూ పూర్వకాలంలో మత కార్యక్రమాలు, పూజారి కార్యక్రమాలు – పురుషులకే పరిమితమైనట్లున్న మన భావనకు విరుద్ధంగా – స్త్రీలకే చెంది ఉండేవి. తర్వాత తర్వాత అవి పురుష పూజారులకు దత్తమయ్యాయి.” బ్రూయిడ్ తెగలో అలా జరగటాన్ని మనం ఉదాహరణగా తీసుకోవచ్చు. వారు మంత్ర తంత్ర కార్యక్రమాల్నించి స్త్రీలను నెట్టివేశారని చెప్పడానికి ఆధారాలున్నాయి. వ్యవసాయ క్రతువులు, దానికి సంబంధించిన ప్రాచీన సంప్రదాయం స్త్రీల చేతుల్లోనే ఉండేవి. వారే అద్భుతమైన మాంత్రికులు. క్రమక్రమంగా స్త్రీల అధికారంపై పురుషుల పెత్తనం పెరుగుతూ రావడం వలన – అలాగే దేవుళ్ళ ఆధిపత్యం దేవతలపై పెరిగింది. – పురుషులు కూడా మాంత్రికులయ్యారు. అయితే, ఈ తంతుల వ్యవహారంలో స్త్రీల ప్రాధాన్యత తగ్గి పురుషుల ప్రాధాన్యత పెరగటం ఒక్కసారిగా జరిగి ఉండదు. అలాగే పాతఛాయలు పూర్తిగా మాసిపోవు. అంటే మహత్తు కార్యక్రమాలు, మత క్రతువులు కొత్తగా వచ్చిన పితృస్వామిక పరిస్థితులకు అనుగుణంగా సర్దుకున్నప్పటికి స్త్రీలు ఒకప్పుడు ఇదే వ్యవహారాల్లో ప్రధాన పాత్ర వహించిన ఛాయలు మాత్రం మిగిలి ఉన్నాయి. పురుషులు పూజారి పద్ధతులకు అనుగుణంగా మలుచుకునే క్రమంలో తన జాతిని (లింగాన్ని), త్యాగం చేసి స్త్రీతో ఐక్యం కావాలి. మధ్య ఆసియాలోని అనేక దేశాల్లో పూర్వకాలం దేవాలయ పూజారి భౌతికంగా నపుంసకుడు కావాలి. అంటే, తన లింగాన్ని నరికించెయ్యాలి.(ఇందుకు ఇష్టర్, సిరియన్ దేవతలు, పెసినోస్, హిటైట్ పూజారులు, ఆర్టిమిస్ మొదలైన ఉదాహరణలు చెప్పవచ్చును).

కానీ పురుషులు తమ లింగాన్ని సమర్పించడం విషయంలో వచ్చిన సాంకేతిక సంప్రదాయం స్త్రీలాగా దుస్తులు ధరించటం శరీరంలో భాగాలుగా దుస్తులను కూడా జమకట్టి పురాతనమైన నమ్మకం నుంచి ఈ అలవాటు ప్రారంభించి ఉంటారు. 'ఏ వ్యక్తి అయినా, ఏ జాతి (లింగం)కి సంబంధించిన దుస్తులు ధరిస్తే ఆ జాతికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నట్లు ప్రాచీన సమాజంలో నమ్మిన సార్వజనీన సూత్రము', ఎటబోనియాలో పూజారి విధులు నిర్వర్తించేటప్పుడు పురుషులు తమ జాతిని వదిలి స్త్రీల దుస్తులను ధరించవలసి ఉంటుంది. బోర్నియోలోని దయక్ తెగల వారిలో మహత్తు – క్రతువులు చేసే పురుషులు, స్త్రీల దుస్తులు ధరించాలి. 'డ్యూముఖ్యులు' వర్షాన్ని ఆవాహన చేసేటప్పుడు (ఆడవాళ్ళ) లంగాలు ధరిస్తారు. మెడగాస్కరులో పూజారులు స్త్రీ దుస్తులే ధరిస్తారు. తహితీ మార్క్వెసాస్‌లలో పూజారులు తమ శరీరాలకు తెల్లరంగు వేస్తారు. ఆ పైన స్త్రీలలాగా ప్రవర్తిస్తారు. పూజారులు స్త్రీల వలెనే దుస్తులు ధరించాలనే సూత్రం ఉత్తర అమెరికా ఇండియన్స్, న్యూమెక్సికో తెగలు, ఇండోనేషియా పెల్యూ ద్వీపాలు మొదలైన అన్నిచోట్లా అమలులో ఉంది. గుచ్చివాడలో పూజారి పూజలు చేసేటప్పుడు స్త్రీల దుస్తులు ధరిస్తాడు అని వైట్‌హేడ్ అంటాడు. ప్రాచీన కాలంలో కూడా ఇంతే. "మహత్తులు మొదట్లో స్త్రీలకు సంబంధించినవేననీ, అది స్త్రీలకు మాత్రమే పరిమితమైన కార్యక్రమమనీ భావించడం మినహా ఈ సార్వజనీన సంప్రదాయానికి వేరే అర్థం చెప్పుకోలేము" అని బ్రిఫాల్ట్ ఈ వ్యవహారాన్ని నిర్ణయిస్తాడు.

క్లుప్తంగా చెప్పాలంటే వ్యవసాయాన్ని స్త్రీలు కనిపెట్టారు. పురాతన మతాలకు మూలమైన వ్యావసాయక క్రతువులు కేవలం స్త్రీలకు మాత్రమే చెందినవి. తరువాత పితృస్వామిక పరిస్థితులకనుగుణంగా ఈ మతాలను మార్చడంలో పాత కార్యక్రమాలు పురుషులకు మార్పిడి చెందాయి. అప్పుడు కూడా పురుషుడు పురుషుడులాగా ఏ కార్యక్రమాలూ నిర్వర్తించలేదు. వారు 'స్త్రీలుగా' మారి మాత్రమే అవి నిర్వర్తించగలరు.

ఇప్పుడు తంత్రానికి వద్దాం. తంత్రంలోని విచిత్ర పద్ధతులకూ, మౌలికభావాలకూ అతి ప్రాచీన ప్రజల వ్యావసాయక మహత్తులతో ఎంతవరకూ సంబంధం ఉందో ఆలోచిద్దాం. ప్రస్తుతానికి ఒక ప్రశ్న మాత్రం వేసుకుందాం. తంత్రం మొదట్లో స్త్రీలకు మాత్రమే పరిమితమైన వ్యవహారమని భావించడానికి ఆధారమేమిటి?

యోగినులనీ, భైరవీలని పిలువబడే స్త్రీ యోగుల వ్యవస్థ తాంత్రికులలో ప్రధాన స్థానాన్ని ఆక్రమిస్తోంది. 'తంత్రంలో టావో వాదంలాగానే స్త్రీ భక్తుల ప్రాముఖ్యతను గమనిస్తే ఆసక్తికరంగా ఉంటుంది. 'లక్ష్మీంకర' సహజయోగిని' వారి ఉన్నతులలో కనపడే స్త్రీ నామాలు" అని అంటాడు నీథామ్. అయినప్పటికి తాంత్రికుల్లో ఎక్కువ మంది పురుషులే. అయితే పురుషులు

పురుషుల వలనే తాంత్రికాచారాలలో పాల్గొంటారా అనేది ప్రశ్న. కాదనేది సమాధానం. "ఆచార భేద తంత్ర" ఇలా అంటుంది : పంచతత్వాలను, ఖపుష్పాన్ని, కుల స్త్రీని ఆరాధించండి. అదే వామాచారం. అత్యున్నత స్త్రీ శక్తిని ఉజ్వలింపజేయాలంటే స్త్రీగా మారడమే (వామా భోత్వయజేత్పరం). పంచతత్వాలూ, ఖపుష్పం, కుల స్త్రీ – ఇవి తంత్రశాస్త్రంలోని సంజ్ఞాపదాలు. వీటి అర్థం గురించి తరువాత చర్చిద్దాం. ఇక్కడ ప్రత్యేకంగా గుర్తుంచుకోవలసింది అత్యున్నత స్త్రీ సత్వాన్ని అవాహన చేయటానికి స్త్రీగా మారటం అనే విధి. తాంత్రికులు అలా స్త్రీగా మారడానికి ఎందుకు ప్రయత్నిస్తారు.? దాని కొకటే సమాధానం ఉండి ఉండాలి. ఈ ఆచారాలు, సంప్రదాయాలు మొదట్లో స్త్రీలకు సంబంధించి, స్త్రీలకు మాత్రమే పరిమితమై ఉండాలి. స్త్రీ దుస్తులు ధరించాల్సిన పూజారుల వ్యవహారం కూడా ఇదే రుజువు చేస్తుంది. ఇక్కడ తంత్రవాదం గాఢంగా ముడివేసుకున్న "వామాచార" పదం అర్థం మనం గ్రహించాలి. పెద్ద పెద్ద సంస్కృత పండితులు కూడా ఈ పదాన్ని 'ఎడమ చేతి మార్గం' అని తప్పుగా అర్థం చేసుకునేవారు. అది బొత్తిగా అర్థం లేని మాట. వామ, ఆచార అనే రెండు పదాలు అవి. 'ఆచార' అంటే ఆచరణ. ఇంకా చెప్పాలంటే క్రతువు. 'వామా' అంటే స్త్రీ, లేదా కామవాంఛ. అందువలన వామాచారం అంటే స్త్రీ ఆచరణ, లింగాచరణ. వైదిక సాహిత్యాలలో కూడా లైంగిక లక్షణం గల క్రతు క్రియలు అనేక చోట్ల కనబడతాయి. కానీ, ఈ సాహిత్యాలన్నీ ఆహార సముపార్జన తరాలకు సంబంధించినవి. అంటే పితృస్వామిక జనావళికి సంబంధించినవి. అందుకనే వైదికాచారాలేవీ స్త్రీకి ఉన్నత స్థానాన్ని ఇవ్వలేకపోయాయి. తద్విరుద్ధంగా తంత్రవాదం స్త్రీకి అధిక ప్రాధాన్యత ఇస్తుంది. స్త్రీ సత్వాన్ని ఆవాహన చేయటం, స్త్రీగా మారడం ఇందుకు ముఖ్య సూచనలు. అందుకే తంత్రవాదాన్ని స్త్రీలకే పరిమితమయిన క్రతు కార్యక్రమాల మూలంలో గుర్తించాలి. లైంగిక వ్యవహారాలు ఇందులో చాలా ముఖ్యమైన పాత్ర వహించాయి. ఇందుకే తాంత్రిక ఆచారములలో ఉన్న అనేక రూపాలలో వామాచారం ఒకటి మాత్రమే కదా అని అభ్యంతరం పెట్టవచ్చు. ఇందుకు అనేక రుజువులు కూడా చూపించవచ్చు. దక్షిణాచారము ఆలస్యంగా వచ్చిన వ్యహారము. అందులో ఉన్న కృతకత్వం, రాజీతత్వం ఈ లక్షణాన్ని స్పష్టంగా చూపుతుంది. ఒక వ్యక్తి దక్షిణాచార తాంత్రికుడిగానూ, వైదిక సాంప్రదాయకుడిగానూ కూడా ఉండవచ్చు. మరో సంగతి, ఈ రెండింటిలోనూ వామాచారమే నిజమైన తంత్రమని కొన్ని తాంత్రిక గ్రంథాలు చెబుతాయి. "వామా, దక్షిణ అని రెండు సంప్రదాయాలున్నాయి. ప్రతి వ్యక్తీ పుట్టిన క్షణం నుంచీ దక్షిణాచారానికి చెందినవాడే కానీ, అభిషేకానంతరమే ఎవరైనా వామాచారి కాగలడు" అని 'వామకేశ్వర తంత్రం' చెబుతుంది. అంటే, తంత్రవాదంలో అభిషేకానికి అత్యున్నతమైన ప్రాముఖ్యత ఉన్నదని అర్థం చేసుకోవాలి. అభిషేకమే వామాచారిగా మారిస్తే నిజమైన తాంత్రికుడు వామాచారి మాత్రమే. మరో సంగతి. ఇప్పుడు మనకు లభిస్తున్న గ్రంథ సామాగ్రిని మాత్రమే నమ్ముకుని తంత్రవాదపు అసలు స్వభావాన్ని గ్రహించడం పూర్తిగా సాధ్యం కాదు. మరోవైపున

అసలు సిసలు తంత్రవాదం రహస్యాచరణా స్వభావం కలది, మరి ఆ సంప్రదాయంలో మునిగిన తాంత్రికులు తమ రహస్యాలను బైట వారికి  చెప్పరు. అయినప్పటికి కొద్దిమంది పండితులు తమకు పరిచయమున్న సాంప్రదాయక తాంత్రికుల ద్వారా కొన్ని రహస్యాలను సాధించగలిగారు. బెంగాలీ తాంత్రికులు మాత్రం వామాచారానికి భిన్నమైన ఏ పద్ధతినీ గుర్తించరనేది అలాంటి రహస్యాలలో ఒకటి. ఇది చాలా ముఖ్యాంశము. మాతృస్వామిక దక్షిణ ప్రాంతాన్ని మినహాయిస్తే తంత్రవాదానికి బలమైన స్థానం విశాల బెంగాల్. చివరగా తంత్రవాదంలోని యోగ సాధన విద్య అంటే స్త్రీత్వాన్ని సాధించడానికి చేసే తీవ్రమైన కృషి అని అర్థం అవుతుంది. మరో మాటలో చెప్పాలంటే మౌలికమైన వ్యక్తిత్వాన్నీ, చైతన్యాన్నీ, స్త్రీ చైతన్యంగా, స్త్రీ వ్యక్తిత్వంగా పరివర్తింప చేయడానికి చేసే సాధన. మన పండితుల్లో చాలామంది ఈ అంశాన్ని గమనించలేదు. అలాగే తంత్రవాదాన్ని గురించి రాసే ఆధునికులు యోగ సాధనలో దాగివున్న ఆత్మతత్వాన్ని గుర్తించాలనే ఉత్సాహంలో తంత్రాచారాల్లోని ప్రత్యక్ష అర్థాలను గమనించలేదు.

తంత్రవాదంలోని యోగ సాధనకు షట్చక్రభేదం అంటారు. తాంత్రికులకు శరీర శాస్త్రం పట్ల ఉన్న దృక్పథమే దీనికి సైద్ధాంతిక ప్రాతిపదిక, దాని ప్రకారం సుషుమ్నా నాడికి ఇరువైపులా రెండు నాడులుంటాయి. సుషుమ్నా నాడి గుదచక్రం వద్ద నుంచి మెదడువరకూ కొనసాగుతుంది. సుషుమ్నా నాడిలో వజ్రాఖ్యమనే మరో నాడి, మళ్ళీ దానిలో చిత్రిణి అనే మరోనాడి ఉంటాయి. అంటే చిత్రిణి నాడి  సుషుమ్నా నాడిలో కీలకమూ, సారవంతమూ అయినదన్నమాట. సుషుమ్నా నాడిపై వివిధ స్థానాల్లో సప్త పద్మాలు ఉన్నట్లు భావిస్తారు. ఆధునిక తంత్రవాద రచయితలు ఈ పద్మాలను నర – కేంద్రాలు (Nerve Plexuses) అని పిలుస్తారు. కానీ, విషయమేమిటంటే తంత్రవాదంలో పద్మాన్ని ఒక సంజ్ఞార్థంలో వాడతారు. తంత్రవాదంలో పద్మం స్త్రీ జననాంగానికి గుర్తు. వజ్రం (మణి) అనే పదం, లింగ (పురుషాంగం) పదానికి మర్యాదపూర్వకమైన మాట. లేదా మార్మిక పదం. అలాగే పద్మం స్త్రీ జనంగానికి (భగము లేక యోని) సాహితీపరమైన పదం. (అని బౌద్ధ తంత్రవాద శాస్త్రాన్ని గురించి రాసిన ఎల్.డి. లావలీ హోషియాన్ అంటాడు) 'ఓం మణి పద్మేహం' అని రోజూ మంత్రోచ్చారణ చేసే ఆధునిక బౌద్ధులు ఆ మంత్రంలో ఇలాంటి అర్థం ఉంటుందని అనుమానించలేరు. పూర్వకాలంలో ఈజిప్టులోనూ, ఇప్పటికీ పశ్చిమ దేశాలలోనూ ఇదే సంజ్ఞాపదం ఈ అర్థంలోనే కొనసాగుతోంది. కాకపోతే బౌద్ధుల లాగానే వారు కూడా ఈ అర్థాన్ని తిరస్కరిస్తారు. అందువలన సుషుమ్నా నాడిపై గల ఏడు పద్మాలు స్త్రీత్వానికి ఏడు స్థానాలు, ఇవి ప్రతి వ్యక్తిలోనూ ఉంటాయి. తంత్రం ప్రకారం ఈ ఏడు పద్మాలకు కచ్చితమైన రేఖా చిత్ర రూపాలుంటాయి. ఆ చిత్ర రూపాలలో ఉన్న ఎక్కువ పద్మాలలో త్రికోణ చిత్రము ఉంటుంది. త్రికోణ చిత్రము మళ్ళీ స్త్రీ జననాంగానికి తాంత్రికులిచ్చిన ప్రతిరూపమే. పైగా తాంత్రికులు సప్తశక్తులు (కులకుండలినీ, వారుణీ,లకినీ మొ॥) ఈ ఏడు పద్మాలలోనూ ఉంటాయని చెబుతారు. ఆధునిక పండితులు

శక్తి అనే పదాన్ని Force లేదా Energy అని అనువాదం చేస్తారు. దాస్‌గుప్తా దాన్ని విద్యుత్ఛ్చక్తి అనేంతవరకూ వెళ్లారు. కానీ, తంత్రవాదానికున్న ప్రత్యేక సందర్భాన్ని బట్టి ఈ అర్థం పొసగదు. తాంత్రికులలో శక్తి అంటే స్త్రీ. కనుక కులకుండలినీ మొ॥న శక్తులు అన్నింటినీ కూడా స్త్రీ శక్తికి భిన్నమైనవిగా మనము భావించలేము. ఆ రకంగా సుమ్నాషు నాడిపై స్త్రీత్వానికి ఏడు స్థానాలున్నాయి. ఇక యెగసాధన సంగతి చూద్దాం. తంత్ర సాధకుడు ఊపిరిని అదుపులో పెట్టుకోవడం వగైరా మార్గాల ద్వారా "కుల కుండలినీ, శక్తి"నీ ఉద్దీపింపచేయాలి. సుషుమ్నా నాడి క్రింది చివరి కేంద్రంలో నిద్రిస్తున్న శక్తిని మేల్కొల్పటం అన్నమాట. చిత్రిణీ నాడి ద్వారా ఈ శక్తిని పైకి పైపైకి వివిధ  దశలలో వివిధ పద్మాల ద్వారా మెదడుకు పంపడమే ఈ సాధనకున్న లక్ష్యం. సుషుమ్నా నాడిపై అత్యున్నత స్థానంలో ఉన్న పద్మము పేరు సహస్రదళ పద్మము (వేయిరేకుల పద్మము). తాంత్రికులు దీనిని చైతన్యానికి ఉన్నతోన్నతమైన స్థానంగా భావిస్తారు. తాంత్రిక యోగ సాధనలో సారాంశం ప్రకృతిని ఉద్దీపింపజేసి, శక్తివంతమొనర్చి నీచ కేంద్రమునుంచి చైతన్యస్థానమైన అత్యున్నత కేంద్రానికి బట్వాడా చేయటం. మధ్యలో ఉన్న దళాలను పద్మాలను గమించిపోయి ఉన్నతమైన చైతన్య స్థానాన్ని అందుకుంటుంది స్త్రీ శక్తి. ఇది వ్యక్తిత్వాన్ని స్త్రీత్వంగా సంపూర్ణంగా పరివర్తన చేసే ప్రయత్నం కంటే భిన్నమైనదేమీ కాదు. "కులకుండలిని" శక్తి సహస్రదళ పద్మాన్ని చేరినంతనే ఆమె అక్కడున్న పురుషత్వంతో ఐక్యమై అద్వైతాన్ని సాధించగా జరిగేదేమిటి? అన్నింటిని లీనమొనర్చుకునే స్త్రీత్వాన్ని ఉద్దీపింజేసి ఏకత్వాన్ని సాధించటమే.

తాంత్రికుల శరీర శాస్త్రాన్ని చర్చించనవసరం లేదు. అలాగే షట్‌చక్రభేద మార్గం ద్వారా సాధించుతున్నామని చెప్పే ఆత్మానందాన్ని కూడా మనం పట్టించుకోనక్కరలేదు. ఈ యోగ సాధన విషయంలో ఉండే ఊహాపోహలన్నీ (తంత్ర గ్రంథాల్లో) పురాతన సారాంశముపై రుద్దిన తరువాతి కాలపు ఆలోచనలే 'వామ భూతయజేత్ పరం' అనే సూత్రాన్ని ప్రత్యక్షంగా అనుసరించడానికి నిర్దిష్టమైన ఆచార పద్ధతి మాత్రమే మనకు ముఖ్యం. తంత్రవాదపు యోగసాధన విషయంలో మనం చెప్పుకునే ఈ వివరణ ఆధునికులు తంత్రవాదంపై రాసిన గ్రంథాలతో మాత్రమే పరిచయమున్న వారికి కొత్తగా కనపడవచ్చు. అయితే మనదే సరైన అవగాహన అని చెప్పడానికి కొన్ని ఆధారాలున్నాయి. ముఖ్యంగా చర్యగీతాలు. ఈ పాటల్లోని తాంత్రిక లక్షణాన్ని పండితులంతా స్థిరపరచిందే. అయితే వీటిల్లో స్పష్టంగా బౌద్ధ లక్షణాలు కనపడుతున్నాయి. "చండాలి, దొంబి, సవరి, యోగిని, నైరమణి, సహజసుందరి మొదలైన పేర్లతో పిలవబడే స్త్రీ శక్తి ఈ చర్య గీతాలలో కనబడుతుంది. అలాగే రూపెత్తిన ఈ స్త్రీ దేవతతో యోగి కలయికను గురించి కూడా తరచు చెప్పబడుతుంది" – (దాస్‌గుప్త).

అనేక పేర్లతో పిలవబడే స్త్రీ శక్తి చర్యగీతాల దృక్పథంలో యోగి శరీరానికి బాహ్యంగా ఉండదు. 'కులకుండలినీ' మొదలైన శక్తుల లాగానే ఈ స్త్రీ శక్తులన్నీ యోగి శరీరంలోనే ఉంటాయి. ఉదాహరణకు ఒకపాటలో "కాపాలి అయ్యాడు కణ్హయోగి/ ఆరంభించి యోగాభ్యాసము/తనమేని లోపలే/ క్రీడించుకున్నాడు అద్వైతరూపాన." యోగి శరీరంలో స్త్రీ శక్తి ఉద్దీపన చర్యగీతాలలో అనేక రకాలుగా భావించబడింది. "పద్మము ఒకటి, రేకులు అరవై నాలుగు, దొంబి అధిరోహిస్తుంది దాన్ని, నాట్యం ఆడుతుంది." కాని ఈ నాట్యాన్ని అన్నింటినీ దహించే అగ్నితో పోల్చారు. ఆ రకంగానే శుద్ధ స్త్రీత్వం మిగులుతుంది. "నాభిలో రగిలేను చండాలి/ తథాగతు లైదుగురు లోచనాది దేవతలు/ ఇంకా ఇంకా అన్నీ మండిపోయెను/ చంద్రుడు స్రవించేను 'హం' "స్వరాన్ని" మరోపాటలో చంద్రుడు నీరు పోస్తాడని కూడా ఉంది. అతి పురాతన భావజాలం ప్రకారం చంద్రుడు సహజమైన సస్యదేవత. ఈ విషయాన్ని బ్రిఫాల్ట్, థామ్సన్‌లు విశేషంగా చర్చించారు. ఇదే విషయాన్ని మనం గుర్తుపెట్టుకుంటే చంద్రుడు 'హం' అనే వర్ణాన్ని గానీ, జలాన్ని గానీ వర్షించాడని అన్నప్పుడు అర్థరహితంగానూ, మార్మికంగానూ కనబడదు. అయితే చర్య గీతాలలో భాష సాధక పద్ధతిలో ఉన్న వారికి మాత్రమే అర్థమయ్యే లక్షణముంది (సంజ్ఞా భాష). చర్యగీతాల దృష్టి నుంచి కూడా యోగ సాధన లక్ష్యం అంతర్గత స్త్రీ శక్తి ఉద్దీపన, తద్వారా ఆమె అద్వైత లక్షణ స్థాపన అని నిస్సంకోచంగా చెప్పుకోవచ్చు. ఆధునిక తంత్రవిద్యా పారంగతులు యోగ సాధనను గురించి సూక్ష్మాతిసూక్ష్మంగా వర్ణించారు. గానీ, ఎందుచేతనో మనం అనుకున్న ఈ అవగాహనను పట్టించుకోలేదు. కానీ, భండార్కర్ మాత్రం ఇలా అన్నాడు: "ఈ మతాన్ని (తంత్ర) అనుసరించే వారందరికీ త్రిపుర సుందరి (తాంత్రిక స్త్రీ సత్వానికి పేరు)తో ఐక్యం కావాలనే లక్ష్యం ఉంటుంది. తన మతాచారాలలో తనను స్త్రీగా ఊహించుకునే అలవాటు చేసుకుంటాడు. భగవంతుడు స్త్రీ రూపమనే భావనను సమర్థించుకోవడానికి శాక్తేయ మతస్థులు స్త్రీగా మారడాన్ని లక్ష్యంగా పెట్టుకుంటారు" అన్నాడు. కానీ, ఈ నమ్మకం ఎందుకొచ్చిందో భండార్కర్ సమాధానం చెప్పలేదు. అదే విధంగా 'సహజియా'లు ప్రతి మానవుడూ ఒక ప్రత్యేక సాంస్కృతిక దశలో స్త్రీగా మారాలి.' అని నమ్ముతారు. అలాగే తనలోని స్త్రీ స్వభావాన్ని గుర్తించనంతవరకూ అతనికి శుద్ధ ప్రేమానుభవం కలగదు" అని అంటాడు బోస్. "నీలోని పురుషుణ్ణి త్యజించు, ప్రకృతివిగా మారు, అప్పుడే నీవు అనంతంలో ఒక్కటవుతావు" అనే సహజియా గీతాన్ని ఉదహరించాడు. ఇదే బోసు సహజియాల దృక్పథాన్ని మానసిక శాస్త్ర ప్రాతిపదికపై సమర్థించడానికి ప్రయత్నించాడు. "పురుషుడు స్త్రీగా మారటం అంటే అర్థం ఏమిటి? ఎనభై ఏళ్ళ వృద్ధుణ్ణి తీసుకోండి. అతను మగవాడే. సందేహం లేదు. కానీ, అతని ఆవేశాలన్నీ చల్లారిపోయాయి. పురుషాంశలన్నీ అదృశ్యమైపోయాయి. తాతగారి ఈ పరిస్థితి వయస్సువల్ల క్షీణత వల్ల వచ్చాయి. కానీ, అదే రకమైన అపుంస్త్వాన్ని క్రమమైన మానసిక(Spiritual) వ్యాయామాల వల్ల సాధించిన యువకుడ్ని తీసుకోండి. అతనికి ఇంద్రియాలన్నీ పటిష్టంగానూ,

చురుగ్గానూ ఉంటాయి. వృద్ధాప్య ప్రభావానికి పూర్తిగా దూరంగా ఉంటాయి. కానీ బాహ్య వస్తువులేవీ చలనం కలిగించలేనంత స్థాయికి అతని ఇంద్రియాలు అదుపులోకి వచ్చాయి అన్నమాట..” ఈ అద్భుత మానసిక శాస్త్రం గురించి మనం ఆలోచించాల్సిన పనిలేదు. ఇది సహజియాలు దృష్టిలో పెట్టుకున్న మార్గం మాత్రం కాదు. సహజియాలు ఊహాత్మకమైన అపుంస్త్వాన్ని సాధించడానికి సిద్ధపడరు. వారికి స్త్రీగా మారే ఆదర్శం సూటిగా ఉంటుంది. అంటే అందరి పురుషుల్లోనూ నిబిడీకృతమైన స్త్రీ సత్వాన్ని ఉద్దీపింపజేసి తమలోని పురుష సత్వాన్ని ధ్వంసం చేయాలనే ఆదర్శం. పైగా ఉద్వేగాలను – ముఖ్యంగా కామాన్ని – నశింపచేయాలని సరైన తాంత్రికవాదం ఏదీ లక్ష్యంగా పెట్టుకోదు. అందులో సహజియా తాంత్రికవాదం అసలు పెట్టుకోదు. పైగా తమలోని అంతర్గత ఉద్వేగాన్ని – స్త్రీ సత్వ ఉద్వేగాన్ని రెచ్చగొట్టి ఒక రకమైన మహో ద్రేక స్థాయికి దాన్ని తీసుకువెళ్ళడం వాళ్ళ లక్ష్యం. సహజియాల గ్రంథాలన్నీ “బోధిని సాధించాలనుకున్న వాడు కామక్రియలో పాల్గొని తీరాలి (పంచకామాలు) అని చెబుతాయి” – (శాస్త్రి).

వామాచారంలో స్త్రీకి ఇంత ప్రాధాన్యత ఎలా వచ్చింది? అది వ్యవసాయ కార్యక్రమాల అవసరాలవల్ల ప్రారంభమైందని మనవాదం. అంటే అంతకు మునపటి అభివృద్ధి దశలోని వ్యవసాయావసరం. అప్పటికి వ్యవసాయ సాంకేతిక శాస్త్రం పెద్దగా అభివృద్ధి చెందలేదు. ఈ దశలో వాస్తవ కర్మకాండకు భ్రమాపూరిత కర్మకాండ అనుబంధంగా అవసరం. వ్యవసాయ కళ ‘మహత్తు’ తోనూ, క్రతువులతోనూ నిండి ఉండేది. అయితే ఈ మహత్తులపై నమ్మకం, సారాంశం ఏమిటి? ప్రకృతిలోని సృష్టి కార్యక్రమమంతా మానవ శిశూత్పత్తిని పోలి ఉంటుంది. దానిమీద ఆధారపడి ఉంటుందని వాళ్ళ నమ్మకం. అందులో స్త్రీ పాత్రకు ప్రాముఖ్యత ఉంటుంది. తంత్రవాదానికి మూలం ఈ అతి ప్రాచీన విశ్వాసంలో దొరుకుతుంది. ప్రకృతిలోని ఉత్పత్తి కార్యక్రమాన్ని త్వరితం చేసే ముఖ్యమైన అన్ని వ్యవహారాల్లోనూ, మూగగా వున్న స్త్రీ సత్వాన్ని మేల్కొల్పడంలో – లేక తనకు తాను స్త్రీగా మారడంలోనో – ఉండి ఉంటుందనే నమ్మకం నుంచి తాంత్రికుల  యోగసాధనా మార్గం కనుగొనబడింది.

## వ్యావసాయక కర్మకాండ

వ్యావసాయక కర్మకాండలో ఇమిడి ఉన్న సైద్ధాంతిక స్థాయిని నిర్ణయించి తంత్రవాదానికి ప్రత్యేకాంశాలు చర్చిద్దాం. ఒరినాకో ఇండియన్లు మండుటెండలో పిల్లలను భుజాన వేసుకున్న స్త్రీలతో విత్తనాలను చల్లింపచేయటం చూసిన కాథలిక్కు పురోహితులు కోప్పడినప్పుడు వారు ఇలా అన్నారట, “ఫాదర్! ఈ సంగతులు మీకేమీ అర్థం కావు. అందుకనే చిరాకు పడుతున్నారు. ఆడవాళ్ళు పిల్లల్ని కంటారని, మగవాళ్ళం కనలేమనీ మీకు తెలుసుకదా! ఆడవాళ్ళు విత్తనాలు చల్లితే జొన్నకర్ర రెండు మూడు కంకెలు వేస్తుంది. యుక్కాదుంప రెండు

మూడు బుట్టల దుంపల్నిస్తుంది. అలా అన్నీ ఇబ్బడి ముబ్బడిగా ఫలితాన్నిస్తాయి. ఎందుకని? ఆడవాళ్ళకే ఎలా కనాలో తెలుసు. అలాగే, చల్లే విత్తనాలని ఎలా పుష్కలంగా పండించాలో తెలుసు. అలాంటి విషయాల్లో వాళ్ళకు తెలిసినంత మగవాళ్ళకు తెలియదు" – (ఫ్రేజర్). వ్యవసాయానికి సంబంధించిన మహత్తు గురించి వారి నమ్మకానికిదో ఉదాహరణ. మానవసారం (సంతానాన్ని కనేశక్తి) ముఖ్యంగా స్త్రీల సారం, ప్రకృతిలో ఉన్న సారం ఒక తెగకే చెందినవని వాళ్ళ నమ్మకం. అంటే మానవ శిశుజననానికి, వ్యావసాయికోత్పత్తికి సంబంధం ఉందని భావం. అందుకనే అనుకరణ ద్వారా ఒక రకమైన ఉత్పత్తిని, మరో రకమైన ఉత్పత్తి ప్రభావితం చేయగలదు. అలాగే స్పర్శ వల్ల కూడా. అందుకనే స్పర్శా మహత్తు, సరూపగుణ మహత్తు అని రెండు రకాల మహత్తులతో వ్యవసాయోత్పత్తిని పెంచవచ్చునని వారు నమ్మారు. మానవ జన్మోత్పత్తినీ పంటల ఉత్పత్తిని ఒకే రకమైనవిగా భావించడం వలన వారు మానవ జన్మోత్పత్తికి ఆధారంగా పంటలను కూడా ఎక్కువ చేయవచ్చునని ఊహించారు. మధ్యాఫ్రికాలోని బగాండా తెగల ఉదాహరణ చెప్పుకోవచ్చు. 'కవల పిల్లలకు కన్నజంట అత్యద్భుతమైన సారం కలవారిగా వన్నె కెక్కుతారు. వారికి అరటి చెట్ల ఫలదీకరణను కూడా విస్తృతం చేసే శక్తి ఉంటుందని బగాండాల నమ్మకం. (అరటిపండ్లు వారి ముఖ్య ఆహారం). కవలలను కన్న కొద్దికాలం తరువాత ఒక ఉత్సవం చేస్తారు. దాని లక్ష్యం ఆ తల్లిదండ్రుల సారశక్తిని అరటిచెట్లకు సంక్రమింపజేయటం. తల్లి వత్తయిన పచ్చిగడ్డి మీద పండుకుంటుంది. ఒక అరటి పువ్వును తన కాళ్ళ మధ్య పెట్టుకుంటుంది. భర్త వచ్చిన తన జననాంగంతో ఆ అరటి పువ్వును పడగొడతాడు. తరువాత వారిద్దరూ తమ కిష్టలైన వారి పొలాల గుండా నృత్యం చేస్తూ వెళతారు. ఇదంతా అరటిచెట్లు ఎక్కువగా పండటానికి దోహదం చేస్తాయనే", మన సంస్కృత కావ్యాల్లో కూడా కథానాయిక చెట్లకు, మొక్కలకు దోహదం చేయటం మనం ఎరిగిందే. పై ఉదాహరణలో పురుషుడి ఉత్పత్తి శక్తికి కూడా కొంతపాలు ఉన్నట్లు కనపడుతుంది. కానీ, ఫ్రేజర్ చెప్పిన 'ఒరినోకో' ల వ్యవహారంలో ఈ శక్తి స్త్రీలకు మాత్రమే పరిమితం. ఇది బహు పురాతనమైన నమ్మకం. స్త్రీ సారానికి, భూసారానికి బాంధవ్యం ఉందని నమ్మకం. వ్యవసాయం స్త్రీలు కనిపెట్టిందే కనుక వ్యవసాయోత్పత్తి పూర్తిగా స్త్రీల జననోత్పత్తి కార్యానికి అంటకట్టబడింది. గర్భిణి స్త్రీల మహత్తు, శక్తి పంటలకు కూడా వ్యాపిస్తుందని బవేరియన్, ఆస్ట్రియన్ రైతులు కూడా భావించేవారని ఫ్రేజర్ అంటాడు. ఒక చెట్టున కాచిన మొదటి పండు గర్భిణీ స్త్రీకిస్తే పై సంవత్సరంలో ఆ చెట్టు విరగకాస్తుందని కూడా వారు నమ్ముతారు. మరోవైపున గొడ్రాలు భార్య, తన భర్త తోటలను కూడా నిస్సారం చేయగలదనీ, ఆ చెట్లు కాయకుండా చేయగలదనీ బగండాలు నమ్ముతారు. అందుకనే పిల్లలు లేని స్త్రీలను వెలివేస్తారు. 'సారవంతమైన స్త్రీ చెట్లను ఫలదీకరిస్తుంది. గొడ్రాలు వాటిని నిష్ఫలం చేస్తుంది.' – (ఫ్రేజర్). ఈ విషయం బ్రిఫాల్ట్ ఇంకా విశదంగా చెప్పాడు. 'భూసారం తరతరాలుగా స్త్రీలతోనే పెనవేసుకుని ఉన్నది. స్త్రీలే వ్యవసాయం చేసేవారు కనుక వ్యావసాయక మహత్తు వారికే ఉంటుంది. అనే నమ్మకం

బహు పురాతనం.' 'స్త్రీల సహజ శరీర నిర్మాణము, పునరుత్పత్తి క్రమం వారికి మహత్తును సంక్రమింప చేశాయని ఒక నమ్మకం. అందుకే వారికి అతీత శక్తులు, మహిమలు ఉన్నాయని భావించబడింది.' సంతానాన్ని భరించే శక్తి స్త్రీలకు సహజము. నిజానికదే స్త్రీత్వము. అందుచేతనే వ్యవసాయ కార్యక్రమాల్లో కష్టాలు కూడా స్త్రీలు భరించగలరని ప్రాచీనంగా వస్తున్న ఊహ. వ్యవసాయము ఫలప్రదమవడానికి స్త్రీ సంతానధారణశక్తి ఆధారమని ప్రాచీన మానవుడు అనుకున్నాడు.

'చెరోకి' తెగవారు ధాన్యాన్ని స్త్రీలే కనిపెట్టారని భావిస్తారు. 'స్త్రీ తన శవాన్ని భూమిపై ఈడ్చుకుంటూ తీసుకెళ్ళాలనే ఆజ్ఞాపించింది. శవం అంటిన చోటల్లా పుష్కలంగా పండింది'. బ్రెజిల్‌కు చెందిన టూపి తెగవారు ఒక యువతి ఎవరితోనూ లైంగిక సంపర్కం లేకుండానే మంచులాంటి తెల్లని బిడ్డని కన్నదని కథ చెప్పుకుంటారు. ఆ బిడ్డ సంవత్సరం తరువాత మరణించాడు. ఆ శవాన్ని పాతి పెట్టారు. ఆ పాతిన చోటు ఒక మొక్క మొలిచింది. ఒక కాయకాచింది. అదే భూమిపై మొదటి 'మానియొక్' చెట్టు అని వారి నమ్మకం. న్యూజిలాండ్‌లో గర్భిణి స్త్రీకి, చిలకడ దుంపల పొలం ఉన్న స్త్రీకి ఒకే రకమైన జాగ్రత్తలు తంతులు చేస్తారు. నికోబార్ ద్వీపస్తులు గర్భిణితో విత్తనాలు చల్లిస్తే బాగా పండుతాయని నమ్ముతారు. దక్షిణ ఇటలీలో కూడా అలాంటి నమ్మకమే ఉంది. వీటన్నిటి వెనుక ఉన్న సూత్రం ఒకటే. భూసారము, స్త్రీ సారము ఒకే లక్షణాన్ని కలిగి ఉంటుంది. ఈ పురాతన విశ్వాసాన్ని ఒక గ్రీకు పాటలో చూడవచ్చు. 'యూదు యువతి పంటను నూర్చుతోంది. ఆమె గర్భిణి. కాసేపు నూర్చుతోంది. కాసేపు గోధుమ కట్టపై ఒరుగుతోంది. ఆమె ఒక బంగారు బిడ్డను భరిస్తోంది.' ఈ ప్రాథమిక భావం అనేక రూపాల్లో ప్రత్యక్షమవుతుంది. బ్రిఫాల్ట్ ఈ భావం సర్వత్రా ఉందని కూడా సూచించాడు. పండే భూమికీ, గర్భిణికీ సమాన ధర్మాలున్నాయి అనే భావం సార్వత్రికము. వ్యవసాయోత్పత్తి విషయంలో ఉన్న ఈ ప్రాచీన భావం బరువైనది కాదనుకుంటే, మానవ జన్మను గురించిన ఊహలు కూడా మొదట్లో అలాగే ఉండేవని గుర్తు పెట్టుకోవాలి. పుట్టుకకు, లైంగిక సంపర్కానికి ఉన్న కార్యకారణ సంబంధం అర్థం చేసుకోడానికి మానవజాతికి కొన్ని యుగాలు పట్టింది. ఇప్పటికే ఆస్ట్రేలియన్, అమెరికన్ ఆదిమ జాతులలో ఇదే భావం కొనసాగుతోంది. లైంగిక సంబంధం పుట్టుకకు అవసరమని తెలుసుకోలేని అజ్ఞానంలోనే వారింకా ఉన్నారు. పిల్లలు భూమాత నుంచే గర్భంలో ప్రవేశిస్తారని వారు నమ్ముతారు. భూమిలో ఉన్న ఒక గుహ నుంచి పిల్లలు వస్తారనీ, భూమిపై చెవి ఆనించి వింటే ఆ పుట్టని పిల్లల ఏడ్పులూ కేకలూ వినగలమనీ వారంటారు. క్రిస్టియన్ మత ప్రచారకులు అలాంటి నమ్మకాలు పోగొట్టడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చింది. ఇంకా కొన్ని ప్రదేశాల్లో ఇదే నమ్మకం వేరే రూపాల్లో కనబడుతుంది. పుట్టగానే శిశువును నేలపై పెట్టడం అనే సంప్రదాయం అసలు తల్లి, భూమి అని చెప్పడానికి సంజ్ఞ. ఈ సంప్రదాయాన్ని రోమన్లు కూడా గౌరవించేవారు. మొరటు ఆటవికులు ఈ

సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. శ్రీలంకకు చెందిన 'వెడ్డా' తెగవారు శిశువును నేలమీద పెడతారు. బ్రెజిల్ టూపీలు, గోల్డ్‌కోస్ట్ మధ్యాఫ్రికా ప్రాంతీయులు ఇలాగే చేస్తారు. సిసిలీలో జన్మించిన మరుక్షణం శిశువును నేలమీద పెట్టకపోతే ఆసుపత్రిలోనే చనిపోతుందని నమ్ముతారు. శిశు జన్మానికి సంస్కృతంలో ఉన్న సామాన్యపదం 'భూమిష్ట', అంటే 'నేలమీద పెట్టబడుచున్న', అని అర్థం. అంటే కథ అర్థం అయినట్టే కదా!

ఆ రకంగా ఈ ప్రాచీన విశ్వాసానికి రెండు లక్షణాలున్నాయి. ఒకటి భూమిపై మొక్కల పెంపకం స్త్రీ శరీరంలోని జననశక్తిపై ఆధారపడి ఉంది. రెండు స్త్రీకి కల గర్భధారణ శక్తిపై ఆధారపడి ఉంది. ఈ రెండూ మహత్తుకు సంబంధించినవే. ఈ రెండో అంశంపై వివరణ కోసం మరికొన్ని ఉదాహరణలు చూద్దాం. పిల్లలు కావాలనే కోరిక గల స్త్రీలు ఒక రాయినో, మట్టిబెడ్డనో, చెట్టుకు వెళ్ళాడతీయటం భారతదేశమంతటా ఉన్న సంప్రదాయం. చెట్టు కాయలను కాయునట్టుగా స్త్రీలు కూడా గర్భం ధరిస్తారనే ఆశ ఇందులో ఇమిడి ఉంది. కొన్ని సందర్భాలలో సంతానవతి కావాలనుకున్న స్త్రీ తొడపైన పండ్లు, కూరగాయలు పెడతారు. భారతదేశమంతా వ్యాప్తిలో ఉన్న అనేక సంప్రదాయాలలో ఈ నమ్మకాన్ని చూడవచ్చునని ఫ్రేజర్ అంటాడు. వృక్షదేవత, మందల పెంపుదలకు స్త్రీల గర్భాలకు తన మహత్తును ప్రసాదిస్తుంది. ఉత్తర భారతంలో 'ఎంబ్లికా ఆఫీషినాలిస్' పవిత్రమైన వృక్షము. ఫాల్గుణ ఏకాదశినాడు ఆ వృక్ష మూలాన తర్పణలు విడుస్తారు. చెట్టు మొదలకు పసుపు పచ్చని తాడు చుడతారు. స్త్రీలకు, పశువులకు, పంటలకు ఫలప్రాప్తి జరగాలని పూజలు జరుపుతారు. ఇంకా ఉత్తర భారతదేశంలోనే కొబ్బరికాయను అతి పవిత్రమైనదానిగా భావిస్తారు. దానిని శ్రీ ఫలం అని పిలుస్తారు. అంటే సంపదకు దేవతయిన లక్ష్మి లాంటి ఫలమన్నమాట. కొబ్బరికాయ సారమునకు గుర్తు. "ఉత్తరభారతమంతటా గుడిగోపురాలలో కొబ్బరికాయల నుంచి సంతానవతులు కాదలచుకున్న స్త్రీలకు ఇస్తూ ఉంటారు." ఈ నమ్మకాలన్నీ ఇప్పుడు మత రూపాన్ని ధరించాయి. అయినా మూలంలో ఇవి మహిమకు సంబంధించినవే. మరికొన్ని సందర్భాలలో ఇవే నమ్మకాలు వింతరూపాలలో కనపడతాయి. గొడ్రాళ్ళు వర్షాల్లో నగ్నంగా నిలుస్తారు. లేదా బిందెల కొద్దీ నీళ్ళు పోసుకుంటారు. గొడ్రాలితనం అలా పోతుందని వారి ఉద్దేశం. నీరు భూమికి సారాన్నిచ్చే తొలి ప్రకృతి శక్తి. అందుకనే స్త్రీలకు కూడా అదే ఫలితాన్ని కలుగచేస్తుందని నమ్మకం. పంజాబులో పిల్లలు కావాలనుకున్న స్త్రీలు వీధులు కలిసిన చోట్ల బజారుల్లో స్నానాలు చేస్తారు. అక్కడే కొన్నిచోట్ల స్త్రీని పీటమీద కూర్చోబెట్టి నూతుల్లోకి దించుతారు. ఆమె బట్టలూడదీసి స్నానం చేసిన తరువాత పైకిలాగ బడుతుంది. నూతిలోకి దిగడం సాధ్యపడకపోతే స్నానపు తంతును చెట్టుకింద ముగిస్తారు. ఈ తంతును నూతి సారశక్తిని కానీ, వృక్ష సారశక్తినిగానీ స్త్రీలోకి పంపే చర్యగా భావిస్తారు. నుయ్యి ఎండిపోతుంది. చెట్టు రాలిపోతుంది. స్త్రీ గర్భం ధరిస్తుంది. కాంధులలో గొడ్రాలిని ఒక జల సంగమం దగ్గరికి

పూజారి తీసుకువెళతాడు. ఆమె మీద నీళ్ళు చిలకరిస్తాడు. కోయ గోండ్లలో పెండ్లికూతురు తలపైన నీరుపోస్తారు. దిగువ హిమాలయ ప్రాంతంలో ఆమె చేతుల మీద పోస్తారు. ఇతరచోట్ల కూడా ఈ నమ్మకాలు వ్యాప్తిలోకి ఉన్నాయి. "సారవంతం చేసే వర్షాలు, ప్రవహించే నీరు భూమిని ఫలప్రదం చేసినట్లే స్త్రీలను కూడా ఫలప్రదం చేయగలవు" – (బ్రిఫాల్ట్). "బుష్‌మన్ తెగకు చెందిన స్త్రీలు, బాలికలు వర్ష సమయంలో జాగ్రత్తగా ఉంటారు. ఎందుకనంటే స్వర్గం నుంచి పడుతున్న వాన భూమిని ఫలప్రదం చేసినట్లే తమకు గర్భం తెప్పిస్తుంది. హాటెంటాట్ స్త్రీలు ముందు ఉరుములు – మెరుపుల వానలో నగ్నంగా నిల్చోకపోతే పిల్లలు కలుగుట అసాధ్యమని నమ్ముతారు. అస్ట్రేలియన్ స్త్రీలు కూడా అలాగే వర్షం వల్లనే గర్భిణులవుతామని నమ్ముతారు. ఒక మంగోలు రాణి వడగళ్ళ వానతో గర్భందాల్చింది" – (బ్రిఫాల్ట్). ఇదే నమ్మకానికి 'తలక్రిందులు' ఉదాహరణలు కూడా ఇవ్వవచ్చు. స్త్రీ సారశక్తి భూమిని ఫలప్రదం చేసే వర్షాన్ని సాధించే సాధనంగా భావించుతారు. 1873 –1874 క్షామంలో (గోరక్‌పూర్) రాత్రి వేళ స్త్రీలు గుంపులు గుంపులుగా నగ్నంగా ఇళ్ళలో నుంచి బయటకు వచ్చి నాగళ్ళు తీసుకుని పొలాల్లోకి ఈడ్చుకుంటూ వెళ్ళారు. మీర్జాపూర్ దీర్ఘ క్షామం సందర్భంలో ఒక రైతు కుటుంబంలోని ముగ్గురు స్త్రీలు పూర్తిగా నగ్నమయ్యారు. అంతకు ముందే పురుషులను ఆ ఛాయల్లో లేకుండా చేశారు. అందులో ఇద్దరు నగ్న స్త్రీలను నాగలి కాడికి కట్టి మూడో నగ్న స్త్రీ మేడివద్ద నిలబడి కలిసి దున్నుడు కార్యక్రమాన్ని అనుకరించారు. అలాగే, ఉత్తర బెంగాల్‌లో క్షామ పరిస్థితులు వచ్చినప్పుడల్లా ఆ రాజ్ వంశీయులు, కోచ్ తెగవారు – అంటే వారి స్త్రీలు– పూర్తిగా నగ్నమై ఆ నగ్న స్థితిలోనే వారి వాన దేవుడి విగ్రహం ముందు నృత్యం చేస్తారు. గుజరాత్‌లో శ్రామిక వర్గాలకు చెందిన కూర్మి, నునియా, కహర్, చామర్, దశద్, ధమ్కా కులాల వారు కూడా ఇదే ఆచారాన్ని పాటిస్తారు. ఇలాంటి ఆచారాలు ప్రపంచంలో అన్ని ప్రాంతాల్లోనూ ఉన్నాయి. "జార్జియాలోని కకేషియన్ రాష్ట్రంలో క్షామ పరిస్థితులు దీర్ఘంగా కొనసాగినప్పుడు పెళ్ళీడు ఆడపిల్లలను జంటలు జంటలుగా నాగలికాడి వారి భుజాన వేసి పూజారి వారిని నడిపించుతూ నదులు, గుంటలు మొదలగు వాటి గుండా ప్రార్థిస్తూ, అరుస్తూ, కేకలు వేస్తూ, ఏడ్పులతో, నవ్వులతో తిప్పుతాడు" – (ఫ్రేజర్). కొన్ని చోట్ల ఇలాంటి ప్రదర్శనలలో పూజారి గానీ, ప్రార్థన గానీ ఉండవు. ట్రాన్సిల్వేనియాలో నేల ఎండకు బెట్ట విచ్చినప్పుడు కొందరు కన్యలు బట్టలు విడిచేసి నగ్నమైన వృద్ధురాలితో కలిసి ఒక నాగలిని ఎత్తుకొని పొలాల గుండా పోయి, చివరికి ఆ నాగలిని ఒక సెలయేటిలో విడిచిపెడతారు. సెర్వియాలో వర్షాభావ సమయాల్లో ఆడపిల్లను నగ్నం చేసి పువ్వులు చుడతారు. ఈ అర్ధనగ్న స్థితిలో ఆమె ప్రతి ఇంటి వద్ద నృత్యం చేస్తుంది. ఆ ఇంటిలోని పెద్ద స్త్రీ (కులమాత అన్నమాట) బయటకి వచ్చి ఆ పిల్ల మీద నీరు పోస్తుంది. ఆ పిల్ల సహచరిణులు వాన పాటలు పాడతారు.

ఇదంతా ప్రకృతిలోనికి స్త్రీ సహజమైన సార శక్తిని చొప్పించడానికి చేసే కృషి అని నమ్మడం వలన జరుగుతోంది. తరువాతి కాలంలో మానవ విజ్ఞానం పెరిగినప్పటికి లైంగిక సంపర్కానికి, గర్భానికీ ఉన్న సంబంధం స్థూలంగా తెలిసినప్పటికీ ఇంకా ఈ పాత నమ్మకం కొనసాగడం గమనించ తగ్గ విషయం. ధాన్యాన్నిచ్చే భూమి, పిల్లల్ని కనే తల్లికి సమానంగా చూడబడింది. తత్ఫలితంగా స్త్రీ గర్భధారణ శక్తి ప్రకృతి ఉత్పత్తి శక్తిని పెంచేదిగానూ మరో వైపున సహజమైన ఫలదీకరణ శక్తి మానవ పునరుత్పత్తికి ముఖ్యంగా స్త్రీ పునరుత్పన్న శక్తికి సహాయ పడేదిగానూ భావించడం జరిగింది.

## దుర్గపూజ ఎలా మొదలైంది?


భూ మాతను, మానవ మాతను ఒకే దృష్టితో చూసే ఈ పురాతన విశ్వాసం ప్రాచీన ప్రపంచంలోని మహా దేవతల (అమ్మతల్లులు), మహా మాతల రూపకల్పనకు ఎంత సహాయపడిందో బ్రిఫాల్ట్ విస్తృతంగా వివరించాడు. హిందూ మతంలో ఉన్న ఒక ఉదాహరణను మాత్రమే ఇక్కడ మనం చూద్దాం. తంత్రవాద మూలం ఆ ఉదాహరణలో దొరుకుతుంది. కాబట్టి ప్రత్యేకంగా దాన్ని తీసుకుందాము. మార్కండేయ పురాణంలో దేవీ మహాత్మ్యం అనే ముఖ్యమయిన అధ్యాయం ఉంది. దానిలో ఆ దేవి ఒక విచిత్రమైన పలుకు పలికింది. “ఓ దేవతలారా! నా శరీరం నుంచి పుట్టుకు వచ్చే జీవ పోషక శాకములతో ప్రపంచాన్ని పోషిస్తాను. అది కుంభ వృష్టి కాలంలో సంభవిస్తుంది. (ఆత్మదేహ సముద్భవైః) శాకంబరిగా భూమిపై నేను ప్రసిద్ధి చెందుతాను”.

శాకంబరి అనే పేరు విలక్షణంగా ఉంది. ఆ పదానికి అర్థం శాకములను ధరించునది. లేదా శాకములను పోషించునది. జీవ పోషక వృక్ష సంతతి వర్షాకాలంలోనూ అందులో ఆమె స్వశరీరం నుంచి ఉద్భవిస్తాయని చెప్పడంలో ఈ భావం ఇంకా ప్రస్ఫుటమైనది. ఈ పేరుకు అట్టడుగు మొక్కలు స్త్రీ శరీరం నుంచి వెలువడ్డాయనే ప్రాచీన విశ్వాసం దాక్కొని ఉంది. దీనికి సజీవ ఉదాహరణలు చెరూకిలు, టుపీలు మొదలైన వెనుకబడిన తెగలలో ఇదే భావం స్థిరంగా ఉండడమే. దీన్ని పైన గమనించాం. ఈనమ్మకానికి కచ్చితమైన సాక్ష్యం హరప్పా శిధిలాలలో దొరుకుతుంది. మార్షల్ ఆ సాక్ష్యాన్ని ఇలా వర్ణిస్తాడు. హరప్పాలో దొరికిన దీర్ఘ చతురస్రాకారపు ముద్ర చాలా ప్రాముఖ్యమైనది. ఆ ముద్రపై తల్లక్రిందులుగా నిలబెట్టబడిన స్త్రీమూర్తి, ఆ మూర్తి గర్భాశయం నుంచి పైకి వచ్చిన మొక్క”.

ఆ ముద్రికపై ఆరు అక్షరాలు కూడా ఉన్నాయి. బహుశా శాకంబరి అనే పేరుకు సంబంధించిన వివరణ ఆ అక్షరాల్లో దొరకవచ్చు. అయితే, సింధు లోయ లిపిని ఇంకా మనం పరిష్కరించలేదు. ఆ ముద్రికపై ఉన్న భావానికి భారత సంస్కృతిలో వేరే కాలాల్లో అక్షరరూపం ఉంది. మార్షల్ ఇలా అంటాడు: “భారత దేశంలో నాకు తెలిసినంత వరకూ ఇలాంటి చిత్రీకరణ



పూర్ణఘటం



సర్వతో భద్ర మండలం

– భూదేవత గర్భం నుండి పైకి వచ్చిన వృక్షం – ఏకైక ఉదాహరణ అయినప్పటికీ అసహజం మాత్రం కాదు. ఉత్తరప్రదేశ్ బిటా ప్రాంతంలో దొరికిన గుప్తయుగపు మట్టి శిల్పానికి సమానంగా ఉంది ఈ ముద్రిక. అయితే, మట్టి శిల్పంలో దేవి అదే భంగిమలో ఉన్నప్పటికి పద్మము గర్భాశయము నుంచీ కాక మెడ నుంచి పైకి వచ్చింది." దేవతకు, వృక్షజాతికి ఉన్న బంధం స్పష్టము. ఆర్.పి.చందా సింధులోయ తవ్వకాలకు ముందే ఈ విషయం చెప్పాడు. అంతేగాక దేవి ప్రఖ్యాత నామాలైన 'అన్నదా', 'అన్నపూర్ణ' పదాలను కూడా ఈ కోణం నుంచే చూడాలన్నారు. 'అన్నదా' అంటే ఆహారం ఇచ్చున్నది. 'అన్నపూర్ణ' అంటే ఆహారంతో నిండి యున్నది. మొక్కలకు స్త్రీ దేవతలకు మధ్యనున్న బంధం శాక్తేయంలోని కుల వృక్షముల ప్రాముఖ్యత నుంచీ చూడాలి. "ఈ సందర్భంలో శాక్తేయ మందలి కుల వృక్ష ఆరాధన జాగ్రత్తగా గమనించాల్సిన అంశము. శాక్తేయులు ఉదయము లేవగానే నిర్వర్తించవలసిన మొదటి విధి "ఓం కుల వృక్షోభ్యోనమః" అని చెట్టుకు నమస్కరించాలి. "కుల చూడామణి" ప్రకారం "భక్తుడు కుల వృక్షాన్ని చూసినప్పుడల్లా నమస్కరించాలి". 'శాక్తానంద తరంగిణి' కర్త రెండు రకాల కుల వృక్షాల జాబితాలను ఇస్తాడు.... కుల వృక్షాలను గురించి 'ఈ కుల వృక్షాలన్నింటిలో కుల యోగినులు వసిస్తారు. కుల వృక్షాల క్రింద నిద్రించరాదు. వానికి అపకారము చేయరాదు' – (ఆర్.పి. చందా). చందా ఈ సందర్భంలో చెప్పిన అన్ని విషయాలకంటే దుర్గపూజ ప్రారంభానికి వృక్ష సంతతికీ గల సంబంధాన్ని చెప్పడమే ముఖ్యమైన విశేషం. దురదృష్టవశాత్తు ఆయన ఇంకా ఎక్కువ వివరాల జోలికి వెళ్ళలేదు.

సింహాన్ని అధిరోహించి పది చేతులతో ఉన్న దుర్గాదేవి రూపు మనకెంత తెలిసినదయినప్పటికి నిజం చెప్పాలంటే దుర్గ పూజలో జరిపే అసలు సిసలు క్రతువుతో ఆ రూపానికేమీ సంబంధం లేదు. అసలు ఇలాంటి రూపం దుర్గకు కల్పించడమనేదే మన చరిత్రకారులు పరిష్కరించవలసిన ఆసక్తికరమైన సమస్య. అయితే దుర్గకూ ఈ ప్రస్తుత

రూపానికి ఉన్న సామీప్యత చాలా ఆలస్యంగా (అంటే ఇటీవల) ఏర్పడి ఉండాలి. దుర్గపూజలోని కేంద్రకమైన తంతు లేదా క్రతువు మాత్రం పెద్దగా మారలేదు. ఒక శతాబ్దం క్రితం వరకూ బెంగాలీ విగ్రహకర్తలకు పది చేతులుకల సింహాన్ని అధిరోహించిన, పుత్ర పుత్రికలతో పరివేష్టితమైన దుర్గ సంగతి తెలియదు – (బందోపాధ్యాయ). ఈ విగ్రహం చుట్టూ ఎంత వెలుగు జిలుగులు పెంచినప్పటికీ అసలు దుర్గ పూజకూ దానికీ ఏమీ సంబంధం లేదు. అసలు క్రతువు పూర్ణ ఘట్టం, 'యంత్రం'లతో ముడిపడి ఉంది. పూర్ణఘటం అంటే నీరు నింపిన మట్టిపాత్ర. దానిని క్రింద చెప్పినట్లుగా పెడతారు. పంచ సస్యాలను బల్లపరపుగా, చతురస్రంగా ఉన్న మట్టిపై జల్లుతారు. దానిపై నీరు నింపిన మట్టిపాత్రను పెడతారు. పెరుగు కలిపిన అన్నాన్ని ఆ పాత్రలో ఉంచుతారు. ఈ పాత్ర మెడచుట్టూ ఎర్రని దారాన్ని కడతారు. పాత్ర మూతిని అయిదు రకాల ఆకులతో కప్పుతారు. ఆ ఆకులమీద బియ్యము, వక్కలు ఉన్న మూకుడు పెడతారు. మళ్ళీ దానిపై ఒక పండు, వీలయితే తొడిమ ఉన్న కొబ్బరికాయను పెడతారు. కొబ్బరి కాయకు కుంకుమ పూస్తారు. క్రింద వున్న మట్టికుండ పై కుంకుమతో మానవ శిశువు చిత్రం వేస్తారు. ఆ చిత్రాన్ని 'సింధూరపుత్తళి' అంటారు. ఇప్పుడీ పాత్రను అంతటినీ కలిపి 'పూర్ణఘటం' అంటారు. పూర్ణఘటం ఉంచిన చతురస్రాకారపు మట్టిపై ఒక బొమ్మ ఉంటుంది. దానిని 'సర్వతోభద్ర మండలం' అంటారు. అది తంత్రవాదంలో 'యంత్రములు' అని ప్రసిద్ధి చెందిన బొమ్మలలో ఒకటి. దాని కేంద్రంలో ఎనిమిది రేకుల పద్మం ఉంటుంది (అష్టదళ పద్మ). తంత్రంలో పద్మం స్త్రీ జననాంగమునకు సంజ్ఞ అని మనకు ఇదివరకే తెలుసు. పూర్ణ ఘటాన్ని సర్వతోభద్ర మండలంపై పెట్టడంలోని అంతరార్థం మనం తేలిగ్గానే గ్రహించవచ్చు. మొక్కలు పళ్ళు స్త్రీ జననాంగానికి దగ్గరగా తీసుకురాబడ్డాయి. అదే భావం పూర్ణఘటం కూడా వ్యక్తం చేస్తుంది. ఆ మట్టిపాత్ర స్త్రీ జననాంగము. సింధూర పుత్తళి బొమ్మతో దాన్ని సూచించటం జరిగింది. ఇది మానవోత్పత్తికి ప్రతిరూపము. కుంకుమను చిహ్నముగా వాడటంలోనే ఆ అంశం స్థిరపడుతోంది. ఈ మానవోత్పత్తి ప్రదర్శన ఎందుకు? పళ్లు, మొక్కలు. ఆకుల విస్తరణకే. అందుచేతనే వాటన్నింటినీ 'స్త్రీ జననేంద్రియాన్ని' స్పృశించేటట్లు ఏర్పాటు చేశారు. మనం తిరిగి ప్రకృతి ఉత్పాదకతను మానవ ఉత్పాదకతతో అనుకరింపజేసి – లేక స్పృశించేటట్లు చేసి –ఇది వరకే అనుకున్న మహత్తు వద్దకు వస్తాం. (ముఖ్యంగా స్త్రీ ఉత్పాదకత) . దుర్గ పూజకు ఇదీ అసలైన అర్థం, దానిలో నిర్ధారణగా ఆత్మకు లేదా మతానికి సంబంధించిన వ్యవహారాలేవీ లేవు. అది ఒక వ్యావసాయక భావన (మహత్తు).

## లతాసాధన - యంత్రములు

ఆధునిక ప్రమాణాలతో చూస్తే తంత్రవాదుల లైంగిక సిద్ధాంతాలు, ఆచారాలు – వానిని మించిన మొరటైన అసభ్యమైన వ్యవహారాలేవీ ఉండవు. ప్రాచీన తంత్రవాదాన్ని గురించి రాసే రచయితల రెండు దృక్పథాల్ని ఇది సూచిస్తుంది. తంత్రవాదాన్ని తక్షణం తిరస్కరించడమో, లేదా అందులో ఉన్న అసభ్యాలను కప్పిపెట్టి దానికేదో ఆత్మకు సంబంధించిన, మార్మిక వాదానికి

సంబంధించిన అంశాలతో అలంకరించడమో జరుగుతుంది. కానీ ఈ రెండు దృక్పథాలూ ప్రయోజకరం కావు. తంత్రవాద సందర్భంలో చర్చించే తాత్విక సూక్ష్మాంశాలు తంత్రాన్ని అర్థం చేసుకోడానికి పనికిరావు. ఇవన్నీ తంత్రవాదంపై నాజూకుగా రుద్దబడిన ఆధునిక సిద్ధాంతాలు. తరువాతి కాలంలో ఎంత నాజూకుతనం తెచ్చుకున్నప్పటికీ తంత్రవాదం ప్రాథమికంగా ఆదిమ తరగతికి చెందినది. అయినప్పటికీ ఆదిమత్వ కారణంగా తంత్రవాదాన్ని పూర్తిగా తిరస్కరించటం మన దేశపు సాంస్కృతిక చరిత్రను అర్థం చేసుకునే లక్ష్యానికి వీలుగా ఉండదు. అది తప్పు. అంటే అలా తిరస్కరించటం తప్పు. ఎన్నో ఆదిమ ప్రత్యేక లక్షణాలు ఉన్నప్పటికీ తంత్రవాదం భారతీయ సంస్కృతి అభివృద్ధిపై తీవ్ర ప్రభావాన్ని కలిగి ఉన్నది. మామూలుగా భావించే దానికంటే భారతీయ ఆలోచనా విధానంపై దాని ప్రభావం ఎంతో లోతైనది. మనకు సరిగా అంచనాకందనన్ని శతాబ్దాల నుంచీ ఈ దేశ ప్రజలు తంత్ర సిద్ధాంతాలకు, ఆచారాలకు గాఢ ప్రాముఖ్యతను ఇచ్చారు. తంత్రవాద అవశేషాలు ఎంత మొరటుగా, అసంబద్ధంగా కనబడుతున్నప్పటికీ ఇందుకు భిన్నమైన ప్రాముఖ్యత దానిని అంటిపెట్టుకుని ఉండి ఉండాలి. మన పూర్వీకుల కాలం నాటి పరిస్థితుల నుంచీ మనం ఎంతో విడివడ్డాం. అందుచేత మొదట్లో ఉన్న దాని ప్రాముఖ్యతను ఇప్పుడు సమర్థించాల్సిన అవసరం లేదు. కానీ, వాటిని అర్థం చేసుకోవలసిన సమస్య మాత్రం ఉండనే ఉంది. మనం ఎలా ఎక్కడి నుంచి ఇక్కడికి వచ్చామో తెలుసుకోవాలి కదా.

తంత్రవాదంలో, స్త్రీ జననాంగం కేంద్రంగా పెట్టుకుని చేసే క్రతువుకున్న అత్యున్నత ప్రాముఖ్యతను గమనిస్తాము. స్త్రీ జననాంగానికి మామూలు పదము భగము. కానీ, యంత్రవాదానికి సంబంధించిన చిత్రమైన పరిభాష రీత్యా వాడే పదం 'లత', అంటే 'పాకునది'. దాని కేంద్రంగా సాగే క్రతువును 'భగ యాగము' అంటారు. మరో పేరు 'లతా సాధన', అంటే లతకు సంబంధించిన క్రతువు. ఇదే రకంగా స్త్రీ జననాంగానికి ప్రముఖ స్థానం తాంత్రిక 'యంత్రాల'లో కూడా చూడవచ్చు. అసలు యంత్రమే స్త్రీ జననాంగానికి సంజ్ఞ. దీనిపై థామ్సన్ అనేదేమిటో చూద్దాం : "ఉత్తర ఆమెరికాలో పంట పొలాలకు తెగుళ్లు వస్తే రుతుకాలంలో ఉన్న స్త్రీలు రాత్రిపూట నగ్నంగా పొలాల గుండా నడుస్తారు. ఇలాంటి అలవాట్లు యూరోపియన్ రైతులలో ఇంకా మిగిలి ఉన్నాయి. చరిత్రకారుడు ప్లినీ 'నష్టం కలిగించే కీటకాలకు విరుగుడుగా రుతుకాలంలో ఉన్న స్త్రీలు పొలాలగుండా పాదాలకు ఆచ్ఛాదన లేకుండా, విరబోసుకున్న జుట్టుతో, నడుము వరకు తొడుక్కున్న లంగాలతో పొలాల మధ్య నడవాల'ని చెప్పాడు. డెమోక్రటస్ కూడా అలాగే అభిప్రాయపడ్డాడని కొలుమెల్లా అంటాడు. స్త్రీలు చెప్పులు లేని కాళ్ళతో, విరబోసుకున్న జుట్టుతో పంటచేను చుట్టూ మూడుసార్లు తిరగాలని అతను అంటాడట. రుతుకాలంలో స్త్రీకి సారశక్తి ఉధృతంగా ఉంటుంది కనుక, ఆ శక్తిని పొలాలకు సరఫరా చేయటమే ఇందులోని గర్భిత భావం. కొన్ని చోట్ల స్త్రీలకు ఆ శక్తి సహజంగా ఉంటుందని కూడా నమ్ముతారు. జూలూ తెగ వారిలో కన్యలు అటూ ఇటూ తిరుగుచున్నప్పుడు నగ్నంగా

ఉండాలి. అంతేకానీ, బహిష్టుగా ఉండటం అనేది ముఖ్యమైనది కాదు. లంగాను పైకిలాగి తన జననాంగాన్ని చూపించే తంతుకు ఈ భావం మూలం కావచ్చు. ఈ తంతు డెమెటర్ (అమ్మదేవత) కాలంలో వ్యాప్తిలో ఉండేది. గ్రీకు మత వ్యవస్థలలో స్త్రీ సభ్యులు చెప్పులు, తలకట్టు, నడుముకట్టు లేకుండా నడిచే సంప్రదాయం ఈ భావ వలయం నుంచి పుట్టినదే."


వెనుకబడిన రైతాంగానికి చెందిన స్త్రీ జనం వర్షం కోసం చేసే తంతులో ముఖ్యమైన లక్షణం నగ్నంగా ఉండటమేనని మనం గమనించాము. నగ్న స్త్రీ జననాంగం ప్రకృతి ఉత్పాదకతను వృద్ధి చేస్తుందనే భావం ఇందులో ఇమిడి ఉంది. ఆర్థికాభివృద్ధి రీత్యా వెనుకబడిన జాతులన్నింటిలో ఈ భావం సర్వత్రా వ్యాపించి ఉంది. హిడతా తెగలో వ్యావసాయక తంతులో పాల్గొనే స్త్రీలు నగ్నం అవ్వాలి. వర్షం కోసం జరిపే ఉత్సవాలలో బరోంగా స్త్రీలు, ఇంకా కాంగోలోని స్త్రీ సమూహాలు జరిపే ఇతరేతర క్రతువులలోనూ పూర్తి నగ్నంగా ఉన్న స్త్రీలే ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తారు. నాగరిక ప్రజలు వీటిపట్ల ఏహ్య పడవచ్చును. కానీ, ఆనాగరిక యూరప్‌లో కూడా స్త్రీల క్రతువులు ఇంత మొరటుగానూ ఉండేవి. ఫ్లెమిష్ స్త్రీలు వారి విధులు నగ్నంగానే నిర్వర్తించాలి. బ్రిటిష్ పూజారిణులు కూడా ఆ రోజుల్లో రంగులు వేసుకుని నగ్నంగానే తమ విధులు నిర్వర్తించేవారు." మంత్రోచ్చాటన శక్తివంతంగా ఉండాలంటే మంత్రకత్తె బట్టలన్నీ విడిచిపెట్టాలనేది సార్వత్రిక సూత్రం. పురాతన గ్రీసులోనూ, ఇటలీలోనూ మంత్రతంత్రాలు నిర్వహించేటప్పుడు మంత్రకత్తెలు నగ్నంగానే ఉండేవారు – (బ్రిఫాల్ట్). ఇలాంటి ఉదాహరణలు బ్రిఫాల్ట్ ఎన్నో చెప్పాడు. నీధామ్ కూడా చైనీస్ టావో వాదులలో ఉన్న పూజా విధులలో నగ్నత కూడా ఒకటి అన్నాడు. నగ్నత వాన దేవుని ఆరాధనలో ప్రత్యేకతను కూడా సంతరించుకుంది. అంటే తంత్రవాదానికి, టావో వాదానికి ఉన్న దగ్గర పోలికల వలన ఈ నగ్నతకున్న విశేష ప్రాముఖ్యత స్పష్టపడుతుంది. నగ్నత అనేక మహత్తు వ్యవహారాల్లో అత్యావశ్యకం. వర్షం రప్పించడానికి సాగించే తంతులో నగ్నత్వానికి మరింత ప్రాముఖ్యం ఉంది. కానీ, 'దుస్తులు మాంత్రికురాలిని కల్మష మొనరిస్తాయని' నమ్మినందువల్ల ఈ సంప్రదాయం వచ్చి ఉండవచ్చునని క్రూక్స్ భావించాడు. కానీ, ఆ ఆలోచన తార్కికంగా సక్రమమైనది కాదు. మహత్తుకు సంబంధించిన క్రతువుకి ఉన్న ప్రత్యేక లక్షణాన్నీ, దానికీ, మతానికి ఉన్న భేదాన్ని క్రూక్స్ గమనించలేదు. జననేంద్రియాలను బహిరంగ పరచటం ద్వారా ఆ స్త్రీలు ప్రకృతిని ఉత్పత్తికై ఉద్దీపింపచేస్తున్నారు. "భారతదేశం, బాబిలోన్, ఈజిప్టు, గ్రీసు లాంటి పూర్వ నాగరిక దేశాల్లో ఉన్న మతాలన్నీ – పురాతన మొరటు దశలోనైనా, అభివృద్ధి చెందిన దశలోనైనా సరే ఆధునిక యూరోపియన్ దృక్పథంలోని మతానికీ, పవిత్రతకూ విరుద్ధమైన ఊహలతో, సంజ్ఞలతో, కార్యక్రమాలతో నిండి ఉండేవి... 'ప్రకృతిలోని ఉత్పాదక శక్తులు ఆరాధనా గౌరవాన్ని సంతరించుకున్నాయి.' అనే వివరణతో ఈ వాస్తవాన్ని విశ్లేషిస్తారు. కానీ, ఈ విశ్లేషణ 'ఆరాధన' అనే పదానికున్న అన్వయ క్లిష్టతను గమనించదు. ప్రాచీన మతంలో ఆరాధనకు లక్ష్యంగానీ, సబబుగానీ ఆధునికార్థంలో లభించదు. ప్రాచీన మతంలో ఏ శక్తికీ స్వయంగా ఆరాధనార్హత ఉండదు. వాటి తక్షణ ప్రయోజనమే ఆ అర్హతను ఇస్తుంది" – (బ్రిఫాల్ట్). అసలు ప్రాచీన

'మతము' అనే పదం కంటే మహత్తు విశ్వాసం అనే సమాసమే అప్పటి నమ్మకాలకు ప్రతిబింబంగా ఉంటుంది. సాంస్కృతిక అభివృద్ధి క్రమంలో మహత్తుకు ఉన్న తొలినాటి అర్థం మాసిపోయి మతంగా పరిణమించిన తరువాత, స్త్రీ జననాంగపు సామర్థ్యం ఉన్న తొలినాటి విశ్వాసం మాత్రం అవశేషంగా మిగిలిపోయింది. అయితే అప్పటి అర్థంలో కాదు. 'భగ యాగానికి' లేదా 'లతా సాధనకు' (తాంత్రిక గ్రంథాలలో) దీనిని ఆధారంగా తీసుకోవచ్చు. కానీ, తంత్రవాదంపై వచ్చిన అనేక గ్రంథాల కంటే తంత్రవాదం బహు పురాతనం. అందుచేత తంత్రవాదంలో స్త్రీ జననాంగానికి ఇచ్చిన విశేష ప్రాముఖ్యత, ప్రాచీన ఆలోచనా విధానంలో స్త్రీ జననేంద్రియానికి అంటగట్టబడిన సామర్థ్యం నుంచి మాత్రమే బోధపడుతుంది. అలాగే తంత్రవాదాన్ని ప్రత్యేకంగా పరిశీలించే ముందు కొన్ని మత సంప్రదాయాల్లో మిగిలి ఉన్న ఈ మహత్తుపై విశ్వాసాల అవశేషాలను సమీక్షించుదాం. బ్రిఫాల్ట్ మత క్రతువులలో జననేంద్రియాలను బహిరంగ పరిచే తంతు గురించి అనేక ఉదాహరణలిచ్చాడు. అలాగే స్త్రీ జననాంగపు ప్రతిరూపాలను నియోగించటం కూడా ఇలాంటిదే. సింధులోయ తవ్వకాలలో ఇలాంటి ఉదాహరణ దొరికింది. ప్రసిద్ధమైన కామాఖ్య దేవాలయంలో దేవి విగ్రహం యోని మాత్రమే. అలాగే ఈ క్రతువుల బాధ్యత స్త్రీల నుంచి పురుషులకు సంక్రమించినప్పుడు మానవ పునరుత్పాదక శక్తి కూడా పురుషాంగానికి 'బదిలీ అయింది'! ఈ సూత్రాన్ని పొడిగిస్తే ఏమవుతుంది? (పురుష) పూజారులు నగ్నం అవ్వాలి. లింగానికి ప్రతి రూపమైన చిహ్నాలు, ప్రతి కృతులు మత కార్యక్రమాలలో విరవిగా ప్రవేశించాయి. ప్రాచీన ఈజిప్టులో స్త్రీలు లింగాకృతులను మోసుకువెళ్ళేవారు. దక్షిణాఫ్రికా, కాంగోలలో ఈ సంప్రదాయం ఇంకా ఉంది. థెస్మోఫోరియాలో కులీన ఎథీనియన్ స్త్రీలు ఇలాగే చేసేవారు. మాతృత్వ సౌశీల్యానికి అధి దేవత అయిన వెస్టాను పూజించేటప్పుడు లింగాకృతులకు ప్రముఖస్థానం ఉంది. రోములో కంటే ఆఫ్రికాలో ఇలాంటి అసభ్యతా ప్రదర్శన ఎక్కువేమీ కాదు – (బ్రిఫాల్ట్)

భౌతిక సంపద వృద్ధికోసం చేసే కృషిలో భాగంగానే భగ యాగాన్ని లేక లతా సాధనను తీసుకోవాల్సి ఉంటుందని మన వాదం. స్త్రీ జననాంగానికి ఇచ్చిన ప్రాముఖ్యత కూడా ప్రకృతిలోని ఉత్పాదక శక్తిని విజృంభింప చేయడానికి పనికి వచ్చే సాధనంగా భావించబట్టే. తంత్ర సంప్రదాయం దృష్టిలో 'భగం' షడైశ్వర్యాల సంపుటీకరణ (షడైశ్వర్యమంటే ఆరు రకాల సంపదలు). అసలు స్త్రీ జననాంగాన్ని సూచించే పదం (భగం) అన్ని సంపదలకు మూలంగా అర్థం చెప్పుకోవటం ఎలా సాధ్యపడిందో ఇంతవరకూ పరిశీలించకపోవడం ఆశ్చర్యం. దానికి ఒకే సమాధానం ఉంది. స్త్రీ జననాంగం భౌతికాభివృద్ధి కంతటికీ మూలం అనేది అతి ప్రాచీన విశ్వాసం. ఋగ్వేదం తొలి భాగాల్లో ఈ అర్థం మనకు కనబడుతుంది. అంటే ఒకప్పుడు భౌతిక సంపదను వర్ణించే పదం, స్త్రీ జననాంగానికి కూడా తర్వాతి కాలంలో ఉపయోగపడిందన్నమాట. తంత్రవాదంలో భౌతిక సంపద అంటే వ్యవసాయపరమైన అర్థాన్ని మాత్రమే సంతరించుకుంది. స్త్రీ జననాంగాన్ని మరోపదం 'లత' అని కూడా పిలుస్తారు తాంత్రికులు. లతకు సాహిత్యార్థం పాకునది లేదా మొక్క (తీగ). అంటే తంత్రంలో స్త్రీ


జననాంగానికి, మొక్కకు ఏదో సంబంధాన్ని ఊహించారన్నమాట. ఈ సంబంధం తాంత్రిక యంత్రాలలో కూడా మనం గమనించవచ్చు. యంత్రాలు సంకీర్ణమైన రేఖా చిత్రాలు. తాంత్రికులు వీటికి చాలా ప్రాముఖ్యతను ఇస్తారు. దేవతలు దిగివచ్చి ఈ యంత్రాలపైన ఆశీనులవుతారని ఊహ. నిజమైన తాంత్రిక దృక్పథంలో ఇలాంటి వివరణలు కట్టుకథలే. ఈ యంత్రాలన్నీ స్త్రీ జననాంగానికి చిహ్నాలని తాంత్రికులు కూడా అంగీకరిస్తారు. ఈ అంశాన్ని ఉద్దండ పండితులెందరో అనేకసార్లు చెప్పి ఉన్నారు. బండార్కర్ 'శ్రీ చక్ర' లేదా 'శ్రీ యంత్రం' అనే దాన్ని గురించి ఇలా అంటాడు. "తొమ్మిది స్త్రీ జననాంగపు ప్రతి రూపాల మధ్య గీసిన మరో జననాంగం పూజా విధానమే శ్రీ చక్రము." శ్రీ చక్రం తంత్ర విద్యలో చాలా ముఖ్యమైనది.

తంత్రవాదంలో అనేక పేర్లతో అనేక యంత్రాలుంటాయి. కానీ వాటిలో ఉండే ముఖ్యమైన లక్షణమొకటే. స్త్రీ జననాంగాన్ని పద్మాకారంలోనో, త్రికోణరూపంలోనో లేదా రెండు విధాల కూడా చిత్రించుతారు. ఇదేమీ వింతకాదు. కానీ, యంత్రాలకున్న మరో లక్షణాన్ని ఎక్కువమంది గమనించరు. ఎక్కువ భాగం యంత్రాలలో కేంద్రంలో ప్రతిష్ఠితమైన స్త్రీ జననాంగ ప్రతికృతి చుట్టూ లతలు నాలుగు వైపులా ఉంటాయి. దానిని 'కల్పలతిక' అంటారు. (కోరిన కోర్కెలు తీర్చే లత). తాంత్రిక యంత్రాలలో స్త్రీ జననాంగానికి లతకు అంత దగ్గర సంబంధం ఎందుకు అని ప్రశ్న వేసుకుంటే ఒకే ఒక్క సమాధానం సాధ్యమవుతుంది. హరప్పా శిధిలాలలో దొరికిన శాకంబరి పదానికి ప్రతికృతమైన ముద్రికలో, నిబిడీకృతమైన ప్రాచీన విశ్వాసమే తాంత్రిక యంత్రాలకు మూలము. ఇప్పుడు మనం తాంత్రిక యంత్రాలలో స్త్రీ జననాంగాన్ని త్రికోణముగా సూచించే ఆచారం ఎలా ప్రారంభమైందో సమీక్షిద్దాం.




శ్రీ చక్రం

అలాంటి శిల్పాల్లో అతి పురాతనమైనది దిగువ ఆస్ట్రియాలో దొరికింది. అది ఉత్తర ప్రాచీన శిలాయుగ దశకు చెందింది. 'విలెండార్ఫ్ వీనస్' అని పిలుస్తారు దాన్ని. అది చాలా లావుపాటి స్త్రీ బొమ్మ, వక్షము, పిరుదులు విపరీత ప్రమాణంలో ఉన్నాయి. బహుశా గర్భిణి కావచ్చు. మూర్తి నగ్నమే. ఈ రోజు మనం ఊహించే రీతిలోని కళా వస్తువు మాత్రం కాదది. మూర్తి అంతా ఎర్ర రంగు పులమబడి ఉంది. అంటే దాన్ని పూజతంతుకు ఉపయోగించేవారన్నమాట. అంటే అది ఒక సస్యదేవత. నగ్నత్వం ఉన్నప్పటికీ ప్రాముఖ్యత మాత్రం స్థనాలకు, గర్భాశయానికి ఇవ్వబడింది. జననాంగానికి కాదు. ఇది గమనించదగ్గది. అదే కాలంలో దొరికిన శిల్పా కృతులలో కూడా స్థనాలకే ప్రాముఖ్యత ఎక్కువ. ఈ పురాతన శిల్పాకృతులన్నీ పునరుత్పత్తి క్రమంలో జననాంగాలకున్న పాత్ర గమనించని కాలంలో సృష్టించబడి ఉండాలి. స్థనాల్లోనే సృష్టి క్రమం మొదలవుతుందని తొలి కాలాల్లో ఒక ఊహ ఉండేది. తరువాతి రోజుల్లోనే శిశువు కడుపులోకి 'దిగింది' అన్నమాట. గర్భపు తొలి లక్షణాలు స్థనాలపై కనపట్టం వల్ల బహుశా స్థనాలే గర్భానికి మూలంగా భావించి ఉండవచ్చు. ఈ నమ్మకం బ్రిటిష్ న్యాగిని ప్రాంతంలోని సినౌగోలో తెగలో ఇప్పటికి ఉంది. అందుచేతనే కావచ్చును అజిటెక్ తెగవారిలో 'అనేక స్థనాలున్న' మాతృమూర్తి రూపం ఉద్భవించింది. ఆమె భూమాత కూడా. సహజ సారాన్ని పెంచే సాధనంగా ఆ భూమాతను భావించారు. ఎఫిషియా ప్రాంతంలో ఆర్టెమిస్ దేవతను కూడా అనేక స్థనాలున్న స్త్రీగా, భూసారాన్ని పెంచే శక్తిగా మలుచుకున్నారు. ఒక వస్తువు ప్రాముఖ్యాన్ని వివరించడానికి, దాని ప్రమాణాన్ని విపరీతంగా పెంచడమో లేక సంఖ్యా పూర్వకంగా వృద్ధి చేయటమో ప్రాచీనుల పద్ధతి. స్థనాలే మానవ పునరుత్పత్తికి మూలకారణంగా భావించినందువలన ప్రాచీన శిలా యుగపు మాతృ మూర్తులకు స్థనాలు




విలెన్‌డార్ఫ్ వీనస్ | లెస్ప్యూన్ వీనస్ (దంతం) | మెంటాన్ వీనస్




బెలూచి-ఆఫ్ఘన్ సరిహద్దు




మెసపొటేమియా (క్రీ.పూ. 3000)




యుక్రైన్




భారతదేశం (క్రీ.పూ. 800)



సింధు నాగరికత




ఫొనీషియా (క్రీ.పూ. 2500)



మెసపొటేమియా (క్రీ.పూ. 400)



ఈజిప్టు (క్రీ.పూ. 2000)



క్రేప్ కొత్త రాతియుగం

విపరీత ప్రమాణాల్లో ఉంటాయి. లేదా స్థనాల సంఖ్య పెరుగుతుంది. కానీ, మానవజాతికి ఏ తక్కువస్థాయి ఆలోచనా విధానం శాశ్వతం కాలేదు. మానవ పునరుత్పత్తి క్రమంలోని అద్భుతాన్ని క్రమక్రమంగా అర్థం చేసుకోవడంతో స్త్రీ జననాంగ ప్రాముఖ్యత మనిషి దృష్టిలో పడింది. తద్వారా తరువాతి దశలో స్థనాల నుండి జననాంగం వైపు మనుషులు దృష్టిసారించారు. ఆ దశలోని మానవ జ్ఞానమే భగ యాగానికీ, లతా సాధనకూ మూలమై ఉండాలి. పురాతన కాలం నాటి ప్రసిద్ధమైన స్త్రీ దేవతామూర్తులు ఈ విషయాన్ని ఇంకా స్పష్టం చేస్తాయి. ప్రత్యేకంగా ఈ మూర్తులన్నిటా స్త్రీ జననాంగాన్నే త్రికోణంగా రూపెత్తించటం గమనించదగ్గ విషయం. తాంత్రిక యంత్రాలలోని త్రికోణాలకు ఆధారం ఈ ఆలోచనా విధానంలో దొరుకుతుంది.

## ఖపుష్ప

భిల్లులు విత్తనాలు చల్లేముందు పొలంలో ఒక ఎత్తయిన చోట రాతిని నిలిపి కుంకుమ పూస్తారు. కుంకుమకున్న ప్రాముఖ్యత ఏమిటి? వారలా ఎందుకు చేస్తారు? కుంకుమ రుతు రక్తానికి ప్రతీక అని మనం భావించవచ్చు. రుతు రక్తమే మానవ పునరుత్పత్తికి ప్రాతిపదిక అని పురాతన ఆలోచనా విధానం భావిస్తుంది. కనుక రాతిపై రక్తాన్ని పులమటం భూమికి ఉత్పత్తి శక్తిని కలిగించడానికే. ఈ ఒక్కటే రుతు రక్తానికి – లేదా దాన్ని పోలిన వాటికి – తంత్రవాదంలో ఉన్న ప్రాముఖ్యతను వివరిస్తుంది. థామన్స్ ఇలా అంటాడు. “మానవ సంతానోత్పత్తికి సంబంధించిన మహత్తులన్నీ ఫలితం కంటే పరిణామక్రమానికే బంధించబడి ఉంటాయనేది మనం గమనించాలి. అంటే రుతుస్రావానికి మాత్రమే ప్రాముఖ్యత. శిశువుకు కాదు. తత్ఫలితంగా రక్తానికి – రుతురక్తం, మామూలు రక్తం ఏదైనా – జీవదానశక్తి సహజంగా ఉందని విశ్వసిస్తారు.” (అంటే ప్రాణానికి రక్తమే అందునా స్త్రీ రక్తమే మూలమని భావిస్తారు). పురాతన ఆలోచనా పద్ధతిలో బహిష్టును శిశు జన్మకు సమానమైన సంఘటనగానే గుర్తిస్తారు. అది నిజం కూడా. మహత్తు అనేది సందిగ్ధమైనది. దాని శక్తి సామర్థ్యాలు భయం పుట్టిస్తాయి. ఒక వైపున ‘దరిచేరరాని స్త్రీ’ ‘పవిత్రురాలు’ ‘అనుల్లంఘనీయ’. మరోవైపు నుంచి ఆమె ‘కళంకిని’ ‘కల్మషమైనది’. రోమనులు ఆమెను ‘శాక్రా’ అంటారు. అంటే ‘పవిత్రమైనది’. లేదా ‘దౌర్భాగ్యురాలు’. అందుకనే పితృస్వామిక సమాజంలో స్త్రీ మతంపై తన అదుపును కోల్పోయినప్పుడు రెండవ అర్థం అమల్లోకి వచ్చింది. ఆమె లైంగిక ధర్మాన్ని, లైంగిక చర్యలను పాపపంకిలమైనవిగా పరిగణించటమే కాక అసలామె స్త్రీత్వాన్నే నీచమైనదిగా లెక్కించటం మొదలైంది. ఆమె అన్ని అనర్థాలకు మూలమైంది. (Evil eve) అంటే మాయావి.

ఇలాంటి భావాలు సర్వత్రా ఉన్నాయి. బహిష్టయిన స్త్రీని, ప్రసవించిన స్త్రీని ఆదరించే విధానం ప్రపంచమంతా ఒక్కటిగానే ఉండేది. ప్రపంచంలోని మరే విషయంలోనూ ఇంతటి సారూప్యత కనపడదు. ఈ అంశం మీద బ్రిఫాల్ట్ ఎంతో విషయసేకరణ చేశాడు. మానవ

సంస్కృతిలో ప్రతి దశలోనూ చాలా తెగలలోనూ దీనికి సంబంధించిన వస్తుసామాగ్రి ఆయన పోగుచేశాడు. రుతు రక్తం ఆగిపోయిన తరువాత గర్భకోశంలో మిగిలిన రక్తం నుంచి శిశువు తయారవుతుందని ఆరిస్టాటిల్, ప్లినీ ఇంకా అనేకానేక ప్రాచీన మధ్య కాలపు ప్రకృతిక వాదులు భావించేవారు. ఇది జీవ రక్తం. అందుకనే రక్తాన్ని నిషిద్ధ వ్యక్తులను గుర్తించే సాధనంగా మార్చారు. ఆ రక్తం రుతురక్తం కావచ్చు, లేదా మామూలు రక్తం కావచ్చు, లేదా ఎర్రని ద్రవపదార్థం ఏదైనా కావచ్చు. రక్త చిహ్నం ముఖ్యం. అలాగే విధి నిషేధాలలో ఉన్న సందిగ్ధత కూడా వ్యక్తమవుతుంది. రక్తం పులమబడిన వస్తువును స్పృశించరాదనే నిషేధం. అదే వస్తువు ప్రాణశక్తిని ఇస్తుందనే నమ్మకం ఒకేసారి దొరుకుతాయి. బహిష్టమయిన స్త్రీలు రుతురక్తాన్ని వంటిపై పులుముకోవడం ప్రపంచంలో చాలా చోట్ల సంప్రదాయం. అలా పులుముకున్న స్త్రీ పురుష స్పర్శకు నిషిద్ధం. అదే సందర్భంలో స్త్రీలు తమ సామర్థ్యాన్ని పెంపొందించుకుంటారనే నమ్మకం కూడా ఇమిడి ఉంది. వివాహ సందర్భంలో వధువు నుదుట ఎర్రని బొట్టుపెడతారు. అంటే ఆమె ఇతరులకు నిషేధము. భర్తకు మాత్రమే చెందినది అని భావం. అంటే తన భర్తకే సంతానాన్ని కంటానని వాగ్దానం చేసినట్టు లెక్క. అయితే ఆ బొట్టు తరువాతి రోజుల్లో అలంకారమయిందనుకోండి. బంటూ జాతిలో ఒక తెగవారి (వలంగే) స్త్రీలు అందరూ ఒక్కోకుండెడు ఎర్ర సుద్ద రంగు తమ ఇంట్లో పెట్టుకుంటారు. ఆ రంగు స్త్రీ జాతికి పవిత్రము. ఉత్సవ సందర్భాల్లో స్త్రీలు ఆ రంగును మొఖాలకు పులుముకుంటారు. వంటికిరాసుకుంటారు. ఈ క్రింది సందర్భాల్లో ఆ రంగు అవసరం ఉంటుంది. ప్రసవించిన తరువాత తల్లికీ బిడ్డకూ ఆ రంగు వేస్తారు. శిశువు బ్రతకడానికీ, తల్లి పునర్జీవించడానికీ ఆ రంగే కారణమని నమ్ముతారు. కన్య వధువుగా మారే సమయంలో ఆపాదమస్తకం ఆ రంగును పులుముతారు. అంటే ఆమె పునర్జన్మ నెత్తినట్లుగానూ, ఫలవంతమవుతుందనీ నమ్మకం. అలాగే భర్త మరణానంతరం దుః ఖానికి కేటాయించిన సమయానంతరం విధవ జ్వాలలను దాటి అదే రంగును ధరిస్తుంది. అంటే ఆమె మృత్యుపంకాన్నుంచి తిరిగి వచ్చిందన్నమాట.

రక్తవర్ణం అంటే జీవ పునరాగమనం. అందుచేతనే ఉత్తర పురాతన శిలాయుగంలోనూ, నూతన శిలాయుగంలోనూ పాతిపెట్టబడిన అస్థికలకు ఎర్రరంగు పులిమారు. ఈ సంజ్ఞాభావం మరో చిన్న వివరణ ఇస్తే పూర్తిగా అర్థం అవుతుంది. అక్కడ శ్మశానాల్లో దొరికిన ఆస్థిపంజరాలను మడతబడి ఉండడమో లేదా గర్భస్థ శిశువువలె తీర్చి ఉండటమో గమనించదగిన విశేషం. జీవ వర్ణాన్ని (రక్తాన్ని) పులిమి గర్భస్థ శిశువులాగా పడుకోబెట్టడం కంటే ప్రాచీన మానవుడు చనిపోయిన జీవికి పునర్జన్మను ఇచ్చే మార్గం వేరే ఏముంటుంది?"

ఈ పురాతన విశ్వాసానికి అవశేషంగా మిగిలిన రెండు ఉదాహరణలు భారతదేశంలో తరువాతి కాలంలో వచ్చిన మతాలనుంచీ తీసుకుందాం. బెంగాల్‌లో "తొలకరి వాన సందర్భాన

భూమాత బహిష్టయి ఫలదీకరణకు సిద్ధపడుతుందని నమ్ముతారు. ఆ సమయంలో దున్నుట, విత్తుట మొదలైన వ్యవసాయ కార్యక్రమాలన్నీ కట్టిపెడతారు." ఆ రోజున జరిపే మతోత్సవానికి "ఆమ్యువచి" అని పేరు. అలాగే తిరువాన్కూరు ప్రాంతంలో "గుళ్ళల్లో అప్పుడప్పుడు జరిపే ముఖ్యమైన ఉత్సవమొకటుంది. 'త్రిప్పుకరత్తు' అని దానిపేరు. లేదా 'శుద్ధి ఉత్సవం'. అది దేవి బహిష్టుకు సంబంధించిన వ్యవహారం. సంవత్సరానికి ఎనిమిది నుంచి పదిసార్లు జరుగుతుంది ఈ ఉత్సవం. దేవి లోహ విగ్రహానికి చుట్టిన వస్త్రం ఎర్రగా డాగులుపడి ఉండటం – అంటే సరిగ్గా బహిష్టులాగే –గమనిస్తారు. ఎర్రడాగులతో మాసిపోయిన ఆ వస్త్రాన్ని 'వంజిపూళ' లేక 'తళగూర్ పట్టి' కుటుంబాల స్త్రీలకు పరిశీలన నిమిత్తం పంపిస్తారు. వారు ఔనని చెప్పిన తరువాత దేవి విగ్రహాన్ని ప్రత్యేకమైన చావిట్లోకి మారుస్తారు. అసలు పూజలు జరిపే ఆలయాన్ని కొద్దికాలం మూసేస్తారు. దేవి వాడేసిన వస్త్రాన్ని చాకలమ్మకిస్తారే గానీ, దేవికి తిరిగి వాడరు. పవిత్రతను సంతరించుకున్న ఆ వస్త్రంపై చాలామంది మక్కువ చూపుతారు." – (బ్రిఫాల్ట్). చుంగనూర్‌లో కూడా పార్వతీదేవి బహిష్టుకు ఎంతో ప్రాముఖ్యతనిస్తారు. అస్సాంలోని కామాఖ్యదేవి విషయంలో కూడా ఇలాగే జరుగుతుంది. ఉత్పత్తి, పునరుత్పత్తి క్రమాలలో మహత్తు కలదన్న నమ్మకమే తంత్రవాదానికి మూలం అయింటే రుతు రక్తానికి కూడా ప్రత్యేక ప్రాముఖ్యత ఉండటం సహజమే కదా. తాంత్రికులలో దానికి (రుతు రక్తానికి) ఒక సంజ్ఞానామం ఉంది. సామాన్యంగా దాన్ని 'కుసుమ' లేదా 'పుష్ప' అంటారు. కొన్నిసార్లు దాన్ని 'ఖపుష్ప' అని కూడా అంటారు. వృక్ష సంతతితో ఉన్న గాఢ సంబంధాన్ని ఈ పదావళి తెలియజేస్తుంది. కుసుమము లేక పుష్పము అంటే అర్థం పువ్వు. మొక్క కాయలు కాస్తుంది. స్త్రీ జననాంగము బిడ్డల్ని కంటుంది కదా. అందుకనే స్త్రీ జననాంగాన్ని లత (అంటే మొక్క) అంటారు. అలాగే కాయకు ముందు పువ్వు (గర్భానికి ముందు బహిష్టు లాగా).

అందుచేతనే రుతు రక్తాన్ని 'కుసుమ' లేదా 'పుష్ప' అని పిలుస్తారు. రుతురక్త విషయంలో తంత్ర సాహిత్యం అనేక సూక్ష్మాంశాలను స్పృశిస్తుంది. వివిధ రకాల స్త్రీల రక్తాలకు భిన్నమైన పేర్లుంటాయి. అది వేరే కథ. కుంకుమను వాడటం తమ దుస్తులను రక్తవర్ణంలో ముంచడం లాంటి తాంత్రికాచారాలకు పై నమ్మకానికి ప్రత్యక్ష సంబంధం ఉంది. ఇది మనం గుర్తుంచుకోవాలి. ఇప్పుడు ఈ నమ్మకం కేవలం మూఢ నమ్మకంగా కరుడు కట్టింది. ఆ విషయంపై తాంత్రికుల వాదాలన్నీ మన అభిరుచులకు జుగుప్సాకరంగా కనబడతాయి. అలాగే ఏదో ప్రాచీన విశ్వాసం ఈనాడు మూఢనమ్మకంగా తోచటం ఆశ్చర్యం కాదు. ఇది సాంకేతిక శాస్త్రం విజ్ఞాన అభివృద్ధి వలన సాధ్యమయింది. ఏమైనప్పటికీ రుతు రక్తానికి ఆపాదించబడే ఆ పవిత్రతకు మూలం మరో అంశంలో ఉంది. ఇది ఒక కొత్త మూఢ నమ్మకం పాత మూఢనమ్మకాన్ని తోసిపుచ్చడమే. మనకున్న పితృస్వామిక ఆలోచనల వల్ల అలవాట్ల వల్ల రుతురక్తాన్ని రాగరహితంగా చూడలేకున్నాము.

## పంచ'మ'కారాలు

ఒక తాంత్రిక గ్రంథం 'ఓ దేవీ ఎవరైనా ఐదు (పంచ) లేకుండా చండీ మంత్రాన్ని ఎలా జపించగలరు? మరో గ్రంథం 'ఓ దేవీ పంచ 'మ' కారములు దేవతలకు ప్రియమైనవి.' అలాగే అన్ని గ్రంథాలు పంచ 'మ' కారాలకు ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చాయి. అంత పవిత్రంగా భావించే పంచ'మ'కారాలు. మద్యము, మాంసము, మత్స్యము, ముద్ర (ఉడికించిన గోధుమ), మైథునము (లైంగిక సంపర్కము). ఈ పదాలన్నీ 'మ' అనే అక్షరంతో ప్రారంభమవుతాయి. కాబట్టి వీటిని పంచ 'మ' కారాలంటారు.

నిజమే ఈ జాబితా భీకరంగానే ఉంది. తంత్రవాదానికి బలం చేకూర్చాలని గానీ, సమర్థించాలని గానీ, ప్రయత్నించిన ఆధునిక పండితులకు పంచ'మ'కారాలు కొరక రాని కొయ్య. దీన్ని మార్మికం చెయ్యాలనే ప్రయత్నాలు జరిగాయి: పంచ"మ"కారాల పరమార్థం చాలా సూక్ష్మంగా ఉంటుంది. లేదా గుప్తంగా ఉంటుంది. తంత్రమతంలోకి ప్రవేశించని వారికి అది అర్థం కాదు. అసలు కొందరు ఈ ఆచారాలన్నీ సామాన్యులకు కాదనీ, ఆధ్యాత్మికంగా ముందుకు వెళ్ళినవారికే వీటిని విధించారనీ లేదా పంచ'మ'కార సంప్రదాయాన్ని క్లిష్టమైనదనీ ప్రమాదకరమైనదనీ – కత్తిపై నడకకంటే, పులులతో సహవాసం కంటే క్లిష్టమైనదనీ – అంటారు. ఇలాంటి సబబులు మనకనవసరం. అందులో అగుపించే అసందర్భాలే వాటిని సమర్థించే పరిస్థితిలోని బలహీనతను బయటపెడతాయి. ఈ పురాతన ఆచారాలను మెచ్చుకోడానికి గానీ, సమర్థించడానికి గానీ, ప్రస్తుతం అభివృద్ధి చెందిన సాంకేతిక శాస్త్రం, విశదీకృతమైన ప్రకృతి సూత్రాల విజ్ఞానమూ అడ్డువస్తాయి. కానీ, వాటిని అర్థం చేసుకోవటం అవసరం. మనం మన 'పురాతన' పూర్వీకుల దృష్టిని తెలుసుకుని ఆ దృక్పథం నుంచీ ఈ అంశాలను చూడకపోతే అర్థం కావడం సాధ్యంకాదు. అప్పుడే వ్యవసాయం కనుగొనబడింది. నాగరికత వైపు పురోగమనం మొదలౌతోంది.

పంచ 'మ' కారల్లోనూ మద్య, మైథునాలను గురించి ఆలోచిద్దాం. ఒక సమకాలిక పండితుడు ఇలా అన్నాడు : "మాంసము, ముత్స్యము ముద్ర వీటికి అభ్యంతరము ఉండనక్కరలేదు. కానీ, మద్యము మైథునము మతచారంలో భాగాలెలా అవుతాయి. అనేది సమస్య." కానీ తాంత్రికులలో ఈరెంటి ప్రాముఖ్యత విషయంలో కచ్చితమైన దృక్పథం ఉంది. ఉదాహరణకి మద్య ప్రయోగం లేకుండా సాధన ఉండజాలదు. ఒక గ్రంథం ఇలా చెబుతుంది. "మద్యం లేకుండా ఏ సిద్ధీ ఉండదు. అందుచేత దానిని జాగ్రత్తగా ఆస్వాధించాలి. అలాగే ఆమె చేత కూడా తాగించాలి. అప్పుడే మంత్రోచ్చాటన చేయాలి". ఎలా చూసినా దీన్ని నాగరిక ప్రజలతత్వంగా అంగీకరించలేము. కానీ, ఈనాడు మిగిలివున్న ప్రాచీన మానవులను గురించి మనకు తెలిసిన విషయాల వెలుగులో దీన్ని అర్థం చేసుకోవాలి. ఓరియోన్‌లు ఊడ్పు ఊడ్చే

ముందు భూమిపై బియ్యంతో తయారైన మద్యాన్ని చిలకరిస్తారు. బైగా జాతివారు అడివిని నరికి వ్యవసాయం చేయాల్సిన పొలం సరిహద్దులు నిర్ణయించి అప్పుడప్పుడూ గ్రామపు పొలిమేర చుట్టూ మద్యాన్ని చిలకరిస్తూ తిరుగుతారు. ఈ కార్యక్రమాన్ని బైగా మాంత్రికుడికి (పురోహితుడికి) అప్పజెప్పతారు. దానిని నిర్వర్తిస్తూ అతను మద్యం సేవిస్తాడు. అందువలన అతనికి గొప్ప మహత్తు సంక్రమిస్తుందని – అర్ధ దైవశక్తి (క్రూక్) భావిస్తారు. మాహువావృక్షం చుట్టూ గోండులు జరిపే తంతులో మద్యం మహత్తును ప్రసాదించగలదనే విశ్వాసం ఇమిడి ఉంది. వారు మాహువా వృక్ష భాగాన్నించి మద్యం తయారు చేసుకుంటారు. ఆ మద్యాన్ని మత సంప్రదాయాల్లోనూ గృహ సంప్రదాయాల్లోనూ ఉపయోగించుతారు. పొలాల్లో తెగుళ్ళు రాకుండా చూడడానికీ, భూసారాన్ని రక్షించడానికీ మద్య ప్రయోగాన్ని ఒక తంతుగా నిర్వర్తిస్తారు. మద్యాన్ని మహిమగల దానిగా భావించటానికి కారణం ఏమిటి? ప్రాచీన ఆలోచనా సరళిలో రక్తం లాగే మద్యం కూడా జీవదాన సామర్థ్యం కలదే. ఈ విషయం రెండు రకాల ఉదాహరణలలో రుజువవుతుంది. మొదటి రకంలో మరణాన్ని నిరోధించడానికి మద్యం ఉపయోగపడుతుంది. రెండో రకంలో మద్యం జన్మ (పునర్జన్మను)ను ఖాయం చేస్తుంది. ఈ క్రింది ఉదాహరణలో మద్యం మరణాన్ని నిరోధించటం చూడవచ్చు. ఎవరైనా చనిపోతే త్రాగటం అలవాటుగా ఒక ఆచారం ఐర్లండులో ఇప్పటికి ఉంది. ఇక చావు తరువాత ఉపవాసం ఉండటం, చిత్తుగా తాగటం వెస్ట్ ఆఫ్రికాలోని 'ట్షీ' తెగవారికి ఇప్పటికీ అలవాటు. దుఃఖితులంతా మత్తెక్కి ఉంటారు. యోరు బాల విషయంలోనూ అంతే. అయితే శవ సంస్కారానంతరం మాత్రమే మద్యపానం ముఖ్యాంగంగా మారుతుంది. వూల్వాఇండియన్‌లలో శవ సంస్కార సందర్భంగా 'మిషా' పానం జోరుగా సాగుతుంది. చనిపోయిన వారి ఇంటినుంచి తాగుతున్న ప్రదేశానికి దూదితో ఒక తాడులాంటిదాన్ని సాగదీస్తారు. (టెలిగ్రాఫ్ తీగలాగ) అది సమాధి స్థలానికి కూడా కొనసాగుతుంది. బంగాలా మనిషి చనిపోగానే అతని కుటుంబానికి చెరకు సారా విపరీతంగా వస్తుంది. నృత్యము, మదుపానము మూడు నాలుగు రాత్రుళ్లూ పగళ్లూ లేదంటే మద్యం ఉన్నంతకాలం కొనసాగుతాయి. గయానా ఇండియన్లు కూడా తద్దినపు విందులో తాగి తందనాలాడుతారు. షిన్‌యై తెగవారిలో పోంబె అనే ప్రాంతపు బీరు శవ సంస్కారానంతరం జరిగే కార్యక్రమాల్లో ప్రముఖంగా ఉంటుంది. బోనా అనే ఉత్సవం జరపడానికి పెద్ద ఎత్తున బీరు తయారవుతుంది. సమాధిపైన రంధ్రాలు చేసి అందులో 'పోంబె' (సారా) పోస్తారు. ఆ సమాధి ఉన్న ఇంటి ముందు దుఃఖితులు పోంబెతో చేతులు కడుక్కుంటారు. ఊరేగింపు ముగిసిన తరువాత మృతుని భార్యలలో ఒకామె (ఆమెను ముసిమో అంటారు. అంటే దేవత) ముసిమో తలను కేలికోతో కప్పుకుని పోంబె కోసం అరుస్తూ ఉంటుంది. ముసుగు క్రింద తాగుతుంటుంది. పెద్ద భార్య ఇంటిముందు పెద్ద గొయ్యి తవ్వి చక్కగా సిమెంట్ చేస్తారు. ఆ గోతి నిండా మద్యం పోస్తారు. చంచాగానీ, పాత్రగానీ అవసరం లేకుండా అక్కడున్నవాళ్లంతా ఆ మద్యం తాగుతారు. తరువాత జరిగే విందులో పోంబె, మాంసముంటాయి. భారతదేశంలో

కూడా ఈ అలవాటు ఏమీ వింత కాదు. అందులోనూ దళిత జాతులని పిలువబడే వారిలో ఇది తప్పనిసరి. ఈ అలవాటు మృత్యువుకు దూరమవటానికి ప్రాణం పునరాగమనానికి ప్రయోగించే కర్మకాండ. భారతదేశంలో తయారయ్యే ప్రాంతీయ మద్యాలలో ఒకదాని పేరు 'సంజీవని' లేదా 'మృత సంజీవని' (అంటే చనిపోయిన వారిని బతికించేది). ఈ నమ్మకమే తంత్రశాస్త్రంలోని 'సాధక ప్రవేశ' (అభిషేక) కర్మకాండలో మద్యాన్ని ఉపయోగించటంలో స్పష్టపడుతుంది. మరణమూ, పునర్జన్మ ఇందలి సారాంశం. పసివాడు పసివాడుగా చనిపోతాడు. వ్యక్తుడుగా తిరిగి జన్మిస్తాడు. అందుచేతనే "జీవదాన శక్తి గల" మద్యం ఈ కర్మకాండలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుతుంది. అతి ప్రాచీన సమాజంలో రజస్వలకావడం, పెళ్ళి, అంటే పునరుత్పత్తికి తయారవడం వెంట వెంటనే జరుగుతాయి. అందుచేతనే పెళ్ళి తతంగాలలో మద్యం ముఖ్యపాత్ర వహిస్తుంది.

"తిప్పేరా ప్రాంతపు పెళ్ళిళ్ళలో వధువుకు ఆమె తల్లి ఒక గ్లాసుడు మద్యం ఇస్తుంది. వధువు ఆ గ్లాసుతో వరునివద్దకు వెళ్ళి అతని తొడపై కూర్చుని కొంత మద్యం తాను తాగి మిగిలింది అతనికి ఇస్తుంది... తానా ప్రాంతపు నకిరీ కుంభీలలో పెళ్ళి తంతు పూర్తికాగానే ఆ జంటకు మద్యం ఇస్తారు. కియోంతా తెగలో వధువు తరపు బాలికలు ఊరి వెలుపల వరుని, వరుని బృందాన్ని వెదురువాసం అడ్డంగా పెట్టి నిలుపుతారు. వరుడు ఆ బాలికలతో కలసి సౌభ్రాతృత్వ ప్రేమకు చిహ్నం చెయ్యాలి. ఆ తరువాతనే అతనిని గ్రామంలోకి ప్రవేశించనిస్తారు. మొరాకో పెళ్ళిళ్ళలో పురోహితుడే జంటకు ఆశీర్వాదంతో పాటు మద్యం కూడా ఇస్తాడు. ఇద్దరూ తాగేసిన తరువాత ఆ గ్లాసుని నేలకు కొట్టి పగులగొడతాడు పెళ్ళికొడుకు. ఇందులో సూక్ష్మార్థం ఉంది. "మళ్ళీ ఆ గ్లాసు అతుక్కునే వరకూ జంట విడిపోకూడదని కోరిక". లార్కాలులో ఇరు పక్షాల వారికి చెరొక బీరు ఇస్తారు. వారు తమ పాత్రలోని బీరు పరస్పరం కలుపుకొని తాగుతారు. దీనితో పెళ్ళి తంతు ముగుస్తుంది. మొలాకస్, జపాన్, బెంగాల్, బ్రెజిల్, రష్యా, స్కాండినేవియా ఇంకా యూరపులోని అనేక ప్రాంతాల్లో పెళ్ళిళ్ళకు వధూవరుల జంట ద్రాక్ష సారాయనో, బీరునో, ఒకే పాత్రలో త్రాగుతారు. భేణి – ఇజ్రాయిల్ పెళ్ళిళ్ళలో వరుడు మద్యాన్ని వధువు నోటిలో పోస్తాడు. కొరియా, చైనాలలో వధూవరులు రెండు పాత్రలలో తాగుతారు కాని, ఆ పాత్రలు రెండూ ఎర్రదారంతో కట్టబడి ఉంటాయి. క్రైస్తవ దేశాలలో మద్యపానం పెళ్ళి తంతు నుండి ప్రత్యేకంగా జరుగుతుంది. పెళ్ళి అయిన తరువాత జంటకు ద్రాక్ష సారాయిని చర్చి ఇస్తుంది. వెంటనే తాగేస్తారు. గోండు జాతివారిలో వధూవరుల తండ్రులు కలసి తాగుతారు." – (మతము, నీతి, విజ్ఞాన సర్వస్వము).

మద్యము పునరుత్పత్తి వాంఛను ఉద్ధీపింపచేస్తుందనే నమ్మకం బహుశా ఈ సంప్రదాయానికి కారణం కావచ్చు. సంతాలుల సృష్టికథ ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

"హరం, అయో అనే పేర్లు గల అబ్బాయి అమ్మాయి మొట్టమొదటగా రెండు పక్షి గుడ్ల నుండి బయటకి వచ్చిన మనుషులు. వారికి బట్టలు లేవు. కాని, వారికి సిగ్గనిపించలేదు. ప్రశాంతంగానే జీవించేవారు. కాని వారికి సంతానం కలుగలేదు. అందుచేత ఒకరోజున లితా అనే వారి పితృదేవత (బోంగా) వారి వద్దకు వచ్చి ఇలా అన్నాడు: "పిల్లల్లారా మీరెక్కడ ఉన్నారు? ఎలా ఉన్నారు? మిమ్మల్ని చూసిపోదామని వచ్చాను. మీరు బాగున్నట్టుగానే ఉన్నారే? మీరింతవరకూ చూడని రుచి ఆనందం ఒకటుంది. బీరు తయారుచేసుకోండి. చాలా మధురంగా ఉంటుంది." తరవాత వారికి బీరు తయారు చేసే పద్ధతి నేర్పాడు. ముగ్గురూ అడవిలోకి వెళ్ళారు. లితా వారికి కొన్ని చెట్ల వేర్లు చూపించాడు. ఆ ఇద్దరూ ఆ వేళ్ళు తవ్వి పైకి తీశారు. బీరు చేయడం నేర్చుకున్నారు. లితా వారితో ఇలా అన్నాడు: "ముందు 'లితా' కోసం కొంత బీరు నేలమీదపోసి తరువాత మీరిద్దరూ త్రాగండి. రేపు మళ్ళీ వచ్చి మిమ్ములను చూస్తాను". తరువాత వారు ఇద్దరూ ఆకులతో మూడు పాత్రలు చేసి బీరుతో నింపారు. ఒక పాత్రలో బీరు నేలమీద పోశారు. మిగతాది తాగేశారు. వారు తాగుతూనే రమించడం మొదలుపెట్టారు. తాగి, తాగి మత్తుఎక్కిపోయింది. కలసి పడుకున్నారు. ఉదయాన హఠాత్తుగా లితా వచ్చాడు. వస్తూనే "ఏమి పిల్లలూ ఇంకా లేవలేదా? మేల్కోండి" అన్నాడు. వారికి స్పృహరాగానే నగ్నంగా ఉన్నట్లు గమనించి సిగ్గుపడ్డారు. "తాతా మాకు సిగ్గేస్తుంది. మేము ఇద్దరమూ నగ్నంగా ఉన్నాము. రాత్రి బీరు తాగ్రి మత్తెక్కి ఏదో చెడ్డపనిచేశాం అన్నారు." లితా ఫరవాలేదని చెప్పి నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు. తరువాత వారికి ఏడుగురు మగపిల్లలు, ఏడుగురు ఆడపిల్లలు కలిగారు. (ఏషియాటెక్స్ సొసైటీ పత్రిక బెంగాల్). ఈ కథ అర్థం స్పష్టమే. తొలి మానవుల జంట మద్యాన్ని కనుగొనడంతో పునరుత్పత్తి క్రియ మొదలయ్యిందన్నమాట. అంటే ప్రాచీన మానవుని ఆలోచన ప్రకారం మద్యం మృత్యువుని తప్పించుకోవడానికి మాత్రమే కాక నూతన జీవసృష్టికి కూడా పనికొస్తుందని ఊహ. రక్తంలాగే మద్యం కూడా జీవతత్వం అన్నమాట. మద్యం కలిగించే మానసిక, భౌతిక ఫలితాలు ఈ దృక్పథానికి ఎంతవరకూ కారణమో పరిశీలిస్తే బాగుంటుంది. మత్తు అనేది మామూలు స్థితికి భిన్నమైన జీవాన్ని ఇచ్చినట్లు భ్రమ కలగవచ్చు. అందుచేతనే చైనాలోని పూజారులు (షామానులు) రసాయనికంగా ఆవేశం కలిగించడానికి తరచు మద్యాన్ని వాడతారు. బ్రిఫాల్ట్ చాలా ఉదాహరణలు ఇస్తాడు. ఇవన్నీ మద్యానికున్న మహత్తుపట్ల వున్న ఆదిమ విశ్వాసం నుంచి వచ్చిన భావజాలం. ముఖ్యంగా మద్యం ప్రసాదించే జీవసత్వం భూసారాన్ని పెంపొందించగలదని విశ్వసించడంలోనే భూమిపై మద్యాన్ని జల్లే తంతు మొదలయిందనవచ్చు. తాంత్రికులు మద్యాన్ని ముఖ్యాంశంగా తీసుకున్నందుకు తార్కిక కారణం ఇక్కడ లభిస్తుంది.

తంత్రవాదాన్ని సమర్థించే మన సాంప్రదాయిక పండితులు మద్య మాంసాలను తాంత్రికులు వాడడం పట్ల వైదిక ఆచారాల ప్రసక్తితో సబబులు చూపిస్తారు. మాంసము,

పులిసిన కల్లు వీటి వాడకం వైదిక ప్రజలలో సామాన్యమే కాక వారి క్రతువులలో కూడా ఈ రెంటికీ స్థానం ఉందని ఆ పండితులు చెబుతారు.

వైదిక ప్రజలు వాడే మధువు పేరు సోమా. వైదిక సాహిత్యం అంతా దానికి ముఖ్యస్థానం ఇచ్చింది. అలాగే సోమా ఒక వైదిక దేవత కూడా. సోమయాగమనే క్రతువు కూడా ఉంది. చిత్రమేమిటంటే ఈ మద్యాన్ని మృత్యునిరోధకమైన శక్తిగా వైదిక సాహిత్యం భావిస్తోంది. సోమపానం చేసి అమర్త్యుడు నయ్యానని వైదిక కవి అంటాడు. సురా అనే మరో ముఖ్యమైన మత్తుపానీయం ఉంది. తరువాతి కాలంలో ఈ పేరును అన్ని రకాల మద్యాలకి ఉపయోగించారు. బహుశా అది సోమ పానీయం కంటే ఘాటైనదై ఉండాలి. అలాగే క్రతువులకే పరిమితమై ఉంటుంది. 'వాజపేయము', 'సౌత్రమణి', ఇంకా మరికొన్ని వైదిక క్రతువుల్లో సురకు స్థానముంది. వైదిక సాహిత్యంలో భూసారపు అభ్యుదయానికి సాగించే క్రతు కార్యక్రమాలకు సురతో గాఢ సంబంధం కనబడుతుంది. ఈనాటి ఉన్నత వేద పండితులంతా దీనిని గుర్తించారు. సురను ఒక క్రతు భాగంగా ఉపయోగించడంలోని విశేషము ఏమిటి? ఆధునిక తాంత్రిక పండితులు అనుకుంటున్నట్లు తాంత్రికుల పంచతత్వ భావానికి వేదానుమతి ఉందా? అలాంటి అభిప్రాయం అసంబద్ధం. తాంత్రిక పంచ'మ' కారాల్లో మద్యం కేవలం స్త్రీ సత్వపు ప్రాముఖ్యతకు మాత్రమే సంబంధించిన క్రతువులో భాగం. అసలు వైదిక తాంత్రిక దృక్పథాలు మౌలికంగా భిన్నమైనవి. అందుచేత వైదిక సంప్రదాయం ఆధారంగా తాంత్రిక తతంగాలను సమర్థించడం సాధ్యపడదు. అయితే వైదిక సాహిత్యంలో ఉదహరించబడ్డ సుర, సోమ, పానాల ప్రసక్తికి వేరే అర్థం ఉంది. మిగతా వైదిక సంప్రదాయాలలాగానే వేదకాలపు ప్రజల ప్రాచీనావశేషాల్లో అది ఒకటి. వేదకాలపు ప్రజలు ముఖ్యంగా పశు పోషణపై ఆధారపడి బ్రతికినవారు. అందుచేత భూసార వృద్ధికోసం చేసే క్రతువులూ తతంగాలూ వారికంత తీవ్రమైనవి కావు. అవి వ్యవసాయం చేసేవారికి అవసరం. మహిమల పట్ల విశ్వాసం, మహిమల నుంచి వచ్చే ఫలితాల పట్ల నమ్మకం తొలి వ్యవసాయ దశలో ముఖ్యపాత్ర వహిస్తాయని మనం ఇదివరకే గమనించాం. అందుచేతనే మద్యపానానికి తంత్రవాదంలో ఉన్నంత ప్రాముఖ్యత వేదకాలంలో ఉండటానికి వీలులేదు. తొలి వేదకాలం నాటి ప్రజలు సోమ, సుర పానాలకు ఇప్పటికీ భారతదేశంలో ఒరోన్ తెగవారు, బైగా తెగవారు ఇచ్చిన ప్రాముఖ్యతనే సాగించేవారు. అది వైదిక సాహిత్యపు ప్రాచీన విశ్వాసాల అవశేషం మాత్రమే. చిత్రమేమిటంటే హీన కులజులుగా చలామణి అవుతున్న మనదేశపు ప్రజలు కొందరు చావు సమయంలోనూ, పెళ్ళి సమయంలోనూ కూడా మద్యపానానికి ప్రాముఖ్యతనిస్తూ ప్రాచీన వేదకాలపు నమ్మకాలకు అనుగుణంగా ప్రవర్తిస్తున్నారు. క్రింది కులాల వారిని చులకన చేసే బ్రాహ్మణ మతంవారు ఆ సురాపాన ఆచారాన్ని వెయ్యినోళ్ళ ఉగ్గడిస్తున్నారు. సమర్థిస్తున్నారు. పంచ'మ' కారాల్లో మరోటి 'మైథునము' అంటే లైంగిక సంపర్కము. యూరప్‌లోని వసంతోత్సవము – వేసవి పండుగలను గురించి మాట్లాడుతూ ఫ్రేజర్ ఇలా అంటాడు. "ఈ

ఉత్సవంలో కనబడే విచ్చలవిడితనమూ, పోకిరితనమూ ఏదో పొరపాటున వచ్చిన మితిమీరిన లక్షణం కాదనీ ఒకప్పుడు ఇవన్నీ ఒక క్రతువులో ముఖ్యమైన భాగం అని మనం భావించడానికి అవకాశాలెక్కువ ఉన్నాయి. అలాగే ఈ ఉత్సవాలు జరిపేవారు చెట్లకు, మొక్కలకు జరిపే పెళ్ళిళ్ళు మానవ లైంగిక సంపర్కం ప్రమేయం లేకుండా ఫలప్రదం కావని నమ్మేవారు అని కూడా మనం భావించవచ్చు." ఈ ప్రాచీన నమ్మకాన్ని తొలినాటి రూపులో నాగరికమైన యూరపులో చూడజాలమని ఆయన అన్నాడు. కానీ, ప్రపంచంలో ఇతర ప్రాంతాలలోని అనాగరిక జాతులు భూమి సారాన్ని వృద్ధి చేసే సాధనంగా మానవ లైంగిక సంపర్కాన్ని కావాలనే జరుపుతారు. అలాంటి ఆచారాల క్రతువుల అవశేషాలు యూరపులో క్లుప్త రూపంలో కనబడతాయి. లైంగిక చర్యకు గర్భధారణకు ఉన్న సంబంధాన్ని గుర్తించిన మానవ జ్ఞానదశను ఈ ఆచారం ప్రతిఫలిస్తుంది. మానవుల సారశక్తిని ఫలదీకరణం చేసే లైంగిక చర్య, దాని మహత్తు వల్ల భూసారాన్ని కూడా వృద్ధి చేస్తుందని ఈ సంప్రదాయంలో ఇమిడి ఉన్న తర్కం. ఫ్రేజర్ మరికొన్ని ఉదాహరణలు చెప్పాడు. మధ్య అమెరికాలోని పైపిల్ జాతివారు విత్తడానికి ముందు నాల్గు రోజులు లైంగిక సంపర్కాన్ని ఆపేసేవారు. 'విత్తడానికి ముందు రాత్రి పూర్తిగా కామ క్రీడలలో పాల్గొనడానికి వీలుగా అలా చేసేవారు. మొదటి విత్తనాలు నేలమీద పడే క్షణంలోనే రతి కార్యం జరపడానికి ప్రత్యేకంగా మనుషులను కూడా వినియోగించేవారు. ఈ లైంగిక క్రీడ ఒక విధి. అలా కాకపోతే విత్తనము జల్లే హక్కు కోల్పోవాలి. జావాలో కొన్ని ప్రాంతాలలో పంట చేను కోతకు వచ్చినప్పుడు రైతులు తమ భార్యలను పొలాల్లోనే రమించేవారు. తత్కారణంగా కాపు బాగా కాస్తుందని నమ్మకం. యూరపు రైతుల ఆచారాలు కొన్ని ఈ నమ్మకానికి చిహ్నాలుగా మిగిలిపోయాయి. జర్మనీలో కొన్నిచోట్ల పంటనూర్పిడిలో పాల్గొన్న స్త్రీలు, పురుషులు కలసి పొలాలలో దొర్లుతారు. యుక్రెయిన్‌లో వివాహితులు జంటలుగా పొలాలలో పడుకుని దొర్లుతారు. బ్రిఫాల్ట్ కూడా ఈ సంప్రదాయం కొన్ని సాంస్కృతిక దశల్లో సర్వత్రా ఉండేదని భావిస్తాడు. ఇక్కడ క్రతు సంబంధమైన రతి క్రీడను గురించి ఒక సంగతి చెప్పుకోవాలి. ఈ సంప్రదాయం కొన్ని సందర్భాలలో పురాతన లైంగిక కమ్యూనిస్టు వ్యవస్థను జ్ఞప్తికి తెచ్చుకునే ఉత్సవం కూడా కావచ్చు. (మూకుమ్మడి పెళ్ళిళ్ళు లేదా సామూహిక లైంగిక సంపర్కాలు) నాగరిక పరిశీలకులకు ఇదేదో లైంగిక విచ్చలవిడితనంగా కనబడవచ్చు. కాని అసలు సంగతి అది కాదు. "ఈ ఉత్సవాలను కామోద్రేకాల ప్రతిరూపంగా భావించడం అన్యాయం. భూసారవృద్ధికి, మానవ సంక్షేమానికి అవసరమని భావించి పవిత్రంగా, నిర్భయంగా ఏర్పాటు చేసిన క్రతువులే అవి" – (ఫ్రేజర్). బ్రిఫాల్ట్ కూడా సాంప్రదాయిక అనుమతి ఉన్న ఈ క్రతువులు విచ్చలవిడితనాన్ని దృష్టిలో పెట్టుకుని కాక ఉన్నతమైన లక్ష్యం కోసమే ఏర్పడ్డాయని అభిప్రాయపడ్డారు. కొన్ని ఉదాహరణలు : పెరూలో ఫల్టా తోటలు పంట తరుణానికి వచ్చినప్పుడు కొద్ది రోజులపాటు ఉపవాసాలు, రతి క్రీడ మానుకొనడం సంప్రదాయంగా వస్తూంది. ఆ

తరువాతనే ఉత్సవం. పురుషులు, స్త్రీలు నగ్నంగా సమావేశం అవుతారు. పరుగుపోటీ పెడతారు. పురుషులు తనకు దొరికిన స్త్రీని సంభోగిస్తాడు. చిలీ, నికరాగువా మొదలయిన చోట్ల మెక్సికోలోని కొన్ని జాతుల్లోనూ సంవత్సరానికి ఒకసారి ఇలాంటి లైంగిక స్వేచ్ఛ ఉత్సవాలు జరుగుతాయి. అమెజాన్ ప్రాంతంలోని కొన్ని తెగలలోనూ, జురుపారీ పవిత్రోత్సవాల్లోనూ హద్దులేని లైంగిక స్వేచ్ఛా దృశ్యాలు మనకు ఇప్పటికీ కనబడతాయి. అక్కడ వయోభేదం కూడా పాటించరు. చొరోటి జాతిలో మతపరమైన నృత్యం తరువాత బహిరంగ లైంగిక స్వేచ్ఛ ప్రస్ఫుటంగా కనబడుతుంది. పెటకోనియన్‌లలో ప్రధానమైన మతోత్సవం (కమరుకో) విచ్చలవిడి రతి క్రీడలతో ముగుస్తుంది. ఉత్తర అమెరికా దిగువ మిసిసిపీ లోయలలో పంటకోత కాలంలో జరిగే ఉత్సవాలలో అందరూ స్వేచ్ఛగా పాల్గొంటారు. ఆ తెగలోని వృద్ధ పురుషులు, స్త్రీలు యువతీ యువకులను ఉత్సాహపరుస్తారు. ఆస్ట్రేలియా, న్యూగినీల మధ్య ఉన్న ద్వీప సముదాయాలలో సూర్యుడు పురుషుడనీ, భూమి స్త్రీ అనీ సూర్యుడు భూమిని సారవంతం చేస్తాడని నమ్ముతారు... వర్షాకాలం ప్రారంభంలో సూర్యుడుగారు భూమిని సారవంతం చేయడానికి పవిత్రమైన అత్తిచెట్టులో (ఫిగ్ ట్రీ) ప్రవేశిస్తాడు. ఈ సందర్భాన పందులను, కుక్కలను బలిఇస్తారు. స్త్రీ, పురుషులు విచ్చలవిడిగా తిరుగుతారు. సూర్యునికీ, భూమికీ జరిగే సంయోగాన్ని బహిరంగంగా నాటకీయంగా ఆట పాటలతో ప్రదర్శిస్తారు. ఆ చెట్టు కిందే రతిక్రీడలు సాగిస్తారు. వర్షం, ఆహార సమృద్ధి, పానీయ సమృద్ధి, పశువర్ధనం, సంతానవృద్ధి, సంపద పెంపుదల వీనిని సూర్యుడు తాత ద్వారా సంపాదించడానికే ఆ ఉత్సవమని చెబుతారు. మలయాద్వీప కల్పంలో ధాన్యం మార్పిడి కాలంలో జాకూన్ తెగలో పురుషులు భార్యలను పరస్పరం మార్చుకుంటారు.

బ్రిఫాల్ట్ ఇలాంటి వివరాలు ఎన్నో సేకరించాడు. అయితే మనదేశంలో సంగతులు చూద్దాం. సంతాలులు పెద్ద పండుగ పేరు సోహ్రే. ఈ పండుగకు వ్యవసాయంతో సంబంధం ఉంది. ఐదు రోజులు నృత్యంతోనూ, తాగుడుతోనూ, వ్యభిచారంతోనూ జరిగిపోతాయి. ఈ పండుగ ప్రారంభానికి ముందు గ్రామపెద్ద లైంగికంగా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించవచ్చునని చెపుతాడు. కానీ, ప్రత్యేకమైన కొద్దిమంది స్త్రీల జోలికి మాత్రం పోకూడదని జాగ్రత్త చెబుతాడు. గ్రామ ప్రజలు తమ చెవులలో పన్నెండు దూది ఉండలు పెట్టుకున్నామనీ, ఏమీ వినమనీ, దేనినీ లెక్క చేయమనీ సమాధానం చెబుతారు. కొల్హాన్‌లో జరిగే 'మాఘే' పండుగ సందర్భంలోనూ, ఇంకా యితర ఉత్సవాలలోనూ లైంగిక స్వేచ్ఛ ఉంటుంది కానీ విచ్చలవిడితనం లేదు. హో జాతి వారు మాఘే పండుగలో బూతులు తిట్టుకుంటారు. (పిల్లలు పెద్దలనీ, పెద్దలు పిల్లలనీ). అది కూడా ఒక వ్యావసాయక క్రతువు. తూర్పు రెంగ్‌మాలలోనూ, పశ్చిమ రెంగ్ మాలలోనూ సంపాదన కోసం వ్యభిచరించే దుష్ట సంప్రదాయం లేదు. కానీ, పశ్చిమ రెంగ్‌మాలలో లైంగిక నీతి తక్కువే. ప్రతిచోటా లైంగిక కార్యక్రమాలు విత్తనాల కాలంలో

మాత్రమే అధికంగా ఉంటాయి. మద్యం ఎక్కువ తాగిన కొలదీ, లైంగిక కార్యం పొలాలను సారవంతం చేస్తుందని అసంకల్పిత విశ్వాసం వల్ల ఇలా జరగవచ్చునని చెబుతారు. కొన్యాక్ గ్రామంలో ధనవంతులు తమ ధాన్యాగారాల వరండాలలో యువతీ యువకులు పడుకునే అవకాశం కల్పిస్తారు. అక్కడ ఏ యువకుడికైనా రతిక్రీడ జరిపే అవకాశం లభిస్తుంది. జెమీ గ్రామస్తులు (కచ్చానాగాలు) బాటను బాగుచేసే ఉత్సవం ఒకటి జరుపుతారు. బాగు చేసిన బాట ప్రక్కన సంభోగకార్యం రూపాన్నీ సృష్టిస్తారు. స్త్రీ జననాంగాన్ని మట్టితో చేస్తారు. ఎండుగడ్డిని రోమాలకు చిహ్నంగా మట్టి జననాంగంపై చల్లుతారు. ఒక కొయ్యకర్ర పురుషాంగంగా నిలబడుతుంది. గుంపులు గుంపులుగా వస్తూ – పోతూ ఉన్న యువతీ యువకులు ఈ ఆకృతి దగ్గర నిలబడతారు. వారిలో ఒకడు ఆ కర్రను అవసరమైన పద్ధతిలో కదిలించి ఊపుతాడు. చూచేవారికి మంచి వినోదం.

హోలీపండుగ కూడా ఇలాంటి ఉత్సవమేనని క్రూక్ అభిప్రాయపడతాడు. రాజ్‌మహల్ కొండలలో సంవత్సరానికొకసారి జరిగే పంటల పండుగలో కూడా ఈ విచ్చలవిడితనం కనబడుతుంది. ఒరిస్సాలోని 'భూయియా'లు జరిపే వసంతోత్సవంలో రక్త సంబంధాలు, భార్యా భర్తల బంధాలు రద్దు చేస్తారు. నీలగిరి కొండల్లోని కోటా తెగవారు నిరంతర రతి క్రీడలతో ఒక ఉత్సవం జరుపుకుంటారు. అస్సాం తెగల స్త్రీలు వసంతోత్సవంలో మచ్చగానీ, ఆపకీర్తిగానీ, అభ్యంతరం కానీ లేకుండా ఇష్టం వచ్చినట్లు ప్రవరిస్తారు. కొండిస్తాన్, మణిపూర్, ఉత్తర బర్మాలో కూడా ఇలాంటి ఉత్సవాలు జరుగుతాయి. బాగ్చీ అనే పండితుడు భాషా విషయకమైన ఈ క్రింది భోగట్టా ఇచ్చాడు.

సంస్కృత పదం 'లాంగలం' అనే మాటకు 'నాగలి' అనే అర్థం ఉంది. అలాగే 'పురుషాంగమనే' అర్థం ఉంది. అలాగే సూత్రాలలోనూ, మహాభారతంలోనూ 'లాంగోల' ము అనే పదం కనబడుతుంది. దాని అర్థం 'తోక'. మరొక అర్థం 'పురుషాంగం'. 'పురుషాంగం' నుంచి 'నాగలి', 'తోక' లక్షణాలకు మనసు సారించడం కష్టమైన పనికాదు. రతి కార్యానికి, దున్నడానికీ మధ్య అనేక పోలికలు కనబడతాయి. (ముఖ్యంగా త్రవ్వి విత్తనాలను నాటడం). లింగ పదము మిగతా రెండు పదములను పోలియున్నది. (లాంగలం, లాంగోల) మరి దాని అర్థం కూడా పురుషాంగమే.

సంతాల భాషలో 'ల' అనే పదం ఉంది. దాని అర్థం త్రవ్వుట, లేదా గొయ్యి చేయుట. లాంగాలము మొదలైన పదాలు 'ల' నుంచి సాధించబడినవి. అయితే నాగలి భూమాతలోనికి చొచ్చుకు పోవటాన్ని వివరించినట్లే ఆస్ట్రోయాషియాటిక్ భాషలో పురుషాంగాన్ని, నాగలిని సూచించే పదాలకు అర్థం "లోపలకు చొప్పించే అవయవం."

ఆస్ట్రోయాషియాటిక్ ప్రజలు దున్నడానికి ఉపయోగించే పరికరం ఈ భావాన్ని ఇంకా బలపరుస్తోంది. కొందరు ఆస్ట్రోయాషియాటిక్ ప్రజలు ఇప్పుడు కూడా దున్నడానికి నాగళ్ళు వాడరు. ఒక పదునైన కర్రతో విత్తనాలు వేయడానికి అనుకూలమైన గుంటలు త్రవ్వకుంటూ పోతారు. పురుషాంగానికీ, ఆ వ్యవసాయ పరికరానికీ ఉన్న పోలిక స్పష్టం. మెలనేషియా, పొలినేషియా ప్రాంతాలలో వాడే ఆ వ్యవసాయ పరికరం పురుషాంగం పోలికలోనే ఉంటుంది. పొలినేషియన్ భాషలలో ఆ త్రవ్వకపు పరికరానికీ, పురుషాంగానికీ కూడా ఒకే పదం ఉపయోగిస్తారు. బహుశా భారతదేశంలో కూడా అలాంటి పరికరాన్నే ఆదిమజాతి వారు తొలి రోజుల్లో ఉపయోగించి ఉంటారు. అదిపోయి నాగలి వచ్చినా పదం మాత్రం మిగిలిపోయింది. అయితే ఇదంతా పితృస్వామిక వ్యవస్థా ప్రభావం నుంచి వచ్చిన భాషా సంప్రదాయం కావచ్చును.

'తైత్తిరీయ సంహిత' వ్యావసాయక లక్ష్యాలను సాధించడానికి ఈ క్రింది మంత్రాన్ని సూచిస్తుంది: "కాడి కట్టండి... విత్తనానికి సిద్ధంగా ఉన్న గర్భాశయంలో విత్తుము.. ఫలించిన ధాన్యాన్ని కొడవలితో క్రిందికి తెచ్చుకో" వ్యావసాయక కార్యక్రమాలను, లైంగిక కార్యంతో పోల్చడం వేద కవులకు మామూలే.

'వాజసనేయి సంహిత' లో ఇంతకంటే ఆసక్తిదాయకమైన భాగం ఉన్నది. ఆధునిక వేద పండితులు ఆ భాగాన్ని చూసి కొంచెం ఇబ్బంది పడతారు. ఇప్పటి నీతి నియమాల పరిధిలో అది చాలా జుగుప్సాకరంగా ఉంటుంది. అధ్వర్యు, ఉద్గత, బ్రహ్మ మొదలైన వేద పూజారులకూ వారి స్త్రీ మిత్రులైన కుమారి, నవత, మహిషిలకూ మధ్య జరిగిన సంభాషణల్లో.... భీభత్సవమైన లైంగిక సంపర్క వివరాలుంటాయి. అయితే... ఈ రతి క్రీడా సంభాషణ అంతటా 'షితేవతే పునన్నివా' అనేది పల్లవిలాగా కనబడుతుంది. (ధాన్యాన్ని ఆరబెట్టే వ్యవసాయకునిలాగా తీసుకుని వదలడం త్వరగా చేయుట – విత్తనం జల్లుట). ఇదంతా 'ఆశ్వమేధం' లో భాగంగా దీన్ని వర్ణించారు. అయితే బూతులాగా కనబడినప్పటికీ.... రతిక్రియా వివరాలు ఉన్నప్పటికీ.... పంటల ఉత్సవాలకూ... లైంగిక క్రియకూ ఉన్న అనుబంధమే ఇందులోని విశేషాంశం కూడా... అయితే వేద సాహిత్యంలోని ఉత్పత్తి సార కార్యక్రమాలన్నీ ఆహార సముపార్జన దశకు ఎక్కువ సంబంధం కలిగి ఉన్నాయి. అక్కడక్కడ మాత్రమే ప్రత్యక్షంగా వ్యవసాయానికి ప్రత్యక్ష సంబంధం కలవిగా తోస్తాయి. రెండో విషయం పితృస్వామిక లక్షణం: దాన్ని స్పష్టంగా 'బృహదారణ్యక ఉపనిషత్'లోని ఈ క్రింది భాగంలో చూడవచ్చును. "ఆమె అతని వాంఛను తీర్చకపోతే ఆమెకు ధనమివ్వాలి (అంటే లంచం) అప్పటికీ ఆమె అంగీకరించకపోతే కర్రతోనో, చేతితోనో కొట్టి లొంగ తీసుకోవాలి".

మాతృస్వామిక, పితృస్వామిక సంప్రదాయాలను స్పష్టంగా బయలు పరిచే రెండు సమాసాలు కూడా ఇక్కడ మనం గుర్తుపెట్టుకోవాలి. (1) బీజ ప్రాధాన్యం, (2) క్షేత్ర ప్రాధాన్యం.

వేద సంప్రదాయాల్లో ... ఈ రకమైన పితృస్వామిక వ్యవస్థను సూచించే వివరాలు, ఛాయలు ఎన్ని ఉన్నప్పటికీ, తంత్రశాస్త్రం... ప్రాథమికంగా... స్త్రీ సత్త్వ ప్రధానమైన సంప్రదాయ మనడానికి సందేహం లేదు.

## తంత్రం : దాని అర్థం : ప్రాచీనత : శాఖలు

తంత్రం అనే పదానికి అర్థం ఏమిటి? దాని వయస్సెంత? తంత్రవాదంలోని వివిధ శాఖల మధ్య ఉన్న భేదాల ప్రాముఖ్యత ఏమిటి? ఆధునిక మేధావులలో కొందరు తంత్రం అనే పదం యొక్క అర్థాన్ని గురించి విస్తృతమైన చర్చలు చేసారు. అయితే దురదృష్టవశాత్తు ఆ పదానికున్న సామాన్యార్థాన్ని మాత్రం గణించలేదు. తంత్రవాదం అనేది ప్రముఖంగా మార్మిక తత్వశాస్త్రం అనే ఊహలో మునిగిపోవటం వల్ల ఇలా జరిగింది. ఆ మార్మికతకు అనుబంధంగా కొన్ని ఆత్మవాద ఆచరణలు కూడా ఆధారమని వారు నిర్ణయించుకున్నారు. కానీ ఆ పదం యొక్క సరళమైన అర్థం ఈ తత్వశాస్త్రాన్ని, ఈ ఆచరణను స్పష్టం చేయదు. తంత్ర అనే పదం "తన్" అనే ధాతువుకు "ష్ట్రన్" అనే పదం చేర్చటం ద్వారా లభించింది. (తనోతి తన్యతే వాయితి తన్+ ష్ట్రన్) "తన్" అనే ధాతువుకు అర్థం "విస్తరించు" లేదా "వ్యాపింపచేయు." విస్తరించేదేమిటి? వ్యాపింపచేసేదేమిటి? ప్రాథమికంగా మానవ కుటుంబం : అంటే బహుళ సంతానం. మరో మాటలో దానర్థం విస్తరణ చర్య. హరివంశంలోనూ, భాగవత పురాణంలోనూ ఈ పదానికి "విస్తరింపచేయు" అనే అర్థమే ఉండేదని మోనీర్ విలియమ్స్ రుజువు చేశాడు. 'సంతానము', 'తనయ' (బిడ్డ) అనే పదాల నుంచి ఈ భావం ఇంకా స్పష్టం అవుతుంది. ఈ పదాలు కూడా 'తన్' ధాతువు నుంచి వచ్చినవే. అలాగే అదే ధాతువు నుంచి వచ్చిన మరో పదం 'తంతు'. అంటే క్రమ పద్ధతిలో కుటుంబము తరతరాలుగా వృద్ధి చేయుట అనే అర్థంలోనే కాత్యాయన శ్రౌత సూత్రాలలోనూ, ఆప స్తంభ ధర్మ సూత్రాలలోనూ, తైత్తిరీయ ఉపనిషత్తులనూ ఉపయోగించారని కూడా మోనీర్ విలియమ్స్ భావించాడు. తైత్తిరీయ బ్రాహ్మణంలో 'వారసుల క్రమం' గా ఈ పదాన్ని భావించారు. 'తంతు కర్త్రి' అనే పదానికి అర్థం 'కుటుంబ క్రమము' (వరుస). తంత్ర అనే పదానికి కుటుంబ వ్యాప్తి లేదా సంతానోత్పత్తి అనే అర్థాలు సాధించటం కష్టమే కాదు. మహాభారతంలో "కులస్య తంత్ర", అనే పదానికి అర్థం కుటుంబాన్ని నిలుపుకునే ప్రధానచర్య, అంటే 'వ్యాప్తి' అనే అర్థం. ఇలాంటి సాక్ష్యాలు ఎక్కువ అక్కర లేదు. తన్ అనే ధాతువుకు ముఖ్యమైన అర్థం పునరుత్పత్తి చేయుట. ఆ ధాతువు నుంచి వచ్చిన పేరే తంత్రం. అంటే పునరుత్పత్తి అన్నమాటే. ఇది తంత్ర వాదానికి భూమికగా సరిపోతుంది.

తంత్రవాదం రాసిన గ్రంథాలను పరిశీలించటం ద్వారా దాని చారిత్రికతను నిర్ణయించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అలాంటి ప్రయత్నాలన్నీ ఆయా తాంత్రిక గ్రంథాల వయస్సును నిర్ణయించటానికి పనికి రావచ్చేమోగానీ తంత్రవాద చారిత్రికతను నిర్ణయించజాలవు.

తంత్రవాదంపై వచ్చిన గ్రంథాలకంటే తంత్రవాదమే పురాతనమైనది. నిజానికి కొన్ని గ్రంథాలు ఇటీవల తయారైనవే. ఉదాహరణకు 'మహా నిర్వహణ తంత్రం', రామ్మోహనరాయ్‌గారి గురువు రాశాడని చెబుతారు. 'మేరు తంత్రం', అనే గ్రంథంలో "లంద్రజ" (లండన్ వాస్తవ్యుడు), "ఇంగ్రెజ" (ఆంగ్లేయుడు) అనే పదాలు కనపడతాయి. ఆ గ్రంథం ప్రాచీన మనడానికి వీలుచిక్కదు. మరికొన్ని గ్రంథాలు ఆరు, ఏడు శతాబ్దాల్లో తయారయ్యిండొచ్చు. ఇప్పటికే అనేకమంది సమర్థులైన పండితులు తంత్రవాదం, దానిపై వచ్చిన గ్రంథాల కంటే పురాతనమైనదని రుజువు చేశారు. అందువలన తంత్రవాదపు ప్రాచీనతను ఆ గ్రంథాల ద్వారా స్థాపించలేము.

"ఆ గ్రంథాల చారిత్రిక కాలాన్ని స్పష్టంగా నిర్ణయించడం అసాధ్యం. బహుశా ఇప్పుడు దొరికే పుస్తకాలన్నీ ఎప్పుడో అడుగంటి పోయి, మాసిపోయిన పుస్తకాల అవశేషాలు కావచ్చు. వానిలో చేర్పులూ, మార్పులూ చాలా చొచ్చుకొనిపోయి ఉండవచ్చు. ఇప్పుడు మనకు దొరుకుతున్న పుస్తకాలు క్రీస్తు శకం ఆరు, ఏడు శతాబ్దాల నాటివి అంటారు. కానీ, బహుశా తరువాతి కాలానివి కూడా అయిండొచ్చు. తాంత్రిక ప్రయోగాలు సూత్రాలు అంతకు మునుపు కాలాల్నుంచీ ప్రయోగంలో ఉన్నవే. అవి ఆదిమ ఆలోచనా సరళికి చెందినవి. ఆదిమ నాగరిక ప్రజల ఆలోచనలు శతాబ్దాలపాటు ఘనీభవించిపోతాయి." – (మతము – నీతి – విజ్ఞాన సర్వస్వము. సం॥ జె. హేస్టింగ్స్ ఎడింబరో).

మన తంత్రవాద చరిత్ర పండితులలో ఒకరైన బందోపాధ్యాయ 'తంత్రవాదం వేదాలకంటే తక్కువ పురాతనమైనది కాదు' అని భావిస్తాడు. ఈ వాదంతో చాలామంది సమర్థులైన పురాతన వస్తు శాస్త్రజ్ఞులు కూడీ ఏకీభవిస్తారు. వేదాలను రచించిన శ్వేతవర్ణ ఆర్యులతో పాటు కృష్ణవర్ణ (నల్లని) ఆర్యులు కూడా భారతదేశంలోకి వచ్చారని వీరంటారు. ఆ నల్ల తెగవారు ప్రాచీన ఇరాన్ నుంచి ప్రస్తుతపు కాబూల్ లోయగుండా తక్లామకాన్ దాటి కాశ్మీరు ద్వారా భారతదేశంలో ప్రవేశించారని ఊహ. వారిలో ఒక శాఖ గాంధారం గుండా మహారాష్ట్ర చేరారని, మరొక శాఖ కొండదారుల గుండా బెంగాల్ వరకు వ్యాపించారని భావిస్తున్నారు. అలా వచ్చిన వారే భారతదేశంలోకి తంత్రవాదాన్ని తెచ్చారనే పురాతత్వశాస్త్రజ్ఞులు ఊహ. ఇక్కడ వర్ణించబడిన తెగల ప్రయాణం సుందరంగా ఉంది. అయితే ఆధునికమైన చారిత్రక పరిశోధనలు ఈ వాదనకు ఊతాన్వివ్వవు. అలా అని భారతదేశానికి తంత్రవాదం వలన వచ్చిన విధానమే అసందర్భం అయిపోదు. ఈ సమస్య బాగ్చీ ఎప్పుడో లేవనెత్తాడు. నీథామ్ మళ్ళీ పైకి తీసుకొచ్చాడు. బందోపాధ్యాయ తన కాలం నాటి పురాతత్వ శాస్త్రవేత్తల మీద ఆధారపడి తంత్రవాదం పురాతనమైనదన్నాడు. బహుశా ఆయన ఊహించిన దానికంటే కూడా పురాతనమైనది కావచ్చు. సింధు నాగరికతా శిధిలాల్లో స్పష్టమైన తంత్రవాదపు చిహ్నాలు లభిస్తాయి. ఈ విషయం ఆ రోజుల్లో మార్షల్ సూచించాడు. ఇటీవలి కాలంలో ప్రాణనాథ్ మొదలైనవారు ఆ వాదాన్ని స్థిరపరచారు. "సింధు కళ, అక్షర చిత్రాలు తంత్రవాద సంజ్ఞలతో గాఢ సంబంధం కలిగి ఉండాలని నమ్మే అవకాశం ఎంతో ఉంది." ఇందులో వింతేమీ లేదు.

సింధు ప్రాంతపు పట్టణ, నాగరికత, సంపదనంతా భూమి నుంచే సాధించేది. తద్వారా ప్రాచీన వ్యావసాయక దశలోని నమ్మకాలు, ఆచరణలు స్థూలంగా ఆ నాగరికతలోకి ప్రవహించి వుంటాయి. సింధు శిధిలాలలోనే తంత్రవాద ఛాయలు కనబడ్డాయంటే మనదేశంలో తంత్రవాదానికి ఐదువేల సంవత్సరాల పైనే వయస్సుందన్నమాట. మన దేశాభివృద్ధి ఎగుడుదిగుడుగా సాగుతూ వచ్చింది కనుక ఏదో తారీకుల పద్ధతిలో తంత్రవాద చరిత్రను నిర్మించడం తప్పు. స్థంభించిపోయిన ఆర్థికాభివృద్ధి వల్ల భారతదేశంలో విపరీతంగా వెనుకబడిన అన్ని తెగల నమ్మకాలు, ఆచరణలు, తంత్రవాదంలో విపరీతమైన మార్పులకు లోనై మనకు దర్శనమిస్తుంటాయి. అంటే ఐదువేల సంవత్సరాల నాడు సింధు నగరాలను నిర్మించిన పూర్వీకుల జీవితాన్నే ఇప్పటికీ అనుభవిస్తున్న ప్రజలున్నారన్నమాట. ఆ ప్రజల జీవితంలో తంత్రవాదపు మూలాలను మనం వెతకాలి. అంటే తంత్రవాద సహజరూపం కేవలం ప్రాచీనమైనదే కాదు ఆధునికమైనది కూడా. ఆమాటకొస్తే సమకాలీనం.

తంత్రవాదం ఇప్పటికీ నిలిచివున్న సంగతే క్లిష్టమైన వ్యవహారం. తంత్రవాదానికి పునాదిగా వున్న తొలి నమ్మకాలు, ఆచరణలు మనకు వెనుకబడిన తెగలలో మిగిలి ఉండడమే గాక భారతీయ సంస్కృతి పైనే తంత్రవాదం గాఢముద్ర వేసింది. 'నిజానికి మామూలు ప్రజలలో వ్యాపించిన హైందవంలోనూ, నిగూఢమైన హైందవంలోనూ కూడా ఆచారాలన్నీ తాంత్రిక లక్షణం కలవే' – ఎవలోన్.

"భారతీయ ఆలోచనా విధానం మీద శాక్తేయ మతం విపరీతమైన ప్రభావాన్ని చూపింది. భారతదేశంలో దేశమంతటా వ్యాపించిన శక్తి సాధనా కేంద్రాలు (తాంత్రిక) విస్తృతంగా కనబడతాయి. పూర్వం ఇంకా విస్తారంగా ఉండేవి. ఈ రోజు వరకూ కొనసాగుతూనే ఉన్నాయి." – (కవిరాజు... ప్రాచ్య పశ్చిమ తత్వశాస్త్ర చరిత్ర).

ప్రాచీన వ్యావసాయక దశలో నివసించిన వారి నమ్మకాలు, ఆచరణలు పరిశీలించి తాంత్రికవాద మూలాలు నిర్ధారణ చేయడం వలన, తంత్రవాదం ఇప్పటికీ ఎలా మిగిలిపోయిందనే సమస్య పరిష్కారం కాదు. తంత్రవాదానికి మూలమైన భౌతిక పరిస్థితులు అందులోని సజీవాంశాలు తర్వాతి కాలపు దేశ సాంఘిక వ్యవస్థలో కొనసాగి ఉండాలి. అందుచేతనే తంత్రవాదపు భావాలు, ఆచరణలు కూడా వ్యాపిస్తూ వచ్చాయి. ఆసమ నాగరీకరణ అనే మన సూత్రీకరణ భారతీయ సంస్కృతిలోని ఈ విచిత్రాన్ని ఎలా వివరించగలదో మనం పరిశీలించుదాం.

## తంత్రవాద శాఖలు

"తంత్రవాదం ఇప్పటికీ మనకు ఒక చిక్కుముడిలాగా కనబడుతుంది. ఈ రంగంలో చాలా స్వల్పమైన కృషి జరిగింది. తంత్రవాద సిద్ధాంతాలను విశ్లేషించే ప్రయత్నాలు చాలా

తక్కువ. కానీ తంత్రవాదంపై విపరీతమైన సాహిత్య సృష్టి జరిగింది – ఆ సాహిత్యం అంతా రాత ప్రతుల్లోనే దొరుకుతుంది" – (బాగ్చీ).

ఇది నిజమే. తంత్రవాదం మీద ఇంత సాహిత్యం ఉన్నా విశ్వవిద్యాలయాల్లో అదొక కొరకరాని కొయ్యగా మిగిలిపోయింది. దీనికి అనేక కారణాలున్నాయి. కొన్ని అనుకోనివి, కొన్ని క్లిష్టమైనవి. విచిత్రమేమిటంటే తంత్రవాదంపై ఉన్న సాహిత్యమే దాన్ని అర్థం చేసుకోడానికి పెద్ద అడ్డంకి అయికూర్చుంది. తంత్రవాదంపై ఏ గ్రంథమైనా దాని స్వభావాన్ని గురించి తప్పుడు ఆశలు రేపుతుంది. విద్యార్థులు కూడా మోసపోతారు. అలా అని ఆయా గ్రంథాల్లో నిజమైన తంత్రవాదం దొరకదని కాదు. దొరుకుతుంది. కానీ, దాంతోపాటు ఇంకా ఎన్నో ఉంటాయి. అనేక కోణాల నుంచీ అనేక మార్గాల గుండా తంత్రవాదానికి భిన్నమైన – కొన్ని సందర్భాలలో అందుకు వ్యతిరేకమైన – ఆలోచనలు తొలి తంత్రవాదంలోకి చొప్పించబడ్డాయి. అందుచేత సిసలైన తంత్రవాద స్వరూపాల్ని – ఆ గ్రంథాల్నించి – ఉద్ధరించటం కష్ట సాధ్యం. మరో ప్రత్యేకమైన ఇబ్బంది కూడా ఉంది. తంత్రవాదాన్ని అధ్యయనం చేసే ఆధునిక పండితులకు తంత్రవాదంలో 'చొప్పించబడ్డ' అంశాలతో ఎక్కువ పరిచయం ఉంటుంది. ఎందుకనంటే, వారి ఆలోచనలకు అవి సన్నిహితంగా ఉంటాయి. అందుచేతనే ఆధునికులు అసలు తంత్రవాదం కంటే దానిపై రుద్దబడిన భావాలకు ఎక్కువ అంటి పెట్టుకుని ఉంటారు. పైగా ఆయా గ్రంథాల్లో అసలు సిసలు ప్రాచీనమైన విషయాలన్నీ వారికి చిరాకు కలిగిస్తాయి. అందుచేత వారు ఆ ప్రాచీనాంశాలను దాచి పెట్టడమో, లేదా గట్టిగా ఖండించడమో చేస్తారు. ఒక పద్ధతి గ్రంథంలో బౌద్ధ తత్వశాస్త్రానికి అణుకువుగా కనబడే తంత్రవాదాన్ని పైకెత్తే ప్రయత్నాలు జరిగాయి. (మహాయానం). అలాంటి గ్రంథాలు సహజంగా బౌద్ధ సాంకేతిక పదాలతో నిండి ఉంటాయి. ఇది – ఆధునిక పండితులలో గొప్పవాళ్ళు కూడా – తంత్రవాదాన్ని, బౌద్ధపరిభాష ద్వారా అర్థం చేసుకునే ధోరణిని కలిగించింది. మహాయానం నుంచి ఉద్భవించిన వాదంగా తంత్రవాదాన్ని భావించటం ఒక విపరీతం. అది పూర్తిగా చెడిపోయిన తంత్రవాదం. హెచ్.పి. శాస్త్రి లాంటి పండితులు కూడా తంత్రవాదానికీ, మహాయానానికీ మధ్యనున్న సంబంధాన్నే బలపర్చటం చూస్తే ఈ అభిప్రాయం ఎంతబలంగా ఉందో అర్థమవుతుంది. ఏమయినప్పటికీ ఈ గ్రంథాల్లో చెప్పబడుతున్న సిద్ధాంతాలు, ఆచరణలు బౌద్ధవాదంలో భావవాద తత్వానికి స్వాతిక ఆచరణకు ఎంత భిన్నమైనవో స్పష్టమే. ఈ గ్రంథాల్లో కనబడుతున్న లైంగిక చిహ్నాలకు సంబంధించిన ప్రాథమిక దృష్టి మహత్తు అంశాలతో నిండి ఉంది. స్త్రీ, పురుష సంయోగమే ఇందులోని ముఖ్యభావన. శ్యూనత, కరుణ, ప్రజ్ఞ, ఉపాయ, వజ్ర, పద్మ లాంటి బౌద్ధ పదాలను ఇష్టం వచ్చినట్లు తీసుకుని ఉపయోగించారు. నిజమే. 'రెండింటి సంయోగ'మంటే లైంగిక సంయోగమే. ఈ గ్రంథాల్లోని క్రతువు బహిరంగంగా లైంగిక సంయోగ వ్యవహారంపై ఆధారపడిందే. బౌద్ధతత్వానికీ, తంత్రవాదానికీ మధ్యనున్న సంబంధం కృతకమే అని బౌద్ధ తంత్రవాదాలు రుజువు చేస్తాయి. ఆ సంగతి మనం రెండు ఉదాహరణలు పరిశీలిస్తే తేలుతుంది.

“హిందూ తంత్రాల గురించి మనం చర్చించిన వాటికి సమానమైన విషయాలనే బౌద్ధ తంత్రాలలో కూడా చూస్తాం. హిందూ తంత్రాలలోని శివుడు, దుర్గ మొదలైన పేర్లు బౌద్ధవాద తంత్రాలలోని వజ్ర సత్వ, వజ్ర డాకిని లాంటి పేర్లుగా మార్పు చెందాయి. అంతే. బౌద్ధ తంత్రాలలో కూడా చండీ, తార, వరాహి మొదలైన దేవతల పూజలు విస్తారంగా ఉన్నాయి. శివుని పేరు మీద ప్రచారమవుతున్న తంత్రాలలో కనపడినట్టుగానే రకరకాల దేవతలు బౌద్ధ తంత్రాలలో కూడా కనబడతాయి. (హేతుక మొదలైన). ‘మాలామంత్ర’, ‘మాతృక’, ‘కవచ’ ‘హృదయ’ మొదలైనవి బౌద్ధ తంత్రాలలో కూడా కనబడతాయి. ఇవన్నీ అతి గోప్యమైనవిగా భావించబడతాయి. బౌద్ధ తంత్రాలలో వీనిని సాధకుడు కాని వారికి బహిరంగ పరచకూడదని నిషేధం ఉంది.

“బుద్ధుని అభిప్రాయాలు వివరించే బౌద్ధ పవిత్ర గ్రంథాలలో పంచ ‘మ’ కారాలను తీవ్రంగా నిరసించారు. కానీ బౌద్ధ తాంత్రికులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తారు. పంచ ‘మ’ కారాల సాధన బౌద్ధ తంత్రాలలో ప్రధాన పాత్ర వహిస్తుంది. బౌద్ధ గ్రంథాలలో తీవ్రంగా నిరసించబడిన మధు, మాంస ఆస్వాదన బౌద్ధ తంత్రాలు విశేషంగా శ్లాఘిస్తాయి. తాంత్రిక ఆచరణలో సఫలం చెందిన వానిని ‘వీరనాయకుడి’గా బౌద్ధ తంత్రాలు పిలుస్తాయి. బౌద్ధ తాంత్రికులు ఈ ప్రపంచ స్త్రీ నుంచి పుట్టినట్లే భావిస్తారు. (వామోద్భవం). అలాగే చక్రపూజ, వీరయోగ, భగపూజ మొదలైన సంప్రదాయాలలో కూడా బౌద్ధ తాంత్రికులు వెనుకబడలేదు.” – (బోస్ – విశ్వకోశ).

‘బౌద్ధ తంత్రవాదం అంటే ఆచరణలో బౌద్ధ హైందవమే. అంటే హైందవమూ లేదా శైవమూ బౌద్ధ వేషంలో ఉన్నదన్నమాట! – (పౌసీ). ఇది నిజమైతే బౌద్ధతంత్రం అనేపేరు తప్పుడు ప్రయోగము. పౌసీ బౌద్ధ తంత్రంలోని రెండు ధోరణులను వివరిస్తూ అన్న ఈ క్రింది మాటలు గమనీయం.

“రెండు తాంత్రిక మార్గాలు జీవులందరూ వజ్ర సత్వులేనని – నిజానికి ఆఖండ వజ్ర సత్వంలోని భాగాలన్నమాట నమ్ముతాయి. అలాగే వజ్ర స్వభావం అన్ని జీవుల్లోనూ ఉంటుందని సక్రమమైన జ్ఞాన, క్రతువుల ద్వారా ఆ వజ్ర స్వభావాన్ని వాస్తవీకరించవచ్చని నమ్ముతారు. వామహస్త ధోరణి కల తంత్రవాదులు వజ్ర స్వభావాన్ని శైవ పద్ధతిలో ఊహిస్తారు. దక్షిణహస్తం వారు వేదాంత లేదా యోగ సంప్రదాయంలో ఊహిస్తారు. శైవ పద్ధతి తంత్రాలకు సంబంధించి శైవాన్ని, శాక్తేయాన్ని బౌద్ధులు అనుసరించిన పద్ధతిగా మనం గమనించాలి. బుద్ధుని మూడు సంప్రదాయ మార్గాలు నిలబడ్డాయి. కానీ, వజ్రసత్వ స్వభావపు అసలు రూపం నాలుగో స్వరూపం. అదే ఆనంద శరీరం. (ఆనంద, సుఖమయ, మహాసుఖకాయ) అదే వజ్ర శరీరం. ఈ శరీరంతోనే శాశ్వతమైన తధాగతులు లేదా భగవంతుడు శాశ్వతంగా శక్తి (తార లేదా భగవతి) ని అలింగనం చేసుకుంటాడు. జీవి లేదా భగవంతుడు వీరి స్వభావంలో

మిళితమై ఉన్న శృంగార భావం నుంచి నిజమైన దైవ స్వభావాన్ని వాస్తవం చేయడానికి సాధకుడు భగవతి రూపమైన లేదా భగవతియే అయిన స్త్రీతో సంభోగ క్రతువు నెరవేర్చాలని బోధ పడుతుంది. (యోగిని ముద్ర). (బుద్ధత్వం యోసిద్ యోని సమాశ్రితం) - బుద్ధత స్త్రీ అంగంలో ఉంటుంది - అని సూత్రం. (చండా మహా రోశన ప్రకారం) శాక్యముని అంతః పురంలో తాంత్రిక వ్యవహారాలు ఆచరించటం ద్వారా బుద్ధత్వాన్ని సాధించాడట. ఈ సాహిత్యంలో ప్రత్యేకంగా కనబడే అంశం స్త్రీ పూజ : చీదర కలిగించే వ్యవహారం జుగుప్సాకరం, నేరపూరితం, వావి వరుస లేని లైంగిక సంపర్కం ఈ పూజలో భాగాలు. దీన్ని బోధిసత్వ వీరోచిత ప్రవర్తనగా (ధిక్కార చర్య) భావిస్తారు. అదే సంపూర్ణ సుగుణాల సాధనకు మార్గమని భావిస్తారు. బౌద్ధ పురాణం, మార్మికవాదం స్వేచ్ఛగా శాక్తేయులతో కలసిపోతుంది. (ఇంద్రియమే పంచ 'బుద్ధులు' మొదలైన భావాలు)" - (పౌసీన్ మతం -నీతి శాస్త్రం - విజ్ఞాన సర్వస్వం).

బౌద్ధ వాసన వేస్తున్నప్పటికి అలాంటి భావాలకూ, బౌద్ధవాదానికి సంబంధం లేదు. తంత్రవాదపు వాస్తవ స్వభావాన్ని అర్థం చేసుకోవాలంటే ఆయా గ్రంథాలలో కృతకంగా రుద్దబడిన బౌద్ధాంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. తద్భిన్నంగా మన పండితులు దాన్ని మౌలిక బౌద్ధవాదానికి క్షీణ రూపంగా భావిస్తున్నారు. బౌద్ధ పారిభాషిక పదాలతో నిండిన శృంగార భావన. "మహాయాన బౌద్ధంలోని ఉన్నతమైన భావాలు కాలక్రమేణా ఇంత చంఢాలంగా ఎలా క్షీణించిపోయాయి" అని హెచ్.పి. శాస్త్రిగారు తనకు తాను ప్రశ్న వేసుకుంటున్నాడు. ఆయన చెప్పిన సమాధానం విశేషమైంది. బౌద్ధమతాన్ని విశృంఖలంగా ప్రజలకు అందజేయాలనే ప్రయత్నం వల్ల జరిగిన ఫలితమని ఆయన అంటాడు. బౌద్ధమతం వ్యాపిస్తున్న కొలదీ ప్రజలలో అప్పటికే పేరుకుని పోయిన మూఢ నమ్మకాలు దానిలో చేరిపోయాయి. స్వార్థ రహిత వైరాగ్య మతం నుంచి హేయమైన జిత్తులమారుల, హీన మానవుల మతంగా దిగజారిపోయింది. ఇది నిజమేనని ఒప్పుకున్నప్పటికీ కొన్ని నమ్మకాలు, ఆచారాలు అంతకు మునుపే ప్రజా సముదాయాల్లో చోటు చేసుకొని ఉన్నాయని, వాటికి బౌద్ధతంత్రం అని చెప్పబడే మతంలో కొన్ని బౌద్ధ భావాలు చొప్పించబడ్డాయని నిర్ణయించుకోవచ్చు. మౌలిక బౌద్ధం ప్రజలలో వ్యాపించివున్న క్షీణ భావాల పొత్తుతో బౌద్ధ తాంత్రికంగా మారిందని అనుకుంటే ప్రజలలో అప్పటికే నెలకొని ఉన్న భావాలలోనే బౌద్ధ తంత్ర మూలం దొరుకుతుంది. ఈ ఆలోచనకు అనుబంధంగా మూలతంత్రవాద స్వభావాన్ని అర్థం చేసుకోవాలంటే బౌద్ధంతో దానికున్న సంబంధాన్ని తిరస్కరించాలి. క్రింది కులం ప్రజలలో వ్యాపించి ఉన్న నమ్మకాలలోనూ సంప్రదాయాలలోనూ దాని మూలాన్ని వెదకాలి. హెచ్.పి. శాస్త్రికి తన దృక్పథంలోని సారాంశం తెలియదు. ఇక్కడే తాంత్రికవాదాన్ని అర్థం చేసుకోవడంలో మన ఆధునిక పండితులు పొరబడిన కారణం మనకర్థమవుతుంది. తంత్రవాదం తన మౌలిక రూపంలో, శతాబ్దాలుగా తక్కువ చూపు చూపబడిన కులాలతోనూ, వృత్తులతోనూ అల్లుకొని ఉన్నది. మన ఆధునిక పండితులు

ఈ తక్కువ జాతి కులాల పట్ల, వృత్తుల పట్ల తమకున్న చులకన భావాన్నుంచి వేరుపడలేకపోయారు. మౌఢ్యాన్ని జయించాలంటే ముందు దాన్ని అర్థం చేసుకోవాలి. ఈ కార్యాన్ని మన ఆధునిక రచయితలు పూర్తిగా విస్మరించారు. అందుచేతనే తాంత్రికవాద మూలరూపాన్ని గ్రహించడానికి వారి అభిప్రాయాలు అడ్డువచ్చాయి. ఆ మూలరూపం వెనుకబడిన ప్రజల, హీన జాతి కులాల వారిలో వ్యాపించి ఉండి, ఒక రకం తాంత్రిక గ్రంథాలు బౌద్ధ భావాలతోనూ, పరబంధాల తోనూ నిండి ఉంటే మరోరకం గ్రంథాలు అభివృద్ధి చెందిన హిందూమత సంజ్ఞలతో నిండి ఉంది. పురాణాల్లో వర్ణించబడిన దేవుళ్ళ, దేవతల సమూహంతో పాటు భక్తి, పూజ, మోక్షం మొదలైన వాటికి విపరీత ప్రాధాన్యం ఇవ్వటం మనం ఇక్కడ చూడవచ్చు. బౌద్ధ తంత్రాలలో కనపడే బౌద్ధతత్వంలాగే, హిందూ తంత్రాల్లో కనబడే ఈ అభివృద్ధి చెందిన ఆత్మికభావాలు మౌలిక తంత్రవాదానికి పూర్తిగా బాహ్యమైనవి. తరువాతి కాలంలో విపరీతంగా పెరిగిపోయిన ఆమిష్మిక (ఆత్మిక) భావాల అట్టడుగున హిందూ తంత్రాలలో స్త్రీ పురుష సంయోగం విశ్వవ్యాపిత ప్రమాణంలో ఊహించబడింది. అంటే, మానవ ప్రతిబింబాల సంయోగానికి ప్రాముఖ్యత, క్రతుయోగ్యత ఇవ్వబడింది. ఎవ్వరెన్ని తెలివితేటలతో సమర్థించినప్పటికి తంత్రవాదంలోని ఈ ప్రాచీన భావానికీ, భక్తి, పూజ, మోక్షం అనే భావాలకీ పొసగదు. బౌద్ధ తంత్రాలు ఈ భావనను 'ప్రజ్ఞ' 'ఉపాయా'ల సంయోగంగా ఊహించటానికి ప్రయత్నిస్తే హైందవ తంత్రాలు దాన్ని 'శివశక్తి' సంయోగంగానో 'హరగౌరీ' సంయోగంగానో భావిస్తాయి. వైష్ణవ సహజ మతంలో దీన్ని 'కృష్ణరాధ' సంయోగంగా భావిస్తారు. దాన్నే 'రాస' 'రతి' సంయోగం అంటారు. ఇదేకాక ఇలాంటి పుస్తకాల్లో మరో అద్భుతమైన ప్రయత్నం జరిగింది. ఒకరకం గ్రంథాల్లో హైందవ లేదా బౌద్ధ భావాల గాఢ ప్రభావంతో పాటు రసవాద పక్షపాతం కూడా కనబడుతుంది. ఇదే భావన పాదరసం, అభ్రకముల సంయోగానికి పొడిగించారు. "తమ శరీరాల్ని విడవకుండానే 'హరిగౌరీ' (పాదరసం, అభ్రకం) ప్రభావం వల్ల నూతన రూపాల్ని సాధించితే రస సిద్ధులుగా వారిని శ్లాఘించాలి. మంత్రములన్నీ వారి అధీనంలో ఉంటాయి. సాధకుడు ఈ జన్మలోనే విముక్తి పొందాలనుకుంటే తనను తాను ఉజ్వలమైన శరీరంగా మార్చుకోవాలి. హరగౌరీ సృజనాత్మక సంయోగం వల్ల పాదరసం సంభవించినట్లే – అలాగే అభ్రకం గౌరి నుంచి ఉద్భవించినట్లే – పాదరసం అభ్రకం వేరువేరుగా హరగౌరీలకు సమానంగా గ్రహించబడతాయి. ఈ పద్యం చూడండి.

అభ్రకం నీ మూలం, పాదరసం నా మూలం

ఓ దేవీ! ఈ రెంటి కలయికే మృత్యువును, దారిద్ర్యాన్ని ధ్వంసం చేస్తుంది.

(రే – హిందూ రసాయనికశాస్త్ర చరిత్ర)

ఇక్కడి విముక్తి భావన పూర్తిగా భౌతికం. పై పుస్తకంలోనే మరోచోట చెప్పినట్లు 'రసరూపాలు సాధించిన తరువాత సజీవులైనప్పటికీ విముక్తి చెందినట్లే గుర్తించాలి.' ఇది

అమిష్మిక భావజాలంలో ముడి భౌతికవాద భావాన్ని ఇరికించే ప్రయత్నం కాదా? ఈ అంశం తరువాత చూద్దాం. ఎన్నెన్ని ఆమిష్మిక భావాలు, పదబంధాలు ఉన్నప్పటికీ ఈ వివిధ తంత్రవాద గ్రంథాల్లో ఒకే ఒక మౌలిక భావన ఉంది. అదే స్త్రీ, పురుష సంయోగ భావన. అందుచేత దాన్నే తంత్రవాద అంతస్సారానికి సంబంధించిన దానిగా తీసుకోవచ్చు. దాన్ని వివరించే పదబంధాలు అనేకానేకం. కనుక అవన్నీ తంత్రవాదానికి బాహ్యమైనవే కావచ్చు. ఇదే విషయం మీద వచ్చిన ఆధునిక గ్రంథాలు ఈ వాదాన్ని అంగీకరించాయి. "తంత్రవాదం మూలంలో బౌద్ధమూ కాదు, హైందవమూ కాదు. అది క్లిష్టమైన తాత్విక ఊహలకు భిన్నంగా సాగిన అంతర్గత మత ప్రవాహంగా కనబడుతుంది. ఎప్పుడో గుర్తు తెలియని కాలంలో భారతదేశం మత చరిత్రలో ప్రారంభమై ఉంటుంది." – దాస్‌గుప్త. "అందరికీ తెలిసిన మతైక ఆలోచనలూ, మత సంప్రదాయాలూ – వీటితో సమాంతరంగా గుప్తయోగ సాధనలు ఒక అంతర్ ప్రవాహంగా పురాతన కాలం నుంచీ భారతదేశంలో సాగుతూ వచ్చాయి. అవి శైవ, శాక్తేయ భావాలతో కలిసినప్పుడు శైవ, శాక్తేయ, తంత్రవాదాలు పుట్టాయి. అలాగే బౌద్ధ ఆలోచన విధానంలో సంపర్కం వచ్చినప్పుడు బౌద్ధ తంత్రవాదంగా పరిణమించింది. బంగాళీ వైష్ణవ ఆలోచనలతో కలిసినప్పుడు వైష్ణవ సహజ ఉద్యమం అనే పేర గుప్త వైష్ణవ మతం అభివృద్ధి చెందింది." – దాస్ గుప్త. ఇదే నిజమైతే మనం మూల తంత్రవాద లక్షణాన్ని తెలుసుకోవడానికి గుప్తయోగాచార అంతర్ ప్రవాహాన్ని పరిశీలించాలి. మనం ఈ పద్ధతిలోనే పరిశీలించడానికి ప్రయత్నించి తంత్రవాదం బౌద్ధమూ, హైందవమూ కాదనీ సూటిగా వ్యావసాయక మూలమైనదని నిర్ధారణకు వచ్చాము. అయితే మౌలిక యోగానికీ వ్యావసాయక తంతుకూ ఉన్న సంబంధాన్ని పరీక్షించాలి. ఈ గుప్త యోగాచారాలు ముఖ్యంగా మన రైతాంగపు వెనుకబడిన ప్రజా సముదాయాల్లో మిగిలి ఉండటం ఊహించరానిదేమీ కాదు. శాస్త్రిసేన్‌ల లాంటి పండితుల కృషి ఫలితంగా మనకి ఇది వాస్తవమేనని బోధపడుతుంది. సేన్ చెప్పినట్లు 'బెంగాల్‌లో వందల కొలదీ ఇలాంటి శాఖలు నిశ్శబ్ధంగా పని చేస్తున్నాయి.' పేర్లు మాత్రం ఊరూరా మారిపోతుంటాయి. ఆయన వీటన్నింటికీ ఒక పేరూ, వర్ణనా చేశారు – (సహజియా). మౌలికంగా అన్నీ ఒకటే. దురదృష్టవశాత్తు ఈ శాఖలలో కృతకంగా కలిసిపోయిన బౌద్ధాంశాలు సేన్‌ను కూడా తికమక పెట్టాయి. "సహజియాలు ఏ రకంగానూ తాము బౌద్ధులమని చెప్పుకోరు. అలాగే తమ సిద్ధాంతాలకు మూలమైన కారణాలు వివరించడానికి అనువైన బౌద్ధ గ్రంథాలను కూడా వారు ఉదహరించారు. భావాల్లోనూ, ఆచారాల్లోనూ బౌద్ధ క్రతువులు, దృక్పథాలు చెరపరాని ముద్రలు వేసాయి. ఆధునిక సహజియాలకు తాము బౌద్ధ సూత్రాలను ఎంతో దగ్గరగా అనుసరిస్తున్నామని కూడా తెలియదు. వారి పూర్వీకులు వైష్ణవ మతంలో చేరినప్పుడు ఈ వాస్తవాన్ని మరుగుపరిచారు. అయినప్పటికీ వారి క్రతువులలో ఆ పాతవాటిని పాటిస్తున్నారు. ప్రస్తుత దశలో చరిత్రకారులు, పండితులు నెల్లూ పొల్లూ వేరు చేయాలి. సహజియాల భావాల్లోనూ, ఆచారాల్లోనూ ఉన్న బౌద్ధాంశాలను గుర్తించాలి." – (సేన్ – "చైతన్యుడు ఆయన కాలం"). నిజమే నెల్లూ, పొల్లూ విడగొట్టడం చరిత్రకారుని కర్తవ్యమే. కానీ ఏది నెల్లు? ఏది పొల్లు?

## తంత్రవాదము : కులాలు

తంత్రవాదపు శుద్ధరూపం ఒక స్థాయిలో నిమ్నవర్ణాల వారిలోనూ, వృత్తుల వారిలోనూ మాత్రమే మిగిలి ఉండటం తంత్రవాదాన్ని ప్రత్యక్షంగా అర్థం చేసుకోఉవడానికి ఒక అడ్డంగా మిగిలిపోయింది. దీనికి అనేక సాక్ష్యాలు ఉన్నాయి.తంత్రాలలో 'చండాలి', 'దొంబి', 'సవరి' మొదలైన పాత్రలకు విశిష్టమైన ప్రాముఖ్యత ఉంది. ఈ స్త్రీ నామాలన్నీ హీనమైన వృత్తులు సాగిస్తున్న కులాలకు చెందినవి. కుబ్జిక అనే తంత్ర విభాగం నిమ్న హిందూ వర్ణమైన కుమ్మరి వారిలో పుట్టిందని చెప్తారు. అందుకే దానిని కులాలికామ్నాయానికి చెందినదిగా ఉదహరిస్తారు. "కుబ్జిక తంత్రం" ఆచార క్రియలకు స్థానం, కుమ్మరి ఇల్లు అని విధిస్తుంది. అలాగే నాథామత సంస్థాపకుల్లో ఒకని పేరు 'గోరక్షక'. నాథామతం కూడా ఒక రకమైన తంత్రవాదమే. అదే మతానికి సంబంధించిన ఒక గాథలో తొలి బెంగాలీ కవిత 'మైనామతీర్ గాన్' అని తగులుతుంది. దాని ప్రకారం 'హడీ' అనే అతి తక్కువ జాతి మనిషి రాణీగారిని మత ప్రవేశం చేయించాడని చెప్పబడింది. ఇంకా ఇతర తాంత్రికాచారాల్లో పురోహితుడి విధులన్నీ తక్కువ జాతివారే చేయడం జరుగుతుంది. హీనంగా చూడబడ్డ కులాలకు సంబంధించినదైన తంత్రవాదానికి కులవిచక్షణ, కులాధికృత గిట్టవు. "తంత్రంలో కుల జాతి లింగ బేధం లేకుండా క్రతు కార్యక్రమాలు అందరికీ సమానమే' అనే అద్భుత భావన దొరుకుతుంది. ఇది వేదాలు నిర్ధేశించిన స్వార్థపూరిత నిషేధాలతో పోలిస్తే ఎంతో అభ్యుదయకరం. ఆంగ్లేయ రచయితలు వేదాలను తంత్రవాదానికి వ్యతిరేకంగా భావిస్తారు. శూద్రులు, స్త్రీలు వైదిక నిషేధాలకు అతీతులు" – (ఎవలోన్). సేన్ బెంగాలీ సహజియాల విషయంలో కూడా ఇదే చెబుతారు. "మన దేశపు ఉన్నత వర్గాలవారు ఆచార పరాయణులు. సహజియాలు అలా కానే కాదు. (సేన్ లెక్కలలో సహజియాలందరూ ముఖ్యంగా నిమ్న వర్ణాలకు చెందినవారే) వారి బోధనా పద్దతులు అద్భుతం. అన్ని మతాల నుంచీ మనుషుల్ని పోగుచేస్తారు. వారిలో ముస్లింలు, క్రైస్తవులు, బ్రాహ్మణులు కూడా ఉన్నారు. సహజియాలు అన్ని రకాల కుల వివక్షకు దూరం. సమాజంలో కులస్థాయి, సదాచారం ఇక్కడ ప్రశ్నకాదు. ఈ శాఖలన్నీ కులానికి వ్యతిరేకం. ఉడికించిన ఆహారాన్ని భుజించటంలో ఈ శాఖల వారికి ఏమీ పక్షపాతం లేదు. – ఉన్నత హిందూ కులాలవారు ఈ విషయంలో తీవ్రాచారాలను పాటిస్తారు." – (సేన్). అప్పుడప్పుడు కులపద్ధతికి వ్యతరేకమైన ఆలోచనలు తిరుగుబాటుగా కూడా రూపెత్తుతాయి. తాంత్రికులు పురుషుల్లోనూ, స్త్రీలలోనూ సమానత్వాన్ని చాటారు. సంప్రదాయ వివాహనీతిని వ్యతిరేకించారు. 'శంకర విజయం'లో ఆనందగిరి ఉచ్ఛిష్ట గణపతి అనుచరులను వామాచార మతానికి చెందిన వారిగా వర్ణిస్తాడు. వారు "మా మతం ప్రకారం రెండు మౌలిక ధర్మాలను అనుసరించాలి. అన్ని కులాలలోని పురుషులను ఒక కులంగా పరిగణించాలి. ఇది ఒక ధర్మం. వివిధ కులాలకు చెందిన స్త్రీలందరినీ ఒక కులంగా పరిగణించాలి. ఇది మరో ధర్మం. వారి పరస్పర సంయోగ వియోగాలలో పాపమేమీ లేదు.

'ఫలనా పురుషుడు, ఫలానా స్త్రీకి భర్త' అనే నిబంధన ఏమీ లేదు. కులాలన్నీ ఒకటే కులం అయినప్పుడు వివాహ వ్యవస్థ ఒక కల్పన" అని అంటారు.

ఇది నిజంగా విభ్రాంతి కలిగించే విషయం. అయినప్పటికీ వాస్తవ తంత్రవాద దృక్పథాన్ని ఇది ప్రతిబింబిస్తుంది.

"మతపరమైన నిబంధనలను, నిషేధాలను సహజియాలు తీవ్రంగా విమర్శిస్తారు. సరాహపద తన 'దేహకోశం' లో చాలా పదునైన విమర్శ చేశాడు. అగ్ర భాగాన బ్రాహ్మణులున్న పూర్వాచార చతుర్వర్ణ పద్ధతికి  అతను తీవ్ర వ్యతిరేకి. బ్రాహ్మణులు బ్రహ్మనోటి నుండి ఊడిపడ్డారనే విషయం కట్టుకథ. తెలివైనవారు, మోసకారులు సృష్టించిన కథ అది. అందుచేత బ్రాహ్మణులను అందరికంటే ఉన్నతమైన వారిగా పరిగణించరాదు. అలాగే ఒక మనిషి మత సంస్కారం వల్ల బ్రాహ్మణులు కాగలిగితే హీనమైనవాడు కూడా బ్రాహ్మణుడు కావచ్చు కదా. బ్రాహ్మణులు మట్టిని, నీటిని దర్భలను తీసుకుని మంత్రాలు ఉచ్ఛరించి తమ ఇళ్ళల్లో అగ్నిపూజ చేస్తారు. – – వృధాగా నేతిని మంటల్లో పోస్తారు. తద్వారా దట్టమైన పొగతో వాళ్ళ కళ్ళు మండుతాయి. వారు ఒంటిపోచ జంజాన్నో, మూడు పోచల జంజాన్నో ధరిస్తారు. – సత్యదర్శనం కానిదే ఇవేమీ పనికిరావు. ప్రపంచమంతా మాయాభ్రమలో మోస పోతోంది – మతము, మతరాహిత్యము ఏకమైన మహా సత్యం ఎవరికీ తెలియదు. ఈశ్వర భక్తుడు వళ్ళంతా బూడిద పులుముకుని అట్టలు కట్టిన వెంట్రుకలతో ఇంట్లో కూర్చుని హారతులు వెలిగించి ఒక మూల గంటలు కొడతాడు. చూపు నిలిపి యోగాసనం వేస్తాడు. అమాయకులైన ప్రజలు చెవులకు మతతత్వం బోధిస్తాడు. ఆ రకంగా వారిని మోసగిస్తాడు. విధవలు, ఉపవాస దీక్షాపరులు, ఇంకా అనేక దీక్షలు తీసుకున్న వారు ఈ భక్తుల ద్వారా దీక్ష పొందుతారు. ఆ భక్తులేమో ఇదంతా దక్షిణకోసం చేస్తారు." – (దాస్‌గుప్త). ఇది మతం మీద ఆధునిక సోషలిస్టు ఎవరో సాగించిన యుద్ధం కాదు. ఇది ఒక సహజియా కవి కులవ్యవస్థ మీద చేసిన ఉద్వేగపూరితమైన తిరుగుబాటు.

## దేహ తత్వము

తంత్రవాద విశ్వదృష్టి వ్యావసాయక మహత్తుతో ఎలా ముడిపడి ఉందో ఇప్పుడు పరిశీలించుదాం. ప్రకృతిలోని ఉత్పాదకతను అంటే పుడమి తల్లి ఉత్పాదకతను మానవ సంతానోత్పత్తి కార్యక్రమాల ద్వారా – పోలిక ద్వారా గానీ స్పర్శ ద్వారా గానీ– వృద్ధి చేయవచ్చును అనే సూత్రంపై వ్యావసాయక క్రతువు ఆధారపడి ఉంది. దానికి అనుబంధంగా మానవ పునరుత్పత్తి ప్రకృతి ఉత్పత్తిపై ఆధారపడి ఉన్నట్లు కూడా భావిస్తారు. అందుచేతనే సహజంగానే ఈ ప్రాచీన విశ్వాసంలో ఆత్మ, దేవుడు, ముక్తి, స్వర్గం, ప్రార్థన లేక త్యాగం అనే భావాలకు స్థానం లేదు. నిజానికి ఇలాంటి లక్షణాలన్నీ అభివృద్ధి చెందిన మతాల్లోనే ఉంటాయి. ఇంత

విపరీతమైన ప్రాచీన విశ్వాసపు మౌలిక స్వభావాన్ని సైద్ధాంతికంగా సూత్రీకరించటం న్యాయమైతే దానిని మానవ శరీరంతో ప్రకృతిని సమానం చేసే సిద్ధాంతంగా చెప్పవచ్చు – అ రెండూ ఒకే మౌలిక సత్యానికి రెండు అంశలు. దాన్నుంచి రెండు ఉపసూత్రాలు పుడతాయి. మొదటిది : మానవ శరీరపు నిగూఢ స్వభావాన్ని అర్థం చేసుకోగలిగితే ప్రకృతి నిగూఢతను గూడా అర్థం చేసుకోగలిగాలి. రెండు : ఈ విశ్వం పుట్టుక శిశు జన్మం కంటే విడ్డూరమైందేమీ కాదు. ఈ రెండు గూఢార్థాలు వివరణయే దేహతత్వం ఇంకా తంత్రవాదం విశ్వదృష్టి. లిఖిత తంత్రవాద గ్రంథాల్లో ఈ దేహతత్వం అనేక పరాయి భావాలతో కలిసి ఉంది. అలాంటి సందిగ్ధమైన భావాల పోగు నుంచి విడదీసి ముఖ్యాంశాలపై స్పష్టమైన వ్యాఖ్యానం సాధించినందుకు బందోపాధ్యాయ అభినందనీయుడు.

"మానవ శరీరంలో ఉన్నదంతా విశ్వంలోనూ ఉంది. (బ్రహ్మండే ఏ గుణా సందితే తిష్టంతి కళేబరే) – మానవ శరీరం విశ్వానికి సూక్ష్మరూపం మాత్రమే. అన్ని తంత్రాల తీర్మానమూ ఇదే. తంత్రవాద జ్ఞానాన్ని ఈ సిద్ధాంత ప్రాతిపదిక మీదనే సంపూర్ణంగా వివరిస్తారు. పురాణాలూ ఇంకా శాస్త్రాలు ఈ సిద్ధాంతాన్ని అంగీకరించాయి.

"ఆ విధంగా తాంత్రిక సిద్ధాంతానికీ, సంప్రదాయానికీ రెండు లక్షణాలున్నాయి. ఒకటి బాహ్యాంశం. ఇది విశ్వానికి సంబంధించినది. రెండు అంతరాంశం. ఇది మానవ శరీరానికి సంబంధించినది. తంత్రవాద సంప్రదాయ సాఫల్యము రెండు రూపాల్లో సాక్షాత్కరిస్తుంది. ఒకటి భూమికి చెందిన ప్రకృతి బాహ్య అంశ, రెండవది అంతర్ స్వభావాంశ. అంటే మానవ శరీర రూపంలో ప్రకృతి. నీలో నివురుగప్పి ఉన్న శక్తులను అభివృద్ధి చేసి సఫలుడవు కావచ్చును. లేదా బాహ్య శక్తులను అంటే ప్రకృతి శక్తులను అదుపుచేసి నీ అంతశ్శక్తులను వ్యక్తీకరించే మార్గాన్ని సాధించవచ్చును. విశ్వము, మానవ శరీరము రెండూ కూడా ఒకే సూత్రాల మీద, ఒకే భౌతిక పదార్థంతో తయారైనవని తంత్రవాద విశ్వాసం. ఒకే రకం శక్తులు రెంటినీ నడిపించడం వలన శరీరంలోని శక్తులను వృద్ధి కావించి ప్రపంచంలోని శక్తులను నీకు అనుకూలంగా నీ అదుపులోకి తెచ్చుకొనవచ్చును. దేశంలో సిద్ధులు (అలా విజయం సాధించినవారు) మానవ శరీరం కంటే అద్భుతమైన యంత్రమేదీ లేదంటారు. దీంతో సమానమైన అద్భుత యంత్రాన్ని ఎవరూ నిర్మించలేరు. అందువలన ఏ యంత్ర సహాయమూ లేకుండా మీ కోర్కెలన్నీ తీర్చుకొనవచ్చును. దానికి ఈ అద్భుత యంత్రంలో బద్ధకంగా పడి ఉన్న శక్తులనుద్దీపింపజేసి అవి అభివ్యక్తమయ్యేటట్లు చూడాలి. ప్రకృతిలోనూ, మానవ శరీరంలోనూ అణిగిమణిగి ఉన్న శక్తుల మధ్య సంబంధం ఆశ్చర్యకరం. తంత్ర సాధన అంటే ఈ గాఢ సంబంధాన్ని తెలుసుకోడానికి చేసే ఆచరణ. తద్వారా ఆసంబంధాన్ని స్థిరపరచి అదుపులోకి తెచ్చుకొనుట. దీనికి దేహతత్వమే భూమిక. అందుచేతనే తంత్రవాదం ఎల్లప్పుడూ శరీరానికి సంబంధించిన సమస్యల పట్లనే తీవ్ర ఆసక్తికి కలిగి ఉంటుంది " – (బందోపాధ్యాయ).

ఇది భౌతికవాదం కాకపోవచ్చు. కానీ, భౌతికవాద లక్షణాలు కలదే. 'కులార్ణవ' లాంటి కొన్ని తంత్రవాదాల్లో ఈ నమూనా భౌతికవాదం, రుద్దబడిన ఆత్మవాద భావాలతో మసకబడింది. కానీ, సహజియాల సరళ వ్యావసాయక గీతాల్లో భౌతికవాద దృక్పథం మౌలిక స్వాభావికత ఇంకా మిగిలి ఉంది. కొన్ని ఉదాహరణలు: "అన్నిటికంటే ముఖ్యమైనది వారి వారి శరీరమే. నీ శరీరపు రహస్యం నీకు తెలిసినప్పుడే శాంతిని పొందగలవు". "తన శరీర మర్మాన్ని గ్రహించినవాడే ఎరుకగలవాడు. ఇదే వేదాంత సారం". "అన్ని శాస్త్రాలకు ప్రాతిపదికగా ఉండేది శరీరమే". "ఇక్కడ (ఈ శరీరంలో) గంగా, యమునా ఉన్నాయ్. గంగాసాగరం, ప్రయాగ, కాశీ ఇక్కడే. సూర్యుడూ, చంద్రుడూ ఇక్కడే అన్ని తీర్థాలూ ఉన్నాయి – పీఠాలు, ఉపపీఠాలూ కూడా. నా శరీరం కంటే వేరే పుణ్య భూమినిగానీ, ఆనందా శ్రమాన్ని గానీ నేనెప్పుడూ చూడలేదు". సహజియా గీతాలలోని దేహతత్వాన్ని గురించి దాస్‌గుప్త ఇలా అంటాడు : "రాజీలేని తిరుగుబాటు తత్వంతో మతంలోని లాంఛనాలకు ఆచార పారాయణులకు వ్యతిరేకంగా సహజియా సాహిత్యం మానవ శరీరానికి గొప్ప ప్రాముఖ్యత నిచ్చింది. మానవ శరీరం విశ్వానికి సూక్ష్మరూపంగా వారు భావిస్తారు. ఈ లక్షణం ఇంచుమించు తంత్రవాదాలన్నిటిలోనూ యోగ సంప్రదాయం ఉన్నచోటల్లా ప్రముఖంగా కనబడుతుంది. సహజియాలు యోగాంశానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వటం వల్ల 'శరీరం విశ్వానికి ప్రతి రూపం' అనే ఈ సిద్ధాంతం కూడా ప్రముఖ స్థానం సంపాయించింది." అయితే అదే సందర్భంలో ఈ ప్రాథమిక భౌతికవాద దృక్పథాన్ని ఆత్మవాద భావాలతో కలగాపులగం చేసి గందరగోళం సృష్టించే కృతక ప్రయత్నాలు చాలా జరిగాయి. "హేవజ్ర" తంత్రంలో బోధిసత్వుడు ఈ భౌతిక ప్రపంచం, భౌతిక శరీరం అవసరమా అని భగవంతుడిని అడిగాడు. నిజానికి ప్రతీది శూన్యమే కదా అని ఆయన ప్రశ్నలో భావం – దానికి సమాధానంగా శరీరం లేకుండా ఆనందాన్ని సాధించే అవకాశమే లేదని శరీర ప్రాముఖ్యత ఇక్కడే ఉందని భగవంతుడు సమాధానం చెప్పాడు."

"శరీరం లేనివాడు శరీరంలో దాగి ఉన్నాడు. ఆ దాగి ఉన్న వానిని కనుగొన్న వాడే ముక్తిజీవి" అని చర్యగీతం ఉంది. ఇవేమీ తంత్రవాద వాస్తవ లక్షణాన్ని చూపించవు. అయితే ఈ గజిబిజి ఆలోచనలు గొప్ప పండితులను కూడా భ్రమ పెట్టడం ఆశ్చర్యకరం. "సత్యం శరీరమునందు నుండి దాని నుంచే పైకి ఎగసినప్పటికీ దానిని ఒక భౌతిక వస్తువుగా భావించరాదు." అని అంటాడు దాస్‌గుప్తా. ఈ వ్యాఖ్య అపసవ్యమైనది. తాంత్రికుల అంతస్సత్యశోధన శరీరంలో ఏదో భౌతికాతీత ఆత్మిక సూత్రం లాంటిది దొరుకుతుందని కాదు. వారి అన్వేషణ శుద్ధ భౌతికాంశముగా నాడీ మండలానికే చెందింది. ఇది ప్రాచీన భారతదేశంలో విజ్ఞాన శాస్త్ర ప్రారంభానికి కారణభూతమైంది. శరీరశాస్త్రము, దేహధర్మశాస్త్రము, ఈ రెంటికీ తాంత్రికులు ఎంతో దోహదం చేశారు. మానవ చైతన్యానికి మెదడు మూలస్థానమని వారెప్పుడో కనిపెట్టారు. "చరకుడు, శుశ్రుతుడు (అరిస్టాటిల్ వలనే) గుండెకాయ చైతన్యానికి

ముఖ్యాంగము, మూలస్థానము అని  భావించేవారు. కానీ, తాంత్రిక గ్రంథాలలో (గాలెన్ లాగా) చైతన్యస్థానం మెదడుకు మారింది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే మెదడు – వెన్నెముక కలిసిన శరీర భాగం." వారి కాలాన్ని గుర్తుపెట్టుకుంటే ఇది చాలా ప్రాముఖ్యమైన విశేషము. తాంత్రికులకు మానవ శరీరంపై ఉన్న తీవ్ర ఆసక్తివలన, వారి భౌతికవాద దృష్టి వలన ఈ విజ్ఞాన శాస్త్రాలకు తోడ్పడగలిగారు. తాంత్రికులే రసవాదానికీ, రసాయన శాస్త్రానికి ఇదే కారణం వలన ఎలా తోడ్పడగలిగారో చూద్దాం : ఇందుకు విరుద్ధంగా మన సంప్రదాయ తత్వశాస్త్రాలు – ముఖ్యంగా భావవాదానికి చెందినవి శరీర శాస్త్రానికీ, దేహధర్మ శాస్త్రానికీ తోడ్పడడానికి రెండు ముఖ్య కారణాలవల్ల వీలుపడలేదు. మొదటిది ఆత్మ లేక అహం అనే దాని శుద్ధ లక్షణాన్ని ఆవిష్కరించాలనే అతి కుతూహలం వల్ల ఆ తత్వవేత్తలు మానవ శరీరానికి ఏ మాత్రం ప్రాముఖ్యత నివ్వలేదు. రెండు అతి హీనమైన కులాలవారు మాత్రమే – దోములు, చండాలులూ, హడీకులం వారు – శవాలను ముట్టుకునే వారు. పెద్ద కులాలవారు శవాన్ని స్పృశించటానికి వీలులేని చెడ్డవస్తువుగా భావించేవారు. ఇంకా తంత్రవాదపు శవసాధన ఆధునికులకు ఎంత వెగటు కలిగించినప్పటికీ మానవ శరీరపు యంత్రాంగం తాంత్రికులకు సుబోధకమైంది. శవాన్ని మట్టుకోవడానికి, ఖండించి పరిశీలించటానికీ అగ్రవర్ణాల వారు వ్యతిరేకత చూపించటం వల్ల ఈ కాలంలో కూడా శాస్త్ర విజ్ఞాన విస్తృతికి అవరోధం అయింది : కలకత్తా వైద్య కళాశాల ప్రారంభించిన రోజుల్లో విద్యార్థులు దొరకటం దుర్లభంగా ఉండేది.

తంత్రవాదపు దేహతత్వానికీ, తంత్రవాదపు విశ్వదృష్టికీ గాఢ సంబంధం ఉంది. శరీరం, విశ్వం, పరస్పరం ఒకే పోలికలు గలవి. తంత్రవాదం ప్రకారం విశ్వసృష్టి కామం వలనే జరిగింది. విశ్వం స్త్రీ నుంచి జన్మించింది. (వామోద్భవం) అది కూడా పురుష సంగమం వలన జరిగింది. ఈ విశ్వ దృష్టి వ్యావసాయక క్రతువుతో ఎంత పోలిఉన్నదో చెప్పనక్కరలేదు. ఈ విశ్వదృష్టే ఒరిస్సాలోని దేవాలయ శిల్పాలకు ఆధారమై ఉండవచ్చునని బందోపాధ్యాయ అంటాడు. ఆ శిల్పాలన్నీ జుగుప్సగా చిరాకు కలిగిస్తాయి.

"బౌద్ధ తాంత్రికుల్లో మానవ జన్మ, విశ్వసృష్టి ఒకే పద్ధతిలో జరిగాయని నమ్మే 'కామ వజ్రాయన' శాఖ బయల్దేరింది. ఈ శాఖ గ్రంథాలు మామూలు పాఠకులు చదవడానికి వీలు లేనంత ఆసభ్య వివరాలతో నిండి ఉన్నాయి. విశ్వం సరిగ్గా మానవుడి లాగే కామం వల్ల సృష్టించబడిందనీ ఈ శాఖ నమ్ముతుంది. వారి క్రతు సంప్రదాయం విశ్వ కామానికీ, మానవ కామానికీ మధ్య పొందిక కల్పించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. అందుచేతనే వారు ఎల్లవేళలా కామ సాధనలో మునిగితేలేవారు. దేవాలయాల మీద, సాధుశాలల మీద ఈ కామాన్ని ప్రదర్శించేవారు. పూరీ జగన్నాథ దేవాలయం మొదట్లో ఈ కామ వజ్రాయనుల ప్రభావం వల్ల నిర్మించబడిందని నా నమ్మకం. దేవి విమల ఆలయం వారికి పవిత్రమైంది. ఈ శ్రీ మందిరంలోనే విశ్వ సృష్టికీ, మానవ శరీర సృష్టికీ అనుబంధం సాధించబడింది. ఈ అసభ్య శిల్పాలన్నిటిలోనూ

ఉన్న పురుషుడు కామ వజ్రాయని శాఖకు చెందిన బౌద్ధ సన్యాసి. ప్రతి స్త్రీ ఒక దేవదాసి. ఈ దేవాలయం అంతా కామ వజ్రాయన బౌద్ధుల సిద్ధాంతాలపై నిర్మించబడింది – (బందోపాధ్యాయ). ఒరిస్సా దేవాలయ శిల్పాలలోని తాంత్రిక లక్షణం చాలా ముఖ్యమైంది. పైన చెప్పిన దానికంటే వేరే వివరణ సాధ్యం కాదు. బహుశా ఆ దేవాలయం కట్టించిన తాంత్రికులు బౌద్ధంపై మోజు కలవారై ఉండవచ్చు. అందువలన ఆ దేవాలయాలపై బౌద్ధాంశ కలదని వాదించడం అర్థరహితం. ఈ శిల్పాలలో బౌద్ధానికి సంబంధించిందేమీ లేదు. అదేదో బౌద్ధానికి సంబంధించిన విషయం అనే భావం నుంచి మనం విడివడితే ఈ శిల్పాలు బాగా అర్థమవుతాయి. అప్పుడే వ్యావసాయక క్రతువుకు సంబంధించిన విశ్వాసం కూడా మనకు బోధపడుతుంది. బహుశా ఈనాటి కోణార్క్ శిథిలాలు కూడా ఒకప్పుడు భారీ ఎత్తున వ్యావసాయక క్రతువులు చూసి ఉండవచ్చు. ఈ విశ్వ దృష్టి వ్యవసాయ మూలం నుంచి వచ్చిందయితే చరిత్రకు పూర్వం విలసిల్లిన నాగరిక ప్రాంతాలలో కూడా ఇదే లక్షణాన్ని మనం ఆశించవచ్చు. "బహు పురాతనమైన ఈ రకం విశ్వ దృష్టులన్నింటినీ పారంపర్య దృష్టిగా వర్గీకరించారు. ఎందుకంటే ఇవన్నీ 'భౌతిక విశ్వం లైంగిక పునరుత్పత్తి ద్వారా ఉద్భవించినద'ని భావించాయి. ఈ విశ్వ దృష్టి పురాతనమే, దాని సృష్టికర్తలైన ప్రజలు ఆదిమ నాగరికతకు చెందినవారే". పొలినీషియన్ విశ్వసృష్టి పురాణ చక్రం అంతటిలోనూ మిగతా ఏ మతాల్లోనూ లేని ఒక వాస్తవం స్పష్టంగా కనబడుతుంది. 'ఓ – టే – పాపా' అని పిలువబడే బీడు భూమి లేదా శిల స్త్రీ సత్వాన్ని ప్రతిబింబిస్తుంది. పుష్కలమైన పురుష సత్వం 'టంగలోవా' (అంటే ఆకాశం) కురిపించిన వర్షం ద్వారా ఫలించి జీవులన్నింటినీ కంటుంది ఆ భూమి." "భారత, చైనీస్ విశ్వదృష్టికీ ఈ పొలినేషియన్ విశ్వదృష్టికీ ఉన్న సామ్యాన్ని చూసి ఆధునికుడు ఆశ్చర్యపడతాడు. హిందూ, టావోయిస్టు, మావోరి లాంటి భిన్నమైన మతాల్లో సృష్టికి లైంగిక సంయోగం మూలమని భావించటం గమనించదగ్గది." ఇక్కడ భారత అంటే అర్థం తంత్రం అనే చైనా వారి టావోయిజానికీ, మన తంత్రానికీ చాలా పోలికలున్నాయి.

## తంత్రవాదము - టావోయిజము

తంత్రవాదాన్ని గురించి నీథామ్ ఇలా అన్నాడు. "ప్రాచీన టావోయిజంలోని షమానిస్టుల మహత్తుల విధానానికి అతి చేరువైన మతాన్ని చూస్తున్నట్లనిపిస్తుంది." టావోయిజం గురించి ఇలా అన్నాడు : "ఏ కారణం వలనైనాగానీ టావోయిస్టు ఆలోచనా ధోరణిని ఎక్కువమంది యూరపియన్ అనువాదకులు రచయితలు ఇంచుమించు పూర్తిగా అపార్థం చేసుకున్నారు అని చెప్పక తప్పదు. టావో మతాన్ని ఉపేక్షించారు. టావో తంత్ర సంప్రదాయాలను పూర్తి మూఢనమ్మకంగా కొట్టేశారు. టావో తత్వశాస్త్రాన్ని శుద్ధ మతైక మార్మిక వాదంగానూ, కవితగానూ వ్యాఖ్యానించారు. టావోయిస్టు ఆలోచనా విధానంలోని శాస్త్రీయ లేక ప్రాథమిక శాస్త్రీయ కోణాన్ని ఎక్కువగా గమనించలేదు. టావోయిస్టు రాజకీయ దృష్టి సంగతి సరేసరి." ఇదే భావం

మన తాంత్రికుల విషయంలో ఎలా అన్వయించవచ్చో చూద్దాం. ముందు టావోయిజానికీ, తంత్రవాదానికీ ఉన్న పోలికలు. ప్రాచీన భారత తత్వశాస్త్ర భావాలైన పురుష ప్రకృతి అంశాలకు సమానమైన రెండు అంశాలు ప్రాచీన చైనాలో కూడా ఉన్నాయి. అవి 'యాంగ్', 'యిన్'. పురుషుడు : కాంతి, వేడిమి, పొడి స్వభావం, కాఠిన్యము, చైతన్యము. ఇవన్నీ "యాంగ్", అలాగే స్త్రీ అంటే చీకటి, చల్లదనము, తడి, మృదుత్వము, స్తబ్ధత, ఇవన్నీ "యిన్", ఈ ఊహాలన్నీ చాలా పురాతనమైనవి. 'యిన్, యాంగ్‌ల ద్వంద్వ సిద్ధాంతం కన్ఫ్యూసియన్ లోనూ, టావోయిస్టు గ్రంథాల్లోనూ కనబడుతుంది. ఏ రకమైన మత విశ్వాసాలు లేదా తాత్వికభావాలు కలవారైనప్పటికీ చైనా వారు సర్వదా అంగీకరించే తొలి సహజతత్వశాస్త్ర బీజము ఇదే"– (ఫోర్కె).

నీధామ్ ఒక మినహాయింపును మన దృష్టికి తీసుకువస్తాడు. "యిన్ – యాంగ్ ద్వంద్వము చైనా వారి దృక్పథంలో విడరానిది. భావనలో టావోయిజం 'యిన్' ఆలోచనా క్రమానికి చెందింది. కన్ఫ్యూసియన్ వాదము 'యాంగ్' పద్ధతికి చెందింది అని చెప్పుకోవచ్చు." "అంటే తంత్రవాదం లాగే టావో మతం కూడా 'స్త్రీ పక్షపాతం' కలదన్నమాట. 'కన్ఫ్యూసియన్ విజ్ఞానము పుంస్త్వ స్వభావము కలది. అధికారయుతమైనది, టావో మతస్తులు దానిని తిరస్కరించి స్త్రీ సత్వాన్ని ఆదర్శంగా పెట్టుకున్నారు. ప్రకృతి నుంచి జ్ఞాన స్వీకారం చేసేటప్పుడు స్తబ్ధంగానూ, వినయంగానూ ఉండే స్వభావం వారికి ఆదర్శం."

టావో మతంలోని కొన్ని ఉదాహరణలు – (నీధామ్) : "ఈ విశాల శక్తి అమర్త్యం. దాని పేరే గూఢమైన స్త్రీ. ఆ గూఢమైన స్త్రీ ద్వారానే స్వర్గ నరకాల సృష్టి. అది అనంతంగా అల్లుకుపోతున్న దారం. దాన్ని సాధించినవాడు ఏదైనా పొందగలడు". పుంస్త్వాన్ని ఎరిగి స్త్రీత్వం పట్ల భక్తి పెంచుకున్నవాడు. కొండల నడుమ కనుమగామారి ఈలోకాన్నంతా స్వీకరిస్తాడు. అనంత సద్గుణం వొలికిపోదు. బాల్యావస్థకు తిరిగి చేరడమే....

నీధామ్ వివరించిన టావో ప్రతీకవాదము మనకు మంచి ఆసక్తి కలిగిస్తుంది. 'పరిమితి లేని' (అపరిమిత), 'విడదీయరాని' (అభేద్య) తత్వాలకు నీధామ్ భౌతిక ప్రాతినిధ్యాన్ని చూపించగలిగాడు. అపరిమిత తత్వము ఆదిమ సమిష్టి జీవన విధానానికి (గ్రామ) గుర్తుగా మిగిలిపోయింది. యజమానులు, పూజారులు, యుద్ధవీరులు ప్రత్యేకవర్గంగా ఏర్పడిన కంచు యుగపు ఆది భూస్వామిక దశకు పూర్వదశ అది. టావో మత కవితకు, సహజియా గీతాలకు చాలా దగ్గర పోలికలున్నాయి. అదేదో పొడుపు కథలకు, చిక్కు ప్రశ్నలకు మాత్రమే పరిమితం కాలేదు. 'డొంబి', 'సవరి', 'నైరమణి', 'సహజ సుందరి' పేర్లతో సహజియా కవులు వర్ణించిన స్త్రీ సత్వమే టావో మతస్తుల గూఢ స్త్రీకి సమానము. వైష్ణవ సహజియా గీతాలలో 'పుంస్త్వాన్ని తెలుసుకొని స్త్రీత్వం కోసం తపించేవాడు సర్వజ్ఞుడు" అనే టావో గీతానికి సమానమైన అర్థం దొరుకుతుంది. తంత్రవాదంలో లాగానే టావో మతంలో కూడా పుంస్త్వం కంటే స్త్రీ సత్వానికే

– స్త్రీ దృష్టికే – ఎక్కువ గౌరవం. టావో మతస్తులు సహజంగా ఈ ఆలోచనా విధానం వలనే విజ్ఞానశాస్త్ర మూలానికి, ప్రజాస్వామ్య మూలానికీ చేరుకోగలిగారు. స్త్రీ దృష్టి టావో మతస్తులకు ప్రకృతిని వినయంగా అధ్యయనం చేసేటట్లు మరలించగలిగింది. తరువాత కాలంలో పరిశీలనా శాస్త్రాల నుంచి (సహజ శాస్త్రాలు) ప్రాయోగిక శాస్త్రాల వైపు ప్రయాణించటం తప్పనిసరి అయింది. ఈ విధంగా వారు విజ్ఞాన శాస్త్ర పునాదుల్లోకి వెళ్ళారు. అలాగే ప్రజాస్వామ్య భావన విషయంలో కూడా.

టావో మతస్తుల స్త్రీ ప్రతీక కూడా వ్యావసాయక సంబంధమైనదేనని చెప్పడానికి ఒక ఆధారముంది. టావో మతంలో నీటికి ఇచ్చిన ప్రాధాన్యం, నీటికి పైరు పంటలతో ఉన్న సంబంధం తేలిగ్గానే అర్థం అవుతాయి. దీనికంటే స్త్రీ సత్వానికీ, మాతృస్వామ్యానికీ ఉన్న సంబంధం ప్రధానమైంది. పాత సమిష్టి సమాజాన్ని వర్ణిస్తూ టావో మతస్తులు అల్లిన కవితలో "వారికి తల్లి తెలుసు, తండ్రి ఎవరో తెలియదు" అన్న భావాన్ని ఉదహరిస్తాడు నీథామ్. అంటే చైనా సమాజంలో మాతృస్వామిక వ్యవస్థ ఉండేదన్న మాట అని కూడా నీథామ్ సూచిస్తాడు. టావో మతస్తుల సిద్ధాంత ఆచరణల్లో స్త్రీకి ఇచ్చిన ప్రాముఖ్యతకు, మాతృస్వామిక వ్యవస్థకూ సంబంధం ఉన్నదనే అంశాన్ని కూడా నీథామ్ గమనించలేకపోలేదు. టావో మతంలోని షమానీల (స్త్రీ సన్యాసినులు) వ్యవస్థను 'ఉ' అంటారు. అది తంత్రవాదం యోగిని, భైరవి భావానికి సమానం. దాన్ని గురించి నీథామ్ ఇలా అన్నాడు: 'టావో మతస్తుల ఆదర్శ సమాజం మాతృస్వామిక జ్ఞాపకాలతో ముడిపడి ఉంది. రెండు : వారి స్త్రీ చిహ్నము : మూడు : లైంగిక కళకు వారిచ్చిన ప్రాముఖ్యత. వీటన్నిటి ద్వారా స్త్రీకి వారిచ్చిన ప్రాధాన్యత చాలా ముఖ్యమైనది." "భౌతిక క్రమంలో స్త్రీ ప్రాముఖ్యాన్ని గుర్తించడం, పురుషుడితో స్త్రీ సమానత్వాన్ని అంగీకరించడం, ఆరోగ్యము, దీర్ఘకాల జీవితమూ సాధించడానికి లైంగిక సహకారం అవసరమనే నమ్మకమూ, కొన్ని స్త్రీ మనస్తత్వ లక్షణాలంటే ప్రత్యేకమైన భక్తీ, మానవ సమూహం ప్రక్షాళనకై లైంగిక ఘటనలను ప్రవేశ పెట్టడమూ, అవి కూడా తత్వవర్గ భేదాలు లేకుండా స్వేచ్ఛగా ఉపయోగించడమూ – ఇవన్నీ మనకు తిరిగి తిరిగి కన్ఫ్యూస్టియన్ వాదంలోనూ, సామాన్య బౌద్ధంలోనూ లేని అనేక టావో మతాంశాలను బహిర్గతం చేస్తాయి. తప్పకుండా ఈ విషయాలకు ఆదిమజాతి సమిష్టి జీవితంలోని మాతృస్వామికాంశాలకు సంబంధం ఉండి తీరాలి. ప్రాచీన టావో తత్వశాస్త్రంలోని స్త్రీ చిహ్నానికున్న ప్రాముఖ్యత ఇందులో ప్రతిఫలిస్తుంది". పైన చెప్పిన టావో వాదుల లైంగిక ప్రాధాన్యతను భౌతిక అమర్త్య భావం దృష్ట్యా అర్థం చేసుకోవాలి. ఈ భావాన్ని విజ్ఞాన శాస్త్రానికి అమూల్యమైన ప్రాముఖ్యతగలదిగా నీడామ్ భావిస్తాడు. ఎందుచేతనంటే ఈ ఆదర్శమే రసవాద అభివృద్ధికి దోహదం చేసింది. భారతదేశపు తంత్రవాదాల్లో ముఖ్యంగా రసవాద పక్షపాతం గల తంత్రాలలో ఇలాంటి భావం మనకు తట్టస్థపడుతుంది. భౌతిక అమర్త్యత సాధించడానికి టావో మతస్తులు అనేక మార్గాలు చూపారు. అవి ఒకటి : ఉశ్చ్వాస, నిశ్వాసాల సంయమ నియమాలు, రెండు : సూర్యుని ద్వారా అస్వస్థతను నిరోధించే

క్రియలు, మూడు : వ్యాయామ క్రియలు, నాలుగు : లైంగిక క్రియలు, ఐదు : రసవాద ఔషధ ప్రక్రియలు, ఆరు : ఆహార ప్రక్రియలు. ఇవి యోగ సాధనలోని అంశాలను జ్ఞప్తికి తెస్తాయి.తాంత్రికులకు కూడా ప్రాణాయామము, ఆసనములు లాంటి ప్రక్రియలున్నాయి. మనం లైంగిక ప్రక్రియలను గురించే చర్చిద్దాం. కన్ఫ్యూసియన్ మతస్తులూ, బౌద్ధులూ తీవ్రంగా నిరోధించటం వలన ఈ విషయాలన్నీ గుప్తంగానే ఉండిపోయాయి. ఈ కళలకు సంబంధించిన గ్రంథాలన్నీ మింగ్ పాలకుల కాలంలో అదృశ్యమైపోయాయి. అయితే అక్కడక్కడ ఇతర గ్రంథాలలో లభ్యమయిన శకలాలను పోగుచేసి నీధామ్ కొంత విషయ సంగ్రహణ చేశాడు. దాని ద్వారా టావో మతానికీ, తంత్రవాదానికీ ఈ అంశం లోపల పోలికలను చూడవచ్చు. 'ఇన్ –యాంగ్', సిద్ధాంతాలపట్ల కల స్థూల అంగీకారం వల్ల మానవ లైంగిక సంబంధాలకు విశాల సృష్టి పరిధిలో గణించడం వలన ఆ మాట కొస్తే మానవ లైంగిక సంబంధాలను విశాల సృష్టి కార్య నిర్వహణతో గాఢ సంబంధం ఉందని నమ్మడం సహజమే. టావో మతస్తులు హిసియన్ లక్షణాన్ని (పరిపూర్ణ పురుష లక్షణాన్ని) సాధించటానికి లైంగిక సంపర్కం అడ్డుకాకపోగా అనేక విధాల సహకారి అవుతుంది అని భావిస్తారు". ఉచ్ఛిష్ట గణపతి అనుచరుల వర్ణన (ఆనందగిరి), లోకాయతికుల వర్ణన (గుణరత్న) టావోవాదులు సమూహపద్ధతిపై జరిపే లైంగిక కార్యాలకు సమానమైనవిగా కనబడతాయి. టావో మతస్తులు సమూహాలుగా, విడివిడిగా పూర్ణ మానవత్వానికై జరిపే లైంగిక చర్యలు విభ్రాంతి కలిగిస్తాయి. (ముఖ్యంగా ఆధునికులకు). ఈ కార్యక్రమాలను స్త్రీ పురుషులను సమానమొనర్చే నిజమైన కళగా భావిస్తారు. అమావాస్య, పౌర్ణామిరాత్రులలో ఉపవాసానంతరం ఇలాంటి ఉత్సవాలు చేస్తారు. తద్వారా పాపం నుంచి విముక్తి కలుగుతుందని భావిస్తారు. లాంఛనప్రాయమైన నృత్యంతో ప్రారంభించి బహిరంగ సమూహ లైంగిక చర్యలకు పాల్పడతారు. సామాన్యంగా ఈ ఉత్సవాలు దేవాలయాల ప్రాకారాల ప్రక్కన జరుగుతాయి – (నీధామ్). పాపం నుంచి విముక్తి అనే భావం నీధామ్‌ను గట్టిగా ఆకర్షించింది. ఆధునిక మనస్తత్వ శాస్త్ర శాఖలు ఈ భావాన్ని స్వీకరించడం కూడా ఆయన గమనించాడు. ఇలాంటి ఉత్సవాలను సమూహ ప్రక్షాళన క్రియగా భావించాడు. కానీ, ఇదంతా అసందర్భము అనిపిస్తుంది. పాపాన్నుంచి విముక్తి అనే భావన ఇటీవలి కాలంలో చొప్పించినది కావచ్చు. ప్రాచీన సంప్రదాయం నుంచి మిగిలిపోయిన ఆచారానికి నైతిక, మతైక సమర్థన కావచ్చు. నీధామ్ అన్నట్లు టావో మతం ఆదిమ మహత్తు సంప్రదాయాలోనే పుట్టి ఉన్నట్లయితే ఈ పాప ప్రక్షాళన భావానికి ఇందులో చోటుండదు. అసలు మహత్తు కలాపాలన్నీ ప్రాథమికంగా ఆచరణకు సంబంధించినవే. అలాగే లైంగిక సంపర్కానికిచ్చిన ప్రాముఖ్యత బహిర్గతంగానే మహత్తుకు సంబంధించింది. ఆదిమ ప్రజలలోనే ఆ ఆచారం ఉంటుంది. ప్రకృతి ఉత్పాదక శక్తిని పెంచడానికి ఉద్దేశించిన ఇలాంటి ప్రక్రియలో పాపం నుంచి విముక్తి అనే భావానికి చోటే లేదు. ఈ ఆలోచన నుంచే తాంత్రికులలో నిగూఢ సంప్రదాయాలకు తాంత్రిక సిద్ధాంత

నిర్మాణానికి మూలం ఏమిటో తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. టావో మతాన్ని అర్థం చేసుకోవడానికి కూడా ఇదే పద్ధతిని అనుసరించాలి. నీధామ్ ప్రాచీన టావో మతపు ప్రత్యేకతను అర్థం చేసుకోడానికే ప్రయత్నించాడు గానీ, దాని పుట్టుకను గురించి పట్టించుకోలేదు. ఆ ప్రత్యేకత ప్రాముఖ్యత లేనిదికాదు. కానీ, పుట్టుక సమస్య పరిపూర్ణంగా అర్థమైనప్పుడే ఆ ప్రత్యేకత కూడా అర్థమవుతుంది. థామ్సన్ ప్రాచీన గ్రీకు ఆలోచనా సమస్యను చర్చించేటప్పుడు పుట్టుకను కూడా గణనలోకి తీసుకున్నందువల్ల ఫలితాలు సక్రమంగా లభించాయి. తంత్రవాదం బౌద్ధంలో భాగంగా నీధామ్ భావించడాన్ని మనం అంగీకరించకపోయినా టావో మతానికీ, తంత్రవాదానికీ ఉన్న పోలికల విషయంలో ఆయన చక్కగానే విపులీకరించాడు. ప్రాచీన కాలంలోనూ, తొలి మధ్య యుగాల్లోనూ టావో మతం లైంగిక క్రియలలో గాఢమైన శ్రద్ధ చూపించింది. అలాగే తంత్రవాదంలో కూడా దానికి కేంద్రస్థానం ఉంది. 'వజ్ర', 'పద్మ', సిద్ధాంతాన్ని, 'మైథున', స్త్రీ పూజ సంప్రదాయాలను ఆయన ఉదహరించాడు. ఈ రూపాలన్నీ తొలి మధ్యయుగాల టావో మత సంప్రదాయాలకు సమాంతరంగా ఉన్నాయని కూడా ఆయన అన్నాడు. అలాగే టావో మతానికి, తంత్రవాదానికీ ఇంకా ఎన్నెన్నో సమాన లక్షణాలను గుర్తించవచ్చునని కూడా అన్నాడు. టావో మతస్తుల్లాగే తాంత్రికులు ప్రాణాయామానికి ప్రాముఖ్యత నిచ్చారు. తాంత్రిక సాహిత్యంలో తొలి టావో మతంలో లాగానే అనేక విడ్డూరాలు, వైరుధ్యాలు కనబడతాయి. షాన్ ఉ-వై లైంగిక కార్యకలాపాల శిల్పాకృతులను అంగీకరించాడు కానీ ఆ శిల్పాలను దేవాలయాల ప్రాంగణాలలో పెట్టరాదని నిషేధించాడు. అలాగే భారతదేశంలో తాంత్రికులు దీక్ష పొందని వారికి అర్థంకాని సంజ్ఞా భాషలో మాట్లాడుకునేవారు.

"చూడగానే తంత్రవాదం భారతదేశాన్నించి చైనాకి దిగుమతి అయిందేమో అనిపిస్తుంది. కానీ, దగ్గరగా పరిశీలించి చూస్తే కాలపరిమితి వల్ల టావో మతం దిగుమతి అయినది కాదని అక్కడిదేనని అర్థం అవుతుంది." – (నీధామ్). నీధామ్ చెప్పిన కాలపరిమితి ఈ క్రింది విధంగా ఉంటుంది:

"టావో మతస్తుల లైంగిక సిద్ధాంతాలు, సంప్రదాయాలు చైనాలో క్రీస్తుశకం రెండవ, ఆరవ శతాబ్దాల మధ్య ప్రచారంలో ఉన్నాయి. అంటే కచ్చితంగా ఆ సంప్రదాయం భారతదేశంలో పుట్టడానికి ముందే." ఇదీ నీధామ్ భావన. కానీ, తంత్రవాదంపై గ్రంథాలు ఎప్పుడు వెలువడినప్పటికీ తంత్రవాదం పురాతనమైనదే. సింధూ నాగరికత కాలంనాటిది అందుచేత తేదీలవారీగా చూసి తంత్రవాదం చైనా నుంచీ భారతదేశానికి వచ్చిందని భావించటం అసందర్భం. కాలపరిమితేగాక నీధామ్ తంత్రవాదానికి చైనా పుట్టుక స్థానమని రుజువు చేయడానికి భట్టాచార్య, బాగ్చీ రాసిన పుస్తకాలను ఉదహరిస్తాడు. భట్టాచార్య బౌద్ధతాంత్రిక వాదానికి మూలస్థానం అస్సాం అని అంటాడు. అస్సాంలోనే ఏడో శతాబ్దంలో 'టావో 'తేచింగ్'

గ్రంథానికి సంస్కృతానువాదం' తయారయింది. తాంత్రిక సాహిత్యంలో చైనాకు ముఖ్యమైన స్థానము ఉంది. బాగ్చీ దానికి సాక్ష్యంగా ఇలా అంటాడు : 'చీనాచారం' అని పిలవబడే తాంత్రిక సంప్రదాయాలు అనేకమంది పండితులు చర్చించారు. బౌద్ధులు, హిందువులూ కూడా అనుసరించే తారాతంత్ర గ్రంథము చీనాచార మతం మహా చీనా దేశం నుండి వచ్చిందని చెప్తుంది. బ్రాహ్మణ రుషి వశిష్టుడు మహాచైనా దేశానికి – ఇటు భారతదేశంలోనూ, అటు టిబెట్‌లోనూ కాదు – బుద్ధుణ్ణి కలుసుకోడానికి వెళ్ళాడని చెప్తారు. అక్కడ బుద్ధుడు చీనాచార రహస్య సిద్ధాంతాన్ని వశిష్టునికి  బోధించాడు. ఆ తరువాత దాన్ని ప్రచారం చేయడానికి వశిష్టుడు భారతదేశం తిరిగి వచ్చాడు. చైనాలో ఉన్న రహస్య సమాజాల ప్రతిధ్వని ఈ చీనాచారంలో ఉన్నట్లు ప్రొఫెసర్ సిల్వన్‌లెవీ కనిపెట్టాడు." (బాగ్చీ: తంత్రవాద అధ్యయనం.) బాగ్చీ మరికొంచెం ముందుకు వెళ్ళి ' మహాచీనా క్రమతారా', 'ఏకజాత' దేవతలిద్దరికీ మధ్యనున్న సమానత్వాన్ని స్థాపించి తంత్రవాదపు 'ఏకజాత' మొదట్లో చైనాకు చెందిన దేవత అని కూడా భావించాడు. అలాగే 'సమ్మోహ తంత్రం'లో 'మేరు పర్వతానికి పడమరగా ఉన్న 'కోలా సరస్సు' చీనా దేశంలోని భాగమే' అని చెబుతుంది. దీన్నుంచి బాగ్చీ తంత్రవాదం పూర్తిగా మంగోలియా నుండి వచ్చిందని నమ్మేశాడు. "భారతదేశ సరిహద్దులను దాటి చాలా దూరం వరకూ రకరకాల తంత్రవాదాల ప్రాంతం వ్యాపించి ఉందని రుజువు చేయడానికి చాలా ఆస్కారముందని" కూడా ఆయన అంటారు. ఇవన్నీ ఏమి రుజువు చేస్తున్నాయి? తంత్రవాదంలో పరాయి దేశపు లక్షణాలున్నట్లు సాక్ష్యమిస్తాయి. నీధామ్ లెక్క  ప్రకారం టావోమతం చైనా నుంచి దిగుమతై తరువాత కాలంలో తంత్రవాదంగా రూపెత్తింది. మరి తంత్రవాదం చైనాకు దిగుమతి కావడం నీధామ్ లెక్క ప్రకారం 'పునరాగమనం', భారతీయ బౌద్ధ తంత్రవాదం క్రీస్తుశకం ఎనిమిదివ శతాబ్దంలో చైనాకు చేరటం నీడామ్ దృష్టిలో చైనా వారికి అదివరకే తెలిసిఉన్న ఒక సంప్రదాయాన్ని విదేశీయులు (అంటే భారతీయులు) బోధించడం జరిగింది." భారతీయ తంత్రవాదం అతి పురాతనమైనది. టావోమతం నుంచి అది వచ్చిందని రుజువు చేయడం అసాధ్యం. అయితే, పైన చెప్పిన పండితులు చూపిన రుజువుల వల్ల, ఆధారాలవల్ల ఈ సమస్యకు ఒక ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. తంత్రాలలో బాహ్యాంశాలున్నాయి. అయితే, ఇది ఎలా సాధ్యమైంది. తంత్రవాదానికి అప్పటికే ఉన్న ఈ చట్టం పరిధిలోనే బాహ్యాంశాలు ప్రవేశించి ఉండవచ్చును. మరో మాటలో చైనా, టిబెట్ మొదలైన ప్రాంతాలలో సంప్రదాయంలో కలసిపోయిన నమ్మకాలు, ఆచారాలు భారతీయ తంత్రవాదంలోకి క్రమంగా చొచ్చియుండవచ్చును. రెండు రకాల మతాలకీ కొన్ని పోలికలు  అంతకు మునుపే ఉండటం వలన మాత్రమే ఇది సాధ్యమవుతుంది. దీనిలో విడ్డూరమేమీలేదు. ఈ మతాలన్నీ మాతృస్వామిక వ్యవస్థ నుంచి పొడిగించబడుతూ వచ్చినవే. టావో మతంగానీ, తంత్రవాదంగానీ ఆకాశం నుంచి ఊడిపడినవి కావు. వాటి మూలం ఆనాటి భౌతిక పరిస్థితులలోనే ఉండి ఉండాలి.

భౌతిక కార్యక్రమంతోనూ, మానవుల పరస్పర సంబంధాలతోనూ ఆ మతాలకు ప్రత్యక్షమైన సంబంధం ఉండితీరాలి.'' ఈ భౌతిక ప్రాతిపదికను విశ్లేషించకుండా భావాలు ఎరువుతెచ్చుకోవటం అనటం శుష్క చర్చ. "డిమెటర్ (అమ్మ) మతం ఒకప్పుడు ఈజిప్షియన్ ప్రభావంలో పడిందని చెప్పటానికి ఆధారాలున్నాయి. ఆ ప్రభావ విస్తృతి ఎంతో నిర్ణయించాలంటే ఆ మతం పుట్టిన సామాజిక మూలాలని పరిశోధించాలి. మతభావాలు ఎక్కడెక్కడో పుడతాయి. ఆ భావాలను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నచోటుల్లోనే అవి నిలుస్తాయి. కానీ, దాని తరువాతి అభివృద్ధి అప్పటికే అక్కడ నెలకొని ఉన్న మతానికీ, కొత్తగా వచ్చిన మతానికీ మధ్యనున్న సమాన ధర్మాల పైన, పోలికలపైన ఆధారపడి ఉంటుంది. దానికి తక్షణ సామాజిక వాతావరణ పరిస్థితులు ఎంతో తోడ్పడతాయి. రెండు మతాల మధ్య సమానంగా ఉన్న లక్షణాల ప్రాముఖ్యాన్ని అంచనా వెయ్యాలంటే వ్యవసాయ అభివృద్ధి చరిత్ర, అలాగే రెండు దేశాల చరిత్రలో విభేదించిన ప్రత్యేకాంశాలు కలిపి అధ్యయనం చెయ్యాలి. ఆ రెంటికి ఉన్న సంబంధాన్ని గుర్తించాలి. అప్పుడే మత సమ్మేళన (భావ సమ్మేళనం) అనే ఊహకు ప్రత్యేక ప్రతిపత్తి లభిస్తుంది - (థామన్స్). ఈపై చెప్పిన వాక్యాలు ముక్కికి ముక్కి నీథామ్ చెప్పిన - తంత్రవాదం టావో మతం నుంచి వచ్చిందని - వాదాన్ని తిరస్కరించడానికి కూడా పనికి వస్తాయి. అయితే, నీథామ్ మరోచోట ఇలా అంటాడు : "భావాల ఎగుమతి దిగుమతులను నమ్మడానికి నేను సిద్ధంగా లేను. ఒకే రకమైన సమస్యలను గురించి సమాన సామర్థ్యం గల ఆలోచనా పరులు ఇంచుమించు ఒకే రకపు నిర్ణయాలకు వస్తారు." నిజమే. కానీ, పై భావాన్ని టావో మతానికి, తంత్రివాదానికి మధ్యనున్న సంబంధాలకు ఎందుకు అన్వయించకూడదు?

## శారీరక శ్రమ - ఆది విజ్ఞాన శాస్త్రము

టావో మతం వారి రాజకీయాభిప్రాయాన్ని గురించి నీథామ్ చెప్పింది ఆశ్చర్యం కలగజేస్తుంది. వారి రాజకీయాలను, వారి ఆది శాస్త్రీయ ధోరణులను విడదీసి చూడరాదని నీథామ్ అంటాడు. టావో మతస్థులు మామూలు సమాజానికి బాహ్యంగా సంచరించేవారు. దీనికి కారణం ఒకటే. "వారు భూస్వామ్య సమాజ నిర్మాణానికి బద్ధవ్యతిరేకులు. సమాజానికి దూరంగా ఉండటం ఆ నిరసనకు రూపం." భూస్వామ్య నాయకత్వంపై వారి విమర్శ కడుతీవ్రం. లోకాయతులు, సహజియాలు పాలక కులాలను విమర్శించిన తీరు గుర్తుకు వస్తుంది. నీథామ్ ఇచ్చిన ఉదాహరణలు చూద్దాం : "లజ్జలేని వారు లక్ష్మీపతులు అవుతారు. వాచాలురు గద్దెనెక్కుతారు. చిన్న చిన్న దొంగలను బందీలను చేస్తారు. పెద్ద దొంగలు భూస్వామ్య నాయకులవుతారు. 'నీతిపరులైన' పండితులు, భూస్వాముల చూరులకు వేలాడతారు." "మేధావులని పేరు పొందిన మహానుభావులంతా గజదొంగలకు ఏజెంట్లుగా ఉండటం చూద్దం

లేదూ? ఆ గజదొంగల ప్రయోజనాన్ని యోగులుగానూ, సాత్వికులుగానూ చలామణి అయ్యేవారు రక్షించడం లేదూ? ఇక్కడ ఒక చిన్న ఇనుప కొక్కాన్ని దొంగిలించినవాడు మరణశిక్ష పాలవుతున్నాడు. ఇక్కడే రాజ్యాన్నే అపహరించినవాడు మహారాజైపోతున్నాడు. రాజద్వారాల వద్ద మంచితనాన్ని గురించీ ఆదర్శాలను గురించి ఘాటైన నీతులు వినబడతాయి. మంచితనమూ, నీతీ, తెలివీ, సాధుత్వమూ ఇవన్నీ దోచుకోబడటం లేదా?" మరి టావో మతస్థులు దీనికి సూచించిన ప్రత్యామ్నాయం ఏమిటి? "వారు కొత్తదాన్నేదీ ప్రతిపాదించలేదు. ముందుకు చూడనూ లేదు. కచ్చితంగా చెప్పాలంటే వారిది విప్లవవాదం కాదు. వారు తిరోగమన దృష్టితో చూసారు. ఆదిమజాతి సమిష్టి జీవిత విధానానికి తిరిగి ప్రయాణించాలని, ఆ సమాజమే తిరిగి రావాలని కోరుకున్నారు." టావో మతస్థులకు వర్గ సమాజ పూర్వపు సమిష్టి జీవిత భావన ఎక్కడనుంచీ వచ్చింది. "ఈ ప్రాచీన సమాజ భావనాస్మృతి మాత్రమే ఇంతకాలం పాటు మిగిలి టావో మతస్థులకు ప్రేరణ కలిగించింది అని నమ్మటం కష్టం. కొన్ని సమూహాలు చైనా సమాజపు అంచులలో ప్రాచీన సమాజ నిర్మాణాన్నే, భూస్వామ్య దశ వరకూ కూడా కొనసాగించుతూ ఉండి ఉండాలి. వారిని భూస్వామ్య పాలకులు అనాగరికులు అని పిలుస్తూ వారిని అణిచే ప్రయత్నాలు చేసేవారు. అయినావారు సమాజంలో ఒక ప్రక్కన ఉంటూనే వచ్చారు." "సమకాలీన ప్రజలలో వ్యాపించి ఉన్న సంప్రదాయాలను పదే పదే చెప్పుకునే అన్ని తరాల చైనా గ్రంథకారులలోనూ వాస్తవంగా తమ ప్రాచీనతను స్ఫురణకు తెచ్చుకోవటం గమనించవచ్చు." నీథామ్ ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఇచ్చాడు. టావో గ్రంథాలు కొందరు పూర్వకాలపు తిరుగుబాటుదార్లను గురించి ఉదహరిస్తాయి. వారిని పూర్వకాలపు రాజులు ధ్వంసం చేశారు. బహుశా ఆ తిరుగుబాటు దారులు పూర్వకాలపు వర్గరహిత సమాజానికి ప్రతీకలు కావచ్చు. ఈ పూర్వకాల తిరుగుబాటుదార్ల పేర్లన్నీ 'శ్రమించే' ప్రజలకు సంబంధించినవే : లోహశుద్ధి శాస్త్రాన్నీ, లోహ ఆయుధాల్నీ సృష్టించిన వాడు, గట్లు, గోడలు నిర్మించినవాడూ, రాగి పనిముట్లు చేసేవాడు మొదలైనవారు కుంగ్ కుంగ్ అనే ఒక పేరుకు అర్థం సామూహిక శ్రమ. అందుకే టావో మతస్థులకు పైన చెప్పిన రాజకీయాభిప్రాయాలుంటే వారు నిజంగా శ్రామిక జాతులతో గాఢ సంబంధం కలవారై యుండాలి అని నీథామ్ భావిస్తారు.

"టావో మతస్థులకు శారీరక శ్రమకు, దానికి సంబంధించిన నైపుణ్యానికీ వున్న అనుబంధం అనేక పిట్టకథల్లో దొరుకుతుంది. ఆ పిట్ట కథలు సామాన్యంగా కార్యనైపుణ్యం నేర్పబడేది, ఒకరి వద్ద నుంచీ సంగ్రహింపబడేది కాదనీ, టావో మతస్థులు అనేకానేక వస్తువులను తప్పించుకుంటూ వాటి మధ్యగా పరుగెత్తుకుంటూ మనస్సును కేంద్రీకరించి సాధించగలరనీ చెబుతాయి. కటికవాడు, పడవ నడిపేవాడు, కత్తులు చేసేవారు, బాణాలు చేసేవారు ఇలా రకరకాల వృత్తుల వారందరిని గురించీ ఇలాంటి నైపుణ్యగాథలు దొరుకుతాయి." "ఏది

ఏమైనప్పటికీ తరవాతి కాలాల్లో భౌతిక ఉత్పత్తి, శారీరక శ్రమ టావో మత సంఘాలలో సామాన్య లక్షణంగా ఉంటూ వచ్చింది" నీధామ్. టావో మతస్థులకు అటు శారీరక శ్రమతోనూ ఇటు వస్తూత్పత్తితోనూ ఉన్న గాఢ సంబంధం నుంచే వారి శాస్త్రీయ లేదా ఆదిమ శాస్త్రీయ ప్రాపంచిక దృష్టికి ఆధారం దొరుకుతుంది.

శ్రమ క్రమంలో బాహ్య నిర్బంధ భావన స్ఫురిస్తుంది – మానవుడు శ్రమించేటపుడు బాహ్య ప్రపంచపు భౌతిక వాస్తవికత అతని చైతన్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఇంకో మాటలో చెప్పాలంటే శారీరక శ్రమ మానవ చైతన్యాన్ని భౌతిక ప్రపంచానికి అంటుకడుతోంది – పరలోకం వైపు భావవాద స్వప్నాలవైపు కొట్టుకు పోనీదు. సామాజిక పరిణామ క్రమ ఫలితంగా శారీరక శ్రమ చులకన అయినప్పుడు – అంటే హీనమైనదిగానూ, క్షుద్రమైనదిగానూ భావించబడినప్పుడు – మానవ చైతన్యం అంటే పాలక వర్గ చైతన్యం శారీరక శ్రమకు సంబంధించిన బాధ్యతలను వదిలి వేస్తుంది. అలాగే వాస్తవిక భౌతిక ప్రపంచం పట్ల ఉన్న ధర్మాలను వదులుకుంటుంది. సర్వశక్తులూ సాధించినట్లు భ్రమపడుతోంది. ఆ భావనలో ఉబ్బితబ్బిబయి తానే బాహ్య ప్రపంచ సృష్టికర్తననుకుంటోంది –(ఏంగెల్స్). ఇదే భావ వాదం. చైతన్యానికి బదులుగా ఆత్మనో, భగవంతుణ్ణో ప్రతిపాదిస్తే అదే ఆత్మవాదం అవుతుంది.

అలాంటి దృక్పథం ఆధారంగా శాస్త్రీయవిజ్ఞానం అసాధ్యమని గమనించడం కష్టంకాదు. అసలు ప్రపంచమంతటనీ ఒక చైతన్యం – మనస్సు, ఆత్మ, భగవంతుడు – సృష్టించిందని భావిస్తే ఆ ప్రపంచానికి ఇంద్రజాల స్థితికంటే ఎక్కువ స్థాయి ఉండదు. దానిని గురించిన ఆలోచనలన్నీ సోమరితనపు ఊహలగానే మిగిలిపోతాయి. ఈ కారణం వలనే ప్రపంచాన్ని భ్రమగానో, శూన్యంగానో భావించిన బౌద్ధం చైనా చేరిన తరువాత అక్కడి శాస్త్రీయ ఆలోచనలకు శత్రువుగా పరిణమించింది.

టావో మతస్థుల విషయం వేరు. వస్తూత్పత్తికి, శారీరక శ్రమకు ఎప్పుడూ విధేయంగా ఉంటూ వారు సహజ భౌతిక దృక్పథాన్ని నిలుపుకోగలిగారు. ఆ భౌతిక దృక్పథం ఆధారంగానే విజ్ఞాన శాస్త్రం (ఆదిమ విజ్ఞాన శాస్త్రం) పెంపొందడం సాధ్యమైంది.

"టావో లక్షణం సహజ వస్తువుల్లో ఉంటుందని ఇతర లోకాలలోనూ, ఈ లోకపు టంచుల్లోనూ కాదని టావో మతస్థుడు, వృత్తి పనివాడు ఏ కోన్ముఖంగా భావిస్తారు. టావో గ్రంథాల్లో అందుకు అనేక ఉదాహరణలు". "నెలల తరబడి, సంవత్సరాల తరబడి పడే శ్రమ అంతా సహజ వస్తువుల మధ్యనే జరిగిపోతుంది. కొందరు సహజ వస్తువులకు బందీ అయిపోవడం టావో లక్షణం కాదంటారు. నేనైతే సహజ వస్తువుల బానిసగా ఉండడంలోనే సరైన టావో లక్షణం వుందని నమ్ముతాను. అలా కాకపోతే మామూలు వస్తువుల వాడకం

కూడా జనానికి తెలియకుండా పోతుంది. మహా మహా కన్ఫ్యూసియన్ పండితులు కూడా ఉపయోగకరమైన వస్తువులను ఒక్క క్షణం అయినా దూరం కారు" – (నీధామ్).

శారీరక శ్రమ నుంచి ఉద్భవించిన సహజ భౌతికవాదమిది. దీని ఆధారంతోనే టావో మతస్తులు వారి శాస్త్రీయ (ఆదిమ శాస్త్రీయ) పద్ధతిని సాధించుకున్నారు. నీధామ్ ప్రాచీన చైనాలోని ప్రజాస్వామ్య విజ్ఞానశాస్త్రం గురించి ఇలా అన్నాడు : "... విజ్ఞాన శాస్త్ర ఆవిర్భావానికి, పండితుడికీ, వృత్తి నిపుణుడికీ మధ్య అంతరం పూడిపోవడం ముఖ్యావసరం... కన్ఫ్యూసియన్‌లు ఎప్పుడూ విద్యాధిక అధికారుల పక్షానే ఉండేవారు. వృత్తి నిపుణుల పట్ల, శరీర శ్రమ చేసేవారిపట్ల వారికెపుడూ సానుభూతి లేదు. టావోవాదులకు ఆ వర్గాలతో సన్నిహిత సంబంధం ఉంది. ఈ దృక్పథాలు ఆ తరువాత చైనా చరిత్రలో కూడా కొనసాగిపోయాయి... టావో మతం ప్రాచీన కాలం నుంచీ తొలి విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక శాస్త్రాలతోనూ ప్రాచీన (భూస్వామ్య పూర్వ) సమతా సమాజ ఆదర్శాలతోనూ గాఢ సంబంధం కలిగి ఉంది.

ఆదిమ విజ్ఞాన శాస్త్రానికి, సమతా భావానికీ సంబంధం ఎలా సాధించబడుతుంది? ఆదిమ సమిష్టి సమాజంలో శారీరక శ్రమపట్ల ఉన్న దృక్పథంలోనే ఈ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. ఇందుకు నీధామ్ రెండు ఉదాహరణలిచ్చాడు. ఒకటి : వ్యవసాయంపై ఆధారపడిన ఒక తెగవారు 'రాజర్షులవల్ల ఉపయోగం లేదని' భావించారు. 'పాలకుడూ, పాలితుడూ కలిసి నాగలి పట్టాలని కోరుకుని వారు పెద్ద కులాలను, చిన్న కులాలను రద్దు చేశారు.' పురాతన కాలంలో ప్రజలు నిరంతరం శ్రమించేవారు. తమకు కావలసిన బట్టలు నేసేవారు. ఆహారానికి భూమిని సాగుచేసేవారు. మనం మామూలు బ్రతుకులోని గొప్పతనం అని దీన్నే అంటాం. వారు ఒక సమూహంగా ఐక్యంగా ఉండేవారు. దీన్నే మనం సహజ స్వేచ్ఛ అంటాం.

మార్క్సిస్టు పరిభాషలో చెప్పాలంటే ఆదిమ సమాజంలో అప్పటికింకా సిద్ధాంతానికీ, ఆచరణకూ మధ్య, మానసిక శ్రమకు, శారీరక శ్రమకూ మధ్య భేదం పుట్టలేదు, టావో మతస్థులు అలాంటి సామాజిక వ్యవస్థ నుంచి ప్రేరణ పొందారు. కానీ మహత్తులే ఆదిమ సమాజపు భావజాలం. టావో వాదుల ఆదిమ విజ్ఞానశాస్త్రం కూడా మహత్తుతో ముడిపడి ఉన్నదే (మన తంత్రశాస్త్రంలాగే). తంత్రవాదం కూడా భారతీయ తాత్విక సంప్రదాయంలో ఆదిమ విజ్ఞాన శాస్త్ర ధోరణికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇవన్నీ విడ్డూరంగానూ అస్తవ్యస్తంగానూ కనబడవచ్చు. దానికి కారణం ఆధునిక మానవుడు ఆదిమ 'మహత్తు' ప్రత్యేకతను అపార్థం చేసుకోవడంలో ఉంది. 'మహత్తు' భావం అజ్ఞానం మీదే ఆధారపడి ఉంటుంది. సందేహం లేదు. కానీ, అజ్ఞానం వేరు, భావవాదం లేదా ఆత్మవాదం వేరు. ఫ్రేజర్ చెప్పినట్లు మహత్తులో

"సహజ సూత్రపు ఆధునిక దృక్పథానికి సంబంధించిన ఛాయ (బీజం) ఉన్నది. సహజసూత్రం అంటే ఎవరి ప్రమేయం లేకుండా ప్రకృతి ఘటనలకు ఒక క్రమమైన తిరుగులేని పద్ధతి కలదనే దృక్పథం." "ఆ విధంగా ఆ మౌలిక భావన ఆధునిక విజ్ఞాన శాస్త్ర భావనకు సర్వసమానంగా ఉంది. ఈ క్రమం వెనుక ఒక విశ్వాసం దృఢంగానూ, వాస్తవంగానూ ఉంది. ప్రకృతిలో ఒక క్రమమూ, పద్ధతీ ఉందనే విశ్వాసం... మహత్తుల కార్యకలాపాల్లో ఒక ముఖ్యమైన లోపం ఉంది. ఆ లోపం ప్రకృతిలో ఘటనల క్రమం ఉందని ఊహించటంలో కాదు. ఆ క్రమంలో ముందు వెనుక సంఘటనలను సక్రమంగా గుర్తించటంలో ఉంది.

ఈ దృక్పథం నుంచే ఫ్రేజర్ 'మహత్తును' విజ్ఞాన శాస్త్రానికి సమీప బంధువుగా లెక్క వేస్తాడు. విజ్ఞాన శాస్త్రానికీ, మహత్తుకూ తొలిదశలో పెద్ద తేడా కనపడదు. అందుచేతనే మహత్తు టావో మతానికీ, ఆదిమ శాస్త్రానికీ కూడా ఒక భాగమే. శాస్త్రీయ విజ్ఞానం సహజమైన భౌతిక దృష్టిపై ఆధారపడి ఉంటే, అలాగే మహత్తు సంప్రదాయాలు మొదట్లో విజ్ఞాన శాస్త్రానికి చేరవుగా ఉంటాయి. 'మహత్తులు' కూడా మొదట్లో సహజ భౌతికవాదంపై ఆధారపడి ఉండేవన్నమాట. ఈ సహజ భౌతికవాదం శ్రమ క్రమం నుంచి పుట్టిందే. కనుక పై వాదంలో విచిత్రం ఏమీ లేదు. ఆదిమ సమాజంలో శ్రమ క్రమం క్షీణించటం ఇంకా జరిగినప్పుడు ఆ సమాజపు ప్రత్యేక దృక్పథం 'మహత్తు' అయినప్పుడు, ఆ దృక్పథం "సహజ భౌతికవాద దృక్పథమే" అవుతుంది. అందువలన విజ్ఞాన శాస్త్రానికి దగ్గరగా ఉంటుంది. వర్గ పూర్వ, ఆదిమ సమాజం చిన్నాభిన్నం అయేటప్పటికి శారీరక శ్రమ అంటే చులకన ఏర్పడింది. ఆదిమ 'మహత్తు' స్థానంలోనూ లేదా ఆదిమ విజ్ఞాన శాస్త్ర స్థానంలోనూ మతమూ, భావవాద దృక్పథమూ ప్రవేశించాయి. వర్గపూర్వ సమాజంలో పునాదులున్న టావో మతంలో, 'మరోలోక' దృక్పథానికి స్థానం లేదు. అది 'మహత్తుమయం'. అలాగే ఆదిమ విజ్ఞాన శాస్త్రం కూడా. ఉన్నత వర్గాలవారు, వారి ప్రతినిధులు హీనంగా చూసినప్పటికీ టావో మతం శ్రమ జీవులతో తన సంబంధాలను నిలుపుకుంది. ఈ వివరాలన్నీ మనం తంత్రవాదాన్ని అర్థం చేసుకోడానికి పనికివస్తాయి. తంత్రవాద మూలాన్ని మానవులు చేసే వ్యావసాయక కార్యక్రమాల్లో సాధించటానికి ప్రయత్నించాం. తొలి దశలో ఈ శారీరక శ్రమంతా 'మహత్తు'తోనూ, ఆచరణతోనూ నిండి ఉండేది. అనాగరికమైన, అజ్ఞానయుతమైన ఊహలతో నిండి ఉన్నప్పటికీ వ్యావసాయిక తంత్రం సహజ భౌతిక ధోరణిలోనే ఉండేది. ఎందుకనంటే శారీరక శ్రమ వ్యవసాయానికి అవసరము కదా. తంత్రవాదం అందులోనుంచే పుట్టింది. సహజ భౌతికవాద బీజాలు తంత్రంలోని దేహవాదం వల్ల సృష్టమైనాయి. ప్రాచీన వ్యావసాయిక 'మహత్తు'లోని సిద్ధాంతాంశలు తంత్రవాదం గ్రహించింది. సహజ భౌతికవాద రూపం తరువాత తరువాత భక్తీ, పూజ, మోక్షం లాంటి అనేక ఆత్మవాద భావాలకు భాండాగారమైంది. అయినప్పటికీ తొలి భౌతికవాద అవశేషాలు

పూర్తిగా మాసిపోలేదు. దానికి కారణం తంత్రవాదం తరువాతి రోజుల్లో కూడా హీన జాతులతోనూ, శ్రమ జీవులతోనూ తన సంబంధాలను నిలుపుకోవటమే.

## ఆదిమ విజ్ఞానశాస్త్ర ధోరణి

"విక్టోరియన్ పండితులు తంత్రవాదాన్ని గురించి గుండెలు బాదుకున్నారు. కానీ, ఆ భావాలను రెండువేల సంవత్సరాల చరిత్ర గలిగిన లైంగిక వ్యతిరేక నాగరికతా సూత్రాల ఆధారంగా పరిశీలించగలమా అనే సమస్య ఎదురౌతుంది. బహుశా ఆ భావాలన్నీ దోహద క్రియల – శాస్త్రీయ ప్రాపంచిక దృష్టితో ముడిపడి లేవా అని ఆలోచించాలి. లైంగిక చిహ్న పద్ధతి రసవాదుల భాషను ఎంత ప్రభావితం చేసిందో పాఠకుడికి గుర్తు చేయాలి. అసలు రసాయనిక క్రియా భావమే మానవ లైంగిక క్రియతో పోలిక తీసుకుని మొదలు కాలేదా?" – (నీధామ్). అలాగే నీధామ్ యీ – హిసింగ్ అనే ప్రధానమైన తాంత్రికుడ్ని గురించి కొన్ని వివరాలిచ్చాడు. అతడు ఆనాటి పెద్ద ఖగోళశాస్త్రవేత్త, గణితశాస్త్రజ్ఞుడు. బహుశా అతనికి రసవాదం కూడా తెలిసి ఉండవచ్చునని నీధామ్ భావిస్తాడు.

భారతీయ విజ్ఞానశాస్త్రంలో కూడా రసవాదాన్ని గురించి తాంత్రికులు వేసిన పరిశోధనలు చాలా ప్రాముఖ్యమైనవి. హిందూ రసాయనిక శాస్త్ర చరిత్ర అనే పుస్తకంలో 'రే' అనేక వివరాలిచ్చాడు. ఆయన కూడా తంత్రవాదులు రసాయనిక శాస్త్రానికి చేసిన దోహదాన్ని గుర్తించాడు. రసరత్నాకరం లాంటి అనేక రసవాద గ్రంథాలు ఎనిమిదో శతాబ్దం నాటికే ఎన్నో ఉండేవి. ('రసార్ణవం', 'కాక చండేశ్వరీ మత తంత్ర,' 'రసేంద్ర చోడామణి', 'రస ప్రకాశ సుధాకర మొదలైనవి). 'రే' తయారు చేసిన జాబితాలో రెండు డజన్లు పైగా ఇలాంటి పేర్లు దొరుకుతాయి. ఇందులో కొన్ని మూలరూపంలో దొరకటం లేదు గానీ టిబెటన్ అనువాదాల్లో ఉన్నాయి. మరికొన్ని పేర్లు, అలాగే రసవాదుల పేర్లు కూడా ఇతరుల రాతల్లో కనబడతాయి. నలందా, ఉదంతపుర, విక్రమశిల, మగధ మొదలైనవి తంత్రవాదానికి ముఖ్య కేంద్రాలు. ఆ తంత్రవాదంలో రసవాదం ముఖ్యమైన భాగం. ఈ కేంద్రాల నుంచీ రసవాదం దక్షిణ భారతదేశానికీ, టిబెట్‌కూ వ్యాపించిందని ఊహిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో తాంత్రిక మార్మికవాద ప్రగతి ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుంది. తొలి మధ్యయగపు బెంగాల్‌కు చెందిన చర్యగీతాలలాగానే తమిళ సాహిత్యంలో కూడా దక్షిణ భారత తాంత్రికుల కావ్యాలు చెప్పుకోదగ్గన్ని దొరుకుతాయి. తమిళంలో తంత్రవాదులను సిత్తరులు (సంస్కృతంలో సిద్ధులు) అంటారు. ఈ తాంత్రిక గ్రంథాల్లో ఉదహరించబడిన పద్దెనిమిది సిత్తరులలో ఒకరి పేరు బోగర్. ఆయన అనేక వైద్య గ్రంథాలు, రసవాద గ్రంథాలు రాశాడని చెబుతారు. బోగర్ రాతల్లో బౌద్ధ ప్రభావం ఏమీ కనబడదు. అతను చైనా నుంచి వచ్చాడనీ, కొన్నాళ్ళు పాటలీ

పుత్రం, గయ ప్రాంతాల్లో ఉన్నాడనీ, తరువాత దక్షిణాదికి చేరాడనీ ప్రచారంలో ఉంది. దక్షిణాదినే అతను దీక్ష తీసుకున్నాడంటారు. అలాగే పులిపణి అనే సిత్తరు కూడా చైనా నుంచి భారతదేశం చేరాడని చెబుతారు. తమిళ సిత్తరుల రచనలన్నీ దక్షిణ దేశంలోని గ్రంథాలయాల్లోనూ, మఠాల్లోనూ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.

తాంత్రికులు తమ రసాయనిక ప్రయోగాల కోసం అనేక పనిముట్లను సృష్టించారు. వాటికి ఆయా పనులకు సంబంధించిన పేర్లను పెట్టారు. ఉదాహరణకు 'డోలా యంత్రము', 'శ్వేదాని యంత్రము', 'పఠన యంత్రము', 'ఆదాష్ పఠన యంత్రము', 'ఢేకి యంత్రము', 'వలూక యంత్రయు', 'త్రియక్పాటన యంత్రము', 'విద్యాధర యంత్రము', 'దూప యంత్రము', 'కోష్టి యంత్రము'. వీటి చిత్రాలన్నీ 'రే' గ్రంథములో దొరుకుతాయి. తాంత్రిక రసవాదులు ఆయా పనిముట్లను కనిపెట్టడంతోనూ, ఉపయోగించటంతోనూ సరిపెట్టక ఆయా ప్రయోగాల ప్రాముఖ్యతను సిద్ధాంతపరంగా సూత్రీకరించారు. రుద్రాయమాల తంత్రంలో ఇలా ఉంది : "పైన చెప్పిన ప్రయోగాలను నేను స్వయంగా చేశాను. స్వయంగా చూశాను. ఎవరో చెప్పినందువల్ల గానీ, ఉపాధ్యాయుడు చెప్పినందువల్ల గానీ ఈ విషయాలు ఇక్కడ రాయటం లేదు. మానవ ప్రయోజనం కోసం ఇవి ఇక్కడ సూత్రీకరించబడుతున్నాయి." అలాగే "నేను సొంతంగా ప్రయోగాలు చేసి స్థిరపరచుకొనిన తరువాతనే ఈ ప్రయోగాలకు ప్రచారం కలుగజేస్తాను" అనే వాక్యంతో 'రసేంద్ర చింతామణి' ప్రారంభమవుతుంది. అదే పుస్తకంలో సొంతంగా చేయని ప్రయోగాలను గురించి వ్రాయటం నిరర్ధకమని కూడా ఒక చోట ఉంది.

శ్రుతి, స్మృతి సంప్రదాయాల దేశంలో ఇవన్నీ అద్భుతమైన విషయాలు కాదా? తంత్రవాదుల రసవాదం ప్రయోగాలతో మాత్రమే సరిపెట్టుకోక భౌతికవాద దృష్టిని స్వచ్ఛందంగా తమ శాస్త్రానికి (ఆదిమ శాస్త్రానికి) సైద్ధాంతిక ప్రాతిపదికగా చేసుకున్నారు.

"శరీరాలను విడకుండానే హరగౌరి (పాదరసము, అభ్రకము) ప్రభావం వల్ల నూతన శరీరాలను సాధించిన వారిని రససిద్ధులు అని కీర్తించాలి. ఈ జీవితంలో ముక్తిని కోరేవాడెవడైనా ముందు తనను తాను ఉజ్వల శరీరంగా మార్చుకోవాలి." అని ఒక తంత్రవాద గ్రంథం చెబుతుంది. ఈ ముక్తి భావన విచిత్రంగా భౌతిక సంబంధమైనది. తాంత్రికులకు ముక్తి అంటే శరీర పరిపూర్ణత. రస శరీరాలను సాధించి సజీవంగా ముక్తి పొందుట అనేది వారి ఊహ. భౌతిక అమర్త్యతా భావం తాంత్రికులకు 'పరదా' అనే పదాన్ని ఇచ్చింది. పాదరస ప్రయోగాలు శరీరాన్ని శిథిలం కాకుండా చూస్తాయని వారు నమ్ముతారు. ఎన్నటికి శిథిలం కాని శరీరాన్ని పొందడమే వారి ఆదర్శం. పాదరసం ఇచ్చునది దేనిని? సర్వాన్ని. అందుకే దానిపేరు పర–దా. భౌతిక అమర్త్యభావమూ, దానికి రసవాదంతో ఉన్న సంబంధమూ మళ్ళీ ప్రాచీన టావోవాద

మతాన్ని గుర్తుకు తెస్తుంది. టావో మతస్థులు ప్రాణాయామ, ఆసన, మైథున, రసాయన ప్రక్రియలతో అమర్త్యతను సాధించవచ్చని నమ్మారు. ఈ ప్రయోగాలే తరువాతి కాలంలో శాస్త్రాభివృద్ధికి ప్రేరణను కలిగించాయి. తాంత్రికులు కూడ అదే చెప్పారు. మన దేహ వాదంలో కామసాధన అనే ప్రక్రియ ఉంది. అందుచేతనే తాంత్రికుల ఆలోచనలు ప్రాథమికంగా భౌతిక సంబంధమైనవి. అందుకనే వారు రసాయనిక శాస్త్రానికీ, వైద్యశాస్త్రానికీ ఎంతో సేవచేశారు. తాంత్రికుల ప్రాథమిక భౌతికవాదము వారి ఆదిమ శాస్త్రీయ లక్షణాలకు మూలం.

అయితే ఈ ఆదిమ భౌతికవాదము పురాతనమైనదీ, సహజమైనదీ. అది బాగా వెనుకబడిన సాంకేతిక శాస్త్రంలో భాగమైన క్రతు కార్యక్రమాలతో ముడిపడి ఉంది. తంత్రమూలము భౌతిక ప్రపంచంలో భౌతిక ప్రయోగాలలో, భౌతిక ప్రయోజనాలలోనే దొరుకుతుంది. తరువాతి కాలంలో దానికి ఎన్ని 'భావవాదపు' పూతలు పూసినప్పటికీ తంత్రవాదం భౌతిక వాదానికీ, శాస్త్రీయ విజ్ఞాన సాధనకూ... మానవుడు చేసిన ఒక ముఖ్యమైన ప్రయత్నంగా ... మనం గుర్తించక తప్పనంత సాక్ష్యం ... మనకుంది.

# ౩

# శునకాల మంత్రాలు

# ఆవిష్కరణ

**దే**వీప్రసాద్ చటోపాధ్యాయ రాసిన 'లోకాయుత' ఉద్గ్రంథంలో 'శునకాల మంత్రాలు' (chanting dogs) అనే భాగం అధ్యయన పద్ధతిని ఆవిష్కరిస్తుంది.

వేదాలు, ఉపనిషత్తులు, స్మృతులు, శృతులు... అన్ని రకాల గ్రంథాలూ భౌతికవాద భావాలను 'రూపాంతరమొనర్చి' వర్ణిస్తాయి. ప్రపంచంలో అన్నిచోట్లా సంస్కృతీ పరిణామం ఒక స్థూల క్రమంలోనే జరుగుతుందని శాస్త్రజ్ఞులంటారు. ఊరికే అనడం కాదు. అందుకనుగుణమైన సాక్ష్యాలను, ఆధారాలను కూడా మన ముందుంచారు. భారత దేశ సాంస్కృతిక పరిణామం కూడా ఇందుకు భిన్నంగా ఉండజాలదని దేవీప్రసాద్ చటోపాధ్యాయ ఉద్దేశ్యం... అందుకే వివరంగా 'లోకాయత' భావాలనూ, వివిధ తత్వశాస్త్ర శాఖలలో భౌతికవాదం వదిలిపెట్టిన భావజాలాన్నీ... ఈ గ్రంథంలో చర్చించాడు.

ముఖ్యంగా ఈ 'శునకాల మంత్రాలు' అధ్యాయంలో మానుష శాస్త్రానికి సంబంధించిన ప్రాథమికాంశాలను వివరిస్తూ శునకము, శౌనకులు, శునశ్శేవుడు... మొదలైన పేర్లకూ, చిహ్న పద్ధతికీ ఉన్న సమానత్వాన్ని ప్రతిపాదించాడు. ఈ చిహ్న పద్ధతి (totemism) ఇప్పటికీ గిరిజన జాతుల్లోనేకాక కొద్దోగొప్పో నాగరికమైన వంశాల్లోనూ, కులాల్లోనూ అవశేషంగా మిగిలేవుంది.

ఆ తర్వాత 'ఆహారం కోసం ప్రార్థన' చేసే సంప్రదాయం వెనుకనున్న 'మహిమా' లక్షణాన్ని దేవీప్రసాద్ చటోపాధ్యాయ వివరించాడు. యాతావాతా తేలేదేమంటే ఆదిమానవులకూ, ప్రకృతికీ మధ్యనున్న 'సహానుభూతి భావం' అంటే ప్రకృతి శక్తులను శాస్త్రీయంగా అర్థం చేసుకోవడానికి వీలులేని ఆ కాలంలో కూడా లీలగా 'భౌతిక సాఫల్యత'కు ప్రకృతీ లేదా మానవ స్త్రీ... చిహ్నంగా ఉండేవని మహిమా భావన సారాంశం. ఈ 'కల్పితమైన'

మహిమా స్వభావానికీ... తర్వాతి కాలంలో పరిఢవిల్లి ఆత్మాది భావనలతో నిండిన మతానికీ ఏ మాత్రమూ పొత్తులేదు, సాన్నిహిత్యం లేదు. మతం వేరే చారిత్రక దశలో పుట్టింది. ఈ శునకాల వ్యవహారం... మతానికి భిన్నమైనది. ఆత్మశక్తి అని పిలవబడే దానికి బాహ్యమైనది. అది కార్యకారణ రూపంలో బంధించబడినట్లు పైకి కనిపించే చర్య, నిజానికి ఊహ మాత్రమే.

భౌతిక వాద దృష్టి నుంచి చరిత్రనూ, ప్రాచీన తత్వశాస్త్రాలనూ అధ్యయనం చేయడానికి అవసరమైన విధానాన్ని ఇటీవలి కాలంలో మరింత ముందుకు తీసుకువెళ్లారు. జార్జి థాంప్సన్ 'ప్రాచీన గ్రీకు చరిత్ర'పై చేసిన అధ్యయనంలో సూచించిన పద్ధతిని దేవీప్రసాద్ స్థూలంగా అనుసరించి 'లోకాయుత' రాసాడు. ముఖ్యంగా ఈ 'శునకాల మంత్రాలు' ఆ అధ్యయన పద్ధతిని వివరించింది. 'లోకాయత' గ్రంథాన్ని క్రమంగా-పూర్తిగా-ప్రచురించే క్రమంలో ఈ భాగం మూడోది.

# తులనాత్మక విధానం : ఒక సరళి

**ధాం**ప్సన్ తన 'గ్రీకు చరిత్రాధ్యయనం'లో అనుసరించిన పద్ధతిని అన్వయించి మన ప్రాచీన తత్వసాహిత్య విభాగాలలో మనకు లభించే ఆలోచనా శకలాలను–అందులో కొన్ని గూఢంగాను, మరికొన్ని అర్థరహితంగానూ కనిపిస్తాయి– ఎలా అర్థం చేసుకోవాలో నిర్ణయించుకోవచ్చును. ధాంప్సన్ సూత్రీకరణలకున్న విలువనూ, వాస్తవికతనూ.... భారత తత్వశాస్త్ర చరిత్ర పరిధిలో.... చర్చిద్దాం. (పాక్షికంగానైనా సరే) కేంద్ర కాంశాన్నుంచి పక్కదారి పట్టకుండా... అలాంటి గూఢమైన శకలాలను - ఒక పాఠభాగాన్ని -ఒక మచ్చుగా ఎన్నుకున్నాను. ఎంత అపూర్వము (అద్భుతము) అనిపించినప్పటికీ, పాఠము మొత్తం, నగ్న భౌతిక దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది.

## గూఢ పాఠభాగం

ఈ క్రింద చాందోగ్యోపనిషత్‌లో మొదటి అధ్యాయం 12 వ భాగంలో లభిస్తుంది. అది ఒక సంపూర్ణ భాగమే.

"ఇప్పుడు... తర్వాత (వచ్చేది)... శునకాల ఉద్గీథ" అందుచేత ఒకదాల్భ్యుడు అంటే గ్లావమైత్రేయుడు– వేదాధ్యయనానికి వెళ్ళాడు.

అతనికక్కడ శ్వేత శునకం కనబడింది. దాని చుట్టూ మరికొన్ని శునకాలు పోగయి..... ఇలా అన్నాయి (రు?) "మేము క్షుధార్తులము. తమరు గానమొనర్చి ఆహారము సాధిస్తారా?" అప్పుడా శ్వేత శునకం ఇలా అంది: "ఉదయాన, ఈ స్థలంలోనే నాకొరకు సమావిష్టులు కండు". ఒకదాల్భ్యుడు– అంటే గ్లావ మైత్రేయుడు– ఎదురు చూస్తూ ఉన్నాడు (కావలి యున్నాడు). అప్పుడు, (పురోహితులు) 'బహిష్పవ మాన స్తోత్రాన్ని' ఉచ్ఛరించ బోతుండగా, వారు చేతులు కలుపుకుని.... జరుగుతూ, జారుతూ... వచ్చారు. అప్పుడవి (వారు: శునకాలు) కూర్చొని ప్రథమోచ్చారణ (హింకారము, కావించాయి (రు). (వారి గానం): "ఓం! మనం భుజించెదము గాక! ఓం! పాన మొనరిం చెదము గాక! ఓం! దేవా, వరుణా! ప్రజావతీ!

సవిత్రీ! ఆహారమును ఇక్కడ నింపండి (పోగుచేయండి). ఓం! ఆహార దేవా! ఆహారమునిక్కడ నింపుము – అవును. దానినిక్కడే నింపండి. ఓం!"

పై అనువాదం స్థూలంగా హ్యూమ్ ఆంగ్లానువాదం ఆధారపడింది. ఈ క్రింద ముఖ్యమైన పదాలకు వివరణ.

'ఉద్గీథ' అంటే విశాలార్థంలో 'సమావేద పఠనము'... ప్రత్యేకంగా ఏ చేర్పులూ లేని సరియైన సామవేదం. అయితే సంక్షిప్తార్థంలో 'ఉద్గీథ' అంటే ఉచ్ఛైస్వరంలో పఠనం అది పంచస్థాయీ వేదపఠనంలో మూడవ స్థాయి. అంతకు ముందటి రెండూ: హింకార, 'ప్రస్తావ'లు–తొలి ఉచ్చారణ, ఆది ప్రార్థనలు. తర్వాతి రెండూ: 'ప్రతీహార' 'నిధాన'ములు అంటే ప్రత్యుత్తర సమాప్తులు.

బహిష్పవమానం ఒక వైదిక స్తోమం –స్తోత్రం, సుత్తి, సంకీర్తనం.. (ఒక ప్రత్యేక గాన– ఉచ్ఛారణా–రూపం) వేది(క)కు దూరంగా ఉదయార్ఘ్య సమయంలో గానం చేసే స్తోత్రం.

బ్రతికేందుకవసరమైన భౌతిక సామగ్రికి ఉన్నతోన్నతమైన విలువ నివ్వడం ద్వారా... ఈ పాఠభాగం నిక్కచ్చియైన భౌతిక దృష్టిని ఆవిష్కరించింది. అయితే ఆ భౌతిక దృష్టి ఆదిమం, అపక్వం అనుకోండి. ఈ విషయం ప్రత్యేకంగా ఆసక్తి దాయకం. నిజానికి 'చార్వాక' పదాన్ని 'చార్వ' పదం నుంచి సాధించ వచ్చునని మనం అంగీకరిస్తే... ('చార్వ' అంటే తినుట లేదా చప్పరించుట).... ఇక్కడ వర్ణించ బడిన జీవులు 'భుజించుట, పాన మొనరించుట, ఆహార సంపదనము' మొదలైన విషయాలనే కీర్తించుతున్నారు కనుక... వారిని చార్వాకుల సమూహమనవచ్చును. ఆధ్యాత్మిక జ్ఞానానికి ఆధారమని చెప్పుకునే ఉపనిషత్తులో ఈ పాఠం ఒక భాగం కావడం ఇందులో మరో విచిత్రం.

## బకదాల్భ్యు డెవరు?

ఈ పాఠంలో కేంద్ర విషయం నిస్సంశయంగా శునకాలు ఉచ్చాటన చేసే దృశ్యం. అయితే ఈ దృశ్యం, దృశ్యం కోసమే చిత్రించబడలేదు, అది ప్రత్యేకంగా బకదల్భ్యుడనే ఒకానొక వ్యక్తి చూడడానికి ఉద్దేశించబడిన దృశ్యం. కనుక ఈ వ్యక్తి స్వభావాన్ని నిర్ధారించకలిగితే, ఈ దృశ్యానికున్న ప్రత్యేకత అర్థం కావచ్చును–అంటే అతని భావాలు... భావజాల సామీప్యత. ఈ సంభావ్యతను ఆధునిక విద్వాంసులు. దురదృష్టవశాత్తూ విస్మరించారు.

బహుశా అతని దృక్పథానికి ఆధారం 'స్వాధ్యాయం ఉద్వప్రజా' అనే పదాల్లో లభించవచ్చును. ఈ పదాలను కచ్చితమైన వ్యాకరణ మార్గంలో అనువదిస్తే "వేదవిద్యను త్యజించినవాడు" అనాలే గాని "వేద విద్యకై ఏగినవాడు" అనకూడదు–మనం వాడిన హ్యూమ్

అనువాదం రెండో విధం. సంప్రదాయ వ్యాఖ్యానాలన్నీ 'వేద విద్యను త్యజించినవాడు' అని అనువదించడాన్ని వ్యతిరేకించినా... ఆ అర్థానికి సాహిత్య పరంగా వచ్చే ప్రామాణికత అలా ఉండగా, మరో ప్రయోజనముంది. ఆ వ్యక్తికున్న ప్రత్యామ్నాయ నామాన్ని (పేరును) అర్థం చేసుకోవడానికి పనికొస్తుంది. 'గ్లావ' అంటే సాహిత్యార్థం: కోపగించినవాడు. వేదాలను కోపగించినవాడు, వేదాలను విసర్జిస్తాడు. అయితే 'గ్లావ మైత్రేయ' పదాన్ని అసంతృప్తుడైన లేదా కోపగించిన – మైత్రేయుడని అనువదించడంలో సాంకేతికంగా ఇబ్బంది కలదేమోననే సమస్యను అల్పంగా చూడకూడదు.

ఆ వ్యక్తి వైదిక దృష్టిలో మతద్రోహి అని పైన చెప్పిన వివరణ సూచిస్తుంది. చాందోగ్యోపనిషత్తుకు బాహ్యమైన ఇతర ఆధారాల మూలాన ఈ సూచనకు బలం చేకూరుతుంది. ఒకానొక బకదాల్భ్యుడు వైదిక దేవతల అధినాయకుడైన ఇంద్రునిపై ఎలా దౌర్జన్యం సాగించాడో 'జైమినీయ ఉపనిద్బ్రాహ్మణం' వివరిస్తుంది. 'కఠక సంహిత' అతడు ధృతరాష్ట్రునితో క్రతు వివాదమొనర్చాడని వర్ణించింది. ఇవన్నీ అతన్ని అసంతృప్త వర్గానికి చెందినవానిగా సూచిస్తాయి. ఈ గ్రంథాలేవీ గ్లావ మైత్రేయుడనే రెండో పేరునుదాహరించలేదు. అందుచేత చాందోగ్యోపనిషత్‌లోని బకదాల్భ్యుడితడే ననడానికి కొంచెం సందేహించాల్సి వస్తుంది. అయితే ముఖ్యంగా చాందోగ్యోపనిషత్‌లో కూడ వేరే సందర్భంలో గ్లావ మైత్రేయుడనే పేరు ఊసులేకుండా, బకదాల్భ్యుని ప్రస్తావన ఉంది కనక... వారిద్దరూ ఒకరు కాదనడానికి కూడా సాక్ష్యమేమీ లేదు, ఇంకా, వెబర్, గ్రీర్‌సన్‌లు బకదాల్భ్యుడు పాంచాలుడనీ, పాంచాలురు బ్రాహ్మణ వ్యతిరేకులనీ వక్కాణించారు. వైదిక దృష్టిలో అతడు మత విద్రోహి అనే ఊహకు మరింత ఊతమిస్తుంది.

అయినప్పటికీ, ఆ వ్యక్తి భావజాల బాంధవ్యాన్ని సూచించే ఈ దృష్టిని అంగీకరించాలంటే కొన్ని ఇబ్బందులు ఎదురౌతాయి. చాందోగ్యోపనిషత్‌లో దొరికే సాక్ష్యమే ఇందుకు వ్యతిరేకంగా కనబడుతుంది. అదే గ్రంథం వేరేచోట అతన్ని వర్ణిస్తూ, వేదపఠనంలో ప్రవీణుడని చెపుతుంది. బకదాల్భ్యునికి ఆ జ్ఞానం–అంటే వేదపఠనారహస్య జ్ఞానం – కలదు. అతడు నైమిశ ప్రజలకు ఉద్గీథ – పురోహితుడు అయ్యాడు ! మహాభారతంలో కూడా అతడు క్రతు క్రమవిషయాలను యుధిష్ఠిరునికి బోధించడం మనం చూడవచ్చును. ఈ సాక్ష్యాలు, ఇంతకుముందు ఉల్లేఖించిన వాటికి వ్యతిరేకంగా కనబడుతున్నాయి. బకదాల్భ్యుడు మతవిద్రోహి కాకపోగా, వైదిక విద్యను విసర్జించలేదని ఈ సాక్ష్యాలు సూచిస్తాయి. ఈ గందరగోళం నుంచి బయటపడే మార్గం లభించడం సాధ్యమే. ఈ రెండు రకాల సాక్ష్యాల నిజాయితీని అంగీకరిస్తూనే, అతడు మొదట్లో వైదిక పురోహితుడుగా ఉండి చివరకు వేదాలను విసర్జించాడని కానీ, మొదట్లో నాస్తికుడుగా ఉండి తర్వాత వైదిక పథంలోకి పరివర్తన చెందాడని గానీ మనం ఊహించవచ్చును. రెండు గోత్ర నామాలుండడం వలన – ఆ పరిస్థితి వలన – అతని జీవితంలో ఒక పరివర్తన

జరిగి ఉండాలనే భావం కలుగుతుంది. అన్నిటికంటే ముందు శంకరాచార్య సూచించిన పరిష్కారం ఒకటుంది. దాన్ని సామాన్యంగా అందరూ అంగీకరిస్తారు. – అతడు వివాహిత స్త్రీకి మరొకరి భర్త వలన కలిగిన సంతానమని శంకరాచార్య చెప్పిన అర్థం. (ద్వ్యాముశ్యయన), అయితే దీనికాధారం ఏ గ్రంథంలోనూ లేదు.

ఇన్ని సంకీర్ణ విషయాల మధ్య, వేదపఠనం చేసే శునకాల వింత దృశ్యం తిలకించే వ్యక్తి స్వభావాన్ని గురించి ఇదమిద్దంగా ఏమీ నిర్ణయించే అవకాశం లేదు. అయితే అతని భావాలకు – భావజాలాను బంధానికి – సంబంధించిన ఆలోచనకు రెండు ప్రత్యామ్నాయాలకు మాత్రమే పరిమితమైతే మన వివేచనాలక్ష్యం పూర్తవుతుంది.

## ఆధునికాన్వయం

అతని (బకదాల్భ్యుని) భావజాల బాంధవ్యాన్ని గురించి కొంత చర్చ సాగించాం. అతడు వేదాలను విసర్జించినవాడో, వేదాలను అధ్యయనం చేసినవాడో అయివుండాలి. మొదటివాదం... వాస్తవమైతే... శునక పఠనా దృశ్యం – అతడు చూడడానికే ప్రత్యేకంగా ఉద్దేశించబడినది – బెదిరిపోయిన అతని అభిప్రాయాలను (విశ్వాసాలను) తిరిగి ప్రతిష్ఠించడానికే ఆ సన్నివేశం ఏర్పాటైందన్నమాట. రెండో ప్రత్యామ్నాయమే నిజమైతే, అతడు వాంఛించిన జ్ఞానం ఆవిష్కరించడానికే ఆ సన్నివేశ కల్పన. రెండు సూచనలూ ఏకముఖంగానే ఉంటాయి : ఈ పాఠ భాగకర్త వైదిక విజ్ఞానసారంగా – ఇంకా స్పష్టంగా చెప్పాలంటే వేద పఠనా జ్ఞానసారంగా – భావించిన దానితో ఈ సన్నివేశం... ముడిపడి వుంది. ఇది విడ్డూరంగా కనబడుతుంది. అలాంటి అతి విచిత్రమైన సన్నివేశానికీ, వేద విజ్ఞానానికీ – ఇంకా స్పష్టంగా వేద పఠన జ్ఞానానికి – సంబంధమేమిటి? కాని మనం ఇంతకుముందే గమనించినట్లు, ఈ సన్నివేశమున్న సందర్భానికి మరో పరమార్థం కనబడదు.

వేదపఠనానికి మొదట్లో ఆపాదించబడిన ప్రాముఖ్యతను గురించీ, ఈ వింత సన్నివేశానికీ దానికీ సాధ్య సంబంధాన్ని గురించీ ప్రస్తుతం ఆలోచిద్దాం. ఆ పని చేసేముందు, ఆధునిక విద్యాంసులు చెప్పే ఈ పాఠ ప్రామాణికతా వివరణను సింహావలోకనం చేద్దాం.

బకదాల్భ్యుని ముందు జరిగిన సన్నివేశం, అతనిలో చెదిరిన భావాలను తిరిగి నెలకొల్పడానికై ఉద్దేశించబడినా, లేదా అతడు కోరుకున్న జ్ఞానాన్ని ప్రసాదించడానికి ఉద్దేశించబడినా... ఒకటి మాత్రం స్పష్టం. దీని కర్తలు ఈ సన్నివేశాన్ని ఒక ప్రహసనంగా కానీ అపహాస్యంగా కానీ తీసుకోలేదని అంగీకరించి తీరాలి. మరోమాటలో ఈ పాఠం లక్ష్యం గంభీరమైనదే. ఇది ముఖ్యమైన అంశం. కీలకమైనది. ఇదంతా వైదిక పురోహితుల చర్యపై అవహేళన అని భావించే ఆధునిక విద్వాంసుల దృక్పథాన్ని ఈ పాఠం పూర్వపక్షం చేస్తుంది.

"క్రతుపూర్వక, పురోహిత మతం... అరకొర జ్ఞానం కలవిగా ఉపనిషత్కర్తలకు తట్టిన (తోచిన) సందర్భాలున్నాయి. వారు పురోహితుల వరుసను – ఒకదాని తోకను మరొకటి పట్టుకుని నడుస్తున్న శునక సమూహం 'ఓం! మనము భుజింతుము గాక! ఓం! మనము పానం చేయుదము గాక! అంటూ నడిచే సన్నివేశంతో పోల్చారు" అని రాధాకృష్ణన్ అన్నాడు.

ఈ పాఠంలో రిన్ డేవిడ్స్‌కు సున్నితమైన 'వ్యంగ్యార్థం' – అదీ భారతీయుల ప్రత్యేక లక్షణం – గోచరించింది.

"ఈ హాస్యంలో – పశ్చిమదేశాలకు పరిచయమేలేని హాస్యం – ప్రత్యేకాంశం ఏమిటి?

అమితమైన తెచ్చికోలు గాంభీర్యానికీ – అసాధ్యమైన సూక్ష్మాంశాలతో సహా – నైతిక లక్ష్యంతో కూడిన వాస్తవ గాంభీర్యానికీ మధ్యనున్న భేదాలను విలక్షణంగా వర్ణించే లక్షణం... ఉపనిషత్తులలో స్పష్టంగా కనబడుతుంది. శునకాల ఆరాధనా క్రమం... ఇంకా అలాంటి అనేక సంఘటనలలో "అవాస్తవికతా... వాస్తవికతా మిశ్రమంగా ఉన్నాయి".

డ్యరాంట్, రాధాకృష్ణన్ చెప్పిందాన్నే ప్రతిధ్వనింపించాడు.

ఉపనిషత్తుల కాలంలో కూడా సందేహమనస్కులున్నారని ఉపనిషత్తులలోనే కనబడుతుంది. కొన్నిచోట్ల ఋషులు పురోహితులను ఎగతాళి చేశారు. 'చాందోగ్యోపనిషత్తు' నాటి సనాతన పురోహిత వర్గాన్ని, ఒకదాని తోక మరొకటి పట్టుకుని "ఓం! మనం భుజించెదము గాక! ఓం! మనము పానం చేసెదము గాక!" అంటూ వరుసగా పోయే శునక సమూహంతో పోల్చారు."

బహుశా హ్యూమ్‌కు మాత్రం ఇందులోని వ్యంగ్య లక్ష్యంపై అంత నమ్మకమున్నట్లు లేదు. పురోహితుల ప్రదర్శనపై వ్యంగ్యంగా ఈ దృశ్యాన్ని వర్ణించి, కుండలీకరణంలో (అంటే బ్రాకెట్లలో) ప్రశ్నార్థకము (?) పెట్టాడు.

మరికొన్ని ఉదాహరణలివ్వవచ్చును : కాని అంత అవసరం లేదు. అసలు ప్రశ్న : ఆధునిక విద్వాంసులీపాఠాన్ని వ్యంగ్యమైనదని ఎందుకు భావించారు? అందుకు అనేక కారణాలు.

ఇందులో ఒక ముఖ్య కారణం : ఉపనిషత్తత్వ స్వభావం – వేదాంత స్వభావంపై – పై శంకర భాష్యం, ఈ విద్యాంసులను గాఢంగా ప్రభావితం చేసింది. శంకరుని ముఖ్యమైన ప్రతిపాదన, ఉపనిషత్తులు శుద్ధ జ్ఞాన ప్రాముఖ్యతను ఉగ్గడించాయి – క్రతు (కర్మ) విలువను కాదన్నాయి. కాని ఉపనిషదృష్టిలోని సామాన్య సరళిని అన్వయించి వివరించడానికి వీలైన దిదొక్కటేనని చెప్పరాదు. గ్రంథ సూక్ష్మాల సంగతి అలా ఉంచగా, ఉపనిషత్తులను వివరించిన ఇతర సాంప్రదాయక భాష్యకారులు ఈ దృక్పథానికి వ్యతిరేకులు. ఉదాహరణకు రామానుజుడు, ఉపనిషత్తులు వైదిక క్రతువులకు వ్యతిరిక్తమైనవి కాకపోగా, అనుపూరకాలని భావించాడు.

ఈ వివాదంలోకి మనం వెళ్లనవసరం లేదు. ఏమైనా, ఆధునిక విద్వాంసులకు భిన్నంగా, ఈ పాఠభాగానికి సంబంధించినంత వరకూ ఏ వ్యంగ్యాన్నీ శంకరుడు గమనించలేదు. అందుకు విరుద్ధంగా, ఈ పాఠమండలి గాంభీరార్థాన్ని స్పష్టం చేయడానికే ఆ పాఠ సందర్భాన్ని శంకరుడు మన ముందుంచదలచాడు. గ్రంథంలో అంతకు ముందరి భాగాలు, కాటక పరిస్థితులను వర్ణించాయి. క్షుధార్తుడైన వేద పండితుడు ఉసతి చక్రాయనుడు, అంత్యజాతి వాడు మిగిల్చిన ఆహారాన్ని భక్షించాల్సి వచ్చింది. ఈ ఉపనిషత్కారుడు తార్కికంగా తర్వాతి గ్రంథ భాగంలో శునకాల ఉద్గీథా శకలాన్ని వర్ణించవలసి వచ్చిందనీ, అదే 'ఆహార సంగ్రహ' పద్ధతి అనీ అదే ఆకలికి తరుణోపాయమనీ... శంకరుని వాదం, శ్వేత శునకం, శునకరూపంలో ఉన్న రుషి అనీ, ఆయన వద్దకు చేరిన మిగతా శునకాలు అంత ప్రాముఖ్యమైనవి కాకపోయినా ఋషులేననీ... శంకరుడంటాడు. అయితే ఆ ఋషులు (దేవతలు) దేవ జ్ఞానాన్ని బోధించడానికి ఎందుకు శునకరూపాలు ధరించారో చెప్పడానికి మాత్రం శంకరుడు ప్రయత్నించలేదు.

## 'శునకం' అంటే

ఆధునిక విద్యాంసులీ పాఠాన్ని వ్యంగ్య భూయిష్టమైనదని ఎందుకు భావించారో అనే ముఖ్యమైన ప్రశ్న మనకెదురవుతుంది. వారు గ్రంథంలో ఉన్న శునకాలను పూర్తిగా అపార్థం చేసుకున్నారు. వారికి శునకాలంటే శునకాలే, శునకాలు మినహా మరేం కాదు. ఈ శునకాలకు న్యాయం జరగాలి కనక, ప్రాచీన గ్రంథంలోని ఈ శునకాలకు తోకలు కూడా ఉన్నట్లు ఊహించబడింది. రాధాకృష్ణన్ పండితుడు వర్ణించినట్లు "ముందున్న దానితోకను తర్వాతిది పట్టుకున్న"దట. అయితే ఈ తోక సంగతి గ్రంథంలో లేదు. అయితే తోకలకు పెద్ద కథే ఉంది. అవి శంకరుని ఉపనిషద్వ్యాఖ్యలో మొదలై – శంకరుడు శునకాలను దేవతలని భావించినప్పటికీ, వారి శునకరూపాలను వాస్తవమని భావించాడు – మాక్సుముల్లర్. 'ప్రాచ్య పవిత్ర గ్రంథాలు' ద్వారా రాధాకృష్ణన్ గారి 'భారతీయ తత్వశాస్త్రం' చేరుకున్నాయి.

మరయితే, తోకలు లేకుండా శునకాలు ఉండగలవా? ఆ పైన 'వ్యంగ్యం' ఏమీ లేకుండా మానవ ప్రవర్తనను శునకంతో సమానం చేసి వర్ణించబడగలదా?... అని ప్రశ్నలు వస్తాయి.

ఈ రెండు విధాలైన 'సంభవాలూ' ఆధునిక మేధకు అందుబాటులో లేనివే. అయితే, మనం చర్చించే గ్రంథం ఆధునికం కాదు. అది ప్రాచీన గ్రంథం, ప్రాచీన వాస్తవాలకు సంబంధించింది. అందుచేత దాన్ని సక్రమంగా అర్థం చేసుకోవాలంటే, దాన్ని ప్రాచీనుల దృష్టినుంచే పరికించాలి. మనకున్న అభిప్రాయాలను దానిపై రుద్దకూడదు. అలా చేస్తే... "ఆ శునకాలు శంకరుని భావనలోని దేవతలూ కాదు. అలాగే ఆధునికుల ఊహలోని శునకాలూ కాదు... అవి ఒక మానవ సమూహం" అని సులువుగా బోధపడుతుంది.

## వైదిక సాహిత్యాలలో జంతునామాలు

మనకాలంలో మనం చూసే విధానానికి మౌలికంగా భిన్నంగానే "పాతకాలపు సంగతులు"ండి ఉంటాయి. మానవుల సందర్భంగా ఏ కార్పణ్యమూ లేకుండానే జంతునామాలు స్వేచ్ఛగా ఉపయోగించబడేవి. ఈ పద్ధతిలో వేద సాహిత్యంలో ఉన్న కొన్ని ఉదాహరణలు చూద్దాం.

వేదాలు అంటే వేద సంహితలు... అనేక శాఖలతో కూడి ఉన్నాయి. అందులో చాలా భాగాలు మనకు లభించవు. పేర్లు మాత్రం మిగిలాయి. మిగిలిన వాటి పేర్లకు అర్థాలు కూడా చాలా వరకు ... పోయాయి. అందులో కొన్ని మాత్రం స్పష్టమైన అర్థాన్నివ్వడం ఆశ్చర్యకరమే... అలాంటప్పుడే వాటి మూలం... ఏ జంతునామానికో, వృక్షనామానికో చెంది ఉన్నట్టు అర్థమవుతుంది.

రుగ్వేద సంహితలో అవశేషమొక్కటే ఉంది. దానిపేరు 'సకల'... అది ఒక సర్పజాతి 'ప్రతిసఖ్య' ప్రకారం అదే వేదంలో ఇంకా నాలుగు 'శాఖ'లున్నాయి : అశ్వలాయన, వాస్కల, సాంఖ్యాయన, మాండూక్య, చివరి పేరు 'మండూకం' (కప్ప) నుంచి వచ్చిందయి ఉండాలి. మిగతా మూడూ కూడ ఇదే విధంగా... జంతు లేదా వృక్ష... 'మూలమైనవా' అనే పరిశోధన అమూల్యంగా ఉంటుంది.

'సామవేద సంహిత'కు సహస్ర 'శాఖ'లని పురాణాలు చెపుతాయి. వానిని ఇంద్రుడు ధ్వంసం చేశాడు. ఇంద్రుని చర్య పెద్ద చిక్కే. ఇంద్రుని దాడినుంచి బయటపడిన ఏడు శాఖల పేర్లు కూడ ఇంతకు సమానమైన 'చిక్కైనవే'. అవి : కౌథుమ్, సత్యముగ్ర రాణ్యాయణ, కపోల, మహాకపోల, లాంగూలిక, శార్దూలీయ, చివరిది పులి (శార్ధూలం) నుంచి వచ్చిన పేరే. మిగతావి కూడ జంతు మూలాలై ఉండాలి.

'కృష్ణ యజుర్వేద సంహిత'లో మిగిలిన రెండు ప్రసిద్ధ శాఖలలో ఒకదాని పేరు 'తైత్తిరీయ' ఇది ఒక పక్షి జాతి (తిత్తిర) నుంచి వచ్చిన పేరే. మిగిలిన శాఖలలోని ఉపశాఖల పేరులు ఆసక్తికరంగా ఉన్నాయి. మానవ, వరాహ, చాగలేయ, హరద్రవీయ, దుందుభ, శ్యామాయనీయ. మొదటి మూడు పేర్లూ వరుసగా మనిషి, వరాహం (పంది), మేక...ల నుంచి వచ్చాయి.

ఆధర్వవేద సంహితలో లభించే 'శాఖ'ల పేర్లు 'పైప్పలాద', 'బ్రహ్మాపాలస', 'శౌనక' వీటిల్లో మొదటి పేరు పిప్పల ఫలం మీద ఆధారపడి జీవించిన పక్షి నామం నుంచి వచ్చి ఉండాలి. చివరిది... ప్రస్తుతం మనకు ఎంతో ఆసక్తి ఉన్న జంతువు నుంచి వచ్చి ఉండాలి. 'శౌనక'... మూలం 'శునకం'. ఈ పేరులో వ్యంగ్య లక్ష్యం ఏమి లేదు–.

క్లుప్తీకరిస్తే : కొన్ని 'వేద సంహిత' శాఖల పేర్లు స్పష్టం... మరికొన్ని గుప్తం. స్పష్టంగా ఉన్న సందర్భాలలో, ఆ పేర్లన్నీ... జంతువునుంచో, వృక్షాన్నుంచో... సాధించిన పేర్లు. ఏవోకొన్ని గుప్తంగా – అంటే అర్థం కాకుండా – ఉన్నాయి కాబట్టి, స్పష్టంగా ఉన్నవాటిని పక్కకు నెట్టలేము. అందుచేత, వేదర్షులు తమ సాహితీ సృష్టికి... జంతునామాలు తగిలించేవారని... వాదించవచ్చును.

ఈ సంప్రదాయం పురాతనవే. కొన్ని ప్రధానమైన ఉపనిషత్తులకు జంతునామాలున్నాయి : శ్వేతాశ్వతర (అశ్వం) మాండూక్య (మండూకం) కౌసితకి (గుడ్లగూబ), తైత్తిరీయ (తిత్తిరపక్షి). మరో 'ఉపనిషత్తు' – సంస్కృత రూపంలో లభించదు – చాగలేయ (మేక).

ఈ వాస్తవాలు, నిశ్చితంగా ఉన్నాయి. అందుచేత వైదిక సాహిత్యంలో జంతునామాలు, జంతువులనే నిర్ధేశించాయనీ లేదా మానవ సందర్భంగా ఉపయోగించబడిన జంతునామాలు వ్యంగ్య సూచనతో వాడబడ్డాయనీ భావించడానికి... మనం చాలా సంకోచించాలి. కనక ఉపనిషత్తు... భాగంలోని మన శునకాలు... శునకాలే కాకపోవచ్చు; అవి మానవులే కావచ్చు; ఆ కర్త వారిని, వారి ప్రవర్తననూ అవమానించడానికి – చులకన చేయడానికి – శునకాలని పిలవలేదు. అలా ఎందుకు పిలిచాడో, దానికి కారణమేమిటో... జాగ్రత్తగా పరిశీలించాలి. ఈ క్రింది సాక్ష్యాల వల్ల ఈ 'భావనకు' మరింత బలం చేకూరుతుంది.

## మానవులు : జంతు నామాలు

వేద సాహిత్యంలో వేర్వేరు మానవ సమూహాలను జంతునామాలతో పిలుస్తుంటారు. కొన్ని ఉదాహరణలు :

'అజులు' అనే పేరు గల మనుషులు మనకు రుగ్వేదంలో తగులుతారు. మరో జన సమూహాన్ని 'సిగ్రులు' అని పిలిచారు. అంటే ములగచెట్టు. అలాగే, 'మత్స్యులు' – అంటే చేపలు – అని పిలవబడే వారు అదే గ్రంథంలో తగుల్తారు. శతపథ బ్రాహ్మణంలో ఒక మత్స్య రాజున్నాడు. 'మత్స్యుల'నే ప్రజలు 'కౌసిత'కీ ఉపనిషత్‌లో, గోపథ బ్రాహ్మణంలో, ఇంకా "మనుసంహిత'లో కూడా వినబడతారు. మళ్లీ శతపథ బ్రాహ్మణం సృష్టికర్త 'కూర్మ' రూపంలో కనబడ్డాడని ఉంది. 'ఐతరేయ బ్రాహ్మణం' అధర్వవేదంలో కూడా... 'కశ్యప' గోత్రీకులైన పురోహితుల పేరు కనబడింది. 'కశ్యప' అంటే కూర్మమే.

'కశ్యప' అనేది ఒక ప్రజా సమూహం పేరు కాదు, అది ఒక వేద రుషి పేరు. ఇక్కడ నుంచీ, వేద సాహిత్యంలో చెప్పబడిన ఋషులెవరికీ జంతు నామాలున్నవో గమనించాల్సి వస్తుంది. మేక్డోనల్ బాగా ప్రసిద్ధమైన పేర్ల జాబితా తయారు చేశాడు. అవి : కౌశిక,

మాండుకేయ, గోతమ, వత్స, శునక. ఈ జాబితా సమగ్రం కాదు. అయితే, ఈ జాబితాలో ఆఖరి పేరు మనకు ఆసక్తికరం. గానం చేసే శునకాలు మన సమస్య. దాన్ని అర్థం చేసుకోవడానికే మన యత్నం. వేద సాహిత్యంలో శునక ఋషి ప్రసిద్ధుడనేది ఇక్కడి విషయం. మన ఉపనిషత్పాఠానికి శంకరుడిచ్చిన వివరణకు విరుద్ధంగా, వేద సాహిత్యంలో (ఎక్కడా) శునక ఋషినా పేరుతో పిలవబడడానికి కారణం ఆయనకు తోక ఉండడమూ కాదు, ఆయనకు శునక రూపం ధరించడం సరదానూ కాదు. ఆయన ఒక రుషి, ఒక మనిషి.

వేద సాహిత్యాలు వాస్తవానికి, మరికొంచెం ముందుకేపోయాయి. ఐతరేయ బ్రాహ్మణంలో మనకు ముగ్గురు ప్రసిద్ధ సోదరులు తగుల్తారు – శునఃపుచ్ఛ, శునశ్శేఫ, శునః లాంగూల... అంటే కుక్కతోక. వేద ఋషుల పేర్లకు 'కుక్కతోక' మూలం కాదగినప్పుడు (శునశ్శేఫుడు కచ్చితంగా ఋషే). ఉపనిషదిక శునకాలకు... అసలైన తోకలు తగిలించడానికి మనం సంకోచించాల్సిందే.

## ప్రాచీన సాహిత్యంలో శునకాలు

అందుచేత చాందోగ్యోపనిషత్ 'శునకాల'ని పిలవబడుతున్న మనుషులనే వర్ణించడము పూర్తిగా సాధ్యమే. అలా శునకాలని పిలవడంలో మన పాఠకర్తకు వ్యంగ్య లక్ష్యమేమీ లేదు... మన ప్రాచీన సాహిత్యంలో అనేక సందర్భాలలో శునకాలని పిలవబడే మానవులు కనబడతారు. కనుక ఈ సాధ్యతా భావానికి ఇది మరింత బలం చేకూరుస్తుంది.

కౌటిల్యుని అర్థశాస్త్రం కూడా 'శునకాల'ని పేరున్న మనుషులను గురించి చెపుతుంది. మరి కొంతమందితో పాటు... వారు కూడా రాజ శబ్దోపజీవ గణానికి చెందిన వారే. 'హరివంశం'లో ఒక అధ్యాయానికి అధ్యాయమే ఒక ప్రసిద్ధ వంశ వృక్షాన్ని వర్ణించడానికి సరిపోయింది. ఆ వంశం పేరు శునకవంశం. మహాభారతం, యాదవులలో ఒక తెగను 'శునకాలు' అంది. అదే ఇతిహాసం కనీసం మరో రెండుచోట్ల 'శునకాల'నే పేరుగల మానవ సమూహాలను గురించి చెప్పింది. భీష్మపర్వంలోనూ, సభా పర్వంలోనూ... ఇవి లభిస్తాయి.

అన్నట్లు, మహాభారతంలో మనుషులకు రకరకాల జంతువుల పేరులున్నట్లుగా అనిపిస్తుంది. కొన్ని ఉదాహరణలు : ఉలూక, వృశ్చిక, వాయస, జంబూక, గార్దాభ, కుక్కుట, గజ, శశ, కూర్మ, వరాహ, మేష, వ్యాఘ్ర, హంస, అశ్వ, మత్స్య.

అయితే శునకాలని పేరున్న వాస్తవమై మానవులను గురించిన ఆధారాలపై కేంద్రీకరిద్దాం. 'కరండవ్యూహ' ఒక సంకర జాతి ('కుక్కుర')ని ఉదహరించింది. 'మహాభారతం' అదే పేరుగల ఋషిని గురించి చెప్పింది. విష్ణు పురాణం కూడ, 'కుక్కర' ప్రజలను గురించి చెప్పింది. ఇంక ఉదాహరణలు దొరుకుతాయి.

## వెనుకబడిన ప్రజలు

ప్రశ్న ఏమిటంటే : మన ఆధునిక భావాలరీత్యా, జంతువుల పేర్లతో పిలవబడే మానవులకు సంబంధించిన ప్రాచీన ఆధారాలకు అర్థం కనిపించగలమా? దానికి సమాధానం "లేద"నే చెప్పాలి. అందుకు కారణం కూడా స్పష్టమే. అవన్నీ ప్రాచీన వాస్తవాలకు సంబంధించిన ఆధారాలు. ప్రాచీన వాస్తవాలు నేటి వాస్తవాలతో మౌలికంగా అనేక విధాల భేదిస్తాయి.

అయినప్పటికీ అలాంటి ప్రాచీన వాస్తవాలు ఈనాటికి కూడా పూర్తిగా అదృశ్యం కాలేదని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. జనాభా లెక్కల నివేదికలను గాని, థర్స్టన్, రిస్లీ, రస్సెల్, అయ్యర్ – వాస్తవానికి వెనుకబడిన జనాలను గురించి రాసిన ఏ రచయితైనా – లాంటివారి పుస్తకాలను గాని... పేజీలు తిప్పి చదివి... ఆయా ప్రజల పేర్ల జాబితాను సమగ్రంగా తాయారు చేస్తే... ఆ పేర్లలో బహుశా మనమెరిగిన జంతువుల పేర్లూ.. వృక్షాల పేర్లూ... ఒకటి కూడా మిగలకుండా కనబడతాయి. మన దేశంలోని వివిధ ఆటవిక, అర్థాటవిక ప్రజలు ఇప్పటికీ అలాంటి వింతపేర్లే... ఉపయోగించుతారు. వీటిలో శునకం నుంచి వచ్చిన పేరు మన ప్రస్తుత చర్చకు అత్యంతావశ్యకం. కొన్ని ఉదాహరణలనే తీసుకుందాం. తన 'ఒరావోన్'ల వర్ణనలో, రిస్లీ 'అరణ్య శునకాల' (అడవి కుక్కల)ను గురించి రాసాడు. మైసూర్ తెగల్లో, కులాల్లో 'శునకాలు'ండడాన్ని అయ్యర్ చెపుతాడు. దక్షిణ భారత ప్రజల్లో, 'అరణ్య శునకాలు'న్నట్లు థర్స్టన్ జాబితా చెపుతుంది. ఇలాంటి ఉదాహరణలు అనేకం. నేటి భారతదేశంలోని తెగల్లోనూ, కులాల్లోనూ 'శునకాల' సంఖ్య స్వల్పం కాదు. అలాగే వేద సాహిత్యంలోని 'శునకాల' లాగే ఈ 'శునకాలు' కూడా... కూర్మం, మండూకం, అశ్వం, మత్స్యం... లాంటి జంతునామాలతో సహజీవనం సాగిస్తున్నారు. మన దేశంలోని వెనకబడిన జనులలో ఇప్పటికీ మిగిలి ఉన్న పరిస్థితులు... మన ప్రాచీన సాహిత్యంపై ఇంచుక వెలుగును ప్రసరింపజేయగలవని అనిపించడం లేదా?

ఇలా అనిపించడంలో వింత ఏమీలేదు. ప్రాచీన సాహిత్యంలో ప్రాచీనమైనందువలననే సహజంగా ప్రాచీన వాస్తవాలను ప్రతిఫలిస్తాయి. లేదంటే కనీసం కొన్ని అవశేషాలైనా మిగిలి ఉంటాయి. మరోవైపున, అభివృద్ధి ఆగిపోయి మిగిలి ఉన్న మన వెనుకబడిన ప్రజలలో అవే ప్రాచీన లక్షణాలు లభిస్తాయి. ఇదంతా అపక్రమాభివృద్ధి ఫలితం. ప్రపంచమంతటిలోనూ అందరి ప్రజల పురోగతీ ఒకే రకంగా లేదు. ఇతరులెప్పుడో అధిగమించిన అభివృద్ధి దశలోనే కొందరింకా కొట్టుమిట్టాడుతున్నారు. ఈ అంశాన్ని కెయిన్స్ ఎప్పుడో సూత్రీకరించాడు.

"ఈ సమాజాలు మనకు కొన్నివేల సంవత్సరాల పూర్వం ఉన్న ప్రజల భావనా సంప్రదాయాన్ని ప్రతిఫలిస్తాయి. మనం భౌతికంగానూ, నైతికంగానూ... ఈ దశలన్నీ

దాటిపోయాము. మన పూర్వులు జీవించి, శ్రమించి కృషి చేశారు కనుకనే మనమిప్పుడున్న విధంగా ఉన్నాం." అయితే, ఇది ప్రపంచ స్థాయిలో మాత్రమే జరగలేదు. భారత సమాజ చరిత్రలో అసమాన పురోగతి, ప్రత్యేకంగా ముఖ్య లక్షణం. ఈ దేశంలో, ప్రాచీన సమాజం, అభివృద్ధి చెందిన నాగరిక సమాజంతో పాటు పక్కపక్కనే ఉంటూ వచ్చింది. భారతదేశంలో ఆ ప్రాచీన సమాజమింకా అడుగంటిపోలేదు.

ఇదే వాస్తవమైతే, స్థూలంగా మన ప్రాచీన సాహిత్యంలో మనకు స్పష్టంగాని విషయాలను, ఇప్పటికీ అవశేషాలుగా ఉన్న ఆదిమ ప్రజల (అలాగే అంతకంటే అభివృద్ధి చెందిన ప్రజల)ను గురించి తెలిసిన అంశాల ద్వారా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం సముచితమే. ఈ పద్ధతి చాందోగ్య పాఠాన్ని అర్థం చేసుకోవడంలో ఎంతవరకు సహాయపడగలదో చూద్దాం.

## చిహ్న పద్ధతి

ప్రాచీన సమాజావశేషాల్లో, ప్రపంచ మంతటా, సర్వత్రా కనిపించే విశేషమొకటుంది. ఆ ప్రజలందరూ తమ పేర్లను... వృక్ష ప్రపంచంనుంచో, జంతు ప్రపంచం నుంచో ఎరువు తెచ్చుకుంటారు. మోర్గన్ ఇలా అన్నాడు : "ఆదిమ అమెరికన్ సమాజాలన్నింటా గణజనులు (అంటే తెగలు) తమ పేర్లను ఏదో జంతువు నుంచో, లేదా అచేతన వస్తువునుంచో తీసుకుంటారు గాని, ఒక వ్యక్తి నుంచి కాదు. సమాజపు తొలి పరిస్థితిలో, మనుషుల వ్యక్తిత్వం తెగలో కలిసిపోతుంది."

ఆ విధంగా, సెనెకా తెగలో ఈ క్రింది వంశాలుంటాయి. ఎలుగుబంటె, తోడేలు, బీవరు, తాబేలు, లేడి, ఉల్లాముపక్షి, నారాయణ పక్షి, గ్రద్ద, అలాగే ఓజిబ్వా తెగలో 40 వంశాలుంటాయి : వాటిలో కొంగ,... ఎలుగుబంటె, తోడేలు ముఖ్యమైనవి. జంతు ప్రపంచం నుంచి లేదా వృక్ష ప్రపంచం నుంచి పేర్లను అరువు తెచ్చుకోవడాన్ని టోటమిజమ్ అంటారు. అమెరికాకు చెందిన ఓజిబ్వా తెగ మాండలికం నుంచి ఈ పదం సృష్టించబడింది. ఓజిబ్వా మాండలికంలో టోటెమ్ అనే మాట (డోడియమ్ అని సాధారణంగా పలుకుతారు)కు అర్థం గుర్తు లేదా ధ్వజము – అంటే వంశానికి, తోడేలు బొమ్మ... తోడేలు వంశానికి చిహ్నం.

తర్వాతి పుస్తకాలలో అవిష్కారమైనట్లు టోటమిజమ్ (చిహ్నపద్ధతి) ఆస్ట్రేలియాకు చెందిన వేటాడే క్రింది జాతుల్లో సంపూర్ణంగా మిగిలి ఉంది. మరికొంచెం అభివృద్ధి చెందిన తెగలలో – అమెరికా, మలేషియా, ఆఫ్రికా, భారతదేశం... ఇంకా ఆసియా ఇతర భాగాలు – ఇంచుమించు క్షీణ రూపంలో ఈ చిహ్నపద్ధతి ఉంది.

ఈ చిహ్న పద్ధతి సారాంశం ఇలా ఉంటుంది : ఒక తెగకు చెందిన ప్రతి వంశమూ ఒక జంతువుతో (లేదా మొక్కతో) 'చెలిమి' – లేదా కలయికను – చేస్తారు. దానినే, చిహ్నం

అంటారు. "ఆ వంశం వారు ఆ జంతువర్గానికి చెందిన వారుగా భావిస్తారు. ఆ జంతువు నుండి ఆవిర్భవించినట్లు తలపోస్తారు." శునక – వంశానికి చెందిన వారు తమను శునకాలనుకుంటారు. శునకాలనుంచే వచ్చామనుకుంటారు. ఈ చిహ్న పద్ధతికనుబంధంగా స్పష్టమైన నిషేధాలున్నాయి. – వాటిని 'టాబూస్' అంటారు. అలాగున... శునక వంశానికి చెందిన వారు శునకాన్ని భక్షించడం నిషిద్ధం... (వారిది చిహ్న – జాతి కనక). అదే చిహ్న సమూహంలో పరస్పర వివాహాలు కూడ నిషిద్ధమే.

ఈ చిహ్న పద్ధతి అవశేషాలు ఆదిమ స్థాయి కంటే ఎంతో అభివృద్ధి చెందిన ప్రజల్లో కూడా మినుకు మినుకు మంటున్నాయి. అలాంటి అవశేషాల వల్ల... వారి ప్రస్తుత అభివృద్ధి దశ ఏదైనప్పటికీ వారి పూర్వులు ఒకప్పుడు చిహ్న పద్ధతి సమాజంలో ఉండే వారని స్పష్టమవుతుంది. థాంప్సన్ అన్నట్టు.

"ఇండో యూరపియన్, సెమిటిక్, చైనీస్ ప్రజలలో చిహ్న పద్ధతికి చెందిన మూలాలున్న అసంఖ్యాకమైన సంప్రదాయాలూ, వ్యవస్థలూ ఉన్నవి. ఈ ప్రజాసమూహాలన్నీ తెగలుగా ఉన్నాయి. లేదా ఒకప్పుడు తెగలుగా ఉండేవి. తెగ వ్యవస్థలో చిహ్న పద్ధతి సహజ లక్షణమని రుజువు చేయగలిగితే వారు కూడా ఒకప్పుడు చిహ్న పద్ధతికి చెందిన వారేననే దృష్టికి మరింత బలం చేకూరుతుంది. వేద సాహిత్యంలో మనుషుల సందర్భంగా ధారాళంగా ఉపయోగించిన జంతునామాలను... చిహ్న పద్ధతికి అవశేషాలుగానే చూడాలా? ఆపైన, అలా అయితే, అలాంటి ఆధారాల నుంచి మనమేమి ఊహించవచ్చును?

## చిహ్న పద్ధతి - వేద సాహిత్యాలు

చిహ్న పద్ధతికి చెందిన అవశేషాలు కానీ, జంతువుల నుంచీ, మొక్కల నుంచీ మానవజాతి – లేదా కొన్ని ప్రత్యేకమైన తెగలు లేదా కుటుంబాలు – ఉద్భవించి ఉండవచ్చుననే విశ్వాసం కానీ, ఉండే అవకాశం ఋగ్వేదంలో 'కనబడుతుందని' మేక్డొనెల్ అభిప్రాయపడ్డాడు. ఓల్డెన్‌బర్గ్ కూడా జంతునామాలను చిహ్న పద్ధతికి అవశేషాలుగా పరిగణించాడు. ఇంకా అతని దృష్టిలో, వేద సాహిత్యంలో కనబడే నిషేధాలు అలాంటి చిహ్న పద్ధతికి అనుబంధమైనవై ఉండవచ్చును.

ఏమైనా హాప్కిన్స్ వీటన్నింటి పట్లా సందేహం వెలిబుచ్చాడు. "ఆధునిక మానుష శాస్త్రాన్ని అధికంగా పఠించినందువల్ల మన పండితుడు (ఓల్డెన్ బర్గ్) మనుషులకూ, వంశాలకూ చిహ్న పద్ధతిని సూచిస్తుందనే నిర్నిబంధ సూత్రం కల్పించాడు". హాప్కిన్స్‌కు అది అసంభవంగా కనబడింది. "చిహ్న పద్ధతికి ఉపపత్తి ఏమీలేదు. తద్విరుద్ధంగా అసలు చిహ్న పద్ధతి అనేది లేకుండా చిహ్న విధానంలాంటి రూపుకు ప్రత్యక్ష సాక్ష్యం ఉంది. మరి ఆ 'చిహ్న పద్ధతి

లాంటి రూపు'కు హాప్కిన్స్ వివరణ ఏమిటి? ఫలానా అతన్ని 'తాబేలు' అని పిలవడానికి బహుశా అతని నడక మరీ 'నెమ్మది' అవడం కారణం కావచ్చు. అలాగే 'దోసకాయ' అనే పేరు బహుశా అతని 'పెద్ద కుటుంబం' (సంఖ్యలో) కారణం కావచ్చు. అలాంటి కుటుంబ సంఘటనలు... సమకాలీనుల ఎగతాళితో కూడిన ప్రశంసలను పొందుతాయి కదా!"

కీత్ కూడా, ఇంచుమించు ఇవే వాదనలు చేశాడు : వైదిక సాహిత్యంలో చిహ్న పద్ధతి అవశేషాలను తిరస్కరించాడు. మేక్డొనెల్ చూపిన ఆధారాలను గురించి, "బహుశా ఆ పేరుల్లో కొన్ని... వారి వారి చనువున్న మిత్రులు పెట్టిన సరదా పేర్లు కావచ్చు." మనుషులకు జంతువుల లేదా వృక్ష జాతుల పేర్లు ఉపయోగించడం సాక్ష్యంగా ఏ మాత్రం పనికిరానిది. ఎందుకనంటే కొన్ని సందర్భాలలో అలాంటి పేర్లు మారు పేర్లే కావచ్చు.

అయితే... ఇలాంటి వాదం సక్రమమైన గ్రంథ వివరణకూ, ఊహాత్మక కల్పనకూ మధ్యనున్న వ్యత్యాసాన్ని గమనించదు. 'దోసకాయగారు' బహుళ సంతాన వంతులని ఎగతాళి చేయడం ఎక్కడా కనిపించదు. అలాగే 'తాబేలుగారు' అతి నెమ్మదైనవారని హాప్కిన్స్ వూహలో మాత్రమే తీర్మానించబడింది. అలాగే 'మత్స్యులు' 'అజులు' 'సిగ్రులు' లాంటి తెగల పేర్లు కాని 'గోతమ' 'వత్స' 'శునక' 'కౌశిక' 'మాండుకేయ' 'కశ్యప' లాంటి పేర్లు వారి వారి చనువైన మిత్రులు ప్రసాదించిన మారుపేర్లని... కీత్ ఊహించవచ్చును. కానీ, వేద సాహిత్యకర్తలే... అలాంటి సంభావ్యతకు అవకాశం చూపలేదు. అలాంటి వేద కుటుంబాల పట్ల అత్యంత భక్తి శ్రద్ధలే మనకు కనబడతాయి. చాందోగ్యోపనిషత్‌లో కొన్ని ఉదాహరణలు : కౌసితక రుషి 'ఉద్గీథ' రహస్యజ్ఞానాన్ని తన పుత్రునికి బోధించాడు. శునక కపేయ రుషి – ఈ పేరులో మొదటి భాగం శునకం, రెండో భాగం కపి... నుండి వచ్చాయి – రహస్య జ్ఞానాన్ని శిష్యుడికి బోధించాడు. అలాగే 'రుగ్వేదం'లోను 'ఐతరేయ బ్రాహ్మణం'లోను ఉన్న శునశ్శేపుని కథ 'పహాస ప్రశంసా' లక్షణ రహితంగా... ఎంతో శ్రద్ధగా చెప్పబడింది.

పైగా, జంతునామాలున్న వారు రుషులు మాత్రమే కాదు. వేద సాహిత్య భాగాలకు, శాఖలకు కూడా బాగా పరిచితమైన జంతునామాలున్నాయి. ఇవన్నీ కీత్ చెప్పినట్లు మారుపేరులా? లేక హాప్కిన్స్ చెప్పినట్లు 'పరిహాస ప్రసంగ' ఫలితంగా వచ్చిన పేరులా? కానేకాదు. అలాంటి గ్రంథాలను సృష్టించినవారు, వాటిని శాశ్వతం చేయాలనుకున్నవారు... ఆయా జంతువులను ప్రత్యేక భక్తితో చూసేవారికి వారసులు – సంతానం, అంటే వారు మొదట్లో అలాంటి పేర్లున్న 'చిహ్న పద్ధతి' తెగలకు చెందిన వారన్నమాట.

మరి 'చిహ్న పద్ధతి' అవశేషాలను... తిరస్కరించడానికి హాప్కిన్స్ ఎందుచేత అంత తొందర పడుతున్నాడు? ఎందుకనంటే... అతడు ఆర్యులను 'సమకాలీన మానుష శాస్త్రపు అమర్యాద' నుంచి రక్షించగోరాడు.

"తర్వాతికాలపు గ్రంథాలలో మాత్రమే 'ఇతర ప్రజా సమూహాల' మానుష శాస్త్ర సమాచారంతో స్పష్టమైన సామీప్యతను గమనించగలం. భారతదేశం లోపలికి హిందువులు ఎంతగా చొచ్చుకుపోతే, అంతగా అనార్యజాతి 'మత' పద్ధతిని వారు కలుపుకున్నారు. అందుచేతనే అక్కడ హైందవ పూర్వ 'ఆటవిక' భావాల జాడలు లభిస్తాయి – ఋగ్వేదార్యుల పురోహిత స్వభావము కాదు." ఇక్కడ ఊహలనేకం. వారెవరైనప్పటికీ, సాహిత్యంలో ప్రతిఫలించిన వారి అభివృద్ధి దశ ఏదైనప్పటికీ... ఋగ్వేద ఆర్యులు ముందు 'మనుషులు', అందరి మనుష్యుల్లాగే వారు కూడా 'భూమిపై తమ ఉనికిని అట్టడుగున – అత్యగ్రాన కాదు – ప్రారంభించాల్సి ఉంటుంది'. ఆ తర్వాత పైకి రావడానికి శ్రమపడాలి. క్లుప్తంగా... వారికి కూడా ఒక ఆదిమ గతం ఉండితీరాలి. అందుచేత, వారి ఉత్తర కాలపు సాహిత్యంలో కూడా, ఈ ఆదిమగతపు అవశేషాలున్నాయనే భావంలో అసంబద్ధత ఏమీలేదు. అందుచేత, వారి సాహిత్యాలలో లభించే ప్రతి ప్రాథమిక నాగరికతావశేషాన్నీ ఆర్యులు తమలో ఇముడ్చుకున్న అనార్య లక్షణంగా లెక్కించడం... తప్పుడు అవగాహన. పైగా, విశ్వాసాలు, భావాలూ, నిరభ్యంతరంగా ప్రజల్లోకి చొచ్చుకుపోజాలవు. అందుచేత... వేద సాహిత్యంలోని చిహ్న పద్ధతి సాక్ష్యాలను అనార్యుల నుంచో, ఆర్య పూర్వుల నుంచో సంగ్రహించారనడం కంటే... వాటిని వేద ప్రజల ఆదిమగతపు అవశేషాలుగా మాత్రమే భావిస్తే హేతుబద్ధంగా ఉంటుంది.

మనం కీత్ వాదనాసరళిని సూక్ష్మంగా పరిశీలిద్దాం. వేద సాహిత్యంలో 'కొన్ని' చిహ్న పద్ధతి లక్షణాలే ఉన్నాయి కాని, 'అన్ని' లక్షణాలూ కాదు... అని అతని వాదంలో కనబడుతుంది. అందుచేత మనుషులకు జంతు, వృక్ష నామాలుండడం... విలువైన సాక్ష్యం కాదు. "వేద మతంలో... ఆ చిహ్న జంతువును గాని, శాకాన్ని (వృక్ష సంబంధ) గాని... క్రతు పద్ధతిలో తిని చిహ్నపు తెగను సూచించే సందర్భం ఎక్కడా లేదు. రీనాచ్ సిద్ధాంతం ప్రకారం అతి ముఖ్యమైన చిహ్న పద్ధతి లక్షణం వేదంలో ఇంకా మొదలేకాలేదు. జంతువుల (మొక్కల) నుంచి 'ఉత్పన్నత' అనే ప్రశ్నకు సంబంధించి వేదంలో మనం తోడవలసిన అంశమిదొక్కటే.

అసలు ఇలాంటి 'పవిత్రవధ'కు సంబంధించిన జాడలు ఇంతకంటే ఆదిమ సాక్ష్యాల్లో అశ్వమేధ, సోమ యజ్ఞాల సందర్భంగా... సాధ్యపడుతుందనే సంగతి అలా ఉండగా, ... కీత్ చెప్పిన అభ్యంతరం వేద సాహిత్యంలో చిహ్న పద్ధతి 'సర్వాంగ భూయిష్టంగా' లభిస్తుందన్న వారిని కాదనడానికి మాత్రమే పనికొస్తుంది... అయితే అక్కడ చిహ్న పద్ధతి విశ్వాసాల జాడలున్నవని మాత్రమే... చెప్పబడింది. జాడ, కేవలం జాడ మాత్రమే – చిహ్న పద్ధతి అవశేషం దాని లక్షణాలన్నింటినీ బహిరంగపరుస్తుందని ఎవరూ అనజాలరు. మరోవైపున... వీటిని చిహ్న పద్ధతి అవశేషాలుగా స్వీకరించడానికి నిరాకరిస్తే... మనకు మిగిలేది జ్ఞానాంధకారం. అందుచేత... ఆయా జంతువుల పేర్లు మనమెరుగని కారణం వల్ల వచ్చి ఉంటాయనాల్సి వస్తుంది. నిజానికి కీత్‌వాదం... ఇలా "ముగుస్తుంది".

"వాటిలో కొన్ని... మిత్రులు ఇచ్చిన మారుపేర్లు అయి ఉండడానికి అవకాశం ఎక్కువ... మిగతావి... మనకు తెలియని కారణా వల్ల వచ్చి ఉండవచ్చు."

ఇక్కడ రెండు ప్రత్యామ్నాయాలు : శుద్ధ ఊహ లేదా పూర్తి అజ్ఞానం, ఇదంతా తార్కికంగా సాధ్యపడే సిద్ధాంతాన్ని నిరోధించడం (కాదనడం) వలన మాత్రమే వీలవుతుంది.

## సమూహ జీవనం

మేక్డొనెల్, ఓల్డెన్‌బర్గ్‌లాంటి పండితులు – వేద సాహిత్యంలో చిహ్నా పద్ధతి ఆధారాలున్నాయని అంగీకరించేవారు – కూడా ఈ ఆధారాల ఫలితాల గురించి అసంపూర్ణంగానే చర్చించారు. చిహ్నాపద్ధతి తరచుగా ఒక ఆసక్తికరమైన విషయంగా మాత్రమే చూడబడుతోంది. ఆ పదాన్ని 'తేలిగ్గా' ఉపయోగిస్తారు. అందుచేత ఆ పదాన్ని "జంతు జాతులతో (కొన్ని సందర్భాలలో వృక్ష జాతులు, నిర్జీవ వస్తువులు) క్రమపద్ధతిలో ముడిపడ్డ జన సమూహాలకు ఏదో విధమైన సామాజిక రూప స్వభావం ఉన్న సందర్భాలకు మాత్రమే పరిమితం చేయాలి" అని సూచించడం జరిగింది.

ఈ సామాజిక వ్యవస్థ స్వభావం ఏమిటి? మోరె (moret) దీనికి స్పష్టమైన సమాధానమిచ్చాడు. అసలైన చిహ్నా పద్ధతి సంఘంలో... "రాజులూ, పాలితులూ ఉండరు. అది ప్రజ్వాసామికమైనది. లేదంటే సమతా వ్యవస్థ, వంశంలోని సభ్యులంతా సమాన ప్రాతిపదిక మీద, తమ వంశ చిహ్నాపు నీడలో, జీవితం సాగించగలరు." తిరిగి "చిహ్నా పద్ధతి వంశ పాలనలో అందరి బాధ్యతలూ అన్ని రకాల బాధ్యతలూ – తారతమ్య భేదం లేకుండా – సామూహికంగానే ఉంటాయి... మనం సాముదాయక, సమానతా వ్యవస్థలో ఉన్నాము. ఆ వ్యవస్థ అంతర్భాగంలో ఒకే చిహ్నాపు వంశస్థుల పని పాటలలో సమానత్వం, సమైక్యతా ఉంటాయి. సభ్యులందరికీ సమాన స్థాయి ఉంటుంది"... ఇది ఆదిమ కమ్యూనిజం.

చిహ్నా పద్ధతి సంపూర్ణ రూపంలో ఆస్ట్రేలియాలోనే మిగిలి ఉంది కనుక ఆస్ట్రేలియాకు చెందిన ఆదిమ కమ్యూనిజానికి చెందిన ఆధారాన్ని మాత్రమే పరిశీలిద్దాం.

రెవరెండ్ రిడ్లీ : "ఆదిమజాతివారి మరో సూత్రం కమ్యూనిజం. వారు ప్రొధాన్ సిద్ధాంతాన్ని అమలు పరుస్తారు. (సమష్టి సంపద) వారి క్రమమైన కమ్యూనిజంలో అసలు సిసలు వ్యక్తిగతపు ఆస్తి అసాధ్యం."

దక్షిణాస్ట్రేలియా ఆదిమ జాతుల గురించి టాప్లిన్ ఇలా రాశాడు : "ప్రతి వంశానికీ తమ చిహ్నాం ఒకటుంటుంది. అందులోని ప్రతి సభ్యుడూ మిగతావారిని – పురుషులు, స్త్రీలు, బాలురు – తమ రక్త బంధువులుగా పరిగణిస్తాడు. ఆ గణజీవితమే ఆస్ట్రేలియన్ తెగల

వింతైన జీవిత స్వభావానికి కారణం. ఆ సమాజంలో సొంత ఆస్తి ఉండదు. పరికరాలూ, ఆయుధాలూ... అన్నీ సామూహికంగా అందరికీ చెందినవే, ప్రతి సభ్యుడూ వానిని తమ సమాజానికి చెందిన వస్తువులుగా భావిస్తాడు. వానిని సమాజ శ్రేయస్సుకు, రక్షణకూ - అవసరాన్ని బట్టి - ఉపయోగించుతారు. ఏ అర్థంలోనైనా ఒక ఆయుధం లేదా వల లేదా పడవ... తనదని ఎవరైనా అనుకుంటే ఆ వస్తువుపై తనకంటే తన సమాజానికి అధికమైన హక్కు కలదని కూడా అతనికి తెలుసు. ప్రతివాడూ... పక్కింటివాని వస్తువులు కూడా జాగ్రత్తగా చూస్తాడు. ఎందుచేతనంటే, వస్తువులన్నీ కుటుంబానికి సామూహికమైన సంపద. దీనివలన ఫలితాల్లో ఒకటి : కృతజ్ఞత అనే సున్నితమైన విషయం అక్కడుండదు. ఎవరైనా ప్రమాదంలో చిక్కుకున్నా, గాయపడినా, అతనిని రక్షించి సేవ చేసిన వాని... వ్యక్తిగతాంశ... సామాజిక లక్ష్యమే అందులో ముఖ్యాంశం. తనకిష్టంలేని వానికి కూడా ఒకడు అన్ని విధాలా సాధ్యమైనంత సహాయం చేయడం కూడా... ఇందులో వాస్తవమే. సమాజ శ్రేయస్సు కోసం సొంత ఉద్వేగాలు అదృశ్యమవుతాయి. ఎవరిపట్లనయినా దయ చూపిస్తే... అందరికీ ఆ దయ చూపినట్లే. ఎవరైనా ఒక్కరికి అపాయం జరిగితే అది మొత్తానికి జరిగినట్లే.

ఇవీ చిహ్న పద్ధతి దశలో ఉన్న సమూహ జీవనానికి సంబంధించిన ఉదాహరణలు. అలాంటి సమూహ జీవనం చిహ్న పద్ధతికి సహజ లక్షణం - స్వభావం - అయితే... చిహ్న పద్ధతి అవశేషాలను అలాంటి సమూహ జీవనావశేషంగా అర్థం చేసుకోవాలి.

## మహిమ (మహత్తు) - మతము

మళ్లీ మనం శ్లోకాలు పఠించే శునకాల సన్నివేశానికి వద్దాం.

కొన్ని శునకాలకు ఆకలిగా ఉంది. అవి శ్వేత శునకం దగ్గరకు వచ్చి “అయ్యా! తమరు గానమొనర్చి మాకు ఆహారం సంపాదించగలరా? మేమాకలతో ఉన్నాం” అన్నాయి. ఇది మనకు విడ్డూరంగా కనబడుతుంది. ఆహార సమస్యను ఒకపాట - గీతం - ఎలా పరిష్కరిస్తుంది? ఏదేమైనా... శునకాల భావం అదే. అవి గానం చేసినప్పుడు... ఆహారాన్ని గురించి మినహా మరిదేన్ని గురించీ గానం చేయలేదు. “ఓం! మనం భుజింతుము గాక! ఓం! మనం పానం చేయుదుము గాక!” మొదలైనవి.

ఆ విధంగా, ఆ వాస్తవమైన గీతం అప్పుడు సంభవించిన వాంఛను తృప్తి పరచింది. అది ఊహాత్మకమే కావచ్చు.

అసలు గీతం అంటే, శునకాలు ప్రార్థన అని భావించి ఉండవచ్చు గదా!... అని అనిపించింది కొందరికి. వారికి ఆహారం కావాలి కనుక శ్వేత శునకాన్ని - బహుశా వయస్సులో పెద్ద - ప్రార్థన చేయడానికి తమను నడిపించవలసిందని వేడుకున్నాయి (రు). తద్వారా

దేవతలు తమ కోరిక తీరుస్తారు. ఈ వివరణం మన ఆధునిక భావాలకు అనుగుణమే. నిజానికి శంకరాచార్య ఇంచుమించు ఇదే విధానాన్ని అవలంభించి ఈ పాఠానికి వివరణ ఇచ్చాడు.

ఈ వివరణను ఉన్న విధంగా అంగీకరించడానికి అనేక ఇబ్బందులున్నాయి. అసలు పాఠంలోనే 'పాడుట' (గానం చేయుట) అనే పదం దొరుకుతుంది కాని, 'ప్రార్థించుట' కాదు. దీని కర్త(ల)కు ఈ రెండు పదాల మధ్య వ్యత్యాసం తెలియదని మనం ఊహించలేము. అదే ఉపనిషత్తులో మరో సందర్భంలో ఉద్దేశపూర్వకంగా 'ప్రార్థించుట' అనే పదాన్ని వాడడం చూడొచ్చు. ఆ విధంగా, 'గానం చేయుట' 'ప్రార్థించుట' అనే పదాన్ని వాడడం చూడొచ్చు. ఆ విధంగా, 'గానం చేయుట' 'ప్రార్థించుట' అనేవి రెండూ భిన్న పదాలు కనుక, ... ఆ వ్యత్యాసం కర్తలకు స్పష్టంగా తెలుసు కనక,... ఒక పదానికి బదులుగా మరో పదాన్ని – ఇక్కడ – ఉపయోగించారని ఊహించే స్వేచ్ఛ లేదు. పైగా, చివరగా వచ్చిన శునకాల పాట – అసలు పాట – నిజంగా గీతమే కాని ప్రార్థన కాదు. ఇదిలా ఉండగా కొందరు వైదిక దేవతల స్మృతులు... అందులో ఉచ్ఛరించబడ్డాయి.

రెండు : ఈ గ్రంథానికి బాహ్యమైన మరో ఆధారం శునకాల గీతానికున్న ప్రార్థనా లక్ష్యాన్ని – ఉంటే – కచ్చితంగా తిరస్కరిస్తుంది. ఈ శునకాలు దేవతలూ కాదు, శునకాలూ కాదు, కేవలం ఒక ఆదిమ జన సమూహం అని ఇదివరకే గమనించాం. అందుచేత, ఆదిమ ప్రజల గురించి మనకు సామాన్యంగా తెలిసిన విషయాల వెలుగులోనే... ఆ శునకాల ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి ఆశించాలి. కనక ప్రశ్న ఏమిటంటే : అలా మనం పరిశీలించి తెలుసుకున్న అలాంటి ప్రజలకు, ప్రార్థనోద్దేశ్యాన్ని ఆరోపించగలమా? జేన్ హారిసన్ దీనికి సమాధానం చెప్పింది : "ఆటవికుడు క్రియాశీలి. దైవాన్ని తనకు కావలసినదాన్ని ఇమ్మని వేడుకొనడానికి బదులుగా, తానే సాధిస్తాడు. లేదంటే సాధించప్రయత్నిస్తాడు ప్రార్థనకు బదులుగా... మంత్రాలు ఉచ్ఛరిస్తాడు. ఒక్క మాటలో ... మహత్తును ఆచరిస్తాడు. అంతకుమించి అతడు తరచుగా ప్రయత్న పూర్వకంగా మహత్తుతో సంబంధమున్న నృత్యాలలో నిమగ్నుడౌతాడు. ఆటవికుడు ఎండను లేదా గాలిని లేదా వర్షాన్ని కోరుకున్నప్పుడు అతడు చర్చికి వెళ్ళి కృత్రిమ మైన దేవుని ముందు మోకరిల్లడు, తన తెగవారిని పిలవనంపి 'ఎండ నృత్యం' లేదా 'వాయు నృత్యం' లేదా 'వర్ష నృత్యం'... చేస్తాడు. అతడు భల్లూకాన్ని వేటాడ నిశ్చయించితే, భల్లూకాన్ని జయించడానికి శక్తినివ్వవలసిందని దైవాన్ని ప్రార్థించడు. 'భల్లూక నృత్యం'తో తన వేటను అభినయిస్తాడు."

హారిసన్ 'మహత్తు' అనే పదం ఉపయోగించింది. మహత్తు అంటే మతం కాదు. ఈ రెంటిమధ్యా వ్యత్యాసం గుణాత్మకం. థాప్సన్ చెప్పినట్లు మతం "భగవంతుని పట్ల విశ్వాసమే లక్షణంగా కలది. ప్రార్థన లేదా బలి దాని సంప్రదాయం. మనకు తెలిసిన 'హీనమైన'

ఆటవికులకు దైవం తెలియదు, ప్రార్థన, బలి... తెలియవు. అదేవిధంగా, నాగరిక ప్రజల అతి ప్రాచీన దశవరకు చొచ్చుకుపోతే – అంటే అధ్యయనం చేస్తే – తిరిగి దేవుడు, ప్రార్థన, బలి.... ఏవీలేని దశను చేరుకుంటాం. ఈ దశలో మనకు కనబడేది 'మహత్తు'.

వేద సాహిత్యాలలో మహత్తుకు చెందిన విశ్వాసాల ఛాయలు గాఢంగా ఉన్నాయనే విషయాన్ని నిజమైన పండితులెవరూ సందేహించరు. ఇంచుమించు అధర్వవేదమంతా... "మహత్తు" మినహా మరేం కాదు. కనుక, మన వేద ప్రజల అతి ప్రాచీనకాలానికి పోతే... మనం మతం లేని ఒట్టి మహత్తున్న దశకు చేరుకుంటాం. దురదృష్టవశాత్తూ మన ఆధునిక విద్వాంసులు 'మహత్తు' అనే పదాన్ని తేలిగ్గా ఉపయోగిస్తారు. మతంతో దానికున్న గుణాత్మక భేదాన్ని... అంతగా గుర్తుంచుకోరు. అందుచేత... మహత్తుకు సంబంధించిన నమ్మకాలకున్న సామాన్య స్వభావాన్ని సూక్ష్మంగా పరిశీలించాలి.

వాస్తవాన్ని అదుపులో పెట్టగలమనే భ్రమను కల్పించుకుని నిజంగానే వాస్తవాన్ని అదుపులో పెట్టగలమనే... సూత్రంపై మహత్తు ఆధారపడి ఉంది. తొలిదశలలో అది కేవలం అనుకరణ. నీకు వర్షం కావాలి కనుక నీవొక నృత్యం చేస్తావు. ఆ నృత్యంలో మేఘాలను ప్రోవుచేయుట, పిడుగులాగా శబ్దం చేయుట, జల్లు పడినట్లుగా నటించుట... దానిలో భాగాలు. వాంఛించిన వాస్తవాన్ని కల్పనలో నటించుతావు. తర్వాతి దశలలో... అనుకరణ చర్యతో పాటు ఆజ్ఞ ఉంటుంది. 'వర్షించుము' అనే ఆజ్ఞార్థక వాక్యము, అది ఆజ్ఞ, వేడికోలు కాదు, ఈ మూకుమ్మడి ఒత్తిడి సూత్రం... సంఘం ఇంకా అవిభాజ్యమైన మొత్తంగా ఉన్న సామాజిక దశకు అనుబంధించబడింది. ఆ సంఘం ప్రతి సభ్యునికంటె, అందరి సభ్యుల కంటె కూడా ఆధిక్యత కలది. ప్రతికూలమైన ప్రకృతికి ఎదురు నిలిచిన – ఏకంగా ఉన్న – బలహీన సంఘమది" – థాంప్సన్.

పై ఉల్లేఖనలో రెండు అంశాలను వక్కాణించాం. వాటికి మన పాఠ్యభాగం'తో ప్రత్యక్షంగా... తక్షణ సంబంధముంది. ఆహారం కోసమే శునకాలు గీతమాలపించదలచాయి (రు)... ఆ పాట కూడా ఆహార – గీతమే. వాంఛించిన వాస్తవాన్ని... నెరవేర్చడానికి కల్పనను నటించడమంటే... ఇదే. ఆ కార్యం చేసినది... ఉపనిషత్ పాఠంలోని శునకాలను చూస్తే సమాజం ఇంకా అవిభాజ్యమైన మొత్తంగానే ఉన్న దశ... ముద్ర స్పష్టంగా ఉంది. అంటే ఆ గీతం మహత్తుపై నిలిచింది. అది ప్రార్థన కావడానికి వీలులేదు. మహత్తు అనేది భ్రమాత్మక పరిభాష మాత్రమే. అది భ్రమాత్మకమైనప్పటికీ, నిష్ప్రయోజకం కాదు, అది కార్య సరళికి సహకారి. థాంప్సన్ ఈ అంశాన్ని ఇలా విశదీకరించాడు. "మవోరీలకు 'బంగాళదుంప – నృత్యం' ఉంది. తూర్పు గాలుల వల్ల లేత పంట వాడి మాడిపోయే అవకాశం ఉంది. కనక బాలికలు పొలాల్లోకి వెళ్లి... గాలి దూకుడునూ, వర్షాన్నీ, పంట మొలకెత్తడాన్నీ, మొగ్గ తొడగడాన్నీ... అనుకరిస్తూ నృత్యం చేస్తారు. వారు ఆడుతూ, పాడుతూ తమను అనుకరించమని

పంటను వేడుకుంటారు. కోరుకున్నదాన్ని కల్పనలో నటిస్తారు. అదే మహత్తు. భ్రమాత్మక శిల్పం : వాస్తవ శిల్పానికి అనుబంధం, కాని అది భ్రమాత్మకమైనప్పటికీ, నిష్ప్రయోజకం కాదు. నృత్యానికి బంగాళాదుంపల మీద ఏమీ ప్రత్యక్ష ప్రభావముండదు, కానీ ఆ బాలికల మీదే గణనీయమైన ప్రభావం ఉండగలదు, ఉంటుంది. ఆ నృత్యం వల్ల ప్రేరేపణ పొంది – అది పంటను రక్షించుతుందనే విశ్వాసంతో – పూర్వంకంటే గట్టి నమ్మకంతో, అందుచేత మరింత శక్తివంతంగా పంటను సంరక్షించడానికి తయారవుతారు. ఎలాగైతేనేం... పంటమీద దాని ప్రభావమున్నట్లేగా ! అది వాస్తవం పట్ల వారి స్వీయదృక్పథాన్ని మారుస్తుంది. అందుచేత పరోక్షంగా వాస్తవాన్నే మారుస్తుంది". ఆ విధంగా మహత్తు శక్తి... మానసికమైనది. కాని వ్యక్తుల మనస్తత్వానికి చెందింది కాదు.

"ఈ క్రతువులో ఒక సంగతి గమనించాం... ఒకే తలపు, ఒకే ఉద్వేగం కల అనేకమంది సామూహికంగా ఆ క్రతువులో పాల్గొనాలి... సామూహికత, ఉద్వేగ తీవ్రత అనే రెండు అంశాలు ఒక సామాన్య స్పందనకు క్రతు రూపమిచ్చాయి. ఆ రెండు అంశాలూ ముఖ్యంగా ఆదిమ ప్రజల్లో పెనవేసుకున్న లక్షణాలు... ఇంచుమించు అవిభాజ్యము, ఆటవికులలో ఎవరికైనా వ్యక్తిత్వం పలచన, అల్పము : సామాజికంగా మాత్రమే ఉన్నతమైన ఉద్విగ్నస్థితి కలుగుతుంది. దాన్నే తెగవారు పవిత్రంగా భావిస్తారు. అదే క్రతువుకు సంబంధించిన విషయం, ఉద్వేగ సాంద్రత, సామూహికత జంటగా ఉంటాయి" – హారిసన్.

ఉత్పత్తి నైపుణ్యం పెంపొందించడం వలన ఈ ఆదిమ సామూహికత వెనుకబడిపోతుంది. తద్వారా 'మిగులు' ఏర్పడి కొద్దిమంది అనేకుల శ్రమపై జీవించే అవకాశం వస్తుంది. కాని ఆదిమ 'మహత్తు'కు సంబంధించిన స్మృతులు మాత్రం అదృశ్యంకావు. తర్వాత తర్వాత దాన్నే అతీత ఆధ్యాత్మిక శక్తిగా అన్వయించి... కొద్దిమందికే పరిమితమైన రహస్య (అపూర్వ) జ్ఞానంగా చలామణి చేస్తారు. అదే మూఢవిశ్వాసంగా కుదురుకుంటుంది. మూఢ విశ్వాసం వాస్తవికమైన ఉత్పత్తి విధానానికి అడ్డంకిగా మారుతుంది. మహత్తు దాని వ్యతిరేక లక్ష్యాన్ని చేరుకుంటుంది. అంటే మతంగా మారిపోతుంది.

ఉపనిషత్ భావుకులతో... మహత్తు మతంగా మారిపోయిందని మన వాదం. అయితే వారి మూఢ విశ్వాసాలను అర్థం చేసుకోవాలంటే వారి ఆదిమ చరిత్రను క్షుణ్ణంగా తెలుసుకోవడం అవసరం. మహత్తు ఉత్పత్తి విధానానికి సహకారిగా ఉన్నప్పటి చరిత్ర అది.

## ఆహారం కొరకై గానం

చాందోగ్యోపనిషత్‌లో మనం అర్థం చేసుకోవడానికి ప్రయత్నించే పాఠభాగం 'తిండి కొరకు పాట' మొదటి అంశం : అది ఆ గ్రంథంలో చెదురువాటుగా వచ్చిన ఆలోచన కాదు.

నిజానికి ఉపనిషత్కర్తలు ఆహార సంపాదనకు మడిపడ్డ భావానికి భిన్నమైన లేదా అలాంటి మరో కోరికను తీర్చుకోవడానికి భిన్నమైన – గీతాన్ని ఊహించజాలరు. 'ఉద్గీథ' అనే పదాన్ని సాధించడానికి కోరిన మార్గము వలన ఇది స్పష్టమౌతుంది. వారు చెప్పిన పద్ధతి ప్రకారమే 'ఉద్గీథ' అనే పదం ఉద్, గీ, థా... అనే వాక్యానికి సంక్షిప్తీకరణ. 'ఉద్' అంటే ఊపిరి, 'గీ' అంటే వాక్కు, 'థా' అంటే ఆహారం.

" 'థా' అంటే ఆహారం, ఎందుచేతననగా ఆహారం పైనే ఈ ప్రపంచం స్థాపించబడింది. (స్థితా)" – చాందోగ్యోపనిషత్.

అందుచేత ఆహారం 'ఉద్గీథ' భావనలోనే ముఖ్యమైన భాగాల్లో ఒకటి. ఉపనిషత్కర్తలకు 'ఉద్గీథ' కాని గీతం ఏదీ తెలియదు. అందుచేత వారు భావించిన గీతం... ఆహారానికి ఉద్దేశించినదే.

ఉపనిషత్‌లో గానం చేసే శునకాల సన్నివేశమున్న సందర్భాన్ని అర్థం చేసుకోవచ్చును. ఆ సన్నివేశం... సన్నివేశం కోసమే సృష్టి కాలేదు. అది ప్రత్యేకంగా బకదాల్భ్యుడనే ఒక వ్యక్తి దర్శించడానికి గాను ఉద్దేశించబడింది. అతనిలో వేదపఠనా విశ్వాసాన్ని పునఃప్రతిష్టించడానికి– అతడు మత విద్రోహి అయి ఉంటే–గాని, లేదా వేద పఠనా రహస్యాన్ని ఆవిష్కరించడానికి – అతడు సంప్రదాయమైన వేదాపేక్షకుడైతే – గాని ఆ సన్నివేశం అవసరం. ఏవిధంగా చూసినా, ఉపనిషత్కర్తలు వేదపఠనా సారం అని భావించిన దానికి సంబంధించిందే ఈ సన్నివేశం. ఈ పరిస్థితుల్లో, ఈ సన్నివేశం 'ఆహారం కొరకు గానం' అనే వస్తువును తప్ప మరో విషయాన్ని స్పృశించదు. ఆహార సముపార్జనా భావం వేద పఠనానికి బాహిరమైనది కాదని ఆ కర్తల అభిప్రాయం.

ఈ వాదాన్ని స్థాపించాలంటే... వేదగీతాల స్వభావాన్ని గురించీ, వీటిపై ఉపనిషత్తుల లోని ఊహల స్వభావాన్ని గురించీ... క్లుప్తంగా చర్చించాలి.

## తొలి వేదగీతాలు

చాందోగ్యోపనిషత్ తొలి అధ్యాయాల్లో వాక్కు, గీతం, శ్రావ్యత... మొదలైన అంశాలను చర్చించింది. ఆ గ్రంథ సందర్భం అలాంటిది. మిగతా ఉపనిషత్తుల లాగానే చాందోగ్యం కూడా వేదానికి అనుసంధించబడింది. "చాందోగ్యం అనుసంధించబడిన వేదం 'సామవేదం' అంటే "శ్రావ్యతా జ్ఞానం" – శ్రవణ (?) జ్ఞానం".

వాస్తవం చెప్పాలంటే 'సామవేదం' స్వతంత్రమైనది కాదు. అది 'ఋగ్వేదం', కొన్ని శ్లోకాల సంపుటీకరణం. ఆ శ్లోకాలు సోమయజ్ఞ సందర్భంలో గానం చేయవలసినవి.

సామవేదంలో 75 శ్లోకాలు తప్ప మిగతావన్నీ రుగ్వేదపు 8,9 మండలాలలోనివే. మిగతావి కూడా కనబడకుండా పోయిన రుగ్వేద భాగాలలోని వేనని కూడా కొందరి ఊహ. అందుచేత, సామవేదం ఎప్పుడు సంకలనం చేయబడినా... దానిలోని శ్లోకాలు (గీతాలు) మాత్రం ప్రాచీన గతంలో అల్లబడినవే.

సామవేదంలో ప్రసిద్ధి చెందిన భాగం "కౌధుమ" అందుల రెండు భాగాలు. వింటర్నిజ్ ఈ రెండు భాగాలను గురించి ఇలా అన్నాడు.

"..... ఈ గ్రంథం ఒక లక్ష్యానికి కృషి మాత్రమే. ఇందులో ముఖ్యాంశం ఎక్కడైనా... శ్రావ్యత మాత్రమే. రెండు భాగాల లక్ష్యమూ సంగీతాన్ని బోధించడమే."

సామవేదానికి అనుబంధించ బడిన చాందోగ్యోపనిషత్తు సహజంగా తొలివేదాలకు సంబంధించి ఉంటుంది.

'ఇవి మనం అర్థం చేసుకునే పద్ధతిలో గీతాలు కావు (కదా!)' అని అభ్యంతరం చెప్పవచ్చును. అవి... వేద క్రతువుల్లో ఒక ప్రత్యేకార్థంలో వాడిన గాతాలు అని అనొచ్చు.

సామవేదం క్రతు సందర్భంగా ఉపయోగపడడానికి సంకలనమైంది – యజుర్వేదం కూడా ఇంతే. అందులో ఉన్న శ్లోకాలన్నీ సోమయుజ్ఞ కార్యకలాపాలలో గానం చేయడానికుద్దేశించబడ్డాయి" – మేక్డొనెల్.

ఇది నిజమే. అంటే అర్థమేమిటన్న మాట? వేదగీతాల పుట్టుకకు సంబంధించిన సమస్యను సంపూర్ణంగా పరిష్కరించాలంటే, వైదిక క్రతువుల పుట్టుకకు సంబంధించిన సంకీర్ణ సమస్య గురించి కూడా ఆలోచించాలి. దీన్ని గురించి 'సంఘ – నియతి' సమస్యను చర్చించినప్పుడు తెలుసుకుందాం... అయితే తొలి వేద ప్రజల ఆదిమ శ్రమక్రమాలకూ... ఈ సమస్యకూ సంబంధముందనడానికి ఆధారాలున్నాయి.

వేద గీతాలను గురించిన పై అభ్యంతరాన్ని వేరేవిధంగా, స్పష్టంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం. వేదగీతాలు... విశిష్టార్థంలోనే గీతాలు. ఇవి – మనకు కచ్చితమైన సమాచారమున్న చరిత్రలో – మొదటి గీతాలు. అందుచేత ఇవి చరిత్రలో అతి ప్రాచీన దశకు చెందినవి. వేద ప్రజలు లిపి పూర్వ ప్రాచీనులు. మౌఖికంగా తొలి గీతాలను కూర్చిన కాలంలో... బహుశా వారు ఇప్పటికీ మిగిలి ఉన్న ఆదిమ ప్రజల్లా గానే ఉండిఉండేవారని భావించవచ్చును.

ఈ అంశం మరీ అంత కొత్తదికాదు. వింటర్నిట్జ్... దీన్నెప్పుడో పాక్షికంగా అంగీకరించాడు.

"పూజారులు, మతవేత్తలు ఈ స్వరాలన్నింటినీ స్వయంగా సృష్టించి ఉండరు. వాటిలో అతి ప్రాచీనమైనవి, ప్రజలకు బాగా తెలిసినవైయుంటాయి. అతిప్రాచీన కాలంలో

సంక్రమణోత్సవాలలో ఇతర జాతి పండుగలో ఆ స్వరాల కనుగుణమైన అర్థమత గీతాలు పాడి ఉంటారు. ఇంకా మరికొన్ని బ్రాహ్మణాల కాలానికి ముందరి మాంత్రిక పూజారులు – ఆదిమ ప్రజల మాంత్రికులు, షామాన్లు, వైద్యులు వంటివారే – విపరీత శబ్దాల సంగీతంతో పాటలు, క్రతువులు చేసేవారు. సామస్వరాల ప్రజా 'మూలం' తాలూకు ఛాయలు – లక్షణాలు. 'స్తోభా'లలో (హర్షద్వానాలలో) కనబడతాయి. ముఖ్యంగా ఇటీవలి బ్రాహ్మణాల కాలం వరకూ ఉన్న... సామ గానంలో మహిమ కలదన్న భావంలో ఇది వ్యక్తం. సామవేదానికి చెందిన క్రతు గ్రంథం ఉంది, సామవిధాన బ్రాహ్మణం. దానిలో రెండో భాగం మహత్తుకు సంబంధించిన 'వివరణ గ్రంథమే'. అది 'మహత్తు' లక్ష్యంగా 'సామా'లను ఎలా గానం చేయాలో బోధిస్తుంది. బ్రాహ్మణ సూత్రాలు... రుగ్వేద, యజుర్వేదాల పఠనాన్ని సామగానం విన్నంతనే ఆపివేయాలని చెపుతాయి. ఈ ఆచారం కూడా సామవేదానికీ, బ్రాహ్మణాలకు పూర్వమున్న సమాజంలోని మహిమల పట్ల విశ్వాసానికీ గల సాన్నిహిత్యావశేషమే."

ఇది చాలా ముఖ్యమైన అంశం. ఆషామాషీ వ్యాఖ్యానం కాదు. దీని తాత్పర్యం... ప్రాముఖ్యమైనది. దీన్నుంచి మనకు లభించే సూచన ఏమింటంటే... ఇప్పటికీ ఉన్న ఆటవిక జనంలో పాటకూ, స్వరానికీ వారి జీవితంలో ఉన్న పాత్రను అధ్యయనం చేయాలి. దీని వెలుగులోనే తొలి వేదగీతాల్లో గూఢంగానూ, వింతగానూ అనిపించే – అలాగే తరవాతి కాలంలో వాటిని గురించిన ఊహలను (అంచనాలు) కూడా – భావాలను – పరిశీలించాలి.

## చాందోగ్యోపనిషత్

చాందోగ్యోపనిషత్తుకు, సామవేదానికి అనుబంధింపబడడం వలన ఒక ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. వాక్కు, గీతం, స్వరం... వీటిని సైద్ధాంతికంగా అర్థం చేసుకోవడానికి కచ్చితమైన సాహిత్య సాక్ష్యమున్న తొలి ప్రయత్నమది. అయితే, అవి ఈ గ్రంథ కర్తల పూర్వీకులు– అంటే తొలి వేద ప్రజల – అనుభవించిన ప్రత్యేకార్థంలో వాక్కు, గీతం, స్వరం మాత్రమే. ఈ అంశం చాందోగ్యోపనిషత్తు పట్ల మన మౌలిక దృక్పథాన్ని నిర్ణయిస్తుంది కనుక... ముఖ్యమైనది. తొలి వేద కృతులకూ, చాందోగ్యభావాలకూ, మధ్య వ్యవధి విపరీతమైయుండాలి. ఎంతతక్కువ అనుకున్నా.. అది రెండు సహ స్రాబ్దాలకన్నా ఎక్కువే. ఈ మధ్య కాలంలో వేద ప్రజల భావాలూ, దృక్పథాలూ.. వారి సమాజ స్వరూపంలాగే మౌలికంగా మార్పు చెందాయి. ఉపనిషత్కర్తలు సమాజాభివృద్ధి ఉన్నత దశలో నివశించారు. వారికి ఆధునికమైన ఆధ్యాత్మిక దృష్టీ, తాత్విక భావాలూ.... వచ్చాయి. ఈ పాటలనూ, స్వరాలనూ కూర్చిన వారి పూర్వీకుల పరిస్థితి ఇందుకు భిన్నం. వారు ఆదిమ సమాజంలో ఉండేవారు. వారికి నైరూప్యతాభావనను ఆరోపించడలేం: ఆదిమ ప్రజలకు అలాంటి భావాలు పోసగవనేది అందరెరిగినదే. అదే సందర్భంలో,....ఇప్పటికీ మిగిలి నివసిస్తున్న ఆటవికల జీవి తాలలో

వాక్కు, గీతం, స్వరం నిర్వహిస్తున్న పాత్రకు పోల్చదగ్గ పాత్రనే ఆ పూర్వీకుల జీవితాలలో నిర్వహించి ఉండవచ్చును. అది కఠినానుభవానికి చెందిన విషయం, నైరూప్య భావనకు చెందింది కాదు.

అదే.. ఉపనిషత్కర్తల సజీవానుభవంలో భావం కాజాలదు కదా! అయితే ఆ స్మృతి పూర్తిగా తొలగిపోలేదు. అఖండ మౌలిక సంప్రదాయ ధార వలన అది వారికి చేరింది: వేద సంస్కృతిలోని ఈ 'పట్టుదల' జగద్విదితం. వేరే మాటల్లో... ఉపనిషత్కారులు తాము స్వతహాగా ఆధునిక ఆలోచనా పరులైనప్పటికీ, తమ ప్రమాణాల నుంచే తాము ఆలోచిస్తున్నప్పటికీ,.. ఈ విషయంలో చాలా పురాతన అనుభవాల స్మృతిని మాత్రమే వారు సమర్థించి హేతుబద్ధం చేసారు.

ఈ పురాతనానుభవసారమే అసక్తికరమైనది. ఈ విషయమై మనకు స్పష్టమైన అభిప్రాయం లేకపోతే, ఉపనిషత్తులలోని యోచన మొత్తం గూఢంగానూ... కొన్ని సార్లు అర్థరహితంగానూ కనిపిస్తుంది. మొదట్లో ఒక ప్రత్యేక శక్తి కలవిగా భావించి వేద గీతాలను కూర్చారు వేదపురుషులు, ఛందస్సు స్వరం... అలాగే మాత్రలు, ఉచ్ఛారణా (నొక్కి చెప్పడం, లఘువుగా చెప్పడంలాంటివి)... మొదలైన వాటన్నింటికి అద్భుత మహిమాశక్తులున్నట్లు ఊహించబడింది. ఈ మహిమను వారు కల్పితంగా అంటగట్టుకున్నప్పటికీ, మొదట్లో భౌతిక శక్తికి దోహదకారిగా ఉండేది. అయితే ఉపనిషత్ భావకులకు ఈ దృష్టి ఉండజాలదు: సాముహికా జీవితం మాత్రమే అలాంటి ఊహను వాస్తవమనుకోగలదు. ఆ సందర్భం ఇక్కడ ఇప్పుడు లేదు. అందు తొలినాటి శక్తిని సమర్థించే ఏకైక మార్గం: ఏదో నిగూఢమైన ఆధ్యాత్మిక శక్తిని ఆపాదించడం వలననే సాధ్యం. ఆ క్రమంలో... తొలినాటి శక్తి తద్వ్యతిరేకంగా పరివర్తన చెందింది: భౌతిక శక్తివలె అనుభవమైన విషయం చివరికి ఒక నిగూఢ ఆధ్యాత్మిక భావనగా మారింది.

ఉత్తరోత్తరా జరిగిన ఈ సమర్థన... మనకు ముఖ్యం కాదు. అయితే గీతాల, స్వరాల... శక్తి భావన అవశేషంగా మిగిలిపోయిన సమస్యను నిర్లక్ష్యం చేయలేము.

".... ఆర్థికాభివృద్ధి వలన సామాజిక వ్యవస్థలు నిర్వీర్యమైనప్పుడు వాటికి మతంలో ఆశ్రయం లభిస్తుంది. దానిపట్ల మానవతా చరిత్రకారునికి శ్రద్ధ ఉంటుంది. ఎందుచేతనంటే వదిలి పెట్టబడ్డ ఆచారాలకూ, భ్రష్టమైన భావాలకూ, అరలతో కూడిన భాండాగారం మతం. తమ పూర్వీకులు బ్రతికిన సాధారణ పద్ధతి అదృశ్యమైపోయినప్పటికీ... మనుషులు తమ అభివృద్ధి ఏదోరకంగా తమ పూర్వీకుల ప్రతిష్టమీద ఆధారపడి ఉందనే విశ్వాసానికి అంటి పెట్టుకుని ఉంటారు"-- థాంప్సన్.

అయితే, ఈ ప్రాచీన విశ్వాసాలూ, సంప్రదాయాలూ–జమపడిన–మారిపోయిన పరిస్థితుల్లో వాటికి ఒక నూతన కర్తవ్యం దొరుకుతుంది. అవి ఇక ఏ మాత్రమూ సామూహిక ఉద్వేగాన్ని తీవ్రపరిచే సాధకాలు కావు. వాటిని కొద్దిమందికే చెందిన 'నిగూఢజ్ఞానంగా' ప్రకటిస్తారు. తద్వారా ఆ కొద్దిమందీ మిగిలినవారి కంటే గొప్ప వారై పోతారు. అంటే అవి వర్గాలుగా చీలిపోయిన సమాజంలో, వర్గ ప్రాబల్యానికి సైద్ధాంతికంగా ఆయుధాలైపోతాయి.

ఇక్కడ పరిభాషలు ఆధునికము, కాని ఈ అంశంపై ఉపనిషత్తు సాక్ష్యం సుస్పష్టం.

'ఉపనిషత్' అంటే 'నిగూఢ జ్ఞానం', పాత 'వేదాలం'టే అర్థం 'జ్ఞానం' అని మాత్రమే. అదీ భేదం. ఈ 'నిగూఢ జ్ఞానం' పాలకవర్గపు – క్షత్రియులు లేదా రాజులు – గుత్త సొమ్ము అనీ, ఆపైన వర్గాధిక్యతను ఆపాదించుకోవడానికీ, నిలుపుకోవడానికీ ఈ 'నిగూఢ జ్ఞానం' సాధకమనీ... ఉపనిషత్కులు సగర్వంగా చెప్పుకున్న అంశం. రాజన్యబంధు (రాజులకు మిత్రుడు) ప్రవాహణా జాబాలి, శ్వేతకేతు అరుణేయుని అడిగిన ఐదు ప్రశ్నల... ఉపాఖ్యానంలో ఈ విషయం మనకు తగులుతుంది. ఈ కథ 'బృహదారణ్యకోపనిషత్‌లోనూ, చాందోగ్యోపనిషత్‌లోనూ ఉంది. గౌతముడు (శ్వేతకేతు తండ్రి) రాజప్రసాదానికి వెళ్లి, ఈ ప్రశ్నలకు సమాధానాలు వేసినప్పుడు రాజు ఇలా అంటాడు : "ఓ గౌతమా! నీవు నన్నడిగింది చూస్తే ఈ జ్ఞానం నీకంటే ముందు బ్రాహ్మణులకు చేరలేదనిపిస్తుంది. అందుచేత అన్ని లోకాల్లోనూ పాలన క్షత్రియులకు మాత్రమే చెందుతుంది" ఇది ఆశ్చర్యకరమైన ఒప్పుదల. ఈ సందర్భమందలి జ్ఞానం బ్రాహ్మణులకు కూడా తెలియదంటే, క్షత్రియులు లేదా రాజులు ఆ జ్ఞానాన్ని దత్తం చేసుకున్నారనే అర్థం చేసుకోవాలి. అంతకంటే విభ్రాంతికరమైన మరో అంశముందిక్కడ, తస్మత్ ఉ సర్వేషు – లోకేషు క్షాత్ర శ్యైవ ప్రశాసనమ్ అభూత్ – క్షత్రియులు మాత్రమే ఈ జ్ఞానాన్ని కలిగి ఉంటారు. కనుకనే, వారు అన్ని లోకాలకూ పాలకులు. ఇప్పటి పరిభాషలో దీనికర్థం, ఉపనిషత్ (నిగూఢ జ్ఞానం) అప్పటి పాలక వర్గానికి సైద్ధాంతికమైన ఆయుధం, అయితే రాజుగారు చివరికిచ్చిన సమాచార లేశం సూక్ష్మంగా పరిశీలిస్తే, అది ఇప్పటి ఆటవికుల 'సారవంతపు మహత్తు'లో నిభిడీకృతమైన విశ్వాసాలకు స్థూలంగా మార్మికరూపం.

ఉపనిషదృషులకు తమ పూర్వీకుల నుండి సంక్రమించిన ఆదిమ విశ్వాసాలపై వారి ఆలోచనల స్వభావం ఈ కారణాన కొంచం అర్థం అవుతుంది. సరే ! చాందోగ్యోపనిషత్‌లో, ప్రత్యేకమైన సమస్యను తీసుకుందాం. ఆదిమానుభవాలను మార్మికమొనరించే ప్రక్రియ గ్రంథమంతటా సమానంగాలేదన్న అంశాన్ని గమనించాలి. మొదటి అధ్యాయాల్లో అది మరికొంచెం తక్కువే. మన పాఠం వాటిల్లోనే ఉంది.

చాందోగ్యోపనిషత్తు నిర్మాణం కొంచెం విలక్షణమైనది. అది ఒక విషయాన్ని మాత్రమే చర్చించిన ఒద్దికైన గ్రంథం కాదు. అది అనేక విషయాలపై అస్తవ్యస్తంగా కూర్చిన చర్చల

సంపుటం. ఈ చర్చలు అకస్మాత్తుగా ప్రారంభం కావడం, అంతే అకస్మాత్తుగా ముగిసిపోవడం చూస్తే, ఇవన్నీ మొదట్లో విడి పూసలనీ, తర్వాత అంత బలమైన సూత్రం లేకుండా కూర్చబడ్డాయనీ అనిపిస్తుంది.

కాని, మొదటి రెండు అధ్యాయాలనిండా, ఒక స్పష్టమైన భావధార ప్రవహిస్తుంది. అది... వాక్కు, గీతం, స్వరం... అనే విషయం. రెండో అధ్యాయం తర్వాత, ఉపనిషత్‌లో ఈ విషయం... అడపాదడపా... అదికూడా యాదృచ్ఛికంగా వస్తుంది. ఈ ఉపనిషత్‌లోని మొదటి రెండు అధ్యాయాలే... దీని సారాంశమని మనకు తోస్తుంది. మిగతా అధ్యాయాలు తర్వాత చేర్చినవి కావచ్చు. అందుకనే... మొదటి రెండు అధ్యాయాల్లోనే ప్రాచీనానుభవాల స్మృతి స్వల్ప వికృతిలో మిగిలి ఉండవచ్చును.

ఈ ఉపనిషత్‌లో మరికొన్ని అధ్యాయాలకు కూడా సామాన్యమైన విషయముందని ప్రతివాదం చేయవచ్చును. నిజమైన ఆత్మస్వభావానికి సంబంధించిన విషయం : ఈ వస్తు విషయమే ఉపనిషత్భావాలకు మొత్తంగా ప్రాతినిధ్యం వహించే ప్రత్యేక లక్షణమని అందరూ అనుకుంటారు. చాందోగ్యోపనిషత్‌లో ఎక్కువ సందర్భాలలోనే కాక, ఎక్కువ శ్రద్ధతోనూ, లోతైన ఆసక్తితోనూ ఈ విషయ చర్చ జరిగింది.

నిజమే. అయితే ఈ విషయం చాందోగ్యోపనిషత్ ప్రత్యేక లక్షణం కాదు. సామవేదానికి అనుబంధించబడిన పరిస్థితి రీత్యా దీనికి సందర్భ శుద్ధి కూడా లేదు. ఇంకా, చాందోగ్యోపనిషత్ 'పేరు'కు ఉన్న ప్రత్యేకార్థాన్ని విస్మరించకూడదు. ఉపనిషత్తుల పేరులకూ, అందులో చర్చించిన విషయాలకూ సంబంధం సర్వత్రా ఉండకపోయినా, సందర్భ శుద్ధి ఉన్నప్పుడు దాన్ని వదిలిపెట్టరాదు. 'చాందోగ్య' అనేదాన్ని 'చందోగ' నుండి సాధించారు. "చందోగ" అంటే 'ఛంద్‌స్ – పాటగాడు' 'ఛందస్'లో "మహత్తు – గీతం" 'పవిత్ర గ్రంథం' 'ఛందస్సు' (పద్య... లక్షణం) అని అన్ని అర్థాలనూ కలుపుకుంటుంది. ఈ పదానికి మౌలికార్థం "లయానుబద్ధమైన వాక్కు" అయి ఉండాలి. 'ఛంద్' ధాతువుకు సంబంధించిందై ఉండాలి. 'ఛంద్' అంటే 'ఆహ్లాదపరచు' "తృప్తిపరచు" "సంతసింపజేయు" – వింటర్ నిట్జ్.

ఈ గ్రంథకర్తలు దానిలో ప్రాథమికంగా నిజమైన ఆత్మకు సంబంధించిన సమస్యలే చర్చించాలని భావిస్తే, 'చాందోగ్య' అని పేరు పెట్టడానికి హేతువు లేదు. అలాగే, వారు ప్రాథమికంగా మహత్తు – గీతాలకు సంబంధించిన సమస్యలనే చర్చించదలుచుకుంటే, తొలి అధ్యాయాలే సారాంశంగా ఉంటాయి. అందుచేత అవి మిగతావాటికన్నా ప్రాచీనం. అందుచేత ఆదిమ ప్రజలను గురించి మనకిదివరకే తెలిసిన పరిజ్ఞానం వెలుగులోనే వాటిని గురించి మరింత స్పష్టంగా తెలుసుకోగలుగుతాం. ఇందులో ఆశ్చర్యం లేదు.

## వాంఛ - గీతం

ఈ ఉపనిషత్‌లోని తొలి అధ్యాయాల్లో చర్చించిన అన్ని అంశాలనూ వివరించడం మన లక్ష్యం దృష్ట్యా అనవసరం. మన పాఠానికి ప్రత్యక్షంగా ప్రమేయమున్న విషయం మీదే మనం కేంద్రీకరిద్దాం. శునకాల శ్లోక పఠన సన్నివేశం వ్యంగ్య లక్ష్యానికి భిన్నమైనదే కాక,... ఉపనిషత్కర్తలు వేద పఠనంలోని సారాంశంగా భావించిన దాన్నే ఆవిష్కరించదలుచుకున్నారనేదే మన ప్రతిపాదన.

"మానవుని సారం... వాక్కు

వాక్ సారం... ఋక్ (రుక్కు)

ఋక్ సారం... సామం (స్వరం)

సామం సారం... 'ఉద్గీథ' (గంభీర ఉచ్చాటన) – చాందోగ్య ఉపనిషత్ అంటే... పద్యం, కాని వాక్కు లేదు, స్వరం (శ్రావ్యత) లేని పద్యం లేదు. బిగ్గరగా పాడందే... అది స్వరం కాదు... ఇవన్నీ మానవుని ఉనికికి ప్రాణావసరాలు.

వాక్, శ్లోక, గీతం... ఇక్కడ భావించినట్లుగానే ప్రాచీన వైదిక చింతలో నిరంతర లక్షణం.

"ఏమైనా, వైదిక మతవేత్తలు స్వరం పద్యం నుంచి వచ్చిందంటూ స్వరానికీ – పద్యానికీ ఉన్న సంబంధాన్ని ఊహిస్తారు. అందుచేత పద్యా (రుక్)న్ని 'యోని' అంటారు. దానినుంచి స్వరం వచ్చింది.

ఇది ఆధునిక విద్వాంసులకు విచిత్రంగానే ఉంటుంది. ఎందుచేతనంటే పద్యానికీ స్వరానికీ ఉన్న సంబంధం విషయంలో ప్రస్తుతమున్న భావాలకు ఇది భిన్నం. మనం మన పాత భాగంలోని 'శునకాల'ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించిన మార్గంలోనే దీన్నికూడా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే... ఇది మనకేమీ వింతగా తోచదు. (అంటే ఆదిమ ప్రజలను గురించిన జ్ఞానం వెలుగులో చూస్తే).

"ఆటవికుల మామూలు సంభాషణలో గాఢమైన, స్పష్టమైన లయ, శ్రావ్య స్థాయి ఉంటాయి. కొన్ని భాషల్లో ఉచ్చారణ సంగీతమయంగా, ఎంతో అర్థవంతంగా ఉంటుంది. అందుకే పాట కట్టినప్పుడు పలికిన మాటల్లోని సహజమైన శ్రావ్యతనుంచే రాగం – స్వరం – కూర్చుతారు." – థాంప్సన్.

అంటే... ఆదిమ ప్రజల్లో 'సామముల'కు 'రుక్కు'లే 'యోనులు.' లేక 'సామం' కాకుండా 'రుక్కు' ఉండదు – 'రుక్కు' కాని 'వాక్కు' ఉండనట్లే. "అలా... కవిత్వంతో (పద్యంతో) మాత్రమే

కలిపి ఊహించే స్థాయిలో ఈ ఆటవికుల సామాన్య భాషణం లయాత్మకం, శ్రావ్యం. వారి సామాన్య భాష కవిత్వమయితే... వారి కవిత్వం అద్భుతం. వారికి తెలిసిన కవిత పాట మాత్రమే. వారి గానం ఇంచుమించు ఎల్లప్పుడూ... శారీరక చలనంతో కలిసి ఉంటుంది. దాన్ని బాహ్య ప్రపంచంలో మార్పు తీసుకువచ్చే పద్ధతిలో రూపొందించుతారు. – వాస్తవికతపై భ్రమను రుద్దడం". చివరి అంశం ప్రాచీన వేదపఠనపు మరో ప్రసిద్ధ లక్షణాన్ని వెలికి తీస్తుంది. ఈ గీతాలన్నీ... నిర్ధిష్టమైన హస్త చలనాల సహకారంతో సాగాలట.

గానం చేసేటప్పుడు, "పూజారులు తమ చేతుల – వేళ్ల కదలికల ద్వారా ఆరోహనావరోహణలను... సూచిస్తారు."

బర్నెల్ తన ఆర్షేయ బ్రాహ్మణానికి – సామవేదంలో భాగం – పరిచయం రాస్తూ, వేద పఠనంలోని విలక్షణతను గురించి చర్చించ ప్రయత్నించాడు. అయినా సరే ! అందులోని వివరాల విచిత్రమైన అర్థరాహిత్యాన్ని చూసి ఆశ్చర్యపడక తప్పదు. ఎందుకనంటే, ఆదిమభాషణంలోని అంగికాభినయ దృష్ట్యా వీటిని అర్థం చేసుకునే సక్రమ ప్రయత్నాలేమీ జరగలేదు. "ఆటవికులు, పిల్లల వలెనే మాట్లాడేటప్పుడు అభినయిస్తారు. ఆ అభినయ లక్ష్యం ఇతరులు అర్థం చేసుకోవడానికి, సహాయపడడం మాత్రమే కాదు... వారు తమలో తాము మాట్లాడుకునేటప్పుడు కూడా అభినయిస్తారు. మనకు వాక్కు ప్రాథమికం, అభినయం ద్వితీయం. అంటే మన తొలి పూర్వీకుల విషయంలో కూడా అదే యదార్థమని కాదు." – థాంప్సన్.

మళ్లీ చాందోగ్యోపనిషత్తు వద్దకు పోదాం. ప్రాచీన సమాజంలో వాక్కు, పద్యం, సంగీతం... ఆదిమ సంకీర్ణ స్థితిలో ఉన్నట్టు గమనించాం. అప్పటికి అవి ఇంకా ఈ పరస్పర కార్యరూపాల వైవిధ్యంలో... కలిసిపోవాల్సే ఉంది. సంకీర్ణత బతికి బట్టకట్టేది మహత్తులోనే, కోరుకున్న వాస్తవం లభించినట్లు భ్రమించే సంకేతము (శిల్పం). అంటే మహత్తుకు లక్ష్య సారాంశం కోరిక – ఆ కోరిక 'అద్భుతంగా' నెరవేరడం. చాందోగ్యోపనిషత్కారులకు వాంఛా పరిపూర్తికి, భిన్నమైన లక్ష్యంగల గీతం గురించి తెలుసునని మనం ఆశించం. అలాగే కోరికలు నెరవేర్చేవానికి భిన్నమైన పాటగాడిని కూడా వారెరగరు. ఆ కోరిక ప్రాథమికంగా ఆహార సంబంధమే – మన పాటలు పాడే శునకాల మాదిరిగా.

అప్పుడు ఊపిరి (ప్రాణం) తన కొరకే ఆహారాన్ని – గానం చేసింది, తినబడిన ఆహారమేదైనా, అదే తినింది. ఇందుమీద, ఒకటి స్థిరమైంది. ఆ దేవతలన్నారు, "నిజంగా ఆహారం వలే విస్తరించిన... ఈ లోకం, నీ సొంతానికే గానం చేశావు (నీ కోసమే గానం చేసి సొంతం చేసుకున్న) మిగిలిన భాగమైనా మాకు ప్రసాదించుము."

ఇది బృహదారణ్యకోపనిషత్‌లోనిది. అది ఒక కథా సందర్భంలో వస్తుంది. ఆ కథ చాందోగ్యోపనిషత్‌లో కూడా ఉంది. బృహదారణ్యకంలోని కథారూపం ప్రాచీనం అని డ్యుస్సెన్

ఊహించాడు. అది సందేహమే. చాందోగ్యోపనిషత్‌లో ఉద్గీథ కేంద్ర విషయం కాబట్టి... అది చందోగ్యోపనిషత్‌లోనే పొందికగా ఉంటుంది. ఆపైన వాంఛ పరిపూర్తికి గీతం అనే భావం చాందోగ్యోపనిషత్‌లో  నిరంతర విషయం. కొన్ని ఉదాహరణలు : కాంక్షా గానమొనర్చేవాడు – తద్విధంగా తెలుసుకున్నవాడై – అక్షరాన్ని ఉద్గీథగా పవిత్రంగా భావిస్తాడు.

ఉద్గీథా గాయకుడు ఇలా అనవచ్చు : "గానమొనరించి మీకేమి సాధించగలను?" గానమొనర్చి, వాంఛలను సఫలం చేయగల నాథుడతడే, ఇది తెలుసుకున్న గాయకుడు 'సామ' గానం చేస్తాడు. "గానమొనర్చి దేవతలకు అమర్త్యత్వాన్ని సాధించెదను గాక" – అవును ! గానమొనర్చి దానిని సాధించవలెను. "గానమొనర్చి పితరులకు అర్ఘ్యాన్ని, ప్రజలకు ఆశను, పశువులకు ఆహార జలాలనూ, యజ్ఞకర్తకు స్వర్గాన్ని, నాకై ఆహారాన్ని... సాధించెదను గాక!" "ఈ విషయాలను ధ్యానం చేస్తూ స్తోత్రాన్ని జాగ్రత్తగా పఠించాలి."

ఏది 'ఋక్కు'? ఏది 'సామం'? ఏది "ఉద్గీథ" అని చర్చ జరిగింది. ఋక్కు అంటే వాక్కు, సామం అంటే ఊపిరి (ప్రాణం). ఉద్గీథ అంటే ఓం (అనే అక్షరం) – అవును – ఇవి వాస్తవమైన జంట : వాక్కు, ఊపిరి, ఋక్కు, సామం.

ఈ జంటను 'ఓం' కారానికి జత పరచాలి.

నిజంగా ఈ జంట ఐక్యమైతే... నిజంగా పరస్పర వాంఛ పూర్తి సాధ్యపడుతుంది.

అందువలన వాంఛలను వాస్తవ పరచగలవాడు ఈ జ్ఞానంతో ఉద్గీథను పూజనీయంగా, అక్షరంగా భావిస్తాడు. ఈ అక్షరమంటే అనుజ్ఞ, అంగీకారం తెలపడానికి "ఓం" అని పలుకుతారు. ఇదే పరిపూర్తి... అంగీకారమే (అనుజ్ఞ)... వగైరాలు.

ఈ విషయాలన్నింటి గురించీ... ఉపనిషత్కారులు ఆలోచించి ఉన్నట్లైతే, మన ఆధునిక విధ్వాంసులకు, మన పాఠంలోని శునకాలు వైదిక పండితులను ఎగతాళి చేస్తున్నట్లు భావించే అధికారం లేదు. వారి పాట (గీతం) ఆహార వాంఛను తీర్చుకోవడానికి ఉద్దేశించబడింది. ఇందుకు విరుద్ధంగా మరో అంశమేమిటంటే : వారు వారి పూర్వీకులతో కాలవ్యవధి రీత్యా... ఎంత దూరంగా ఉన్నప్పటికీ, తమ పూర్వీకుల మాదిరిగానే వారు కూడా గీతాల (పాటల) మహచ్ఛక్తిని ప్రబలంగా విశ్వసించారు. అందుచేతనే వారికి కోరికలు తీర్చే లక్ష్యం లేని పాట తెలియదు.

ఈ కోరిక ప్రాథమికంగా ఆహార సంబంధమే. కాని, ఆ కోరిక... వర్షం రప్పించడానికో, పశు సంపదను వృద్ధి చేయడానికో, అగ్నిని ప్రజ్వలింపజేయడానికో కావచ్చును.

**కొన్ని ఉదాహరణలు :**

మొదట వచ్చే వాయువు – హింకర

మబ్బు ఏర్పడింది – ప్రస్తావ

వర్షం... – అది ఉద్గీథ

మెరుపులు, ఉరుములు – అది ప్రతీహార

అది ఉద్ధరిస్తుంది – అది నిధన

అతనికై వర్షం, అతడే వర్షాన్ని రప్పించాడు, దానిని ఈ విధంగా తెలిసిన అతడు వర్షోద్ధతిలో పంచపద 'సామాన్ని' కీర్తిస్తాడు. హింకర, ప్రస్తావ... మొదలైనవి పంచపద పదసామంలో ఐదు భాగాలని మనకు తెలుసు. వర్షం తెప్పించే మహత్తులో నిభిడీకృతమైన విశ్వాసం ఇంకా ఇప్పటికీ ఆటవికులలో శుద్ధంగా మిగిలి ఉంది. పశువృద్ధి వాంఛా పరిపూర్తికై సామం యొక్క మహిమా సామర్థ్యం గురించిన విశ్వాసం ఈ ఉదాహరణ తెలియజేస్తుంది.

జంతు విషయంగా... పంచదశాసామంపై భక్తి ఉండాలి.

మేషములు – హింకర,

గొర్రెలు – ప్రస్తాన

గోవులు – ఉద్గీథ

గుర్రాలు – ప్రతీహార

మానవుడు – నిధన.

జంతువులతని ఆధీనమైనప్పుడు... అతనికి జంతు సంపద ఏర్పడుతుంది. ఇదే అదని తెలిసినవాడు జంతువుల పంచపద సామాన్ని భక్తితో చూస్తాడు.

ఈ ఊహాశకలంలో 'స్వేచ్ఛాంశ' ముంది. ప్రాచీనానుభవంపై తర్వాతి కాలపు ఊహలు కనక ఇందులో తరచు యధేచ్ఛ ఉంటుంది. దాన్నలా ఉండనిద్దాం. ఈ ఊహకు మూలమైన ప్రాచీన విశ్వాసం మనకు ముఖ్యం.

ఎక్కువ ఉదాహరణలు అవసరం లేదు. వింటర్నిట్జ్ 'సామవేదం'లోని క్రతు గ్రంథంవైపు మనలో ఆసక్తిరేపాడు. అది మహత్తుకు సంబంధించిన సూచనాగ్రంథం. మహిమా లక్ష్యాలకోసం వివిధ 'సామముల'నుపయోగించే విధానాన్ని అది బోధిస్తుంది. అయితే వేద పండితులు 'సామము'లను మహిమార్థంగా ఉపయోగించడాన్ని... సృష్టించి ఉండజాలరని మాత్రం మన

పండితుడు స్పష్టంగా చెప్పలేదు. అలాంటి గ్రంథకర్తలు... తర తరాల నుంచి వారసత్వంగా వచ్చిన నమ్మకాలకు హేతువులు కల్పించడానికి మాత్రమే ప్రయత్నించారు.

## వాక్కు, ఛందస్సు, మహిమ

ఆహారం కోసం గానం చేయడమనే భావమే మన సున్నితమైన మేధావులకు మొరటుగా తోచినందువలననే, గానం చేసే శునకాల సన్నివేశాన్ని సులువుగా వ్యంగ్యార్థంలో తీసుకున్నారు. అది మొరటుగానే ఉంది. అయితే మన పండితుల పొరపాటేమిటంటే, ఉపనిషత్కర్తల పూర్వీకులను నాగరీకులని – వారు నిజంగా కాదు – భావించడం. వారు కరువు, మృత్యువు నశింపులంటే భయపడిన క్షుధార్తులైన ఆటవికులు మాత్రమే. అందుచేతనే వారు వాక్కు, ఛందస్సు, గీతం, స్వరం... ఏదైనా ఆకలి తీర్చే మహిమ కలదే.

భాష పుట్టుకను గురించి బృహదారణ్యకోపనిషత్... ఈ క్రింది కథ చెపుతుంది. "ఆదిలో... ఏదీలేదు, ఇది (ప్రపంచం) మరణంతో, ఆకలితో కప్పబడి ఉంది. – ఆకలే మరణం.

అతని కోరిక, "నా రెండో ఆత్మ ఉత్పన్నమైతే!" అతడు – మరణం, ఆకలి – వాక్కుతో మనస్సు రమించడం వలన శుక్లమైనదే సంవత్సరం. అంతకు మునుపు సంవత్సరం లేదు. సంవత్సరానికి సమానమైన కాలం (తనను) తాను భరించాడు. ఆ వ్యవధి అనంతరం అతడు ప్రసవించాడు. అతను జన్మించినప్పుడు మృత్యువు నోరు తెరిచింది అతన్ని మింగడానికి. అతడు 'భాన్' అని కేక పెట్టాడు. అదే వాక్కయింది. అతడనుకున్నాడు "తప్పకుండా అతన్ని నిరోధించాలి. కొద్ది ఆహారాన్ని నేను ఉంచుకుంటాను..." ఆ వాక్కుతో, ఆ ఆత్మతో (?) అతడు ఇక్కడున్న ప్రపంచాన్నంతా తీసుకువచ్చాడు. (సృష్టించాడు) : గీతాలు (రుక్కులు), సూత్రాలు (యజులు) గానాలు (సామములు) ఛందస్సు, క్రతువులు (యజ్ఞాలు) మానవులు, జంతువులు, తాను సృష్టించిన వాటిని భుజించనారంభించాడు. నిజంగానే అతడన్నీ భుజించుతాడు (అద్) : అదే అదితికున్న అదితి లక్షణం. ఈ అదితికున్న అదితి – లక్షణాన్ని ఎరిగినవాడు ఇక్కడి ప్రతిదాన్నీ భుజిస్తాడు. ప్రతిదీ అతనికాహారమౌతుంది – "

అందుచేత ఉపనిషత్కారులు మొరటైన ఆహార భావన అంటే చిరాకుపడరు. అదే ఉపనిషత్తు ఇలా అంది : "ఈ ప్రపంచమంతా వాస్తవానికి ఆహారమూ, భోక్త... మాత్రమే" తిరిగి "సామం బలమెరిగినవానికి ఆధారం లభిస్తుంది. శబ్దము (కంఠ స్వరం) అందుకు నిజంగా ఆధారమే, శబ్దంపై ఆధారపడినప్పుడే ఊపిరి (ప్రాణం) గానం చేస్తుంది. కాని ఆహారం మీదనే అది ఆధారపడిందని కొందరంటారు".

ఈ పై వివరాలలో మర్మం, గూఢత ఎంత ఉన్నప్పటికీ, ఆహారానికీ, వాక్కుకూ ఉన్న సంబంధం మాత్రం పూర్తిగా మరిచిపోలేదని మనం గుర్తుంచుకోవలసిన ఆవశ్యకత ఉంది.

వాక్కు (భాష) స్వరంలాగే మహత్పూర్వకంగా, ఆహార సంపాదనకు సహాయకారిగా భావించబడింది. వాక్కుకున్న ఈ మహత్తు శక్తిని 'హేత్వీకరించడానికే' చాందోగ్యోపనిషత్కారులు ప్రయత్నిస్తున్నారు.

"వాక్కు అతనికి క్షీరాన్ని అంటే వాక్షీరాన్నే ఇస్తుంది. అతడు ఆహారపరంగా సంపన్నుడౌతాడు, ఆహార భోక్త అవుతాడు... ఆ విధంగా సామముల మార్మికార్థాన్ని (ఉపనిషత్తును) తెలుసుకుంటాడు... అవును, మార్మికార్థాన్నెరిగినవాడే!"

చాందోగ్యంలో అది చెదురువాటుగా తగిలే ఆలోచన కాదు. తిరిగి తిరిగి కనబడుతుంది.

"వాక్కు క్షీరాన్నిస్తుంది – అదే వాక్షీరాన్నే – అతడు ఆహారపరంగా సంపన్నుడూ, భోక్తా అవుతాడు... అది ఎరిగిన అతడు సప్తపద 'సామా'నికి ప్రణమిల్లుతాడు".

వాక్కు తిరిగి క్షీరాన్నిస్తుంది. అంటే వాక్షీరాన్ని. అతడు ఆహారపరంగా సంపన్నుడూ, భోక్తా అవుతాడు. దీన్నెరిగినవాడు "ఉద్గీథలోని మూడు మాత్రలకూ – 'ఉధ్, గీ, థ' – ప్రణమిల్లుతాడు" –

ఏమైనా, చాందోగ్యకర్తలు ఒక విషయం స్పష్టం చేశారు : తాము చర్చించే వాక్కు... సామాన్యవాక్కు కాదు. అది లయలున్న ఆటవికుల వాక్కు... కనక అది ఛందో బద్ధం. వాస్తవానికి వారి వాక్కేదీ ఛందస్సు లేకుండా ఉండదు. మనం ఊహించగలిగినట్లే, ఛందస్సుకొక మౌలిక కర్తవ్యముంటుంది. చాందోగ్యోపనిషత్ ఇలా అంటుంది : "దేవతలకు మరణభయం కలిగినప్పుడు వారు మూడు వేదాలవలన రక్షణ కోరారు. తమను తాము 'ఛందస్సుల'తోను కప్పుకున్నారు (అచ్చాదయాన్), వారు కప్పుకున్నందువలననే వాటికి 'ఛందస్సు'లని పేరు వచ్చింది".

కాబట్టి దేవతలు – వేద ప్రజల పూర్వీకులు – మృత్యువంటే భయపడ్డారన్నమాట. మృత్యువంటే, ఆకలి అని బృహదారణ్యకోపనిషత్ చెప్పింది. వారు ఛందస్సుల రక్షణ కోరారు. ఆకలికీ, అంతానికీ... వ్యతిరేకంగా ఛందస్సులు రక్షణ ఇవ్వగల మార్గమొక్కటే. అది ఆహారపు ఆధారాలను (మూలాలను) ఆవిష్కరించడమే. అంటే ఆహార సంపాదనా కార్యంలో ఛందస్సుకు సంబంధమున్నదన్న మాట. ఈ స్మృతి లీలగా ఉండిపోవడం తర్వాతి కాలపు వేద గ్రంథాలలో (వివిధ పద్ధతుల్లో) చూడవచ్చును. తొలి వేద ఛందస్సులలో ప్రసిద్ధమైనవి : గాయత్రి, ఉష్ణిః, బృహతి, పంక్తి మొదలైనవి. ఐతరేయ బ్రాహ్మణం ఇలా చెపుతుంది : "గాయత్రి" పద్యాలను ఆమంత్రణంగా ప్రయోగించాలి. కాంతిని లేదా దీప్తిని కాంక్షించేవాడు, 'స్విష్టాకృత్' పద్యాలను సమర్పించాలి. అలా తెలిసినవాడు ఆ విధంగా 'గాయత్రి పద్యాలను ఉపయోగిస్తే కాంతిమంతడూ, దీప్తి మంతుడూ అవుతాడు "గాయత్రి"... దీప్తి, కాంతి, 'ఉష్ణిః' పద్యాలను జీవనం కోరేవాడు ప్రయోగించాలి. "ఉష్ణిః"... జీవనమే, అది తెలిసి ప్రయోగించనివాడు జీవితాన్నంతా పొందుతాడు. స్వర్గవాంఛ కలవాడు 'అనుష్టుప్' శ్లోకాలను పఠించాలి... కీర్తి

సంపదలనాశించేవాడు 'బృహతి' శ్లోకాలను పఠించాలి. యజ్ఞం చేసేవాడు "పంక్తి" శ్లోకాలను పఠించాలి. బలం కావాలనుకున్నవాడు 'త్రిశుభ్' శ్లోకాలు పఠించాలి : 'త్రిశుభ్' అంటే శక్తి, సామర్థ్యం, బలం, అది తెలిసి 'త్రిశుభ్' శ్లోకాలను పఠించినవానికి శక్తి, సామర్థ్యం, బలం... లభిస్తాయి. 'జగతి' శ్లోకాలను పశువులను కావలసినవాడు పఠించాలి : పశువులకు 'జగతి' శ్లోకాలతో బంధం ఉంది. అది ఎరిగి 'జగతి' శ్లోకాలను పఠించిన వానికి పశువులు లభిస్తాయి. సరైన ఆహారం కోరుకున్నవాడు 'విరజ్' శ్లోకాలను పఠించాలి : 'విరజ్' అంటే ఆహారం, ఎంతో (చాలా) ఆహారం కలవాడే ఈ లోకంలో అతిదివ్యమైనవాడు – మహిమకలవాడు : 'విరజ్' అనే పేరు అందుకే వచ్చింది. (దివ్యమైన)."

వైదిక సాహిత్యంలో ఇలాంటి పాఠభాగాలు ఎన్నో సులభంగా కనబడతాయి. ఇంకా అనవసరం. వాక్కు, సామం... ల లాగే ఛందస్సు కూడా ఏదో వాంఛా పరిపూర్తికై పనికి వచ్చేదనేదే ఇక్కడి సంగతి. తర్వాతి భావాలలో ఒక ప్రత్యేక ఛందస్సుకూ, ప్రత్యేక వాఛకూ ఉన్న సంబంధం పూర్తిగా యాదృచ్ఛికం (యథేచ్ఛగా వాడింది) కావచ్చు. అంటే ఛందస్సుకు కూడా మహత్తు శక్తి కలదని భావించారన్నమాట. కనక ఒకానొక వాంఛను తృప్తిపరచడానికి ఒక గీతాన్ని సృష్టించే నిజమైనవేద మార్గానికి, మన (శ్లోకాలను) పఠించే శునకాలు ఎంతో దూరం కాదు.

## ఋగ్వేదంలో గీతం

ఋగ్వేదంలోని గీతాల పాత్రను విశ్లేషిస్తే, చాందోగ్యోపనిషత్‌లోని శ్లోకాలను పఠించే శునకాలు కచ్చితంగా వేద మార్గాన్ననుసరిస్తునట్లు – మరో మాటలో, బకదాల్భ్యుని ఎదుట వేదర్షుల ప్రాచీన విజ్ఞానాన్ని నిలపడానికి సృష్టించబడినట్లు – ఇంకా స్పష్టపడుతుంది.

ఋగ్వేదంలోని ఆరో మండలంలో ఇంద్రుణ్ని సంబోధించిన ఈ భాగం చూద్దాం. "– తర్వాత... గణం మధ్య మాతో పాటు ఆసీనుడవై, మేము ఆహారం పొందాలని పాడుము – పాడుతున్న మాతో."

గణం అంటే సమూహం. అంటే..., ఆటవిక సమాజంలోని సామూహికత అని ప్రత్యేకార్థం. కనక గణం మధ్యనే నివసిస్తూ తొలి వేద కవులు ఆహారాన్ని అభిలషించారు. అయితే, దాన్ని సంపాదించడానికి వారు సామూహిక గీతాన్ని ఆలపిస్తున్నారు. ఇంద్రుణ్ని తమ గీతంలో గొంతు కలపవలసిందిగా అభ్యర్థిస్తున్నారు. ఇది గమనించదగ్గ విశేషం : చాందోగ్యోపనిషత్‌లో మన శునకాలు చేసిందీ, పలికిందీ ఇదే : 'అన్నం నో భగవన్ ఆగాయతు అశనం ఉద్ ఇతి'.

ఋగ్వేదంలోని అతి ప్రాచీన భాగం 2వ మండలం నుంచి, 7వ మండలం వరకు అని సామాన్యాంగీకారం. ఊహించ గలిగినట్లే, ఆహారం – కోసం – గీతం అనే భావం ఈ భాగాల్లోనే పదేపదే కనబడుతుంది. కొన్ని ఉదాహరణలు :

“(ఓ అగ్నీ) ఈ గీతాల ద్వారా నీవు మాకు ఆహారంతో సహా సంపదనివ్వు : మా సేవ (శ్రమ)తో నిన్ను సేవించుకుంటాం”.

“ఇంద్రుడు అంగీరసులలో వాంఛలను రేపెట్టి, సంతృప్తిపరచడానికి ఆహారం కొరకై గీతాలలో చెప్పబడిందని”

“వాంఛలున్న రుషులు యజ్ఞం ద్వారా ఉదకదాత (ఇంద్రుడు) నుంచి గానం చేసే గోవులను పొందారు, ఆ గోవులను రక్షించుకోవడానికి సుస్వర సంగీతంతో (కలిసి కూర్చుని) ఇంద్రుణ్ని కీర్తించారు.”

“గాన మొనరించువారు నా చుట్టూ (ఇంద్రుని చుట్టూ) అన్ని రుతువులలోను ఆహారాన్ని గురించి చెపుతూ... సామగాయకులవలె 'గాయత్రి 'త్రిశుభ్' శ్లోకాలను పఠించి శ్రోతలనానంద పరుస్తారు.”

“గాయకుల గానం వలన అగ్ని విజృంభించాడు.”

“అగ్ని వైశ్వానరుని... మనస్సులో ఊహించుకుని... ఆహార, సంపదల నభిలషించి, అగ్ని వైశ్వానరుని మనస్సున నిలుపుకుని యజ్ఞంలో గీతాల (పాటల) ద్వారా ఆవాహన చేసెదము. ఉదార మూర్తియైన అతడు రథంలో యజ్ఞ స్థలాలకు వస్తాడు.”

ఇంకా ఎన్నో ఇలాంటి ఉదాహరణలను రుగ్వేద ప్రాచీన భాగం నుంచి చూపవచ్చును. అన్నింటిలోనూ గీతం అంటే నిశ్చయంగా సామూహిక గీతమే. పైగా, అన్ని గీతాలూ భౌతిక వాంఛలను పరిపూర్ణమొనర్చుటకై ఉద్దేశించబడినవే – ఎక్కువగా ఆహార వాంఛ.

రుగ్వేదంలోని తొలి భాగానికీ, తాజా భాగానికీ మధ్య గడచిన దీర్ఘకాలంలో వేద ప్రజల జీవితాలలో ఎన్నో మార్పులు సంభవించినప్పటికీ, ఆహారం గీతం అనే భావంలో మాత్రం అదృశ్యం కాకపోవడం... గమనించాల్సిన విషయం. బహుశా, గీతాల మహత్తు – శక్తికి సంబంధించిన స్మృతి తర్వాతి కాలపు కవులకు అందిందని భావించవచ్చును. దానినే వారు... కొన్ని సందర్భాలలో కాలానుగుణంగా మార్పులు చేసినప్పటికీ... అనుకరిస్తున్నారని చెప్పుకోవచ్చును.

రుగ్వేదంలోని ఉత్తర భాగంలో – తర్వాతి భాగంలో – ఉదాహరణలు కొన్ని : “కుశదర్భలపై హవనమున్నది. మా కోరికలు తీర్చడానికి గీతాలు నీవు (అశ్వినులు) వచ్చేటట్లు చేస్తాయి.

“ఆపైన వో అశ్వీనులారా! వర్షదాతలారా! అక్కడక్కడ కుశదర్భలు చిమ్మబడిన (చల్లబడిన) ఈ గృహములో ఉన్న మమ్ము నీ దీప్తివంతమైన శరీరపు గీతం మమ్మల్ని తృప్తిపరుస్తుంది, అది మాకు వర్షాన్నిస్తుంది. నీ ప్రసాదం మానవుని సంతోషపెడుతుంది – గోవు క్షీరమొసగినట్లుగా.” “ఓ మరుత్తులారా! ఈ స్తోత్రము నీకే! నిన్ను పూజించే, నిన్ను కరిగించే (నీ దయతో) మాకు ఈ గీతం లభించింది, తద్వారా ఆహారం, విజయఫలంగా, శరీరానికై (లభించుగాక!).

ఈ చివరి గీతం రుగ్వేదంలోని మొదటి మండలంలో నాలుగు సార్లు వస్తుంది. అంటే దీనికెంతో ప్రాముఖ్యత కలదన్నమాట. అయితే, ఇందులో మహత్తు – నిమిత్తము కొత్తగా చేరిన ప్రార్థనా – నిమిత్తంతో కలిసి ఉండడం చూడొచ్చు. ఇందుకు కారణం, మారిన సామాజిక పరిస్థితుల్లో లభించవచ్చును. (అది తర్వాతి కాలంలో సృష్టించబడిందన్నమాట). అయితే, మహత్తు – నిమిత్తం మాత్రం పూర్తిగా అదృశ్యం కాలేదని – అవి వేదక్రతుల పూర్వభాగమైనప్పటికీ – స్పష్టంగా బోధపడుతుంది. గీతం ఇంకా వాంఛా పరిపూరిక సాధనంగానే చూడబడుతోంది. శాయనుడు ఈ ఆఖరి శ్లోకంపై వ్యాఖ్యానిస్తూ ఈ అంశాన్ని స్పష్టపరిచాడు, మరుత్తునకు స్తోత్రం సమర్పించి, కావలసిన దానిని కోరడం జరిగింది.

అయితే ఇక్కడ ప్రత్యేకంగా గుర్తించాల్సింది. ఆ కోరికలో ఉన్న పచ్చి భౌతిక స్వభావం – ఆధ్యాత్మిక విలువలకు చెందిన లక్షణమేదీ – స్వర్గ సౌఖ్యం, మోక్షం వగైరా – ఇందులో లేదు. అది ఆహారానికి సంబంధించిన కోరిక మాత్రమే. ఆహారమంటే శరీర పోషణకు మాత్రమే.

ఇది సహజ భౌతికవాదమని తెలుస్తూనే ఉంది. లేదంటే ఆదిమ ప్రజల, ఆదిమ భౌతికవాదం, తర్వాతి కాలపు వేదకవులు కూడా అంతకుమించి ఎదగలేదు. మన ఉపనిషత్పూర్వంలో కూడా శ్లోకాలు పఠించే శునకాలవద్ద ఈ సహజభౌతిక వాదం లభిస్తుంది. బ్రతకడానికై అవసరమైన భౌతిక సాధనాలకు అత్యున్నతమైన విలువనిచ్చి – ఆహారం గురించి మాత్రమే, భుజించడం గురించి మాత్రమే, పానం చేయడం గురించి మాత్రమే గానమొనరించుట వలన – ఈ శ్లోకాలు పఠించే శునకాలు తొలి వైదిక మార్గానికే కచ్చితంగా అంటిపెట్టుకుని ఉన్నాయి (రు).

సహజ భౌతిక వాద దృష్టినుంచి చూస్తే, వేద దృక్పథానికి లోకాయత దృక్పథంతో విభ్రాంతికరమైనంత సామీప్యత కనబడుతుంది.

## జానపద సంస్కృతి - వేద సంస్కృతి

వేద సంస్కృతీ విలక్షణతను – దాని మూలరూపంలో – సంప్రదాయ భిన్నమైన పద్ధతిలో పరిశీలిద్దాం : ఇప్పటికీ దేశంలో మిగిలి ఉన్న జానపద సంస్కృతి దృష్టినుంచి చూద్దాం.

చిహ్నపద్ధతి అవశేషాలను గురించి చర్చిస్తున్నప్పుడు, తమ నిలిచిపోయిన అభివృద్ధి కారణంగా, మన వెనకబడిన ప్రజలు వేద ప్రజల పూర్వీకుల విశ్వాసాలనూ, ఆచారాలనూ... ఇప్పటికీ పాటిస్తున్నారని అనుకున్నాం. అందులో విడ్డూరం ఏమీలేదు. ఈ తొలి ప్రాచీనులు కూడా 'వెనుకబడిన' వారే. అదే కారణం – అలాంటి కారణం – వల్ల, మన జానపద సంస్కృతిలోని కొన్ని లక్షణాలు వేద సంస్కృతి పూర్వ దశలపై వెలుగు చిమ్మవచ్చునని మన వూహ. ఉపనిషత్కర్తలు అపూర్వ వైదిక సంస్కృతి పూర్వదశలపైననే... తమ పద్ధతిలోనైనా, ఊహలు కావించారు.

మన కవసరమైన కవిత్వం, గీతాలు వరకు పరిమితమై ఈ సమస్యను పరిశీలించుదాం. ఉపనిషత్కర్తలకు గీతం లక్ష్యం వాంఛా పరిపూర్తి, గాయకుడు కోరికలను తీర్చువాడు. ఎందుచేతనంటే వారి ప్రాచీనుల అనుభవరీత్యా, ఏదో కోరిక నెరవేరడమే గానసారం. బెంగాలులో జరిగే 'వ్రతముల'లో కూడా ఇదే విశ్వాసం ఇమిడి ఉన్నట్లు మనం తేల్చవచ్చును. ఇవన్నీ జానపద క్రతువులు, ఇవి తరచు రుతువుల ప్రకారం జరుపుకుంటారు. ముఖ్యంగా కర్షక స్త్రీలు ఈ వ్రతాలు చేస్తారు.

'బెంగాలు దేశపు వ్రతములు' అనే అవనీంద్రనాథ్ ఠాగూర్ ప్రామాణిక గ్రంథం ఇందుకు చాలా ఉపయోగపడింది. ఆయన ఆ వస్తువును (విషయాన్ని) ఎలా వివరించాడో స్థూలంగా ప్రయాణం చేద్దాం. భావవాద ప్రభావాలు వస్తువును కప్పివేసిన సందర్భాలను పరిహరించుదాం.

వ్రతానికి కేంద్ర బిందువు కోరిక – దాన్ని మతపర విషయమనడం పొరపాటు. 'వ్రతాలంటే పూజలూ, శాంతులూ కాదు' అని అవనీంద్రుడు పదేపదే చెప్పాడు. వ్రతం చేయడంలో దృష్టి ప్రముఖంగా క్రియాత్మకం. అది, దైవం ముందు మొకరిల్లి వరాలడగడం కాదు. కొన్ని కచ్చితమైన క్రియల (చర్యల) ద్వారా, కోరికలను పరిపూర్తి చేసుకునే దృష్టి. వ్రతములకు మరో లోకం లేదా స్వర్గం అనే భావం అన్యమైనదే. అయితే ఇప్పుడు చూసే వ్రతాలు కొన్ని ఎక్కిడి తక్కిడి మత వ్యవహారాల్లాగా కనబడుతున్నాయి.

వ్రతానికి కేంద్ర బిందువు వాంఛ, ప్రాస. పొడుపు కథ, పాట, ఆట, ఇంకా చిత్ర ప్రతిరూపాలు (ఆల్పనలు) అన్నీ అల్లుకుని ఉంటాయి. ఇవన్నీ... కోరికతీరినట్టే... ఇవన్నీ ప్రతిబింబిస్తాయి. అవనీంద్రనాథ్ చెప్పినట్లు "వ్రతమంటే కోరిక. అది బొమ్మలలో చిత్రించబడి ఉంటుంది. దాని స్వభావాన్నే పాటలు ప్రతిఫలించడం చూడవచ్చు. నాటకాలలో, నృత్యాలలో దాని ప్రతిబింబాలను చూడవచ్చును. క్లుప్తంగా, వ్రతాలంటే.. గానం చేయబడిన వాంఛలు, చిత్రించబడిన వాంఛలు. చలనమున్న సజీవ వాంఛలు" ఇదంతా 'మహత్తు' మతం అని పిలవడం తప్పు. వ్రతాలంటే ప్రార్థనలూ, పశ్చాత్తాప ప్రకటనలూ... కావని అవనీంద్రుడు పదేపదే చెప్పాడు. వ్రతాన్ని అనుసరించివున్న దృష్టి క్రియాశీలమైనది. అది దేవుని ఎదుట మోకరించి, ఏదో వరాలను... అర్థించే దృష్టికాదు. కొన్ని నిర్ధిష్టమైన చర్యల ద్వారా వాంఛలను నెరవేర్చుకునే దృష్టి. పరలోకం లేదా స్వర్గం అనే భావన వ్రతాలకు విరుద్ధమైనది. అయితే ఇప్పుడు మనం చూసే వ్రతాలన్నీ, మతాన్ని జోడించిన కలగూరగంప అనే చెప్పాలి. కాని అవనీంద్రుడు వీటిని ఇటీవలి కాలంలో వచ్చిన జిత్తులమారి వ్యవహారాలు – లేదా ఇటీవలి భావాలతో కల్మషపడిన విషయం – అంటాడు. ఏమైనా, అవి సిసలైన వ్రతాలు కావు. వాస్తవంగా అసలైన వ్రతాలు "లోకసంగీతానికి శృతిచేయబడ్డవి" అని కవితామయంగా చెప్పాడు.

వ్రతాలకున్న ఒక అంశం : అనేకమంది వ్యక్తులు సామూహికంగా, ఒకే కోరికలో పాలు పంచుకుని, వ్రతమొనర్చాలి. వ్యక్తిగతమైన కోరిక, దాన్ని నెరవేర్చుకొనడానికి చేసే

చర్యలూ... వ్రతంగా రూపొందవు. అనేకమంది వ్యక్తులు ఏకైక ఫలితాన్ని సాధించడానికి సహకరించినప్పుడే అది వ్రతమౌతుంది.

"ఒక వ్యక్తి నృత్యం చేయవచ్చును, కానీ నాటకమాడలేడు. అలాగే ఒకవ్యక్తి పూజలూ ప్రార్ధనలూ చేయసాధ్యమే. వ్రతం చేయడం సాధ్యం కాదు. ప్రార్ధన, వ్రతం... రెండూ కోరికలు సాధించడానికే రూపొందించబడ్డాయి. కాని... మొదటిది వ్యక్తికి పరిమితం, కోరికను సఫలం చేసుకోవడానికి... వేడుకోలుతో ముగుస్తుంది. రెండోది ప్రముఖంగా సామూహికమైంది. కోరికను సఫలం చేసుకోవడంతో ముగుస్తుంది."

బెంగాలీ రైతులు 'వసుధారావ్రతం' చేస్తారు. 'గంగ ఎండిపోయింది. ఆకాశం బూడిద గుట్ట మాత్రమే' అనే వ్రత గీతాలు వర్ణించే నడువేసవి వర్షాభావ సమయంలో ఆ వ్రతం చేస్తారు. సహజంగా వర్షవాంఛను సఫలం చేసుకోవడానికి, పుష్కలమైన నీటికోసం ఈ వ్రతం ఉద్దేశించబడింది. రైతులు.. గీతాలాలపిస్తారు. వర్షాన్ని గురించే గానం చేస్తారు. బీటలు వారిన భూమి నీటిలో మునిగిపోవడం, ఆ నీటిలో పసిపిల్ల ఈదులాడడం... ఆ పాటలో వారు 'చూస్తారు.' అలాగే నటిస్తారు. వర్షాన్ని 'సృష్టిస్తారు'. నీళ్ల కూజాను చెట్టుకొమ్మకు వేళ్లాడదీసి, ఆ కూజకు బెజ్జాలు పొడుస్తారు. ఆ కూజా... మబ్బు. అందులోంచి నీరు చినుకులుగా పడుతుంది. అదే వాన. ఆ విధంగా వారొక 'భ్రమ'ను వాస్తవీకరిస్తారు... వాంఛించిన వాస్తవం సఫలం చేయడం అంటే ఇదే.

ఈ తంతులలో పాటలకున్న స్థానం వరకే పరిమితమౌదాం.

**ప్రశ్న ఏమిటంటే :** ఈ 'వసుధారావ్రతం'లోని గీతాలు – వర్షం కావాలనే వాంఛ వాస్తవంగా నెరవేరినట్లు చిత్రించే గీతాలు – నిజంగానే వర్షాన్ని సృష్టిస్తాయా? లేనేలేదు. అయినా... ఈ పాటలు పూర్తిగా వృధాకాదు. ఎందుకనేంటే, నడివేసవి వర్షాభావం దీర్ఘమూ, భీతావహము కూడా. అది రైతులకు సంబంధించి అక్షరాలా అగ్ని పరీక్ష. గీతాల్లో వారు దర్శించే కుండపోత వర్షం. దాన్లో పసివాళ్లు ఆడుకోవడం మొదలైన దృశ్యాలు భౌతిక వాస్తవాలు కాకపోయినా, "మానసిక వాస్తవమే". రైతులకు ఆ గీతాలు – ప్రతికూలమైన ప్రకృతి ముందు – అసహాయ స్థితి నుంచి బయటపడటానికి ఊతమిస్తాయి. ఇదికూడా మహత్తులాగే... ఊహాత్మకమే. కాని వాస్తవిక ప్రయోగానికి సహకరించే భ్రమాత్మకపు ప్రయోగమన్నమాట. వైదిక ప్రజల తొలి పూర్వీకులు కూడా గీతాలాలపించేవారు. వారి పాటలు కూడా వాంఛాసిద్ధికే. ఆ పాటలు వారి మనుగడకు తోడ్పడ్డాయి. గీతాలు ఆకలి నుంచీ, వినాశనాన్నుంచీ దేవతలను రక్షించాయి. ఛందస్సు రక్షణనిచ్చింది. అందుచేతనే, మన ఉపనిషత్కారంలోని శునకాలు కూడా, ఈ పూర్వకాలపు దేవతల్లాగే పాట పాడదల్చుకున్నాయి (రు). అది ఆహారం కోసం పాట. అందుచేత వారి ప్రవర్తన ఇప్పటికీ 'వసుధార'లాంటి వ్రతాలు చేసే రైతుల ప్రవర్తనకు అంత భిన్నమైనది కాదు.

అయితే, ఈ రైతులు ఆదిమ ప్రజలు కాదు. వారి సాంస్కృతిక జీవనంలో ఈ ఆదిమాంశ ఇప్పటికీ సజీవ శక్తిగా మిగిలి ఉండడం... ఒక సంకీర్ణ సమస్య, వైదిక సంప్రదాయంలోని నిగూఢతపై లోకాయత సంప్రదాయం అసంకల్పితంగా ఒక వెలుగును ప్రసరించింది. లోకాయత అంటే 'మొరటు జనాల' నమ్మకాల భావాల సంపుటి అని ఇది – శంకరాచార్య చులకనగా అన్నమాట అది – మనం చూసాం. మరో మాటలో చెప్పాలంటే అది జానపద సంస్కృతి.

అలాగే లోకాయ అంటే ఇహలోక దృష్టి – ఆదిమ భౌతిక వాదం అన్నమాట. అవనీంద్రనాథ టాగోర్, తొలి వేద గీతాలు, వ్రత గీతాలను పోలి ఉన్నాయని ఆవిష్కరించడం నిజంగా అద్భుతమైన విషయం – ఇది జానపద దృక్పథం. వ్రతాలు వేదాల నుండి ఉద్భవించజాలవని కూడా ఆయన స్పష్టంగా చెప్పాడు. ఇది వాస్తవం. ఇవి రెండూ రెండు భిన్నమైన సంస్కృతులకు చెందిన అంశాలు. అందుచేత వ్రతాలను ఆర్య పూర్వులకు ఆపాదించాడు. కాని వ్రతగీతాలు వేదగీతాలకు చాలా దగ్గరగా ఉంటాయి.

"ఆర్యులూ, వారి పూర్వులూ శ్రద్ధ పెట్టిన లోకం, వారు జన్మించిన ఈ భూమి మాత్రమే. వారిద్దరి వాంఛలూ ఈ భూమికి చెందిన సంపదల – భాగ్యము, పంట అదృష్టము, ఆరోగ్యం, దీర్ఘజీవనం ఇంకా ముఖ్యమైన ఇతర ఇహలోక వస్తువులకు – సంబంధించినవే. ఈ రెండు రకాల గీతాల్లోనూ వ్యక్తీకరించిన వాంఛల స్వభావం పరిశీలిస్తే ఇది స్పష్టపడుతుంది" – అవనీంద్రనాథ టాగూర్.

ఇంత స్పష్టమైన పోలికను మనం ఎలా అర్థం చేసుకోవాలి? ఈ ప్రశ్నకు సమాధానాన్వేషణా పద్ధతి కూడా అవనీంద్రుడు సూచించాడు. అమెరికన్ ఆదిమ జనులను గురించి మనకు తెలిసిన సమాచారంతో, రైతు వ్రతాలను అర్థం చేసుకోదగునని అవనీంద్రుని ప్రతిపాదన. ఈ పద్ధతి స్థాపితమైతే... వ్రతగీతాలకు, తొలి వేదగీతాలకు మధ్యనున్న పోలిక మౌలికమైనదైతే... తులానాత్మక మానుష శాస్త్ర సహాయంతో వేద గీతాల నిగూఢతను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించవచ్చునని... విశదమౌతుంది. అయితే అవనీంద్రుడు ఈ సూచ్య విషయాన్ని సమగ్రంగా చర్చించలేదు. అయితే వ్రతాల విషయంలో ఆయన పర్యావలోకించిన విశేషాలు ఆసక్తిదాయకం.

ఈ వ్రతాలు ఎంతకాలం నాటివి? అవనీంద్రుని అభిప్రాయంలో, చాలా పురాతనమైనవి. పురాణాలకంటే, బహుశా వేదాలకంటే కూడా... పురాతనం. ఎన్ని పోలికలున్నప్పటికీ, వ్రతాలు వేదాలకంటే భిన్నమైనవి. వేదగీతాలలో వ్యక్తమైన కోరికలన్నీ పురుష సంబంధమైనవి. వ్రతగీతాలు స్త్రీల వాంఛలను వ్యక్తం చేస్తాయి.

"పురుష వాంఛలు, స్త్రీ వాంఛలు : – వైదిక క్రతువులు పురుషులవి, వ్రతాలు స్త్రీలవి – ఈ రెంటి మధ్యనున్న తేడా ఇదే".

ఇది గమనించాల్సిన విషయం. అయితే అవనీంద్రుడు వక్కాణించని మరోవ్యత్యాసం – ఈ రెంటి స్వభావాలకు మధ్యనున్న వ్యత్యాసం – కూడా ముఖ్యమైనదే. రెండూ... వాంఛాసిద్ధికై... సంపద, రక్షణ – ఉద్దేశించబడినా ఆ వాంఛల స్వభావంలో కూడా వ్యత్యాసం ఉంది. వేద గీతాలాపకులు పశువులను, ఎన్నో పశువులను... కావాలనుకునేవారు.

"వేద భారతీయుని జీవికకు ముఖ్యాధారం పశువృద్ధి. అతని ఉత్కృష్టమైన వాంఛ విస్తృత పశుగణం కోసం, రక్షణ కోసం, ఆరోగ్యం కోసం, సౌభాగ్యం కోసం... చేసిన అనేక ప్రార్థనలలో... తొలి ప్రసక్తి పశువులను గురించే."

మన పల్లెల్లో వ్రతాలు చేసే స్త్రీలు ప్రాథమికంగా పంటను గురించే శ్రద్ధ కనబరుస్తారు. నిజానికి, వ్రతాల్లో ఎక్కువ భాగం... ప్రత్యక్షంగానో, పరోక్షంగానో... వ్యవసాయిక కృషి ఫలసిద్ధిని ఆపేక్షించినవే. ఇందుకు విరుద్ధంగా... వైదిక ప్రజల జీవితంలో – అలాగే వారి గీతాల్లోనూ, క్రతువుల్లోను కూడా – వ్యవసాయానిది రెండోస్థానం మాత్రమే : 'వేదగీతాల కాలంలో వ్యవసాయానిది స్వల్పపాత్ర' – వింటర్నిట్జ్. అందుచేత, వ్రతాలు 'ఆర్యపూర్వుల' నాటివని భావిస్తే, ఆ ఆర్య పూర్వుల సంస్కృతిలో వ్యవసాయాంశాలకు ప్రాథమిక స్థానముండేదనీ, అవి స్త్రీలే నిర్వర్తించేవారనీ మనం తీర్మానించుకోవచ్చును. వేద ప్రజల ఆర్థిక వ్యవస్థకూ – పశుపోషణ, ఆహార సేకరణ మాత్రమే – వేదగీతాల్లో ఉన్న పురుష భావాలకూ... సంబంధముందా? అలాగే, ఆర్యపూర్వుల వ్యవసాయక ఆర్థిక వ్యవస్థకూ వారి స్పష్టమైన స్త్రీ భావాలకూ సంబంధముందా? వామాచారి భావాలను గురించి చర్చిస్తూ కూడా ఇదే ప్రాథమిక ప్రశ్న వద్దకు చేరుకున్నాం. లోకాయతుల క్రతు సంబంధమైన లైంగిక సంప్రదాయం మాతృస్వామిక – వ్యవసాయిక దశలో భాగం. అలాగే వేద సాహిత్యంలో 'అదే' ఆహార సేకరణ – పితృస్వామిక దశలో భాగం.

## సమీక్ష

ఒకసారి సింహావలోకనం : గానం చేసే శునకాలు, నిజంగా శునకాలూ కావు. అలాగే ఆ శునకాల ప్రదర్శన వేదపండితులపై వ్యంగ్య వ్యాఖ్యా కాదు. వారు ఆదిమ ప్రజలు మాత్రమే. బకదాల్భ్యుడనే ఒకానొక వ్యక్తికి వేదపఠనా జ్ఞానాన్ని కలగజేయడానికి ఉద్దేశించబడిన ప్రదర్శన.

"బకదాల్భ్యుడు దానిని తెలుసుకున్నాడు. అతడు నైమిశ ప్రజలకు ఉద్గీథా గాయకుడయ్యాడు. వారికి, వారి వాంఛలనే గానం చేసేవాడు" – చాందోగ్యోపనిషత్. అయితే, పైన చెప్పిన సన్నివేశం వలననే, అతనికా జ్ఞానం వచ్చిందో లేదో స్పష్టంగా చెప్పబడలేదు. బహుశా అంతేనేమో! ఇక్కడ జ్ఞానం అంటే వాంఛలను గానం చేసే జ్ఞానమే. అతను చూసింది సన్నివేశమే కదా!

'చాందోగ్య ఉపనిషత్'లోని గూఢంగా ఉన్న ఒక పాఠభాగాన్ని... స్థూలంగా వివరించడానికి ప్రయత్నించిన విధానమిది. మన ప్రాచీన సాహిత్యంలో నిగూఢమనిపించే

భావాలు... బహు ప్రాచీన విశ్వాసాల అవశేషమయి ఉండవచ్చుననీ... ఇప్పటికీ మిగిలి ఉన్న ఆదిమ ప్రజలను గురించి మనకు తెలిసిన సమాచారం వెలుగులో ఆ నిగూఢ భావాలను అర్థం చేసుకోవచ్చుననీ... మన ప్రతిపాదన. ఈ ప్రతిపాదనకు ఆధారం, ఈ మిగిలి ఉన్న ఆదిమ ప్రజా సమాజాలు "వేల సంవత్సరాల క్రితం ఉన్న మన పూర్వీకుల భావనా ప్రవర్తనను ప్రతిఫలిస్తాయి" – (మోర్గన్)

## సామాన్య సూత్రము

శాస్త్రీయంగా తొలిసారి ఈ సూత్రాన్ని రూపొందించినవాడు మోర్గన్. అతడు తన జీవితంలో అధికభాగం అమెరికన్ ఆదిమజాతుల మధ్య గడిపాడు. వారిని గురించిన ఆయన అధ్యయనం "మానుష శాస్త్రరంగంలో తొలి గ్రంథం. అందులోనూ ఉత్తమోత్తమం". దీని ఆధారంగానే ఆయన "లిఖిత చరిత్రకున్న ముఖ్య లక్షణాలకు చరిత్ర – పూర్వపు – ప్రాతిపదిక"ను నిర్మించాడు.

ఆదిమజాతుల ప్రజలందరూ ఒకే సామాజికాభావృద్ధి దశలో నివశించడంలేదని ఆయన భావించాడు.

"మానవ కుటుంబంలో కొన్ని భాగాలు ఆటవికదశలోను, ఇంకొన్ని భాగాలు అనాగరికదశలోనూ, ఇంకా మరికొన్ని భాగాలు నాగరికతలోనూ ఉన్నాయనేది నిర్వివాదమైనట్లుగానే... ఈ మూడు ప్రత్యేక వ్యవస్థలూ ఒకదానితో ఒకటి సహజమేకాక తప్పనిసరి అభివృద్ధి పరంపరగా బంధితాలని కూడా అనిపిస్తుంది. ఈ పారంపర్యం (లేదా క్రమం) ఒకో మానవ కుటుంబ శాఖ ఒక స్థాయినందుకునేవరకు (క్రమపద్ధతిలో) ఈ పారంపర్యక్రమం... సామాన్యాభివృద్ధి జరిగే పరిస్థితుల వలననే సాధ్యపడుతుంది. కొన్ని శాఖల అభివృద్ధికి ఈ పరిస్థితులలో ఒకటో రెండో మాత్రమే సహాయకరమై ఉండవచ్చును.

కనుక "ప్రస్తుతమున్న అనాగరిక, ఆటవిక జాతుల అనుభవానికి సమానమైన స్థితిగుండా ఆర్యుల అతి ప్రాచీనులు ప్రయాణించి ఉండాలని భావించవచ్చును. ఈ తెగల అనుభవంలో... నాగరికతా దశలన్నింటినీ రూపు కట్టించగల సమాచారం – ప్రాచీనం, ఆధునికం–లభిస్తుంది. కాని ఇటు ఇప్పటికీ వారిలో మిగిలిఉన్న వ్యవస్థలకూ, వారు నూతనంగా కనిపెట్టిన ప్రక్రియలకూ... అటు అనాగరిక, ఆటవిక తెగలలో మిగిలిఉన్న అదేరకం అంశాలకూ మధ్య... సూత్రం ద్వారా స్థిరపరచగల సంబంధాన్ని బట్టి మాత్రమే వారి పూర్వ అనుభవాన్ని (చరిత్రను) 'పునస్సృష్టి' చేయాలి.

మోర్గన్ ఇలా ముగించాడు :

"ఇలా అనేక తెగల, జాతుల – వివిధ కాలాలకు చెందిన – పరిస్థితులను అధ్యయనం చేయడం ద్వారా ప్రాచీన చరిత్రనూ, మన అతి ప్రాచీన పూర్వీకుల స్థితిగతులనూ మనం బహుళంగానే పరిశీలిస్తునట్టు లెక్క".

మోర్గన్ 1877లో ఈ ప్రతిపాదన చేశాడు. ఆ తర్వాత పురావస్తు శాస్త్ర రంగం ఎంతో ముందుకు పోయింది. ఫలితంగా లిఖిత చరిత్రకు ఆదిమ ప్రాతిపదికను పునర్నిర్మించడానికి అధికావకాశాలు లభించాయి. అయినా, ఈ అభివృద్ధి మోర్గన్ ప్రతిపాదనా ప్రాముఖ్యతను తగ్గించలేదు. పురావస్తుశాస్త్రం గతించిపోయిన మానవుని భౌతిక శిథిలాలను పరిశీలిస్తుంది. కాని అది ఆ ప్రజల సమాజ నిర్మాణాన్ని గురించిగాని, వారి విశ్వాసాల గురించిగాని, భావాలను గురించిగాని... సూటిగా ఏమీ చెప్పదు. ఈ లోటును మానవ వర్గశాస్త్రం (Ethnology) పూర్తి చేయవచ్చును.

మోర్గన్ తర్వాత మానవ వర్గశాస్త్ర రంగంలో... నూతన సమాచారం లభించింది. తద్వారా మోర్గన్ చేసిన నిర్ణయాలను కొంచెం మార్పు చేయాల్సి వచ్చింది. అతని ప్రధానమైన ప్రతిపాదన ఇప్పటికీ సుష్టుగానే ఉంది. దురదృష్టవశాత్తూ ఆదిమ చరిత్ర పట్ల ఆసక్తిగల మన ఆధునిక పండితులు ఈ ప్రతిపాదనను సంపూర్ణంగా వినియోగించుకోలేకపోయారు. థాంప్సన్ ఈ తులనాత్మక విధానాన్ని సమర్థించాడు. అయితే అక్కడ తీసుకోవలసిన జాగ్రత్తలు కూడా సూచించాడు.

గార్డన్ చైల్డ్ "ఈ తెగలవారి ఆర్థిక, భౌతిక సంస్కృతి... యూరపియన్లు పదివేల సంవత్సరాల నాడు దాటిపోయిన దశ దగ్గరనే... నిలిచిపోయింది కనుక... వారి మానసికాభివృద్ధి కూడా అక్కడే ఆగిపోయింద"ని మనం భావించాలా? అని అడిగాడు. థాంప్సన్ దీనికి సమాధానం "కాదు" అనే అంగీకరించాడు. అయితే ఆ సమస్యను 'అక్కడే వదలివేయలేము' అన్నాడు. ఈ ఆధునిక తెగల వ్యవస్థలు అభివృద్ధి చెందుతూనే ఉన్నాయి. కాని ఆ అభివృద్ధి "అప్పటికి వాడుకలో ఉన్న ఉత్పత్తి విధానం నిర్దేశించిన దిశలో మాత్రమే సాగుతుంది. ఈ సమస్యకు కీలకం ఇదే. ఉదాహరణకు... మనం చిహ్న పద్ధతి, బాహిర వివాహ వ్యవస్థ, వడుగు... మొదలైన సంప్రదాయాల ఆస్ట్రేలియా రూపాలకూ, మరోచోట ఉన్న ఆ వ్యవస్థల రూపాలతో పోల్చిచూస్తే... వానిలో అసాధారణమైన వివరాలున్నట్లు కనబడుతుంది. అంటే వాటి అభివృద్ధికి దీర్ఘకాలం పట్టిందని అర్థమౌతుంది. అయితే ఈ వ్యవస్థలన్నీ సామాన్యమైనవేనని ఆధారం చేసుకున్న ఆర్థిక సమాజపు లక్షణాలే మరో మాటలో, ఈ తెగల ఆర్థికాభివృద్ధి గిడసబారినట్లే, వారి సంస్కృతి కూడా అంతర్గతంగానే విస్తరిల్లుతుంది. (అంటే సూక్ష్మాంశాలు చేరుతుంటాయి) తత్ఫలితంగా, పాత రాతియుగం నాటి యూరప్‌లో అలాంటి వ్యవస్థలు (సంప్రదాయాలు) అదే రూపంలో కనబడతాయని ఆశించజాలము. కాని ఏదో రూపంలో కనబడవచ్చును". ఆపైన, బాహ్య ప్రభావాలవల్ల ప్రత్యేక లక్షణాలు సంక్రమించవచ్చును.

"మన వణిజులు, మత బోధకులు, ప్రభుత్వాధికారులు, మానవవర్గ శాస్త్రజ్ఞులు... చొచ్చుకొనిపోయి కనుగొన్నందువలన మాత్రమే... ఈనాటికీ మిగిలి ఉన్న ఆదిమ ప్రజలు మనకు తెలుసునని మరవరాదు. కొన్ని సందర్భాలలో వారిని తక్షణం కార్మికులుగా మార్చేశారు – దక్షిణాఫ్రికా బంగారు గనులలో బంటూలలాగా, బ్రిటిషు వలస కార్యాలయపు పరోక్ష పాలనకు అనుకూలంగా కొన్ని సందర్భాలలో ఆ తెగల యొక్క ప్రాంతీయ వ్యవస్థలను ఇష్టం వచ్చినట్లు స్థిరీకరించారు. అలాంటి 'సంస్కృతులు' హఠాత్తుగా కలిగిన సంపర్కాల వల్ల

తప్పనిసరిగా ప్రత్యేక లక్షణాలు సంతరించుకుంటాయి – పెట్టుబడిదారీ విధాన ఫలితాలను శాస్త్రీయంగా విశ్లేషణం చేసిన తర్వాతనే ఆ లక్షణాలను వివరించగలం".

థాంప్సన్ ఇలా ముగించాడు : "ఈ పరిమితులలో, తులనాత్మక విధానం మంచి సాధనమే. మన విషయ జ్ఞానాభివృద్ధికై, ఆ సాధనాన్ని వాడుకోగలము. వాడుకొని తీరాలి".

మోర్గన్‌కు సంబంధించి థాంప్సన్ చెప్పిన ఒక ముఖ్యాంశాన్ని చెప్పుకుంటే సరిపోతుంది. మోర్గన్ కాలం చెల్లినవాడని కొందరు భావించారు. ఆ విమర్శకు బాహ్య సాక్ష్యాల ఆధారమేమీ లేదని థాంప్సన్ అంటాడు. మోర్గన్ కనిపెట్టిన అంశాలపట్ల మన విద్యా ప్రపంచపు విరోధ భావమొక్కటే దానిక్కారణం. ఆదిమ ప్రజలనధ్యయనం చేసే శాస్త్రవేత్త నాగరికుడైనట్లే, "గతాన్ని అధ్యయనం చేసే చరిత్రకారుడు కూడా వర్తమాన పౌరుడే".

అంటే సమకాలీన భావాలూ, విశ్వాసాలూ, విలువలూ వారి ప్రాథమిక దృక్పథాన్ని (శాస్త్రవేత్త, చరిత్రకారుల) తెలిసి కాకపోయినా, ప్రభావితం చేయడానికి అవకాశం ఉంది. అందుచేత... జీవితంపట్ల ఆదిమ దృక్పథం, ఆదిమ సమాజానికి అనుబంధించబడి ఉండడమే కాక, ఆదిమ జీవితం పట్ల మన దృక్పథం కూడా మన సమాజానికి సంబంధించి ఉండడానికి కూడా ప్రత్యేకావకాశం ఉంది. మనం వ్యక్తిగతమైన ఆస్తిపై బతుకుతున్నాం. మన నైతిక విలువలు మనకున్నాయి. పితృ సంబంధమైన వారసత్వానికి మనం అలవాటుపడ్డాం. వీటన్నింటివల్లా, చిక్కపడిన మన ఆలోచనా విధానం వలన లేని విషయాలను కూడా ఉన్నట్లుగా చూసే అవకాశం ఉంది.

సామాజిక శాస్త్రవేత్తలు, చరిత్రకారులు బాహాటంగా చెప్పే వస్త్వాశ్రయతను అఖండార్థంలో తీసుకుంటే, అది భ్రమ మాత్రమే. అయితే వస్త్వాశ్రయత దశలసలుండవని కాదు. దాని సాపేక్షకత మన ఊహాపోహలను విమర్శించుకోగల సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. అందుచేతనే... యధాతథ స్థితిని సమర్థించేవానికి, ఆదిమ ప్రజలను అర్థం చేసుకోవడానికి గానీ, మన ప్రాచీనుల జీవితాన్ని అర్థం చేసుకోవడానికి గానీ, యధాతథ స్థితిని తీవ్రంగా విమర్శించే సోషలిస్టు (ఉదాహరణకు మాత్రమే) కన్న తక్కువ అవకాశం ఉంటుంది.

"ఒక రకమైన ధర్మ నిర్ణయాంధత్వం" అని మార్క్స్ పేర్కొన్న భావం వద్దకు చేరుకుంటాం. "అత్యున్నతమైన మేధాసంపన్నులు కూడా – ఒక రకమైన ధర్మ నిర్ణయాంధత్వ కారణంగా – తమ కళ్లకెదురుగా ఉన్న విషయాలను గమనించడంలో పూర్తిగా విఫలమవుతారు. తర్వాతి కాలంలో ఆ గమనింపు వచ్చినప్పుడు, అంతకు ముందు తాము చూడలేకపోయిన అనేక చిహ్నాలు ప్రతిచోటా గమనించి చకితులౌతారు. ఫ్రెంచ్ విప్లవంపైనా, నూతన వికాసం పైనా వచ్చిన మొదటి ప్రతిస్పందనలలో సహజంగా ప్రతిదాన్నీ మధ్యయుగాలకు చెందినదానిగా, భ్రమాత్మకమైన దాన్నిగా చూడడం జరిగింది. గ్రీమ్‌లాంటి వారు కూడా ఇందుకు భిన్నం కాదు. రెండోసారి... మధ్యయుగాల ఆవలకు ప్రతిజాతి ఆదిమయుగం వరకూ చూడడం. ఇది సోషలిస్టు ధోరణి. అయితే ఆ మహా విద్వాంసులకు సోషలిస్టు ధోరణితో తమకు సంబంధముందని కూడా గమనించలేదనుకోండి. ఆ తర్వాత, అత్యంతాధునికమైన దాన్ని,

అతి పురాతనమైన దానిలో గమనించి ఆశ్చర్యపడ్డారు – ప్రౌధాన్ వణికి పోయేస్థాయికి సమతావాదులు కూడా గమనించి ఆశ్చర్యపడ్డారు.

ఈ 'అంధత్వం' బరువు క్రింద మన మెంత నలిగిపోతామో చూద్దాం. నా పరిసరాల్లోనే, హూన్స్రుకెన్ (కొండ) మీద, పురాతన జర్మనీయ వ్యవస్థ ఇటీవలి వరకూ ఉండేది. మా నాన్న నాతో దాన్ని గురించి చట్ట సంబంధమైన దృక్పథంతో మాట్లాడటం ఇప్పటికీ జ్ఞాపకమే! మరో ఉపపత్తి : భూగర్భ శాస్త్రవేత్తలు – వారిలో అత్యున్నతులు కూడా – కువియర్‌లాంటి అత్యున్నతులు కూడా, కొన్ని దత్తాంశాలను వక్రంగా వివరించారు. అలాగే గ్రిమ్‌లాంటి సమర్థులైన భాషాలక్షణ వేత్తలు అతి సరళమైన లాటిన్ వాక్యాలను తప్పుగా అనువదించారు. ఎందుచేతనంటే వారంతా మోజర్ మొదలైనవారి ప్రభావంలో పడిపోయారు. (జర్మనులలో స్వేచ్ఛ అనేది ఎప్పుడూ లేదనీ అలాగే వాతావరణం బానిసను సృష్టిస్తుందనీ మోజర్ ముగ్ధుడైనట్లు నాకు గుర్తు) ఉదాహరణకు ప్రసిద్ధమైన టాసిటస్ వాక్యం : 'Arva per annos mutant et superest ager' అంటే అర్థం : వారు పొలాలను (Arva) పరస్పరం మార్చుకుంటారు. (అంటే చీట్ల పద్ధతిలో, కనక ఆదిమ సమాజ విధానం అన్నమాట) గ్రామభూమి (ager publicus అనే సమాసం arva పదానికి భిన్నం) మిగిలిపోతుంది. దీనికి గ్రిమ్ ప్రభృతులు అనువాదం : "వారు ప్రతి సంవత్సరమూ కొత్త భూముల్ని సాగుచేస్తారు. ఇంకా సాగు చేయని భూమి మిగుల్తుంది" –

"అతి నూతనమైన దాన్ని, అతి ప్రాచీన సందర్భంలో గమనించడం" అనే మార్క్స్ అన్న ముక్కల్లోని అద్భుత ప్రాముఖ్యత మనకు పదేపదే జ్ఞప్తికి వచ్చే సందర్భాలు మనకీ అధ్యయనంలో అనేకం తగుల్తాయి. కాని ప్రస్తుత సమస్య 'ధర్మ నిర్ణయాంధత్వం' మాత్రమే. ఈ విషయంలో కూడా మన ప్రాచీన సంస్కృతికి సంబంధించిన ఆధునిక గ్రంథాలలో అనేక ఉదాహరణలు లభిస్తాయి.

'మహాభారతం' వాహికులనే ప్రజలను వర్ణించింది. ఆ సందర్భంలో ఇతిహాసం ఇలా ఉంది : "అందుచేత, వారి సోదరీల పుత్రులు – వారి పుత్రులు కాదు – వారసులవుతారు".

ఇక్కడ మనకు స్పష్టంగా, ఒక రకమైన మాతృస్వామిక వారసత్వం కనబడుతుంది. ఖాసీలలోనూ, ఇరోక్వాస్‌లలోనూ ఈ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. కాని మధ్యయుగాల నాటి వ్యాఖ్యాత నీలకంఠుడు దీన్నీ విధంగా వివరించాడు : "వారు తమ సంతానాన్ని తమ సోదరీల గర్భాలలో ఉత్పత్తి చేస్తారు కనక – భార్యల గర్భాలలో కాదు – వారి సోదరీల పుత్రులే వారసులౌతారు".

పరోక్ష మాతృ ప్రధాన వ్యవస్థ దృష్టినుంచి తులనాత్మక పద్ధతిలో దీన్ని నీలకంఠుడు వివరిస్తాడని మనమాశించము. కాని ఇలాంటి దుర్మార్గ కల్పనకావించి, ప్రాచీన గ్రంథంపై రుద్దుతాడని భావించం. కాని, చెయ్యక తప్పలేదతనికి. తనకు తెలిసిన వారసత్వ పద్ధతి ఆధారంగానే ఆ గ్రంథంలో వర్ణించిన వారసత్వాన్ని... వివరించ ప్రయత్నించాడు : వారసత్వం

తండ్రి నుంచి కొడుక్కు సంక్రమిస్తుంది. వాహికులలో అక్కచెల్లెండ్ర కొడుకులే వారసులు, కనక ఎలాగోలా వారు అక్కచెల్లెళ్ల గర్భం నుంచి జనించిన కొడుకులు కావాలి. అంటే నీలకంఠుడు 'ధర్మ నిర్ణయాంధత్వం'తో అవస్థ పడుతున్నాడన్నమాట. మరైతే మానవ వర్గశాస్త్ర దత్తాంశాలనేకం అందుబాటులోకి వచ్చి, నీలకంఠునికంటే సాంస్కృతికంగా అభివృద్ధికర స్థితిలో ఉన్న... ఆధునిక పండితులు ఈ 'ధర్మనిర్ణయాంధత్వం' నుంచి ఏమైనా విముక్తి పొందగలిగారా? దురదృష్టవశాత్తు లేదు. ఇక్కడొక ఉదాహరణ మాత్రం చెప్పుకుందాం.

'చాందోగ్యోపనిషత్'లో ఇభ్య గ్రామమని పేరున్న ఊరును గురించి చెప్పబడింది. అంటే ఇభ్యుల గ్రామం అని అర్థం. 'ఇభ' అంటే ఏనుగు. చిహ్న పద్ధతి దృష్ట్యా, ఆ గ్రామవాసులు ఏనుగు – వంశ వారసులు అని స్పష్టం. ప్రాచీన భారతంలో ఈ ఏనుగు – వంశం ప్రసిద్ధమైనదే. రుగ్వేదంలో ఇభ్యులను గురించిన ప్రసక్తి ఉంది. అలాగే ప్రాచీన బౌద్ధ సాహిత్యంలో కూడా. 'చాందోగ్యోపనిషత్'లోని కథలో వారిని కడజాతి వారిని చూసినట్లు చూస్తారు. అందువలన ఆ కాలంనాటికి వారు ఇంకా వెనుకబడిన దశలోనే ఉన్నట్లనిపిస్తుంది. అశోకుని ఐదవ శాసనంలో పేర్కొన్నట్టు – ఇభ్యులు హీనజాతివారని – వారు వెనకబడ్డ వారై ఉంటారు.

ఎలాగైతేనేం, దానికున్న అసలు (సూటి) అర్థాన్ని సంప్రదాయ వ్యాఖ్యాతలూ, ఆధునిక పండితులూ పట్టించుకోలేదు. ఇభ్యులంటే ఏనుగులను అధిరోహించేవారు అని అన్వయించడానికి వ్యాకరణ శాస్త్ర నైపుణ్యాన్ని కూడా ఉపయోగించారు శంకరాచార్య. ఆయన సంకటం మనకర్థమౌతుంది. 'చిహ్న పద్ధతి' అనే భావన ఆయనకు లభించదు కదా! నిరంతరంగా ఆధునిక పండితులు కూడా ఇదే మార్గాన వివరించడాన్ని 'ధర్మ నిర్ణయాంధత్వం' అని మాత్రమే మనం వర్ణించాల్సి వుంటుంది. కొన్ని ఉదాహరణలు : గెల్డ్నర్ – ఆ పదానికి 'ఏనుగులను పోషించగలిగినంత ధనవంతులైన దాసులు కల గ్రామం' అని అర్థం చెప్పాడు. రాధాకృష్ణన్ ఆయన మార్గంలోనే, 'ఏనుగులు కలిగిన వాని గ్రామం' అని వివరించాడు. హ్యూమ్ అసలు ఏనుగుల ప్రసక్తి వదిలేసి 'సంపన్నుల గ్రామం' అన్నాడు.

సమకాలీనపు టూహల, ధ్యానాల... దృష్టినుంచి అన్వయించ ప్రయత్నిస్తే ప్రాచీన గ్రంథాలను ఇలాగే అపార్థం చేసుకోవాల్సి వస్తుంది. అందుచేత ఇప్పటికీ మిగిలివున్న ఆదిమ ప్రజలను గురించి మనకు స్థూలంగా తెలిసిన వెలుగులో అర్థం చేసుకోవడమే సరైన పద్ధతి. అప్పుడు మాత్రమే గత చరిత్రను పునర్నిర్మించగలం.

అసలు 'లోకాయత'కూ మిగతా తత్వశాస్త్రాలకూ మరో స్పష్టమైన తేడా వుంది. మిగతా 'నాగరిక' తత్వశాస్త్రాలకు ఒక మూలపురుషుడు– తాత్వికుడు– అనేక మంది వ్యాఖ్యాతలు ఉంటారు. 'లోకాయత' అలాంటిది కాదు. సామాన్య జనం లోకాన్ని, లోక లక్షణాలను అర్థం చేసుకున్న తీరు... 'లోకాయత' నిజం చెప్పాలంటే అది 'అనుకోకుండా' తరతరాల సామాన్య జనం చేసిన 'ఆలోచనల సంపుటి' 'లోకాయత'కు కొన్ని విశ్వాసాలు, అభిప్రాయాలు, ప్రవర్తనా సంప్రదాయం ఉంటుంది. వాటిని... ప్రత్యర్థుల గ్రంథాలలోంచి అపార్థాలను వివరించి– తొలగించి– ఉద్ధరించడమే దేవీప్రసాద్ చటోపాధ్యాయ చేసింది.

– హరి

ప్రజాశక్తి బుక్‌హౌస్